SSR09A198

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

ఆరుద్ర

అపూర్వ పుస్తక సేకరణ
కర్త : డా. వెలగా వెంకటప్పయ్య

11

C1

H:-7.3
W:- S.1
SSRQ2A 198
అపూర్వ పుస్తక సేకరణ
స్ఫూర్తి : డా॥ వెలగా వెంకటప్పయ్య
ఆలమూరి
రేపల్లె
2055065

తెలుగు సాహిత్య
సౌరభ సౌందర్యాలకు
వాచవి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం



పదకొండవ సంపుటం

నాయకరాజుల యుగం-II

ఆరుద్ర

డా॥ పి. వి. రాజమన్నారుగారి
'ప్రవేశిక'తో,
కప్పగంతుల
లక్ష్మణశాస్త్రిగారి
పీఠికతో

యం. శేషాచలం అండ్ కంపెనీ
మద్రాసు : మచిలీపట్టణము : సికింద్రాబాదు

రూ. 5/-

SAMAGRA ANDHRA SAHITYAM (in 15 Vols.) — Vol. XI: Nayaka Rajula Yugam II—By *Arudra*. Introduction: B/ Dr. P. V. Rajamannar. Published by *M. Seshachalam & Co.*, Madras - Machilipatnam - Secunderabad. **PRICE Rs. 5/-**

First Edition, March, '67

Copyright © **M. Seshachalam & Co.**

Art Work: **Gangadhar**

Acc. No 5'065'.

తెలు. No సం 7.

Printers **:**

Weldun Press,
146, T. H. Road, Madras-21.

ప్రతిస్థానం

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
రాష్ట్రపతి రోడ్డు సికింద్రాబాదు

Regd. 212864

మా ఉద్దేశం

సాహిత్యాభిలాష గల సాధారణపాఠకులు ఆంధ్రసాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవా లనుకొంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయ సూరిదాకా ఆంధ్రసాహిత్యం అనేక విధాలుగా, బహు ముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నిటికి అన్నీ అచ్చుపడి వెలుగు చూడలేదు. అచ్చయిన పుస్తకాలుకూడ అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణపాఠకులకు బోధపడే వివరణలతో లేవు. ఈ కొరతను తొలగించవలసిన బాధ్యత నేటి ప్రకాశకులపై ఉంది.

ఈ అవబోధంతోనే మేము అనిదంపూర్వమైన ఈ సాహిత్య సేవకు సమకట్టాము. వెయ్యి సంవత్సరాలపాటు వేవిధాలుగా పూచి, కాచి, పరిపరి పరిమళించిన నవరసాలనూ నవనవమైన నవకంతో, నేవ శంతో తేనెవాకలూరించిన తెలుగు సాహిత్యాన్ని సార్వజనికోపయోగకరంగా, సర్వులకూ సులభావగాహంగా పన్నెండు సంపుటాలలోకి ఇమిడికగా కుదించి, తెలుగు మహాజనులకు అందింపబూనుకొన్నాము. సహస్ర సంవత్సరాల సాహిత్యాన్ని ఇంత శతాంశంలో క్లుప్తీకరించడం సాహసమైతే కావచ్చుగాని సాహిత్యపిపాస గల సాధారణపాఠకులు వెనువెంటనే పయనించడానికి ఈ సంపుటాలు చక్కని సోపానాలు కాగల వనడానికి ఎంతమాత్రమూ సందేహం లేదన్న సంకల్పదీక్షే మమ్ముల నీకృషికి ప్రేరేపించింది. ఆంధ్రసాహిత్యాన్ని మూలగ్రంథాల నుండి తనివితీరా గ్రోలడానికి ఈ సంపుటాలు సర్వాత్మనా సాయపడతాయనే ఆశిస్తున్నాము.

ఈ సంపుటాలలో ప్రముఖకవుల జీవిత విశేషాలూ, వాళ్లు సాహిత్యాన్ని ఏయే విధంగా, ఏయే వాతావరణాల్లో, ఏయే సాధక బాధ

శాలతో పెంపొందింపజేసిందీ, వాళ్ళ కావ్యాలలోని గొప్పదనమూ, వాటి నిగనిగ వెలుగులూ వివరించడం జరుగుతుంది. నిదర్శనకు ఆయా కవుల రచనలలోని రసవత్తర ఘట్టాలు కొన్ని ఉదాహరించడం కూడ జరుగుతుంది. ఆ రచనలలోని సొగసులు, చమత్కారాలు విశదీకరించడమూ జరుగుతుంది. ఒక్కొక్క కవి ఏయే గ్రంథాలు వ్రాసినదీ శృంగ్రగాహికగా వివరించి, అముద్రితమైనవీ అలభ్యమైనవీ అయితే ఆ గ్రంథాలనుండి తగిన ఉదాహరణలు సుదీర్ఘంగాకూడ ఇవ్వబడుతాయి.

సాహిత్యమంటే ఒక్క పద్యకావ్యాలే కావుగనుక ఈ సంపుటాలలో ముఖ్యులైన శతకకవులూ, యక్షగాన రచయితలూ, వచన కర్తలూ, వాగ్గేయకారులూ వెుదలైన మధురకవులను గురించికూడ కావలసినన్ని జీవితవివరాలూ, ఉదాహరణలూ ఉంటాయి.

ఈ సంపుటాలు చదివాక ఎటువంటి సామాన్య పాఠకుడికైనా సమగ్ర ఆంధ్రసాహిత్యంతో సన్నిహిత సంబంధం ఏర్పడాలని మా ఉద్దేశ్యం; ఏర్పడి తీరుతుందని మా దృఢాభిప్రాయం.

ఇవి ఆస్వాంతం చదివాక సర్వసాధారణ పాఠకుడు సైతం కొమ్మలు తిరిగిన సాహితీపరుల అగాధచర్చలనుకూడ సాధికారంగా, కరతలామలకంగా బోధపరుచుకునే అవకాశ ముంటుందని ఆశిస్తున్నాము.

ఈ సాహిత్యచరిత్రలో కడచిన సహస్రాబ్దాలనూ పక్కపేజీల్లో పేరొక్కన్నట్లు అందికగా యుగాలుగా విభజించి, తదనుసారంగా ఆయా యుగాల సమీక్ష జరుగుతుంది. అందులో ఇది నాయకరాజుల యుగ సమీక్ష సంపుటి.

పన్నెండు సంపుటా లని ఆదిలో అనుకొన్నాము. మధ్యలో పద మూడైంది. దరిమిలాను పథ్నాలుగు చెయ్యవలసి వచ్చింది. ఇప్పుడు ఈ సంఖ్య కూడా పెరిగింది. పరిమితమైన పుటల్లో ఇమడ్చడానికి రచన సంక్షిప్తం చేయించడం మనస్కరించక యుగసమీక్షల పుటలు పెంచడమా, సంపుటుల సంఖ్య పెంచడమా అన్న మార్గాంతరాల్లో రెండోదే మెరుగనిపించింది. నాయక రాజుల యుగం రెండు భాగాలుగా వేస్తున్నాము. ఇది రెండవ భాగం.

ఈ సవరణలతోచేసిన యుగవిభజనల్లోఇప్పటికిపూర్తయిన సంపుటాల వివరణ ఇది :

1. ఆదిమ – చాళుక్యయుగము (క్రీ. శ. 12 వ శతాబ్దం చివరదాకా)
   (రాజరాజు 1061 లో చనిపోయినా, చాళుక్యచోడులు 1180 దాకా ఆంధ్రపై అజమాయిషీ చేశారు. అందుకని.)
2. కాకతీయయుగం (క్రీ. శ. 1200 – 1290)
   (రాజ్యస్థాపన క్రీ. శ. 1000 లో జరిగినా, గణపతిదేవ చక్రవర్తితో కాకతీయ ప్రాభవం ప్రస్ఫుటంగా కనబడుతుంది. అందుకు యుగం 1199 నుండి ప్రారంభం. అది రుద్రమదేవితోనే తగ్గిందని చెప్పవచ్చు. రెండవప్రతాపరుద్రుని కాలంలో కొత్తగాలులు వీచాయి. కనుక యుగం 1290 తో అంతం చేయవచ్చు.)
3. పద్మనాయకయుగం (క్రీ. శ. 1300 – 1375)
   (మొదటి సర్వజ్ఞసింగమ నాయకుని రాజ్యారంభందాకా)
4. రెడ్డిరాజులయుగం (క్రీ. శ. 1375 – 1450)
   (స్థాపన 1325 లో జరిగినా...కొమరగిరిరెడ్డితో ప్రాభవం. ఒక మూకాంకలుశతాబ్దం వీరియుగంగా పరిగణిద్దాం)
5. గజపతులయుగం (1435 నుండి)
   (రెడ్డిరాజుల యుగానికె ఇది అనుబంధంలాంటిది.)
6. తొలిరాయలయుగం (క్రీ. శ. 1450 – 1500)
   (ప్రౌఢదేవరాయల చివరికాలంనుండి, అనగా 1446 లేక 1450 నుండి సాళువరాయర్ల రాజ్యాంతందాకా)
7. మలిరాయలయుగం (క్రీ. శ. 1500 – 1550)
   (కృష్ణదేవరాయలయుగం)

8. నవాబులయుగం (క్రీ. శ. 1550 – 1600)

(ఇబ్రహీం కుతుబ్ షాతో ప్రారంభం. కులీకుతుబ్ షా మరణానికి ఒకదశ ముందుదాకా)

9. ఆరవీటిరాజులయుగం

(రక్కసతంగడి యుద్ధం తరవాత. 16 వ శతాబ్ది నాలుగోపాదం.)

10. నాయకరాజుల యుగం—1 (క్రీ. శ. 1600 నుండి)

(రఘునాథ నాయకుని పాలన)

11. నాయకరాజుల యుగం—2 (క్రీ. శ. 1670 దాకా)

(విజయరాఘవ నాయకుని కాలం)

ఈ సంపుటాలయ్యాక ఇంకా నాలుగు యుగాలు మిగిలాయి. వాటి వివరాలు :

1. కడపటి రాజుల యుగం (క్రీ. శ. 1670 – 1750)

2. కుంఫిణీ యుగం (క్రీ. శ. 1750 – 1850)

(మెకంజీ. బ్రౌనుల సేవ. ఉత్తర సర్కారులను బుస్సీ పుచ్చుకున్నాడు. 1758 లో కంపెనీవారు ఉత్తర సర్కారులను కైవసం చేసుకున్నారు.)

3. జమీందారీయుగం (క్రీ. శ. 1850–1900)

(పరిపాలన మొదలు సాహిత్యానికి జమీందారులే పోషకులని కవులు భావించడంచేత)

4. ఆధునిక యుగం (క్రీ. శ. 1900 నుండి)

ఈ సంపుటాలను కూడా సవిస్తరంగానే రచించాలని రచయిత ఆశయం. సమగ్రంగా ప్రచురించాలని మా సంకల్పం. మా అభీష్టం సిద్ధించి ఈ కృషి మహాజనానికి ఏ మాత్రం సంతృప్తి కలిగించినా మహా భాగ్యంగా పరిగణిస్తాము.

—ప్రకాశకులు.

ప్ర వే శి క

కందుకూరి వీరేశలింగం పంతులాదిగా అనేక పండితులు ఆంధ్రకవుల చరిత్రలు రచించారు. ఆంధ్రభాషాపరిణామంగురించి పలువురు పరిశోధకులు వ్యాసాలు, గ్రంథాలు వ్రాశారు. ఆంధ్రవాఙ్మయచరిత్రలుకూడా కొన్ని ఉన్నాయి. కాని, రమారమి రెండువేల సంవత్సరాల ఆంధ్రవాఙ్మయాన్ని —చాళుక్యయుగం మొదలు ఆధునికయుగం వరకు— సమగ్రంగా, సక్రమంగా, విపులంగా ప్రజాసామాన్యానికి అందజేసే పుస్తకం ఇదివరకూ లేదు. ఆ కొరత తీర్చడానికి సంకల్పించుకొన్న శేషాచలం కంపెనీవారి ఈ అసమానోద్యమాన్ని ఎంత మెచ్చుకొన్నా చాలదు. ఈ ప్రచురణలో కొన్ని ప్రశంసనీయాలైన అంశాలున్నాయి.

'మహిం మున్ వాగనుశాసనుండు సృజియింపన్' అని అన్నాడు రామరాజభూషణుడు. నన్నయ భారతమే తెలుగులో మొదటి కావ్యరచనఅనే అభిప్రాయం—సాధారణంగా. అయితే ఒక్కక్షణం ఆలోచిస్తే హఠాత్తుగా ఎటువంటి ప్రతిభాశాలియైనా అంత పరిపక్వమైన భాషాస్వరూపాన్ని సృష్టించడం అసంభవ మని తోచకమానదు. నన్నయకు పూర్వం ఎన్ని వంద లేండ్లు నుంచో ఆంధ్రభాష పుట్టి పెరుగుతూ వచ్చివుండాలి. ఆ అజ్ఞాతయుగం గురించి కొంతైనా తెలిసినవారి సంఖ్య అతిస్వల్పం. ఈ ప్రచురణ మొదటి సంపుటంలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనాపూర్వమైన చర్చ ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం.

ఇంకొకటి. ఇదివరకు రచింపబడిన ఆంధ్రవాఙ్మయ చరిత్రల్లో ఆధునిక సాహిత్యానికి అర్హమైన స్థానం ఇయ్యలేదు. ఈ చరిత్రలో దానికి ఉచితమైన ప్రాముఖ్యత ఇచ్చి దాని సర్వతోముఖవికాసం వర్ణింపబడ్డది.

కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్యచరిత్ర వ్రాయవచ్చు—చప్పగా. అటువంటిది కా దిది. కవులను గురించిన కథలూ కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్యవిమర్శలు—వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది.

ఇక రచయితగురించి రెండుమాటలు. ఆయనకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్యజ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్యపరిచయం సహా ఉంది. పరిశోధక కృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత.

ఇంత సమగ్రమైన ఆంధ్రసాహిత్యచరిత్రను ప్రకటించడానికి పూనుకున్న శేషాచలం కంపెనీవారి ఆశయం శ్లాఘనీయం. ఆంధ్రభాషకు వారు ఒనర్చే సేవ అగణ్యం. ఆంధ్రలోకానికి ఇది ప్రశస్తమైన విశ్వాసము కానుక. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

పి. వి. రాజమన్నారు.

———

పీఠిక

ఆరుద్రగారు రచించుచున్న సమగ్రాంధ్రసాహిత్యచరిత్రలోని దిపదకొండవ సంపుటము-నాయకరాజులయుగమునకు సంబంధించిన సంపుటములలో రెండవ భాగము.

మొన్నమొన్నటివరకును అనంతర ప్రబంధయుగము 'క్షీణయుగము' అనునపప్రథపాత్రయుండెను. పరిశోధకపండితులు ఇటీవల దాక్షిణాత్యాంధ్ర సాహిత్యమునుగూర్చి జరిపిన విపుల పరిశోధనలవలన ఎన్నియో నూత్న సాహిత్యప్రక్రియలకు ఆలవాలముగా నేర్పడిన ఈ యుగము విశిష్టమైన దని నిరూపితమైనది. పదకవిత, యక్షగానము, వచనము, నాటకము, శతకము, దండకము మున్నగు ప్రక్రియ లెన్నియో పరిపూర్ణవికాసము నొందిన దీ యుగములోనే.

ఈయుగమునకు సంబంధించినంతవరకు ఒకటిరెండు విశేషాంశములు ప్రధానముగ బరిశీలింపదగియున్నవి. ఆంధ్రసామ్రాజ్యలక్ష్మి తెలుగు పాలి మేరల దాటి దక్షిణాపథములో స్వేచ్ఛావిహార మొనర్చినది. సామ్రాజ్యాధీశ్వరులతో పాటు మండలాధీశ్వరులు, సంస్థానాధిపతులు, సామంతప్రభువులు, అధికారులు కవిపండితపోషకు లైనారు. చెంజి, తంజావూరు, మధుర మున్నగు రాజనగరములు ప్రధానసాహిత్యకేంద్రము లైనవి. రాజకీయ కల్లోలమునందును రమణీయకావ్యములు వెలువడినవి. రాజ్యలక్ష్మి వంశ పరంపరగా రాజుల నాశ్రయించినట్లు సాహిత్యసరస్వతియు కవిపండిత కుటుంబముల పరంపరగా ననుగ్రహించినది.పండితకుటుంబములు సాహిత్య చరిత్రలో ప్రముఖస్థానము నలంకరించినవి. చతుర్విధకవితలు పండితుల మన్ననల నొందినవి.

నాయకరాజుల యుగము పదునేడవ శతాబ్ది తెలుగు సాహిత్యచరిత్రకు పునాదివంటిది. ఈయుగసాహిత్యసమీక్షనొనర్చు విమర్శకుల దృష్టి నేటివరకును ప్రధానముగ మధుర తంజావూరు నాయకరాజులపై కేంద్రీకృతమైయుండెను. చెంజి రాజధానిగ విలసిల్లిన తుండీరమండలమునకు సాహిత్యచరిత్రలో నముచితస్థానము లభింపకుండెను.

ఆరుద్రగారు ఈయుగమునాటి రాజకీయసాంఘికచరిత్రను నిశిత దృష్టితో బరిశీలించి అట్టి వాతావరణములో వెలువడిన కావ్యములనుగూర్చి విపులముగ జర్చించిరి. తుండీరమండలమునుగూర్చి చారిత్రకులు వ్యక్తీకరించిన భిన్నాభిప్రాయములను సమన్వయపరచి తెలుగుకవులకును, తుండీరమండలాధిపతులకును గల సంబంధమును సోపపత్తికముగ నిరూపించి తెలుగుసాహిత్యకేంద్రములలో చెంజికి సముచితప్రాధాన్యమొసగుట ఆరుద్రగారి పరిశోధనాత్మకదృష్టికి తార్కాణముగ నున్నది. విస్మృతాంశము నింత సమగ్రముగ వివరించిన అంశ మొకటియే ఇది సమగ్రఆంధ్రసాహిత్యచరిత్ర యనుటకు నిదర్శనము.

ఈయుగములో వెలువడిన కొన్ని కావ్యములు సాహిత్యగౌరవము కలవి; మరికొన్ని పాండితీస్ఫోరకములు. పూర్వప్రబంధములకు అనుకరణ ప్రాయములయ్యు క్రొత్తదనమును సంతరించుకొనిన కావ్యములును కొన్ని కలవు. దామెర్ల వేంగళరాజు బహుళాశ్వచరిత్ర, మూర్తికవి రాజవాహన విజయము, చెంగల్వ కాళకవి రాజగోపాలవిలాసము, సవరము చిననారాయణ కువలయాశ్వచరిత్ర, లింగనమఖి తిరుకామయ్య సత్యభామాసాంత్వనము మున్నగునవి ఈ కోవకు చెందినవి. ఇవి తెలుగుసాహిత్యముతో ప్రగాఢపరిచయము కలవారికే సుపరిచితములుగా నున్న కావ్యములు. సామాన్యపాఠకులకును సాహిత్యముతో పరిచయ మేర్పడునట్లుగను, సాహిత్యమునం దభిరుచిగలిగించునట్లుగను ఆరుద్రగారీకావ్యములను విమర్శించిరి. కథాంశమును సుబోధమొనర్చిరి. పండితులకు, పరిశోధకులకును దోడ్పడునట్లు కావ్యములోని వివిధాంశములను విపులీకరించిరి. ఈకావ్యములు ఆంధ్రుల సాంఘికచరిత్రకు దర్పణమువంటివి. కీ. శే. సురవరము ప్రతాపరెడ్డి ప్రభృతులు వీనియండలి అమూల్యములైన అంశములను వివరించియుండిరి. ఆరుద్రగారు నాయకరాజులయుగములోని చారిత్రక వాఙ్మయవిశేషములను సమన్వయపరిచి నాటి సాంఘికచరిత్రను గ్రహించుట కనువుగానుండునట్లు ఈ కావ్యములను బరిశీలించుట ప్రశంసార్హము.

చిత్రకవిత్వముగాని, బంధకవిత్వముగాని సామాన్యులకందనివి. గణపవరపు వేంకటకవి రచించిన ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాస మను

కావ్యమును బరిశీలించుపట్ల ఆరుద్రగారు చిత్రకవితారీతుల చిత్రవిచిత్రగతుల ప్రాశస్త్యమును సామాన్యులను సులభముగ గ్రహించునట్లు నిరూపించిరి.

యక్షగానములకును, పదకవితకును ఆరుద్రగారు సాహిత్యచరిత్రలో సముచితసానము నొసగియున్నారు. క్షేత్రయ్య పదములలో సాహిత్యపు విలువను ఆరుద్రగారు సోదాహరణముగ జూపియున్నారు.

రంగాజమ్మ, రామభద్రాంబ మున్నగు కవయిత్రు లాంధ్రసాహిత్యమున కొనర్చిన సేవను కూడ ఆరుద్రగారు నిశితముగా బరిశీలించినారు.

సాహిత్యచరిత్రలో పదునేడవశతాబ్దికాలమును ఏయుగముగా పరిగణింపవలయు ననువిషయము వివాదాస్పదముగా నున్నది. ఇది క్షీణయుగమనియు, అనంతరప్రబంధయుగ మనియు, నాయకరాజుల యుగమనియు సాహిత్యచరిత్రకారులు వివిధముగ బేర్కొనినారు. సాహిత్యప్రక్రియావైవిధ్యముగల యీ యుగమును అనంతరప్రబంధయుగ మనుటయే సమంజసముగా నున్నది.

వివిధకావ్యములను బరిశీలించు సందర్భమున శ్రీ ఆరుద్రగారు కొన్ని అంశములను కేవలము సూత్రప్రాయముగా గాక, మరికొంత విశేషముగా చర్చించియుండినచో పాఠకుల కెంతయో యుపయోగముగా నుండెడిది.

సౌందరి అను రచయిత్రి రంగాజమ్మగ్రంథముల ననుసరించిన సందర్భములను విపులీకరించినచో నూత్నాంశములను తెలిసికొనుట కవకాశము గలిగియుండెడిది. సౌందరి రచించిన గ్రంథము అముద్రితము. దాని నుండి కొన్ని యుదాహరణములు చూపియుండినచో రంగాజమ్మను ఆ కవయిత్రి అనుకరించిన సందర్భములు స్పష్టములై యుండెడివి.

శ్రీ ఆరుద్రగారి సునిశితమైన విమర్శనపద్ధతి, రచనావిధానము పండితులను, సామాన్యులను రంజింపజేయు ననుట కేలాటి సందేహము లేదు. వారు సమగ్రాంధ్రసాహిత్యచరిత్రను జనసామాన్యమునకు సుబోధకముగా నుండునట్లు మృదుమధురలలితశైలిలో రచించి ఆంధ్రలోకమునకు మహోప

కారమును చేసియున్నారు. తేనెలు జాలువారు వారి భాషాశైలిని చదువు నప్పుడు శ్రీ ఆరుద్రగారు కలమును అమృతములో నద్ది వ్రాసినారా యను నంత మనోహరముగ నున్నది. శ్రీ ఆరుద్రగారికి తెలుగుప్రజలు ఎంతయో ఋణపడియున్నారు.

ఇట్టి సర్వజనోపయోగిగ్రంథములను ఆరుద్రవంటి సునిశితవిమర్శక రచయితతో వ్రాయించి ముద్దులు మూటగట్టునట్లుగా ప్రచురించుచున్న శ్రీ యం. శేషాచల ంఅండ్‌కోవారు మిక్కిలిప్రశంసార్హులు. వారికిని, శ్రీ ఆరుద్ర గారికిని నా హృదయపూర్వక ధన్యవాదములు.

హైదరాబాదు
29-3-1967

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

కృతజ్ఞతలు

ఈ ప్రణాళికలో ఇది పదో యుగం-రెండో భాగం. నాయకరాజుల యుగాన్ని రెండు భాగాలుగా ప్రచురించవలసి వచ్చింది. సమగ్రత కోసం, తెలిసిన విషయాలను విడిచిపెట్టకుండా, సవిస్తరంగా ఈ యుగ సమీక్షను వ్రాశాను. ఇది ప్రకాశకులూ, నేనూ అనుకొన్న పుటల పరిమితిని దాటింది; రెండింతలు పెరిగింది. అయినా దీనిని సగానికి సగం తగ్గించ నక్కరలేకుండా రెండు భాగాలుగా ప్రకటించడానికి మిత్రులు యమ్. యన్. రావుగారు అంగీకరించారు. అందుకు వారికి కృతజ్ఞుణ్ణి.

ఈ సంపుటాలను ఆసక్తితో చదివి, సహృదయత్వంతో విమర్శించి, ప్రోత్సహిస్తున్న వాళ్ళందరికీ నా ధన్యవాదాలు. చెల్లా చెదురుగా ఉన్న ఆకరాలను ఒక్క చేతో క్రోడీకరిస్తున్నప్పుడు రచనలో తప్పులు దొర్లడం తప్పదు. వీటికి తోడు సాఫు వ్రాస్తున్నప్పుడో, వ్రూఫు దిద్దుతున్నప్పుడో మరికొన్ని పొరపాట్లు చేరుతున్నాయి. ఇవన్నీ రెండవ ముద్రణలో దిద్దుకొంటానని మనవి చేస్తున్నాను.

ఈ రచనకు కావలసిన గ్రంథాలు కొన్నింటిని మిత్రులు సర్వశ్రీ వేదం వెంకటరాయశాస్త్రి, వేదం లక్ష్మీనారాయణ శాస్త్రి, దేవుళ్ళ చిన్న కృష్ణయ్య, నిడుదవోలు సుందరేశ్వరరావు, డాక్టరు బిరుదు రాజు రామరాజు మొదలైనవారు ఎరు విచ్చారు. వారికి నా ధన్యవాదాలు. ఈ కృషిని ప్రోత్సహిస్తున్న ఈరంకి రాయన్న, పర్వతనేని గంగాధర రావు గార్లకు నా కృతజ్ఞతలు.

ఈ ప్రణాళికకు ప్రవేశిక వ్రాసిన డాక్టరు పి. వి. రాజమన్నారు గారికి, ఈ సంపుటానికి పీఠిక వ్రాసిన కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారికి ప్రకాశకులతో పాటు నా వందనాలు.

ఈ రచనకు సాఫు వ్రాస్తున్న నా అర్ధాంగి శ్రీమతి రామలక్ష్మికి నా అభివందనాలు. పట్టికలు తయారుచేయడంలోనూ, పుస్తకాలు తెచ్చిపెట్టడంలోనూ సాయపడ్డ మిత్రుడు యం. వి. యల్. నరసింహారావుకు దీవనలు. వ్రూఫు దిద్దుతున్న మిత్రులకు నమస్కారాలు.

—ఆరుద్ర.

ఇందులోని విషయాలు

మా ఉద్దేశం	iii
ప్రవేశిక–డా॥ పి. వి. రాజమన్నారుగారు	vii
పీఠిక–కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు	xi
*14. విజయరాఘవనాయకుడు	17
15. దామెరలకవులు, కాకమానిమూర్తికవి	41
16. క్షేత్రయ్య	75
17. చెంగల్వకాళయ్య	101
18. రామభద్రమ్మ, రంగాజమ్మ, మరికొందరు	112
19. కొందరు నాటకకర్తలు	126
20. సవరం చిననారాయణ	139
*21. గణపవరపు వెంకటకవి	159
*22. లింగనమఖి తిరుకామయ్య	182
23. నారాయణతీర్థులు, సిద్ధేంద్రయోగి	193
24. చింతలపల్లిపండితులు, లయగ్రాహి కవులు, బోరవెల్లి సంస్థానం	203
25. కాకునూరి అప్పకవి	218
26. పదిమంది శతకకవులు	234
27. తాడిగోళ్ల కదిరీపతి, అయ్యలరాజు నారాయణ	242
28. ఇతరకవులు	254

---

*గ్రంథములో ఈ శీర్షికసంఖ్యలు తప్పుగా పడినందుకు చింతిస్తున్నాము. అవి ఈ రీతిగా నుండవలెను.

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

11. నాయకరాజుల యుగం - II



నాయకరాజులనాటి దక్షిణదేశము

1

విజయరాఘవ నాయకుడు



శ్యేషు నాటకం రమ్యం అన్నారు మన పెద్దలు. అయితే మన తెలుగుసాహిత్యంలో ఎన్ని రమ్యమైన కావ్యాలున్నా అసలైన నాటకాలు నిన్న నిన్నటిదాకా లే వనే అపోహ ఒకటి ప్రచారంలో ఉంది. నిజానికి మన సంప్రదాయానికీ పరిస్థితులకు సరిపోయే దృశ్యకావ్యాలు మనకు చాలా కాలం నుంచీ ఉండేవి. ఒక రకంగా యక్షగానాలు నాటకాలే. కాని వాటిలో పాత్రల సంభాషణలు విపులంగా ఉండవు గనుక వాటిని నృత్య నాటికలుగానో, గేయప్రబంధాలుగానో పరిగణించడం అలవాటైంది. అయితే తాము నాటకాలను ప్రాస్తున్నామని కచ్చితంగా చెప్పి యక్షగాన కృతులను నాటకరీతులలో నడిపించిన కవులు చాలా మంది ఉన్నారు. వాళ్ళలో ప్రథముడు విజయరాఘవ నాయకుడు. అతడు ఆంధ్ర నాటక కర్తలలో ప్రథముడైనా తంజావూరు పాలించిన ప్రముఖ

నాయక రాజులలో చివరివాడు. తెలుగు నాటకాలను ప్రోత్సాహించి, ఆదరించి ఎంత పుణ్యం కట్టుకున్నాడో తెలుగు రాజ్యాన్ని ఇడుములపాలు చేసి అంత పాపం ఒడికట్టుకొన్నాడు.

పదవీ వ్యామోహం పాపిష్ఠిది. రఘునాథ నాయకు డంతటివాడు రాజ్యం కోసం అన్నగారిని చెరలో పెట్టి చంపించాడని సమకాలికులైన పావరీలు ప్రశాశారు. రఘునాథుడు ఒక్క సోదరుణ్ణే తొలగించి గద్దె కెక్కితే అతని మూడో కొడుకు విజయరాఘపుడు తన ఇద్దరన్నగార్లనూ కారాగారంలో పెట్టించాడు. కళ్ళు పీకించాడు. రఘునాథుడు క్రీ. శ. 1630 లో మరణించాడు. ఆయన రాజ్యకాలంలో తన ముగ్గురి కుమారులలో ఏ ఒక్కరికైనా యువ రాజ్యపట్టాభిషేకం చేశాడో లేదో తెలియదు. అతని పెద్ద కుమారు లిద్దరూ అతనితోపాటు యుద్ధాలలో పాల్గొనేవారు. క్రీ. శ. 1617 లో జరిగిన తోపూరు యుద్ధంలో రఘునాథుని రెండో కొడుకు రామభద్రుడు పాల్గొన్నాడు.[1].

అచ్యుత నామాంకితాగ్రతనూజు - డచ్యుత రామభద్రావనివిభుడు
మొదలైన తనయులు మువ్వురా వేళ - బొదలి మూర్తిత్రయంబో వీర లనగ
ప్రభుశక్తి మెరయభద్రగజమ్ము లెక్కి--యుభయపార్శ్వంబులనొంపుగా గొలువ
[రఘునాథాభ్యుదయం ద్విపద 2_79 నుండి]

రఘునాథ నాయకు డిలా ముగ్గురు కొడుకులతో ఊరేగేవాడని విజయ రాఘవుడే తన గ్రంథంలో ఒక చోట చెప్పాడు తండ్రి తరువాత పెద్ద కొడుకు రాజవ్వాలి. లేదా, రెండోవాడు గద్దెనెక్కాలి. గాని రఘునాథనాయకుని తరువాత మూడోవాడే పట్టాభిషేకం చేసుకొన్నాడు. రఘునాథుడు క్రీ. శ. 1630 లో పోయినా, 1633 దాకా విజయరాఘవుడు సింహాసనంపై అధిష్ఠింప లేకపోయాడు. ఈ మూడేళ్ళూ అన్నదమ్ములు రాజ్యం కోసం యుద్ధాలు చేశారు. రఘునాథుని మంత్రి గోవింద దీక్షితుల వారి పుత్రులు మంచి పలుకుబడి గల ఉద్యోగాలలో ఉన్నారు. ద్వితీయ పుత్రుడు వెంకటమఖి ఇతర రాజోద్యోగులతో పాటు విజయరాఘవునికి సహాయం చేశాడు.

---

1. రఘునాథాభ్యుదయం, నాటకం, పుట 33.

వెంకటముఖికి 'ప్రతిష్ఠాపిత చోళక్ష్మాజాని' అనేబిరుదుఉంది.[1] విజయరాఘవుడు క్రీ. శ. 1633 లో శ్రీముఖనామ సంవత్సర శ్రావణశుద్ధ ద్వాదశి బుధవారం నాడు పట్టం కట్టుకొన్నాడు. ఆనా డతడు షోడశ మహాదానాలు చేశాడు. అప్పటి కతని వయస్సు 15, 16 సంవత్సరా లని పరదేశస్తుల అంచనా.[2] బహుశా పాతికేళ్ళవాడు కావచ్చును. వెంకటముఖి వంటి మంత్రులు ఇతణ్ణి ఎందుకు బలపర్చారో తెలియదు.

విజయరాఘవుడు చాలా శూరుడు. రోజుకు అయిదారామడలు అవలీలగా దాటచేసి రాగలడు. స్వారి చేస్తున్నప్పు డొక గుఱ్ఱం మీద నుంచి మరొక గుఱ్ఱం మీదికి లంఘించకలడు. మావటీలకు లొంగని ఏనుగులను అదుపులో పెట్టకలడు. సానాకత్తి పట్టుకొంటే చాలు అవతలవాడు ఎంత బలవంతుడైనా సరే ఇట్టే అయువుపట్లని గాయపర్చ కలడు.[3] ఇలాంటి వీర యువకుని పక్షమే రాజోద్యోగులు వహించడంలో ఆశ్చర్యం లేదు. రాజ్యము కోసం అన్నదమ్ములు కలహించారని, సోదరులను విజయరాఘవుడు చెరలో పెట్టించాడని చరిత్రకారులు భావిస్తున్నా తన తండ్రే తనకు పట్టాభిషేకం చేశాడని విజయరాఘవుడు వ్రాసుకొన్నాడు. అతడు రఘునాథ నాయకాభ్యుదయం అనే ద్విపద కావ్యం ఒకటి వ్రాశాడు. దానినే కొన్నాళ్ళు పోయాక నాటకంగా మార్చాడు. ఆ నాటకం చివర విజయరాఘవు డిలా చెప్పాడు:

"నిజలీలావిలాస శృంగాటంబుగా నాటకంబు రచియించిన తన ముద్దు పట్టియగు విజయరాఘవ పట్టభద్రునకు పట్టంబు గట్టి ఇతడు గావించు వివిధోపచారంబులను హర్షించుచు...." రఘునాథుడు శుభోదర్కంగా ఉండే వాడట. ఇది విజయరాఘవుని కల్పన. ఈయన ఈ మాత్రం అబద్ధం ఆడి 'ఇదిగో పులి' అనగానే చాని తోకను పట్టుకొని అతని అశ్రితులు కల్లల కారడవిలోకి చల్లగా వేటకు వెళ్లారు. రాజుగారికి పెద్దకొడుకు ఉంటే

---

1. రాజచూడామణి దీక్షితులు తన గురువు వెంకటముఖి గురించి చెప్తూ ఈ బిరుదును తన తంత్రశిఖామణిలో పేర్కొన్నాడు.

2. రఘునాథనాయకాభ్యుదయం, ఆంగ్ల పీఠిక, పుట 30.

3. రాజగోపాల విలాసం. 1_71.

ఉండుగాక, దైవాంశ సంభూతుడైన కడగొట్టువాడే అన్న లందరి కన్న మిన్న అని స్ఫురింప చేయడానికి రంగాజమ్మ అనే అవిద కొన్ని కట్టుకథలు తయారు చేసింది. ఆమె అతని భోగపత్ని. విజయరాఘవుని విలాసాన్ని ప్రబంధంగా వ్రాసింది. అతడు మన్నారుగుడిలోని రాజగోపాలస్వామి భక్తుడు. అందుచేత మన్నారుదాసు డనే పేరు పెట్టుకొన్నాడు. రంగాజమ్మ మన్నారు దాస విలాస మనే ప్రబంధంలో విజయరాఘవుని అవతారం గురించి ఇలా చెప్పింది: "రఘునాథ నాయకయ్య గారికి చెంజి లక్ష్మమ్మ, కళావతమ్మ అనే భార్య లున్నారు. వారు పుత్రసంతానం కోసం రాజగోపాలుణ్ణి పూజించి దానాలూ, వ్రతాలూ చేశారు. రఘునాథు డొకనా డా భార్యలతో పాటు తీర్థమాడి పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు. అప్పుడు శ్రీహరి ప్రత్యక్షమై, 'నీ కేం వరం కావాలో కోరుకో' అన్నాడు. విజయమహిమలతో 'ఈ మహీ మండల మంతా ఏల గలిగే కొడుకును మా కియ్యి' అని రఘునాథుడు ప్రార్థించాడు. "మెచ్చుకున్నాను. నీకు మచ్చికతనయుణ్ణయి అచ్చంగా నీ సాధ్విగర్భాన పుడతాను" అని వర మిచ్చింది కాక పుట్టని పాపకు దేవుడే ఇలా పేరు కూడా పెట్టుకొన్నాడు:

తీవి విజయాభ్యు సుతుని వేడితివి కనుక
లీల మెయి రాఘవునిగ గొల్చితివి గనుక
విజయరాఘవ నామంబు వెలయ నాల్చి
చెలగి వియ్యేళ్ళ పుడమి రక్షింపుచుందు.

[మన్నారు - ప్రబంధం. 1_52]

ఈ అవతార గాథతో ఊరుకోకుండా రంగాజమ్మ మరో కల్పన చేసింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు కాళిందిని వివాహం చేసుకొన్నాడు. ఆమె సూర్యుని కూతురు. ఈ పెళ్ళి చూశాక చంద్రుడు కూడా తన కూతుర్ని కృష్ణునికి ఇవ్వా లనుకున్నాడు. అయితే కృష్ణుడు కొంచెం మొహమాట పడ్డాడు. చంద్రుడు కృష్ణునికి బావమరిది వరస. (లక్ష్మీదేవి అతని సోదరి కదా!) ద్వాపర యుగంలో మేనకోడలిని పెళ్ళి చేసుకోకూడ దన్నారు కాబోలు, కలియుగంలో పెళ్ళాడుతా నన్నాడు. ఆ చంద్రుడు రాజచంద్రుడై తంజావూరులో పుట్టాడు. అతని కూతురి పేరు కాంతిమతి. ఆమెను విజయ రాఘవుడు పెళ్లాడడమే మన్నారుదాస విలాస కథ.

భోగపత్ని రంగాజమ్మ ఈ అవతారకథ అద్భుత కల్పనలతో సృష్టిస్తే అమెకు తీసిపోతానా అన్నట్లు విజయరాఘవుని పట్టంపుకవి కామరసు వెంకటపతి సోమయాజి మరొక అపూర్వ గాథను సృష్టించాడు. విజయ రాఘవుడు ద్వాపరంలోని ఒక్క కృష్ణుడే కాదు. అయనే వాస్తవానికి విజయుడు. అర్జునుణ్ణి ఊర్వశి ప్రేమించడం జగద్విదితం. ద్వాపరంలో అమెను పాపమని ఒద్దు పొమ్మన్నాడు. శాపానికి ఒడికట్టాడు. ఆ తరువాత చాలా బాధపడి కలియుగం దాకా ఆగాడు. ఆ ఊర్వశే తంజావూరులో లీలావతి అనే వేశ్యగా జన్మించిందని అర్జునుడు తెలుసుకొన్నాడు. ఆ పిల్ల కలలో ప్రత్యక్షమయ్యాడు. "నేను అర్జునుణ్ణి, నువ్వు ఊర్వశివి. ఇప్పుడు నేను విజయరాఘవుణ్ణయి తంజావూరు ఏలుతున్నాను. ద్వాపరంలో నీ కోరిక తీర్చలేదు. కలియుగంలో నీ కోరిక తీరుతుందని ఇంద్రుడు నీకు వర మిచ్చాడు. నిన్ను పెళ్ళాడుతాను" అని హామీ ఇచ్చాడు. ఈ లీలావతిని విజయరాఘవుడు పెళ్లి చేసుకోవడమే ఒక నాటకంగా వ్రాసి విజయరాఘవ చంద్రికా విహార మని కామరసుకవి పేరు పెట్టాడు.

భోగపత్నులు, పట్టపు కవులు ఇలా బోలెడు పుక్కిటి పురాణాలు సృష్టించి తనకు అంటగట్టినా, విజయరాఘవుడు తను విజయుణ్ణిగాను, కృష్ణుణ్ణిగాను అని చెప్పాడు. ఆయన సాక్షాత్తూ రాజగోపాలస్వామి వారి కుమారుడు, అంతే. అంతకన్న ఎక్కువ కాడు, తక్కువ కాడు. విజయ రాఘవుని ఉద్దేశంలో రఘునాథ నాయకుడే రాజగోపాలుని అవతారం. తన తల్లి అక్షరాలా అరుణాబ్జవల్లి. ఆమె చనుబాలు తాను గ్రోలాడు. ఒకసారి రాజగోపాలుడు అరుణాబ్జవల్లితో కలిసి విజయరాఘవుని కలలో కనబడి ఇలా అన్నాడట:

బాగుగా నిన్ను జేబట్టి మాపట్టి
వని యెంచి మాతల్లి యరుణాబ్జవల్లి - చనుబాలు గ్రోలించి చాల లాలించి
తొలుదొల్త నీమేని దురితంబు లెల్ల - దొలగించి రాజ్యంబు ధ్రువముగానొసగి
సొంపుగ నిను దయజూచు పురాణ_దంపతులము నీవు తల్లి దండ్రులము.

[రఘునాథాభ్యుదయ ద్విపద, 1_92 నుండి]

దేవుడే స్వయంగా ప్రక్షాళనం చేయవలసినన్ని పాపాలు విజయ రాఘవుని దేహంలో ఎందుకున్నా యన్న సందేహం ఇవాళ మనకు రావడం సహజమే. ఇతడు రఘునాథ నాయకునికి అధర్మయుక్తమైన వారసుడే అని చరిత్రకారుల ఊహ.[1] అన్యాయంగా అధికారాన్ని హస్తగతం చేసుకొని ఈ కళంకాన్ని కప్పిపెట్టుకొనడానికే పుక్కిటి పురాణాలు సృష్టింప చేశాడు. హలకులిశరేఖ లున్న పాదాలు గోపాలునికి, విజయరాఘవ భూపాలునికి తప్ప ఇంకెవరికీ లేవనే నమ్మకాన్ని ప్రజలలో నాటుకొనేటట్లు చేశాడు. తన ఆశ్రయంలో ఉన్న కవులందరూ తాను శ్రీకృష్ణుని అపరావతారమని పని గట్టుకొని పొగడితే, ఆ మాటలు విని విని, శ్రీకృష్ణునిలాగ విచ్చలవిడి శృంగారాన్ని గుత్తపుచ్చుకొన్నాడు. కొలువుకూటంలో తాను చేసే కాముక చేష్టలను సగర్వంగా ఇలా చాటుకొన్నాడు.

నములుతున్న తాంబూలాన్ని ఒక పడుచుపిల్ల నోటికి ఇచ్చేవాడు. ఒక శృంగారవతి కీలుజడను లాగేవాడు. పాదాల దగ్గిర కూర్చున్న ఒక పిల్లదాని పోకముడిని బొటన వ్రేలితో నడలించేవాడు. ఇంకో పడుచు రొమ్ముపై గోటితో గిల్లేవాడు. మరో వెలయాలిని పెదవిపై ముద్దు పెట్టుకొనే వాడు. ఒక వన్నెలాడి వక్షోజాలపై కస్తూరి పులిమేవాడు. మరో పిల్లని గట్టిగా కౌగలించేవాడు. ఇంకో విలాసవతిని తొడపై కూర్చోపెట్టుకొనేవాడు.[2] తన ఘనతను విజయరాఘవుడు ఇలా చాటుకొంటే, రంగాజమ్మ అతని వైభవాన్ని మరికొంత వర్ణించింది. అతని కొలువుకూటం పేరు రాజగోపాల విలాసం. అందులో అతడు సభ తీరే తీరు ఆమె చెప్పింది. ఒక పడతి ఆడపం, మరో మంజువాణి కాళంజి, ఒక పువ్వుబోడి పావడ, ఒకబిత్తరి బెత్తం, ఒక వాలు గంటి వాలు, ఒక అండజయాన గిండి పట్టుకొని దగ్గరలో నిలబడేవారు. నాజమ్మ, చంపకవల్లి అనే ఇద్దరు భోగపత్నుల మధ్య ఒరసుకొని విజయ

---

1. Nayaks of Tanjore by V. Vridhagirisan. P. 127.

2. విప్రనారాయణ చరిత్ర, పుట 15. తన తండ్రి కూడా అచ్చంగా ఇలాగే చలువ చప్పరంలో సరసమాడేవాడని రఘునాథాభ్యుదయంలో విజయరాఘవుడు చెప్పాడు. (3. 559 నుండి) శృంగార నాయక శేఖరుడగుచు... జిగిమించు తొడలపై జేర్చునొక్కతెను...

రాఘవుడు కూర్చునేవాడు. ఈ ఘనకార్యాన్ని అతని కొడుకులు, మనవలు, కూతుళ్ళు వీక్షించేవారు. కస్తూరి,అంబుజవల్లి,శశిరేఖ,మోహనమూర్తి,కృష్ణాజీ. అలిమేలు, సీత, మదనరేఖ మొదలైనవాళ్ళు వసంతకేళి వినిపించేవారు.

రాజగోపాల విలాసం అనే కొలువుకూటంలో విజయరాఘవుని వైభవాన్ని రంగాజమ్మ ఇలా వర్ణిస్తే రాజగోపాల విలాసం అనే కావ్యంలో అతని నాట్యసభను చెంగల్వకాళయ్య మరింత వర్ణించాడు. విజయరాఘవ విలాస మనే మందిరంలో ఒకర్తె వీణ వాయించేది. ఇంకొకతె కిన్నెర పలికించేది. ముఖవీణ ఒకరు వాయిస్తే మరొకర్తె పిల్లనగ్రోవి ఊదేది. ఒకతె తంబుర మీటేది. మరొక చిన్నది స్వరమండలం మీటేది. కొందరు రావణహస్తం ఉడుకు మొదలైనవి వాయించేవాళ్ళు. విజయరాఘవుని నాట్యసభలో అడవాళ్ళ వాద్యబృందమే ఉంటేది. ఈ సంగీతానికి అనువుగా కొందరు బిరుదుపాత్రలు రకరకాల నాట్య విశేషాలను అభినయం చేసేవారు. ఎవరెవరు ఎందులో ప్రవీణులో కాళకవి చెప్పాడు.[1]

చౌపదాలు – రూపవతి	కొరవంజి – కోమలవల్లి
శబ్దచూడామణి – చంపకవల్లి[2]	నవపదాలు – లోకనాయకి
జక్కిణి – మూర్తి	దేశి – శశిరేఖ
దరుపదాలు – రత్నగిరి	పేరణి – భాగీరథి.

ఇంకా మరికొందరు మదన పదాలు, నవరత్నమాలికలు వినిపించేవారు విజయరాఘవు డీ విధంగా కొలువు తీరేటప్పుడు అతని 'సాహిత్యరాయ పెండేరం' ఉండేది. దీని మీద చెంగల్వ కాళయ్య పంచరత్నాలు చెప్పాడు[3]

---

1. రాజగోపాల విలాసం. 1_28.

2. చంద్రరేఖ శబ్ద చింతామణిని వినిపించేద మల్లంపల్లి వారిచ్చిన పూతంపల్లి తెలుస్తోంది. (రఘునాథనాయకాభ్యుదయం తెలుగుపీఠిక.) పుట 44.

3. రాజగోపాల విలాసం 1_72 నుండి 76 దాకా 5 సీసపద్యాలు. ఎత్తుగీతిలో చివర 'జోర! సాహిత్యరాయ పెండేరమమరు' అనే మకుటం ఉంది.

పాదాని కిటువంటి పెండేరం ఉంటే పక్కన శారదా ధ్వజం ఉండేది. దీని మీద కాళకవి రెండు పద్యాలు చెప్పాడు:

ఒకొక్కరాయుడ జీనిచక్కర పానకం
బానిన ట్లాహ్లాద మావహిల్ల
నొకొక్కరాయుడ దావి నెకొక్కన విరజాది
సరము లెత్తినరీతి పరిమళింప
నొకొక్కకయెడ జల్వ లుప్పతిల్లగ మంద
మారుతంబులు వీచుమహిమచెలగ
నొకొక్క యెడ మేను జొక్క సంపాదించు
వెలదివెన్నెల తేట విధము మించ
కవిత రచియింప విజయరాఘవ విభుండె
నేర్చు నని వాణి వర్ణించు నేర్పు మీర
జామరానిల కందళ చలిత మగుచు
దనరు సభయందు నల శారదా ధ్వజంబు.

[రాజగోపాల విలాసం, 1_18]

మధురకవితలు తను చెప్తూ, ఇతరులు చెప్పినవి వింటూ విజయ రాఘవుడు ఎప్పుడూ అడవాళ్ళతోనే గడిపేవా డని భావించవచ్చును. ప్రజల గురించి అత డేమీ పట్టించుకొనేవాడు కాదు. ప్రజలు కూడా అతణ్ణి పట్టించుకోలేదు. 700 మంది భార్యలతో, 3500 మంది ఉంపుడు కత్తెలతో పొద్దస్తమానం గడిపే రాజును ఏ పౌరుడు మెచ్చుకో కలడు?[1] పైగా కాకులని కొట్టి గ్రద్దలకు వేసినట్టు పరదేశ సైనికులకు లంచాలుగా, పరసీమ రాజులకు కప్పాలుగా ఆర్పించడానికి ప్రజలను పీడించి, హింసించి ద్రవ్యాన్ని పోగు చేసేవాడు. పరసేనలు దండెత్తి వస్తున్నాయని తెలియగానే విజయరాఘవుడు తక్షణం రాజధానిని వదలిపెట్టి ఏ వలంకోటలోనో తల దాచుకొనేవాడు.

---

1. విజయరాఘవుని భార్యల సంఖ్య గురించి Maratha Rajahs of Tanjore అనే గ్రంథంలో Dr. K. R. సుబ్రహ్మణ్యంగారు ఉదాహరించారు. పుట 9, 10.

అక్కడకు కూడా వాళ్ళు వెంటాడివస్తే - ఒకటే పాదాక్రాంతుడై వాళ్ళడిగినంత డబ్బిచ్చేవాడు. లేదా గండం గడిచేదాకా అడవులలో నక్కి ఉండేవాడు.

యౌవనంలో ఎంతటి వీరుడైనా, సుఖం మరిగి విజయరాఘవుడు కత్తి పట్టడం మానేశాడు. పూర్వం కురులు కూడనినాడే పడమటి దొరను, అంటే మధురనాయక రాజును అతడు జయించినట్లు తెలుస్తూంది. నవరం వెంకటపతిని పారదోలి ఒక్క గడియలో పందనెల్లూరును పట్టుకొన్నాడట.[1] ఈ విజయాలు తప్ప విజయరాఘవుడు సాధించిన వింకేం లేవు.

శ్రీరంగరాయల జేపట్టి నిల్చి - యా రాయకార్యంబులౌ గాదటంచు
దుండగించిన పాండ్యతుండీరపతుల - ఖండించి వాకిలి గావ జేసితివి.

[రఘునా. ద్విపద, 1_286 నుండి]

అని విజయరాఘవుని గురువుగా రతణ్ణి ప్రశంసించారు. గాని ఇది అసత్య మని చెప్పాలి. క్రీ. శ. 1642 లో కర్ణాటక రాజ్యం పాలించే మూడవ వెంకటపతి రాయలు మరణించాడు. తరువాత అతని తమ్ముని కొడుకు మూడవ శ్రీరంగరాయలు రాజ్యానికి వచ్చాడు. కేంద్రంలో ప్రభువులు మారగానే సామంతులు స్వతంత్రించా లనుకోవడం సహజం. రాయల కింత అణకువగా మనం ఉండవలసిన అవసరం లేదని మధుర,చెంజి నాయకులు భావించారు. తమతో పాటు తంజావూరు కలిస్తే బాగుంటుం దని వారు అభిప్రాయపడ్డారు. విజయరాఘవు డీ ప్రయత్నాన్ని హర్షించి వారితో చేరాడు. దక్షిణాదిన ఉండే ముగ్గురు సామంతులూ ఎదురుతిరిగా రని తెలియగానే వాళ్ళకు తగిన గుణపాఠం చెప్పాలని శ్రీరంగరాయలు సేనతో కదలివచ్చాడు. ముందు చెంజిని ముట్టడించాడు. రాయలు రాణువతో రాగానే విజయరాఘవుడు మిత్రద్రోహం చేశాడు; మధుర చెంజి నాయకులను వారి కర్మానికి విడిచిపెట్టి రాయలతో చెయ్యి కలిపాడు. శ్రీరంగరాయల దాడిని తట్టుకోలేక మధురనాయకుడు ఒక రాజకీయపు టెత్తు ప్రయోగించాడు. మిత్రు డనుకున్న విజయరాఘవుడు శత్రువు అయ్యాడు కనుక శత్రువు లనుకొన్న గోల్కొండ సుల్తానులతో నఖ్యం చేసుకోవా లనుకొన్నాడు రాయలు. చెంజిని ముట్టడిస్తూ ఉండగా సామ్రాజ్యపు రాజధాని అయిన వెల్లూరిపై

---

1. రఘునాథనాయకాభ్యుదయం. 1_282.

దండయాత్ర చేయమని గోల్కొండవారిని మధుర నాయకుడు ప్రార్థించాడు. వాళ్ళు సరే అని, సర్వసైన్యాలతో కదిలారు. రాయలు తన రాజధానిని కాపాడుకొనడానికి చెంజిముట్టడిని ఆపి సేనలతో వెళ్లిపోయాడు.

మధురనాయకరాజు ఇచ్చిన ఆహ్వానంతో గోల్కొండ సైన్యాలు వెల్లూరును ముట్టడించాయి గాని ఆక్కడితో ఆగలేదు. మొదట కొద్దిగా పరాజయాలు పొందినా ఆ తరువాత ఇంకా దక్షిణాదికి కూడా దాడివచ్చాయి. గోల్కొండ సైన్యాలే కాక బీజపూరు సేనలు కూడా అడపా తడపా వస్తూనే ఉన్నాయి. 'తల్లి చెవులు తెంపినవాడికి పినతల్లి చెవులు బీరపువ్వులు' అని వెల్లూరు రాయలను అడవులు పట్టించిన మహమ్మదీయులకు ఇతర నాయక రాజుల మీద ఆపేక్ష ఉంటుందా? క్రీ. శ. **1646** లో చెంజిని పటుకొన్నారు. తరువాత తంజావూరుపై దాడిచేశారు. విజయరాఘవుడు లంచమిచ్చి సంధి చేసుకొన్నాడు. మధుర ముందుగానే మహమ్మదీయులతో రాజీ చేసుకుంది. క్రీ. శ. **1653** దాకా దక్షిణ దేశంలో పరసేనలు మగ్గంలో కండెలాగా తిరుగుతూనే ఉన్నాయి. ఆ తరువాత ఒక్క ఆరేళ్ళపాటు తంజావూరు కాస్త ఊపిరి తీసుకోకల్గింది.

క్రీ. శ. **1659** లో మధుర తిరుమలనాయకుడు మరణించాడు. అతని కుమారుడు రెండవ ముత్తువీరప్ప నాయకుడు రాజ్యానికి వచ్చాడు. అతడు లోగడ విజయరాఘవుడు మధురకు చేసిన ద్రోహానికి ప్రతీకారం చేయదలిచాడు. తన కోటలన్నీ బలపరచసాగాడు. బీజపూరుకు ఇవ్వవలసిన కప్పం మానేశాడు. విజయరాఘవుడు ఇదే అదను అని బీజపూరు సుల్తానుకు విన్నపం పంపించాడు. 'దయచేసి మధురపై దండయాత్ర చేయండి' అని ప్రార్థించాడు. బీజపూరు నుండి షాహజీ, ముల్లాలు సేనలతో వెల్లూరు మధురలే కాక తంజావూరును కూడా ముట్టడించారు. విజయరాఘవుడు ప్రతిఘటించడాని కే మాత్రం ప్రయత్నించలేదు. ఈ పరికితనానికి తంజావూరు కొలువులో ఉన్న రాచవారు సిగ్గుపడ్డారు. యుద్ధంచేసి వీరమరణం పొందడం ఉచితమని వారు చెప్పినా విజయరాఘవుడు తన స్త్రీజనంతో వల్లంకోటకు పారిపోయాడు. ముందుగానే ధనమంతా అక్కడికి తరలించాడు. రాచవారు కత్తులుదూసి బీజపూరు సైన్యాల నెదుర్కొని మరణించారు.

అడ్డగించేవారు లేక తంజావూరులో పరసైన్యాలు అడుగు పెట్టి యథేచ్ఛగా కొల్లగొట్టారు. మన్నారుగుడి దోచుకొని వల్లంకోటకు బయలు దేరారు. పరసేనలు వస్తున్నాయని భయపడి విజయరాఘవుడు అత్మీయులను వారి కర్మానికి వదలి అరణ్యానికి పారిపోయాడు. రాజు పారిపోతే బంట్లు ఉంటారా? వాళ్ళు కూడా కోటలో ఉన్న బంగారాన్ని, సవరత్నాలను మొయ్యగలిగినంత పట్టుకొని పారిపోయారు. మహమ్మదీయ సైన్యాలు రావడానికి ముందు వల్లంకోటలో బందిపోటు దొంగలు జొరపడ్డారు. కోశాగారంలో ఉన్న సంపవనంతా కొల్లగొట్టి పట్టుకుపోయారు. అక్కడ ఉన్న సొమ్ము లెక్కించడానికి సాధ్యపడక కుంచాలతో కొలచేవారు. మహమ్మదీయ సేనలు వచ్చేసరికి కోటలో పూచికపుల్ల కూడా లేదు. ధనాగారం తలుపులు తెరపడానికి ముందు కారాగారం తలుపులు తెరచారు దొంగలు. ఖైదీలంతా బయటపడ్డారు. వాళ్లలో విజయరాఘవుని సోదరు లున్నారు. ఎప్పుడో పోయినవారి కళ్లకు కొద్దిగా ఆశారేఖలు కనబడి ఉంటాయి.

వల్లంకోటను ఆక్రమించుకొని మహమ్మదీయ సైన్యాలు మధురపైకి వెళ్లాయి. దేశాన్ని అల్లకల్లోలంలో ముంచి కప్పాలు పుచ్చుకు వెళ్లిపోయాయి. పరసేనలు సీమనుంచి వెళ్లిపోయాక విజయరాఘవుడు తగుదునమ్మా అని మళ్ళి తంజావూరు చేరుకొన్నాడు. బొక్కసంలో చిల్లిగవ్వ కూడా లేని అనాయక రాజుని చూసి బందిపోటు దొంగలకు జాలి కల్గింది. తాము దోచుకొన్న సంపదలో కొంత వాపసు చేశారు. ఈ దొంగల సహాయంతో ప్రజలను అదుపులో పెట్టి విజయరాఘవుడు మళ్ళి సింహాసనం ఎక్కాడు. అయితే మళ్ళి కష్టాలు మొదలు అయ్యాయి. మధుర రెండవ ముత్తువీరప్ప ఆరు నెలలు మాత్రమే రాజ్యం చేసి మరణించాడు. అతని పెద్ద కొడుకు చొక్కనాథుడు పట్టాభిషేకం చేసుకున్నాడు. పరిస్థితులను చక్కపరిచాడు. క్రీ. శ. **1660-61** లో తంజావూరిపై చాడివెడలి విజయరాఘవుని ఓడించి పాదాక్రాంతుని చేసుకొన్నాడు. దానితో కొన్నాళ్ళు శాంతి ఏర్పడింది. అయితే అది శ్మశానంలోని శాంతిలాంటిది. విడుపులేని యుద్ధాలతో ప్రజలు విసుగెత్తి పోయారు. వచ్చే సేనలూ పోయే సేనలూ ప్రజలను కొల్లగొట్టాయి. దేశంలో కాటకం ఏర్పడింది. రమారమి నూరేళ్ళ క్రిందట రక్కసి తంగడి యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం దోపిడీ పాలైతే ఎన్నో కుటుంబాలు తంజావూరుకు

వలస వచ్చాయి. ఇప్పుడు దురదృష్టవశాత్తూ తంజావూరును విడిచి పెట్టి ప్రజలు మధుర, శాంతోమ్ మొదలైన చోట్లకు పోవలసి వచ్చింది. కూటికి గతిలేని ఈ పేదప్రజలను ఆదరించి అన్నం పెడుతున్నట్లు నటించి దచ్చివారు పరమఘోరాలు చేశారు. ఎందరినో నమ్మించి పడవ లెక్కించి విదేశాలకు బానిసలుగా అమ్మేశారు. "సిగ్గుపడాలి. శాశ్వతంగా దచ్చివారు సిగ్గుపడాలి. ఇండియనుల కష్టాలను తమ వ్యాపారానికి ఘోరంగా వినియోగించుకొన్నందుకు తలవంచుకోవాలి" అని జెసూట్ ఫాదరీలు వ్రాశారు.[1]

నిజానికి దచ్చివారి కంటే ఎక్కువగా సిగ్గుపడవలసినది విజయ రాఘవుడు. తన ప్రజ కూటికి లేక అష్టకష్టాలు పడి అమ్ముడుపోతూ ఉంటే, శృంగారపదాలు చెప్పుకుంటూ ఆనందించే ఈ నాయక రాజును ఏమనాలో తెలియదు. ఇతడు నిజానికి నీరో చక్రవర్తిలాటివాడు. రోము నగరం తగల బడుతూంటే ఆ చక్రవర్తి ఆనందగీతాలు పాడాడు. శత్రువులు కోటను ముట్టడిస్తూ ఉంటే విజయరాఘవుడు పూజలోవుండి మంత్రాలు చదువుకుంటూ ఉండేవాడు. క్రీ. శ. 1673 లో మధుర చొక్కనాథుడు చివరిసారి తంజావూరుపై సేనలు పంపించాడు. అతడు రాజ్యానికి రాగానే ఒకసారి 1660-61 లో తంజావూరును దండించాడు. దానితో సఖ్యంగా ఉంటానని మాట ఇచ్చిన విజయరాఘవుడు తప్పాడు. ఉండీ ఉడిగీ రెండు రాజ్యాలకూ యుద్ధాలు జోరుగానే వచ్చాయి. విజయరాఘవుడు కూడా కొన్ని కోటలు బలపరచుకో సాగాడు. చొక్కనాథుడు అఖరున క్రీ. శ. 1673 లో తన దళవాయి వెంకట కృష్ణప్ప నాయుణ్ణి పేష్కారు చిన్నతంబి మొదలారినీ సకలదళ సమేతంగా తంజావూరిపై పంపించాడు.

మధుర సేనలు ఫిరంగులు పెట్టికొట్టగానే కోటతలుపులు పడిపోయాయి. ఇడిసిపడిన తోవల వెంట, వాకిళ్ళ వెంట శత్రువులు హల్లా చేసి కోటలో చొచ్చుకున్నారు. "ఈ నంగతులు నడిచే తరుణమందు అచ్యుత విజయరాఘవ నాయనివారు నామతీర్థం కొలువులో వుండి తదేకధ్యానంతో జపం చేస్తూనే

---

1. 'La Mission du Madure' నుండి ఉదాహరణ. The Nayaks of Madura, P. 157.

ఉన్నారు. అప్పుడు వారి ఇలాకా మనుష్యులు - ఓ మహారాజా! పగతులు మన కోట హల్లా చేసి లోజొచ్చినారు అని విన్నవించారు. అతడు మహా నారాయణ భక్తి కలవాడు కనుక ఆ పూజ విడిచి లేవక, రాని చూచు కొందామని సన్నచేసినారు" అని తంజావూరుకైఫీయతు చెప్తోంది[1].

దైవభక్తి వాంఛనీయమే గాని ఇంతటి విద్దూరపు ఆచారం భక్తి అనిపించుకోదు. అది ఉన్మాదం. విజయరాఘవుడు వీరవైష్ణవుడు. అతడు చతుర్వేది శతక్రతు శ్రీనివాసతాతాచార్యుల వారి శిష్యుడు.[2] అతనికి గురువుగారు ఎంత చెపితే అంత! అయన ప్రేరణవల్ల విజయరాఘవుడు పరమతాలను ఎంతమాత్రం ఆదరించలేదు. దీనిని పెద్ద ఘనకార్యంగా రంగాజమ్మ పొగిడింది. 'పరమతంబుల నెల్ల నిరసించి యేమేటి వైష్ణవ మతమ శాశ్వతము జేసె' అని మెచ్చుకొంది (ఉషా. 1-5). కోనేటి దీక్షితులు, పురుషోత్తమ దీక్షితులు మొదలైన కవులు శ్రీనివాస తాతాచార్యుల శిష్యులవడం వల్లనే బహుశా విజయరాఘవుని మెప్పు పొంది ఉంటారు. రాజ్యంలో వైష్ణవుడు నేరం చేస్తే వాడిమీద చర్య తీసుకొనడానికి అధికారులు జంకేవాళ్ళు.[3] రఘునాథనాయకుడూ,అతనితండ్రి అచ్యుతప్పా వైష్ణవులేగాని ఇతర మతాలను ఈసడించలేదు. అద్వైతులు పరమశివావతారంగా చూసే అప్పయ్య దీక్షితుల వారిని అచ్యుతప్ప సత్కరించాడు. రఘునాథుడు సురేంద్ర సుధీంద్రులనే ఇద్దరు మధ్వ గురువులను గౌరవించాడు. వీరిలో సుధీంద్రులకు కనకాభిషేకం కూడా చేశాడు.[4] స్మార్తుడైన గోవింద దీక్షితుల వారిని రఘునాథుడు మంత్రిగా పూజించి అర్ధాసనం ఇచ్చాడు. తాత

---

1. తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, వేటూరి ప్రభాకరశాస్త్రి సంపాదకత్వం. పుట 25.

2. ఈ తాతాచార్యులగారితోనే తెనాలి రామలింగని కలిపి కట్టుకథలు కల్పించి ఆ నాటివారు ప్రచారం చేశారని ప్రతీతి.

3. విజయరాఘవుని విప్రనారాయణ చరిత్ర, పుట 56.

4. తంజావూరు ఆంధ్రనాయక చరిత్ర_పురుగంటి సీతారామయ్య్ గారు, పుట 254.

తండ్రులలాగా అన్ని మతాలను సమంగా చూడక విజయరాఘవుడు ప్రజలకు దూరం అయాడు.

మతం గురించి ఇంత పిచ్చి పట్టుదల ఉన్నందుకు విజయరాఘవుణ్ణి చూసి విచారించినా, కుటుంబగౌరవం అంటే వెర్రి పౌరుషం ఉన్నందుకు అతణ్ణి అర్థం చేసుకొని మెచ్చుకోవాలి. తంజావూరు వారి ఆడపడుచును ఇచ్చి పెళ్ళి చెయ్యమని మధుర చొక్కనాథుడు క్రీ. శ. 1673 లో వర్తమానం చేశాడు. ససేమిరా మీకు మా పిల్లని ఇవ్వమని విజయరాఘవుడు చెప్పాడు. పెళ్ళి మాటలకోసం వచ్చిన వాళ్ళను వెళ్లగొట్టాడు. ఇది సాకుగా మధుర సైన్యాలు తంజావూరిపై దండెత్తాయి. శత్రువులు కోటను ముట్టడిస్తూ ఉంటే విజయరాఘవుడు పైన చెప్పినట్లు పూజలో కూర్చున్నాడు.

కోటలోనికి ప్రవేశిస్తూ మధుర దళవాయి ఇప్పటికైనా రాజీ చేసుకోమన్నాడు. విజయరాఘవుడు వినలేదు. అంతకు ముందు ఎప్పుడో ఏదో కోపం వచ్చి ఖైదు చేసిన తన కొడుకు మన్నారుదేవుణ్ణి విడుదలచేసి అతనితోపాటు యుద్ధానికి వెళ్లాడు. ఎంత విపరీతంగా ప్రవర్తించినా విజయరాఘవునిలో మానవత్వం వుంది. కదనానికి పోతున్నప్పుడు జరిగిన ఒక విశేషాన్ని కైఫీయతు వ్రాసింది. కొడుకును చూసి విజయరాఘవుడిలా అన్నాడట: "నీవైతే నాకు ముందుగా నడుస్తున్నావు. మన కిద్దరికిన్ని మరణం సిద్ధంగా ఉన్నది. అయినా నా కళ్ళ ముందర నీవు ఎదుటివారిచేత తగులుపడ్డా, మరణమైనా మహత్తరమైన పుత్రశోకం కదా కళ్ళలో జలం వచ్చును. ఈ యుద్ధరంగాన అలా అయితే పరలోకహాని గనుక నాకు వెనుక నిలచి నా పని అయిన పిమ్మట నీకు సరిపోయినట్టు చూసుకో" అని వెనుకకు చెయ్యి పట్టి యీడవగా ఆ కుమారుడు మీరు రాజులు, నేను బంటును అని ముందునకు దూకాడు.[1]

ఆ యుద్ధంలో తండ్రీ కొడుకు లిద్దరూ మరణించారు. రాణివాసపు స్త్రీలంతా అంతకు ముందే మందుకుండలు చుట్టూ పెట్టుకొని దగ్ధమయ్యారు. దీనితో తంజావూరులో నాయక రాజుల పాలన అంతమైంది.

---

1. తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర, పుట 28.

వీరునిగా రాజ్యానికి వచ్చిన విజయరాఘవుడు వీరునిగానే మరణించాడు మధ్యలో ఎన్ని అక్రమాలు చేసినా ఈ వీరమరణాన్ని పొందినందుకు విజయరాఘవుణ్ణి అందరూ మెచ్చుకుంటారు. పరిపాలన ఎలా ఉన్నా సాహిత్య సేవ చేసినందు కతణ్ణి సాహితీపరులు క్షమిస్తున్నారు. ఎందరో కవులు కవయిత్రులకు ఆశ్రయం ఇచ్చి "వారితో సంగీత సాహిత్య నాట్య విద్యా వినోదముల నాసందించుచు వచ్చిన విజయరాఘవ భూవరుడు ఇతర విషయముల నెట్టివాడైన నీ విషయమున ప్రస్తుతి పాత్రుడు కదా!" అని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు అన్నారు.1

నిజమే. విజయరాఘవుడు చేసినంత సంగీత సాహిత్యసేవ ఇంకొకరు చేసినట్లు కనబడదు. అతని హయాంలో ఇతర రచయితలు వ్రాసిన గ్రంథాల కన్నా అతను స్వయంగా వ్రాసినవి చాలా ఎక్కువ. అతని రచనలు ప్రస్తుతం ఏడు దొరుకుతున్నాయి. అందులో ఆరు నాటకాలు, ఒకటి ద్విపద కావ్యం. ఇవన్నీ అచ్చుపడ్డాయి.

1.	కాళియమర్దనం	నాటకం
2.	కృష్ణవిలాసం	,,
3.	విప్రనారాయణ	,,
4.	రఘునాథాభ్యుదయం	,,
5.	పూతన హరణం	,,
6.	ప్రహ్లాద చరిత్ర	,,
7.	రఘునాథ నాయకాభ్యుదయం.	ద్విపద

వీటిలో కడపటి నాటకంలో విజయరాఘవుడు తాను అంతకు ముందు వ్రాసిన గ్రంథాల పట్టికను పేర్కొంటూ 36 పాదాల సీసమాలికను వ్రాశాడు. దానిలో ఒక్కొక్క కృతిని పేర్కొంటూ తన ప్రత్యేక ప్రజ్ఞను విశదం చేశాడు. ఈ సీసమాలిక వల్ల అతడు 40 గ్రంథాలు వ్రాసినట్లు తెలుస్తూంది. ఇవి కాక మరో పదిహేడు రకాల మధుర కవితలు చెప్పాడు. వాటి పట్టికను చూడండి.

---

1. రఘునాథ నాయకాభ్యుదయం. తెలుగు పీఠిక. పుట 46.

విజయరాఘవ నాయకుని రచనలు

వరుస	రచన పేరు	ప్రక్రియా భేదం	ప్రజ్ఞ
1.	రాజగోపాల విలాసం	నాటకం	సుకవివంద్యుడు
2.	చెంగమవల్లీ పరిణయం	,,	ప్రతిభానిధానుడు
3.	గోవర్ధన సోదరణము	,,	కల్పనాధురీణుడు
4.	రతిమన్మథ విలాసం	,,	ప్రాబంధిక పట్టభద్రుడు
5.	రాసక్రీడ	,,	—
6.	నవనీతిచోరం	,,	మహానుభావుడు
7.	పారిజాతాపహరణం	,,	[illegible] ధుర్యుడు
8.	రుక్మిణీ కళ్యాణం	,,	బుధసార్వభౌముడు
9.	రాధామాధవ వివాదం		—
10.	ధనాభిరామం	,,	సర్వజ్ఞతిలకుడు
11.	సత్యభామా వివాహం	,,	పాండిత్య కవిరాజరాజు
12.	ఉషా పరిణయం	,,	శారదావతారం
13.	దక్షిణ ద్వారకాస్థల వర్ణన	?	ప్రసిద్ధ చరితుడు
14.	కాళీయమర్దనం	,,	
15.	రఘునాథాభ్యుదయం	ద్విపద	ధీరవర్యుడు
16.	రఘునాథాభ్యుదయం	నాటకం	
17.	మోహినీ విలాసం	ద్విపద	
18.	మోహినీ విలాసం	నాటకం	కలసమానుడు
19.	ప్రహ్లాద చరిత్రం	,,	మనీషాధురీణుడు
20.	పూతనామోక్షణం	,,	శృంగార లోలుడు
21.	మంజరీ ద్విపద	ప్రబంధం	—
22.	సైదే నాటకంగా ప్రాశాడు	నాటకం	గానచతురుడు
23.	విప్రనారాయణ	,,	ధీనిధానుడు
24.	సముద్రమథనం	,,	భువనమోహనచరిత్రుడు
25.	కృష్ణవిలాసం	,,	అష్టభాషాధురీణుడు
26.	పాదుకా సహస్రం	ద్విపద	—
27.	ప్రణయ కలహం	,,	చమత్కృతిధురీణుడు

28.	కంసవిజయం		అతులిత ప్రౌఢుడు
29.	జానకీ కళ్యాణం	నాటకం	వావదూకాగ్రగణ్యుడు
30.	పుణ్యకవ్రతం	,,	వాగ్విశేషశేషుడు
31.	గోపికా గీతలు	అనువాదం	అద్యతనభోజుడు
32.	భ్రమరగీతలు	అనువాదం	,,
33.	ఫాల్గుణోత్సవం	రగడ	
		చౌపదాలు	భవ్యచరితుడు
34.	రాజగోపాల దండకం	దండకం	విద్వత్కవీంద్రుడు
35.	వీరశృంగార సాంగత్యం	సాంగత్యం	రసికులమేలుబంతి
36.	మన్నారు సాంగత్యం	,,	నెరజాణరాయుడు
37.	మదనబల దూత్యం	నాట్యకృతి	
38.	శారదా సామ్రాజ్యం	,,	నవరసదృష్టి
39.	సవతిమత్సరం	,,	,,
40.	నాట్యకదంబం	,,	,,
41.	వేడికోలు విన్నపాలు	రచనాలు	
42.	దరువులు	గేయాలు	
43.	యేలలు	,,	
44.	అధ్యాత్మ సంకీర్తనలు	పాటలు	
45.	వాల్మీజి	విడిపదాలు	
46.	గుజరి	,,	
47.	విజ్జెవ్వాడు	,,	
48.	దండలాస్యకం	,,	
49.	కందుకక్రీడ	,,	
50.	ఆల్లిక	,,	
51.	కొరవంజి	,,	
52.	శుభలీల	,,	
53.	గుజరాతి (కోపు)	,,	
54.	దేశి	,,	
55.	చౌపదము	,,	
56.	జక్కిణి	,,	
57.	దురుపదం	,,	

1. పూతనాహారణం:— దీనిని విజయరాఘవుడు క్రీ. శ. 1651 లో వచ్చిన ఖరనామ సంవత్సరంలో ప్రారంభమని ఆంతరంగిక సాక్ష్యంవల్ల చెప్పవచ్చు. ఇది శృంగార నాటకం అన్నాడు. బాలగోపాలుణ్ణి యశోద, గోపికలు ఆడించి జోలలు పాడుతారు. బాలింతరూపం పూని పూతన అక్కడకు వస్తుంది. "ఆదిరాజుల యింట్ల అనిశంబు నేను - దాదినై వర్తింతు ధవళాయతాక్షి" అని పరిచయం చేసుకొంటుంది. "ఎలమి నేబెంచిన నీ కుమారుండు పాలతి చుక్కలు మొలపూసగా పెరుగు" అని చెప్పింది. "పాలిస్తానంది. 'పెనగకు పిలుపని పేరంటమునకు" అని యశోద చెప్తూన్నా వినక పాలిచ్చింది. బాలగోపాలుడు దాని ప్రాణమారుతాలు లాగేశాడు. అప్పుడు పూతన ఇలా విలపించింది:

విడువిడు నాచన్ను విడువిడురా యీరి
బడలితిరా చాల బాల గోపాల !
పగతీర్పలేనైతి భళిభళి నీవునా
మొగమైతే నేను సగమైతి గదరా !
అమ్మకక్కచెల్ల ఇది యేమిరా నీవు
రొమ్మొక్కతే తలఱ దిమ్మెక్కె గదరా !
చిన్నవాడని యుంటి జెల్లబో నీవు నా
చన్నంటితే యసుర మిన్నంటె గదరా !

ఇలా విలపించి పూతన ప్రాణాలు విడిచింది. గోపికలు హాహా కారాలు చేశారు. నందుడు వచ్చాడు. పూతన కళేబరాన్ని పరికించడానికి గొల్లలను పిలిచాడు. వాళ్ళు 'గొల్లలారో' అనే పాట పాడుకుంటూ పాత్రోచిత భాషలో సంభాషించుకుంటారు. జోక్సు విసురుకుంటారు. "ఒరా ఒరా నువ్వేడ ఉంటివిరా ?" అని ఒకడు అడుగుతాడు. "ఒరా నేనే సామిదారం కడనే కాచుకు ఉంటిరా!" అంటాడు వాడు. ద్వారం అనడానికి బదులు వాడు దారం అన్నాడు కనుక "నువ్వు దారం కాచుక ఉంటే నేను సూది యెతుకు లాడుతూ ఉంటిన్రా" అంటాడు రెండోవాడు. వాళ్ళు ఊళబెట్టి రెండు పదాలు గొణుగుతారు. శివాలు అడుతారు. ఆ తరువాత స్వస్తి వాచనం చేయడానికి

పురోహితులను పిలిపిస్తారు. రంగావధాన్లు, సింగావధాన్లు అనే ఇద్దరు వస్తారు. ఇలా మాట్లాడుకొంటారు :

సింగా : ఓయి రంగావధాన్లు !

రంగా : ఏమయ్యా సింగావధానులు ?

సింగా : నేడు నందుడుగాతు మనలను పిలువనంపిన ప్రయోజనమేదో ?
ఏమైనా పెండ్లి పేరంటాలు సాగేనో ?

రంగా : సాగితేనో ?

సింగా : కొన్ని తప్పు మంత్రాలు చెప్పి దబ్బర హోమాలు చేసి నాలుగు పాడియావులు గ్రహించుకోవచ్చునే.

రంగా : అవంచున్నాడవో ? నీ మార్గమల్లా నే బయలు చేస్తేనో ?

సింగా : అవందురా వెట్టి నే నీకు సగం పంచి యిచ్చేగాని యూరకుండరా.

రంగా : అప్పా, నాకు సగం చాలదు. మూడు పాళ్ళు ఇచ్చేవు నే వూరకుండేగాని.

సింగా : అదేంషిరా అయిదు తరాలవ పురోహితుండను, నేనషుండగా నీకు మూడుపాళ్ళు అనగా నేంషిరా ?

రంగా : ఓరీ వ్రజశుంఠా ! నీకు ఒక పాలు చాలదషరా ?

[యక్షగానములు. సంపుటి 1. పుటలు 76_77]

తంజావూరు నాటకాలలో పురోహితులు, కవులు, పండితులు ఒకరి నొకరు వ్రజశుంఠ అని తిట్టుకోవడం పరిపాటి. ఈ పురోహితుల జగడాన్ని ఆపి వాళ్ళచేత స్వస్తి వాచనం చేయిస్తారు. వాళ్ళు సంకల్పం చెప్తూ అది ఖరనామ సంవత్సరమని చెప్తారు. ఇది క్రీ. శ. 1651 లో వచ్చింది. ఈ నాటకంలో పాత్రోచిత భాష, ఆ నాటి పాటలు పదాలు తెలుస్తున్నాయి.

2. విప్రనారాయణ చరిత్ర :—విజయరాఘవుడు ఈనాటకాన్ని వ్రాయడానికి ముందు తెలుగుసాహిత్యంలో చాలా మంది విప్రనారాయణుని కథను ద్విపద రూపంలోనూ, ప్రబంధంగానూ చెప్పారు. వాళ్ళు

చెప్పిన కథను విజయరాఘవుడు మార్చేశాడు. తన విరోధులైన పాండ్య రాజుల సీమలో విప్రనారాయణుడు జీవించాడని చెప్పడం ఇష్టం లేక ఆకథ శ్రీరంగంలో జరగడానికి బదులు మన్నారుగుడిలో జరిగినట్లు వ్రాశాడు. దేవదేవి మొదట తన సభలో నాట్యం చేసి ఆ తరువాత విప్రనారాయణుని చూసిందట. బంగారు గిన్నె దొంగిలించిన నేరానికి విప్రనారాయణుని తన సభలోనే అధికారులు హాజరుపెట్టారు. చరిత్రపట్ల తీసుకోని చనువుతీసుకున్నా రచన బాగానే చేశాడు.పాటలలో సంవాదాలు, పసందైన సంభాషణలు వున్నా ఈ రచన యక్షగానానికి, నాటకానికి మధ్యలో ఉంది. సుదీర్ఘమైన ద్విపదలలో కవి కథను కథనం చేశాడు.

సంతత వీరవైష్ణవ గోష్ఠివలన _ నెంతో విరక్తుడై యిల్లెల్ల రోసి
కన్నియు తండ్రియు త్తరువు బాలింప _ నిల్లాలి బుట్టిన యింటి కంపించి
యాచార్యచేత చక్రాంకితుండౌచు.

విప్రనారాయణుడు నన్యసించాడట. ఇత డొక శుభముహూర్తంలో "విష్వక్సేనునకు నారికేళంబు సమర్పించి" మన్నారుకోవెలలో ఒక తోట నిర్మించాడు. అక్కడకు దేవదేవి తన అక్కతో వచ్చింది. ఆమె అంతకు ముందు విజయరాఘవుని కొలువులో నాట్యమాడింది. ఈ ఘట్టంలో విజయ రాఘవుడు తన ఘనతను వర్ణించే ద్విపద నొకదాన్ని పొందుపరిచాడు. దీనిని అతని పట్టపుకవి కామరసు వేంకటపతిసోమయాజి వ్రాసిన 40 పాదాల ద్విపదలోంచి 36 పాదాలు విజయరాఘవుడు వాడుకొన్నాడు. కామరసు కవి ద్విపద అతని విజయరాఘవ చంద్రికా విహారం అనే నాటకంలో ఉంది. అల్లసాని పెద్దనగారి పద్యాలను కృష్ణదేవరాయలవారు వాడుకొన్నట్టే విజయ రాఘవుడు తన పట్టపుకవి రచనను తీసుకొన్నాడని భావించాలి.

అయితే విప్రనారాయణ చరిత్రను ఎవరో సరసుడైన కవి వ్రాసి విజయరాఘవుని పేరు పెట్టాడని ఈ నాటకాన్ని పరిష్కరించిన పండితులు భావించారు.[1] విజయరాఘవుడు దీన్ని రచించాడని చెప్పడానికి ఒక్కటే

1. విప్రనారాయణచరిత్ర_యక్షగానం.పరిష్కర్తలు : వి. సుందర శర్మ, ఆ. మహాదేవశాస్త్రి. తంజావూరు సరస్వతీమహాలు ప్రచురణ. ఉపోద్ఘాతం, పుట 12.

ఆధారం కనబడుతున్నదని పరిష్కర్తలు అన్నారు. అతని నాటకా లన్నింటికి మొదట ఈ సీసపద్యం నాందిగా ఉంటుంది.

భోజకన్యామ ఖాంభోజరాజమరాళసత్యాఘన స్తన స్తబకభృంగ
జాంబవతీవిలోచనచకోరశశాంక మిత్రవిందాకటిన్యేఘుమాప
భద్రావశావశిభద్రదంతావళవరసుదంతామనోవనమృగేంద్ర
లక్షణాభూవకీర్తిపినీ పర్జన్యభానుసుతా లతాపారిజాత
షోడశస్త్రీసహస్ర చక్షుఃప్రసార-హారసారమసార మోహనశరీర
విజయరాఘవభూపాలభజనలోక-కేలు మోడ్చెద రాజగోపాల, నీకు.

ఈ పద్యం విప్రనారాయణచరిత్రలో మొదట ఉంది. "విజయరాఘవ నాయక ! పరాకు ! స్వామివారు హవణించిన విప్రనారాయణ చరిత్రంబను విచిత్రనాటకంబు నటసపటిమ గనుపింప వినిపించేము" అని నటకులు అంటారు. ఈనాటకాన్ని విజయరాఘవుడే రచించాడని చెప్పడానికి ఇవికాక ఇంకావేరే ఆధారా లున్నాయి. వాటిని పరిష్కర్తలు గమనించలేదు. విజయ రాఘవుని నాటకాల మొదట 'భోజకన్యా' సీసం ఎలా ఉంటుందో "శ్రీ రాజ గోపాల! చిరకీర్తిజాల! కారుణ్యగుణశీల! కళ్యాణలోల!" అనే పదిపాదాల ద్విపదలో రాజగోపాలస్తవం వుంటుంది. దాని తరువాత 'కలశాంబునిధి కన్య కళ్యాణధన్యసలితసౌజన్యజగదేకమాన్య' అనే ఎత్తుగడతో పదిపాదాల కనకాబ్జవల్లిస్తవం కూడా ఉంటుంది. ఇవి మొట్టమొదట విప్రనారాయణ చరిత్రలో విప్రనారాయణుడే చేసినట్టు కవి వ్రాశాడు. తన ఇష్టదైవాలపైన పాత్ర చేయించిన స్తుతులు తనకు నచ్చినవాటిని అతరువాత వ్రాసిన కొన్ని నాటకాలలో ఇష్ట దేవతాప్రార్థనగా పొందుపరిచాడు. ఈ అంతరంగిక సాక్ష్యం వల్ల విజయరాఘవుడే విప్రనారాయణచరిత్రను వ్రాసినట్టు చెప్పవచ్చు.

ఇది మొగలాయీలనంపర్కం దక్షిణదేశానికి కలిగినతరువాతవ్రాశాడు. "మొగలాయివాడవై మోహపుట్టించి పగలును రేయిని పానుపు దిగవు" అని వేశ్యమాత విప్రనారాయణుని తిడుతుంది. అతడు మొదట దేవదేవితో "సరిపోవు మీమాటలు మాసంగడికాండ్రు పకీరులు" అంటాడు. ఆమె నెడబాశాక "మోముచూతునా దానికి నలాముచేతునా" అని వాపోతాడు. సమకాలిక భాష నిలా ప్రధానపాత్రలకు కూడా వాడాడు. ఈ నాటకంలో

కొన్నిపాత్రలు పూర్తిగా అరవమే మాట్లాడుతాయి. దేవదేవి విప్రనారాయణులు తొలిసారి కలుసుకొన్నప్పుడు సంస్కృతంలో సంభాషిస్తారు.

3. కాళీయమర్దనం :— ఇది నాటకం అని విజయరాఘవుడు వ్రాశాడు గాని యక్షగానలక్షణాలే జాస్తీగా ఉన్నాయి. హేమాబ్జనాయికాసమేతుడైన రాజగోపాలస్వామివద్దకు గోభిలగోప్రళయులు వచ్చారు.[1] ఆ మునులు రాజగోపాలుని చూసి "రాజగోపాల! మాపాల ప్రసన్నులై మున్ను మీరు నటించిన బాలలీలలు చూపితిరి కదా. కాళీయభుజంగభంగ నాట్యప్రసంగం బింకొకపరి చూడవేడుకగుచున్నది.మమ్మనుగ్రహింపవయ్య" అని ప్రార్థించారు. కల్పితకాళిందీతీరానికి వాళ్లను పంపించి రాజగోపాలుడు గోపాంగనలతో యమునావిహారం చేద్దామన్నాడు. వాళ్లు "కాళీయుడున్నాడు; వానినెడలించి మా భయం సడలింపవయ్యా" అన్నారు.

అందెలు గజ్జెలు నందంద మెరయంగ_కుందనపుసొమ్ములు గునిసియాడంగ
కందుమీరగా కాళీయఫణముపై_నందనందనుడు నటియించె నపుడు

తరువాత జలక్రీడ చేశాడు. పిమ్మట దక్షిణద్వారక ప్రవేశించాడు. నీరజముఖులు నీరాజన మిచ్చారు. ఇందులో నాటకీయత, సంభాషణల చాతుర్యం ఏమీలేదు.ఇది విజయరాఘవుడు ఏర్పరచిన ప్రథమ కథాసంవిధానం.ప్రదర్శనలోనటీనటకులుచేసే చెణుకులు ఏమీగ్రంథస్థం అయినట్టు లేదు.మిగతారచనల ప్రదర్శనానంతర కథా సంవిధానాలే గ్రంథస్థమైనట్టు కనబడుతుంది.

4. రఘునాథ నాయకాభ్యుదయం :—విప్రనారాయణ చరిత్రని వ్రాశాక ఈద్విపదకావ్యాన్ని విజయరాఘవుడు వ్రాశాడని తలచవచ్చు. "శ్రీరాజగోపాల చిరకీర్తి జాల!"అనే పది ద్విపదలు, "కలశాంబునిధికన్య, కల్యాణధన్య" అనే పది ద్విపదలు వ్రాసి ఇష్టదేవతా ప్రార్థన చేశాడు. తన తండ్రి రఘునాథనాయకుడు వీధిలో స్వారి వెడుతున్నప్పుడు చిత్రలేఖ అనే గణిక ఆతణ్ణిచూసి మోహించింది. తన చిలుక

---

1. వీరు వహ్నిముఖుడనే మునికుమారులు. గోప్రళయుడే మన్నారుగుడిని దక్షిణద్వారకగా రూపొందించమని కృష్ణుని కోరాడు. చూ: చెంగల్వకవి రాజగోపాలవిలాసం.

చేత రాయబారం పంపింది. రఘునాథు డది విని ఆమె ఇంటికి వెళ్లి ఆమెను లాలించాడు. ఈకథను విజయరాఘవుడు మూడాశ్వాసాల ద్విపదకావ్యంగా రచించాడు. ఇందులో ఆనాటి తంజావూరు మనముందు సాక్షాత్కరిస్తుంది. నాయకరాజుల దినచర్య తెలుస్తుంది.

5. రఘునాథాభ్యుదయం :— పై ద్విపద కావ్యాన్నే తరు వాత ఎప్పుడో నాటకంగా మార్చాడు. అదేకథ. అక్కడక్కడ పొడిగించిన అవే ద్విపదలు. ఈనాటకం కాని, ద్విపదకావ్యంగాని సాహిత్యచరిత్ర రచనకే తోడ్పడుతాయి గాని రసానందం కల్గించవు.

6. కృష్ణవిలాసం :— దీనిని ఇటివలనే-పదేళ్లక్రిందట విజయ రాఘవుని రచనగా గుర్తించి పరిశోధకులు ప్రకటించారు. సత్యభామ ఇంటికి వస్తానన్న కృష్ణుడు రుక్మిణి ఇంటికి వెళ్లి క్రీడిస్తూ ఉంటాడు. ఆ మంది రానికి వెళ్లివచ్చిన దూతికద్వారా సత్యభామకు ఈసంగతి తెలుస్తుంది. యకా యెకిని తన ఇంటికి వచ్చి తల కట్టుకొని పడుకుంటుంది. కృష్ణు డొచ్చి కాళ్లమీదపడి క్షమాపణ చెప్పుకొంటాడు. దీనిని విజయరాఘవుడు నాటక మన్నా ఇందులో గేయసంవాదాలేగాని సంభాషణలు లేవు.

7. ప్రహ్లాదచరిత్ర :— ఇది విజయరాఘవుని రచన లన్నింటి లోను ఆఖరిదికావచ్చు. దీనిమొదట 'భోజికన్యా' అనే పద్యంలేదు గాని 'శ్రీరాజగోపాల చిరకీర్తిజాల' అనే ఇష్టదేవతాప్రార్థన ఉంది. దీనిని రఘునాథుడు నాటకచాటుకావ్యం అన్నాడు. హిరణ్యకశిపుడు ప్రవేశించి కటికవాఙ్ఞి పిలిపించి "హాస్యరసంపు బలుకుల నవ్వింపనేర్పరియైన విదూష కుని రప్పించరా" అని చెప్తాడు. కోలకేతు డనే హాస్యగాడు వస్తాడు. 'ఇక్కడ విదూషకుడు హాస్యపు మాట లాడేది' అని కవి డైరక్షను వ్రాసి ఉరు కున్నాడు. తంజావూరు నాటకాలలో హాస్యపాత్రలు స్టేజిమీద తము చిత్త మొచ్చినవన్నీ మాట్లాడేవారని దీనివల్ల తెలుస్తోంది. భాగవతంలోని ప్రహ్లాద కథను ఇందులో రసవంతంగా చెప్పాడు. పాములవాళ్లు, పురోహితులు మొదలైనవాళ్లు పాత్రోచితభాష మాట్లాడుతారు.

విజయరాఘవనాయకుని కృతులలో ఒక క్రమపరిణతి కనిపిస్తుంది. "అతని కృతు లంతకంతకు గేయధర్మమును తగ్గించుకొని రూపకకళ నెక్కువ సంతరించుకొన్నవి. వాటిపై మార్గనాటక ప్రభావ మించుక పొడ సూపినది. విజయరాఘవుడుద్దేశ పూర్వకముగ యక్షగానమున కాపేరికి ప్రత్యామ్నాయముగ నాటకనామకరణము చేసినట్లు తోచును" అని యస్వీజోగారావుగారు చెప్పారు.[1] అది నిజమే.

విజయరాఘవునిపై మార్గనాటకప్రభావం పడితే, అతని ప్రభావం ప్రతని ఆశ్రితులపై పూర్తిగా పడింది. అతని ఆశ్రితులలో కొందరు నాటకాలు ప్రాశారు. వాళ్లనుగురించి, వారి రచనలగురించి విడిగా చెప్పుకొందాం. ఇతని హయాంలో మధుర కవితలు వెల్లివిరిసినంత ప్రబంధాలు రాణించలేదు.

విజయరాఘవుని జీవితంకూడా పాటలాగే సాగింది. ముక్తాయింపుతో ముగిసింది.

---

1. ఆంధ్రయక్షగానవాఙ్మయచరిత్ర. ద్వితీయభాగం. పుట 263.

15

దొమ్మెరల కవులు కొకమూనిమూర్తికవి



న ప్రబంధాలన్నీ ఒకలాగే ఉంటాయి. ఒకటి చదివితే చాలు, మిగిలిన వన్నీ ఎలా ఉంటాయో చెప్పవచ్చునన్న అభిప్రాయం చాలామంది సాహితీపరులకు సహితం ఉంది. నిజమే. కథ కోసం చదివితే ఈప్రబంధాలన్నీ పరస్పరప్రతిధ్వనులు అనిపిస్తాయి. కల్పనలుకూడా అంతే. ఏకావ్యంలో చూసినా నాయికానాయకులు కలుసుకొంటారు; ప్రేమించుకొంటారు; విడిపోతారు; విరహంలో పడతారు; మళ్ళీ కలుసుకుంటారు; పెళ్లాడుతారు; సుఖంగా ఉంటారు. ఏ ప్రబంధానికైనా ఇదే నిర్మాణసూత్రం. వీదండలో చూసినా ఇదే దారం. ఇటువంటి చట్రాలు మన ఆంధ్రసాహిత్యంలోనే కాదు, ఇతర దేశాలలోకూడా ఉన్నాయి. అమెరికాలో హాలీవుడ్ సినిమాకథలలోనూ, బ్రాడ్వేనాటకాలలోనూ కథాప్రణాలిక ఇలాగే ఉంటుంది. 'బాయ్ మీట్స్ది గర్ల్', 'బాయ్

లూజెస్ ది గర్ల్స్', 'బాయ్ గెట్స్ ది గర్ల్స్' ఫార్ములా మీదనే ప్రచారంకోసే కథలన్నీ ఆధారపడి ఉంటాయి. మన ప్రాచీన సంస్కృతనాటకాలలో కూడా ఇలాంటి అంచెలు ఉన్నాయి. ప్రతి ప్రధాన ఇతివృత్తంలోనూ కొన్ని సంధులు ఉండాలని భరతుడు చెప్పాడు.[1] ముఖసంధి, ప్రతిముఖసంధి, గర్భసంధి, విమర్శసంధి, నిర్వహణసంధి అని ముఖ్యమైనవి అయిదురకాలు. ఈ అంచెలలో ఇతివృత్త నిర్మాణం రొటీనుకే దారితీస్తుంది. ఇటువంటి రెడీమేడ్ మూసలలో పోతపోయకుండా ఎవరైనా కావ్యం ప్రాయగలిగితే అతణ్ణి తప్పకుండా అభినందించాలి.

క్రీ. శ. 1625 ప్రాంతాలలో ఒక తెలుగుకవి తన కావ్యానికి అటువంటి మూసకథ అక్కరలేదనుకున్నాడు. నాయికానాయకులు పరస్పరం ప్రేమించుకొనడం, విరహంలో పడడం వగైరా సన్నివేశాలు లేకుండానే ప్రబంధం ప్రారంభామనుకొన్నాడు. ఒకటి కాదు, రెండు కాదు అయిదాశ్వాసాలకావ్యం ప్రాశాడు. 683 గద్యపద్యాలు చెప్పాడు. ఆ ఘటికునిపేరు దామెర్ల వెంగళ రాజు. అతని కావ్యం పేరు బహుళాశ్వచరిత్ర. నిజాని కిందులో చరిత్ర అన్నది ఏమీ లేదు. ఎంతవిపులంగా ఇందులోని కథగురించి చెప్పాలన్నా అది టూకీగానే చెప్పినట్టవుతుంది. మిథిలానగరాన్ని ద్వాపరయుగంలో బహుళాశ్వ డనే రాజు పరిపాలిస్తున్నాడు. ఒకనాడు శ్రీకృష్ణుడు ఆరాజు గారింటికి అతిథిగా వచ్చి విందుభోజనం చేసి సంతోషించాడు. భుక్తాయాసం తీర్చుకొనడానికి చల్లగా కబుర్లు చెప్పుకున్నాడు. ఇంతే కథ! ఈమాత్రం కథాబీజాన్ని నాటి అయిదాశ్వాసాల మొక్కని పెంచడానికి బాగా కృషి చేయాలి. 'చిన్నంకావాలి, చింతాకు కావాలి; మేలిమి కావాలి, మెడ తిరగాలి' అని సామెత చెప్పినట్టు చిన్నమెత్తు బంగారంతో చింతాకుపతకం చేయడం చాలా గొప్ప విద్య. ఇంత చిన్నకథతో అన్నివందల పద్యాలు

---

1. నాట్యశాస్త్రం-పోణంకి శ్రీరామ అప్పారావుగారి అనువాదం. పుట 569.

దామెరలవెంగళరాజు ఎలా వ్రాశాడో పరిశీలిద్దాం.

శ్రీకారం చుట్టాక 74 గద్యపద్యాలలో కవి ఇష్టదేవతాప్రార్థన, స్వవిషయం, షష్ట్యంతాలు రచించాడు. తరువాత 'బహుళాశ్వచరిత్రంబను ప్రబంధరత్నంబునకు కథాప్రారంభ మెట్టిదనిన' అని, వెంటనే ఒకే ఒక పద్యంలో శుకయోగిని చూసి పరీక్షిత్తు ఈకథని చెప్పమన్నాడని, ఆయన చెప్పడం మొదలుపెట్టాడని తెలియజేశాడు.

విదేహదేశంలో మిథిలానగరం ఉంది. (13 పద్యాలలో పురవర్ణన) ఆ ఊరిని బహుళాశ్వ డనే రాజు పాలిస్తున్నాడు. (3 పద్యాలలో అతని ప్రశస్తి) ఆరాజుగారి పురోహితుని పేరు శ్రుతదేవుడు. (2 పద్యాలలో ఇతని సంగతి) ఒకనా డీబహుళాశ్వమహారాజుని చూడడానికి వ్యాసవసిష్ఠపరాశరాది మునులు వచ్చారు; చూశారు. వెంటనే ద్వారకానగరానికి వెళ్లారు. (2 పద్యాలు) ద్వారకద్వారం దూరి ఊరు చూశారు. ఇదిగో సాత్యకిమేడ. ఈబ్రాహ్మణవాడ పదిహేను ఇళ్లు దాటాక క్రీడిసదనం. అది బలరామునిది. ఇది అశ్వశాల. ఇదిగో గజశాల అని ఒకపద్యంలోనే చెప్పుకొన్నారు.మరోపద్యంలో పూలంగడి దాటారు. ప్రద్యుమ్నుని నగరు, అక్రూరుని అంగణంగమించారు. ఇంకో సీసపద్యంలో బహిరంగణం మెచ్చుకున్నారు. తరువాతి పద్యంలో ఆమహామునులు శ్రీకృష్ణుని హజారానికి వచ్చారు. ఆయన ఎక్కడున్నాడో అని మరొకపద్యంలో తర్కించుకున్నారు. ఇది సీసపద్యం. నాల్గుపాదాలలో నాలుగురెళ్లు ఎనమండుగురు భార్యల సంగతీ చెప్పుకుని, ఎత్తుగీతిలో రాధతో క్రీడిస్తున్నాడా అని ప్రశ్నించుకున్నారు. వీ శ్లోపద్యంలో ఇలా అనుకుంటూ ఉండగానే, తరువాతిపద్యంలో కృష్ణుడు తన హజారానికి వచ్చాడు. తివాసీ మీద పచ్చగద్దియపై కూర్చున్నాడు. మొక్కులు స్వీకరించి పరివారాన్ని కూర్చోమన్నాడు. (3 పద్యాలలో కొలువువర్ణన) వచ్చినవాళ్లు మహామునులే కావచ్చు - సభాప్రవేశానికి కొన్నిపద్ధతులు ఉన్నాయి. మునులను గొల్లలు సావిడిలోనే ఉంచారు. వెళ్లి విన్నవించారు. కృష్ణుడు కొలువున్నాక 'రారయ్యా' అని పిలిచారు. అంతటి మహర్షులను ఇలా హెచ్చరించారు:

ప్రభుగోష్ఠి జేగిరపడక విశ్వామిత్రవాల్మీకి వాణిలోవత్తుగాని
భరతప్రపంచంబుహరియెక్కడడుగునోజడియక యుత్తరంబిడుము పులహా-

యొక్కచోదరోక్తిద్రొక్కడువడు దీవుతెచ్చుకోనెమరున కిచ్చవత్స
యొకొక్కరెప్రసంగ మొసగెడుచో గొందఱిడ్డగల్లలు వలదత్రిమాని
శాస్త్రసాహిత్యములుమాకెచాలజీత_మంచుగఱగూరగంపనేబసులంబాద
రాయణకవిత్వసందర్భరసమునిలుపు_మనుచుదౌవారికద్వారమపుడుదాటి

[బహుళా. 1_110]

మహాప్రభువును చూడబోతున్నామే అని ఆ మునులుకూడ కొంచెం ఉత్సాహోద్రేకాలు పొందటం సహజం. తడబాటులో మర్యాదలు మరిచి పోకుండా, చేతిలోనివి క్రింద పడెయ్యకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు చేయడం సబువు. రాచమర్యాదలు పాటించాలి. అందుకే క్రింది పద్యంలో కవి ఇలా చెప్పించాడు:

పడిలమ్మో సుమ్మో నీపాణి పాణింధమనారికేళము దర్శనంబుతరిని
జతనంబు మీకరాక్షతములు శౌరియంజతిచూచి జడియకొసంగుచోట
సిద్ధము నవధానమీపూర్ణకలశంబు మరవిరి శిరమున మోపునపుడు
మీరలెచ్చరిక యీమృదుకాయమాన మృద్వీకానికాయ దార్ఢ్యవేశ
నాయురారోగ్యపుత్రపౌత్రాభివృద్ధి_రస్తుభవతామటంచుగంసారిచేరి
పెద్ద లాశీర్వదించినపిదప జన్నిలనుడటంచును నాస్థాని కరుగుదేఱు.

[బహుళా. 1_111]

ఆస్థానంలోనికి వాళ్లు ప్రవేశించడం, కృష్ణుడు వారి యోగక్షేమాలు అడగడం రెండు పద్యాలు. మునులు అతణ్ణి నుతించడం రెండు పద్యాలు. తాము బహుళాశ్వుని ఊరినుంచి వస్తున్నామని ఒక పద్యంలో చెప్పారు. అతణ్ణి మూడు పద్యాలలో పొగిడారు. 'అవును. ఆబహుళాశ్వుడు మాకు తెలుసు. అతణ్ణి చూడాలి. రేపే బయలుదేరుదాం' అని కృష్ణుడు సెలవిచ్చాడు. నగరులోనికి వెళ్ళిపోయాడు. దానితో 125 గద్యపద్యాల ప్రథమాశ్వాసం ముగిసింది.

ద్వితీయాశ్వాసంలో కవి మొదట ఏమాత్రం ఆలస్యంచేయలేదు. ఒక పెద్దవచనంలో కృష్ణుని ప్రయాణం వర్ణించాడు. మునులతోనే కాక, అతడు

వనితాజనసమేతంగా కదిలాడు. కతిపయప్రయాణాలలో హూణ, కాశ, కరూశ దేశాలు దాటి కోసలదేశానికి వచ్చాడు. అక్కడ విడిదిలో ప్రవేశించాడు. ఆ రాత్రి భోజనం చేసి కృష్ణు డిలా నిద్రపోయాడట:

అచ్చట పచ్చటాకునిలయంబున గొజ్జగిసెజ్జ కొగిటం
గ్రుచ్చిమచ్చెకంటి విరిక్రొమ్ముడి వ్రాలు తమిం దలూడగా
నిచ్చిన చేయి గుబ్బకొకయింత మరల్చి రదచ్ఛదంబు వి
వ్వచ్చుని నేర్పరా డరిదివాచవిచూచుచుగూర్కొన త్తరిన్.

[బహుళ. 2_9]

అంతలో వసంతం వచ్చింది. ప్రయాణంలోనే శ్రీకృష్ణుని అంతఃపుర కాంతలు వనవిహారం చేశారు. జలక్రీడ లాడారు. వనభోజనాలు చేశారు. సంగీతసాహిత్యాలతో పొద్దుపుచ్చారు. ద్వాపరయుగంలో కాకపోయినా దామరల వెంగళరాజుగారి కాలంలో కన్నడంతోపాటు పారశీకానికికూడా ప్రాముఖ్యం ఉంది. కృష్ణుని సంగీతసాహిత్యవినోదాలను కవి ఇలా వర్ణించాడు:

వీణావాద్యముగద్యపద్యకవితావిద్యావినోదంబు క
ల్యాణీకన్నడపారశీముఖ ముఖాలాపంబు లానద్దక
ల్యాణీభూత విచిత్రలాస్యము ప్రశస్యాంభోరుహా స్యామిణుల్
ప్రాణంజూప మురాపహారిహరి యుద్యానోర్వినుండెన్ దగన్.

[బహుళ. 2_73]

కృష్ణు డిలా ఉద్యానోర్విలో ఉండగా రెండోఆశ్వాసం ముగిసింది. ఈ మజిలీని 77 గద్యపద్యాలలో దామెరల వెంగళరాజు వ్రాశాడు.

మూడోఆశ్వాసం మొదలుపెట్టేసరికి కవి చేస్తున్న ఈ ఆలస్యానికి కృష్ణుడు బాధపడినట్టుంది.ఆడవాళ్లను అంతఃపురంలో వదిలేసి సర్వబలాలను పుత్రప్రాంతాలలో దించి గరుత్మంతుని తలచుకొన్నాడు. అతడు రాగానే ఎక్కి మిథిలానగరానికి వెళ్లాడు. ఆకాశయానాన్ని కవి విపులంగా కథనం చేశాడు. కృష్ణుడు తన ఇంటికి రాగానే బహుళాశ్వుడు బ్రహ్మానందం

పొందాడు. కమ్మని కన్నీళ్లతో కాళ్లు కడిగాడు. తనభాగ్యానికి పొంగిపోయాడు. "రాజఋషివయ్య బహుళాశ్వరాజవర్య!' అని కృష్ణుడు మెచ్చుకొన్నాడు. మిథిలానగరంలోని విడిదిలో 'పడుకింటిపసిడిచప్పరమంచంపై' పవ్వళించాడు. బహుళాశ్వుడు ఊడిగంపుచాతురి చూపాడు. ఆమంచంచుట్టూ ఉన్న ఆడపిల్లలతో కృష్ణుడు సరసనల్లాపాలు మొదలుపెట్టాడు. ఆ కాముకవ్యాపారాలను చూస్తున్నా బహుళాశ్వుడు చెక్కుచెదరకుండాతననే సేవించుకొనడం చూసి కృష్ణుడు మెచ్చుకొన్నాడు.

ఇతరాస్యవీటికాధృతహస్తమురవైరివిడెముగొమ్మని యోర్తు కేడుతెఱగు
తనువేడుచొక తెచన్మొనలంటిహరినోర్తుకొనకంటగినుకంటగనినచూడ్కి-
కడలియల్లుడుపోకముడియూడిచిననొక్కయన్నకన్నులు మూసికొన్ననిగ్గు
పుంభావరతిదెల్పుపొలతినలసితంబుబిసరుహాక్షుడు పిక్కపిసుకనెనరు
వనరుహోదరుడేగు రంగనలకిచ్చు-క్రీడనేర్పిచ్చు చిత్రచరిత్ర పటము
లాగుగని చక్రిధాత్రీకళత్రుబొగడి-మామకధ్యాన మెందునుమానడనుచు.

[బహుళా. 3-40]

అంతలో సూర్యుడు అస్తమించాడు. సంజ ఎర్రబారింది. చీకటి పడింది. కాముకులు చెలరేగారు.

చెప్పకుదుప్పటీముసుగు చెయ్వ్యాలుగోడమఱుంగులేటికిన్
జొప్పడు శూన్యగేహములచో టది యేల నికుంజమేల మీ
కిప్పుడు శంభళీభవనమేటికి బైరులయోరలేటి కం
చప్పుడు-చిమ్మచీకటి బయల్గరమించిరిజారదంపతుల్. [బహుళా.3-48]

ఆ చిమ్మచీకటిమాత్రం ఎంతసేపు? వెన్నెల వచ్చింది. సారాచొక్కాలతో బజారుమాటలు మాట్లాడుతూ కన్నెలు విహరించారట.

రారే కన్నగు చెక్కుటద్దములు దోరంబారనానందపుం
బారావారములోమునింగి కలుకుంబాలిండ్లపైబల్మలున్

జీరల్జారబజారపుంబలుకులన్ జిట్టాడుచుం బాడుచు
న్నారాచొక్కులు దిక్కులం దిరిగి రెన్నం గన్నె లవ్వెన్నెలన్.

[బహుళా. 3_58]

ఇలాగ విచ్చలవిడిగా విహరించే వెన్నెలవేళ, పాపం, అక్కడ కృష్ణుడు విడిచిపెట్టిన గోపికాజనం విరహంలో పడ్డారు. చిలకలను, చంద్రుని, మన్మథుణ్ణి, చల్లగాలిని యథావిధిగా తిట్టిపోశారు. రేయి గడిచింది. వేగు చుక్క పొడిచింది. కోడి కూసింది. చల్లగాలి వీచింది. తెల్లవారింది. రాజ పరమేశ్వరుడు సూర్యుడు ఉదయగిరిసింహపీఠిపై ఉన్నాడు. సూర్యాస్త మయంనుంచి సూర్యోదయందాకా **61** గద్యపద్యాలలో దామెరల వెంగళ రాజు వ్రాశాడు. దీనితో తృతీయాశ్వాసం ముగిసింది. ఇందులో మొత్తం **105** గద్యపద్యా లున్నాయి.

ఈ ఆశ్వాసాంతంలో కవి ఒక అపూర్వవృత్తాన్ని వాడాడు. దాని పేరు భ్రమరకూజితవృత్తం. ఇది **21** ప చందంలో ఉంటుంది. ర-న-ర-న-ర న-ర అనే గణా లుంటాయి. 13 వ అక్షరం యతి. దీనిసంగతి అప్ప కవియంలో లేదు. ఈ వృత్తం చూడండి.

కారదాలలిత చార దాయి సారసాంపరిత సౌరభా
సారభానుపవిహార ఫాలశిఖిసన్మహ: పవనసారధీ
సారధీనమిత గీరధీన కలిసంస్తుతస్వగుణ గౌరవా
గౌరవారిరుహ హీరవాద విలసద్యశ: కృతవిహారదా!

[బహుళా. 3_105]

ఇందులో పాదాని కో సమానం ఉంది. సమాసాలు ముక్తపదగ్రస్తాలు. పద్యంలో మొట్టమొదటి పదం, కట్టకడపటిపదం ఒకటే.

నాలుగో ఆశ్వాసం ఎత్తుకోగానే కవి బహుళాశ్వనిచేత కృష్ణునికి విందు పెట్టించారు. ఒక పెద్దవచనంలో అనుష్ఠానాలు పూర్తిచేయించి కృష్ణుని భోజనశాలకు నడిపించారు. 4-వ పద్యంలో వంట అమిరి ఉన్నదని బోనకత్తె

చేత ప్రకటన చేయించి, 55 వ పద్యంలో చెయ్యికడిగించారు. అంటే 52 పద్యాలలో విందు వర్ణించారు. పులిచారు, కాచిన మజ్జిగరసం, కాంచ్న ఒజ్జ పాల తిమ్మనం-ఒకటేమిటి చప్పన్న పదార్థాలు వండారు. తినడానికి కృష్ణునికి ఒక చెయ్యి చాలలేదట. బంతిలో కూర్చున్నవారు ఇలా అనుకున్నారు:

కడియొత్తుచు నెక్రోలగాదయ్యపానీయ మీవేడిచేరింత్రాగరాదె
మొదలనుండియుశాకముల నేటియలవాటుకమ్మనిపప్పింతకలపరాదె
చెప్పరాదనికూరచప్పరింపగ నేల యప్పళంబుల చవి యానరాదె
పిండివంటల పిండి బెట్టనేటికి ఘృతప్లుతభక్తకబళముల్ గొనగరాదె
బజ్జభుజియింపు డల్లంపుబచ్చడులకు_పెరుగుకూటిగురుంగూరవరుగుకాల
నరుగునన్నంబు వరుగంబుననిలమంబు-నించువేడుకభుజియించిరెల్లమునులు

[బహుళా. 4_47]

ఇలా వేడుకగా భోజనాలు చేశాక ఆకులు వేసుకొన్నారు. తనను ధన్యుణ్ణి చేసినందుకు బహుళాశ్వుడు కృష్ణుణ్ణి కీర్తించాడు.

ఒకయింతగుడిసెలో నొదుగుట యొప్పెగా నఖిలజగత్పరిపూర్ణుడైనతండ్రి
యదుగు దోసెడు నీట గడుగుట కలరెగా మిన్నేటిబదమునగన్నప్రోడ
త్రావి చెరెడు పాలి దనిసెగానిలపాలమున్నీటిలో నోలగన్న మేటి
యిచ్చినయొక్కసొమ్మొదబూని మెచ్చెగానిరికిగా పురమైనయీరమువాడు
భక్తియే కారణము కదా భక్తులిడ్డెయొక్కతులసీదళంబుననుత్సహించి
భక్తిముక్తులు దయసేయు పుణ్యమణికి_జగతిననిపించితివి పుణ్యజనశరణ్య.

[బహుళా. 4_65]

ఇలా బహుప్రకారాల కీర్తించాక కృష్ణుడు ఈ మిథిలానగరంలో పూర్వ జన్మలో తాను సీతను పెళ్లాడడం జ్ఞాపకంచేసుకొని రామాయణగాథను కథనం చేయమని విశ్వామిత్రుణ్ణి అడుగుతాడు. ఆయన బహుళాశ్వునికి సీతారాముల వివాహం, శోభనం రాత్రి సరసాలు విపులంగా 58 పద్యాలలో చెప్పాడు. ఆ మొదటిరాత్రి సీతమ్మ చాలా సిగ్గుపడింది.

మోవియొసంగదాడ దోక ముచ్చట గుబ్బపయుంటమీఁద జే
వైఁగనీదు కాదుకడవక్కఁయు నాకిది గొమ్మటంటకై
యేవగనుండినాఁడొ హృదయేశుఁడు గుండియగూడుకట్టె
దేవుఁడుగాన కొంతకడతేతె మనోభవబాధకకన్యదే?

[బహుళా. 4-118]

అయితే కొంచెంసేపట్లో ఆమె 'మదనకదనంబు మహిభర్త మదిగరంచె' (4-121). విశ్వామిత్రుడు ఈ కథ చెప్పాక కృష్ణుడు కొన్నాళ్లు మిథిలలో ఉండి ద్వారకకు వెళ్లాడు. ఈకథ ముగిస్తూ శుకయోగి ఇలా అన్నాడు:

అందలి రాజు భాగవతుఁడౌటను జేసి పురంబులోని వా
రందరు బుణ్యు లందరు గృతార్థులు భాగవతోత్తముల్ వణి
క్పుందనుఁడౌ కళానిధిగుణంబులు గానివి ద్రోచివైచి గో
విందునిచేత మెచ్చుగొని వారల సిద్ధతి మించె సద్ధరన్.

[బహుళా. 4-136]

ఈ పద్యంలో కళానిధి అనే కొత్తపాత్రసంగతి శుకయోగిచెప్పాడు. 'అయ నెవడు? ఆకథ చెప్పు' అని పరీక్షిత్తు అడిగాడు. ఇంతతో నాలుగో ఆశ్వాసం ముగిసింది. 446 గద్యపద్యాలలో ఒకేఒక్క వాక్యంలో వ్రాయదగ్గ శ్రీకృష్ణబహుళాశ్వుల కథని చెప్పాడు.

అయిదవ ఆశ్వాసంలో కళానిధి కథను శుకయోగి పరీక్షిత్తుకు చెప్పాడు. దానికీ, అసలుకథకూ సంబంధం లేదు. బహుళాశ్వుడు పాలించే మిథిలలో ఈ కళానిధి ఒక డున్నాడన్న బాదరాయణసంబంధమే ఊడిపోయే జారు ముడిగా ఈ కథలను కలుపుతూంది. కళానిధికథ ఒక పతితునికథ. వేశ్యా వ్యామోహంలో పడి అంతా పోగొట్టుకొన్న వైశ్యకుమారునికథ 237 గద్య పద్యాలలో కవి చెప్పాడు. ఉద్భటారాధ్యచరిత్ర, నిగమశర్మోపాఖ్యానం, నిరంకుశోపాఖ్యానం, విప్రనారాయణచరిత్ర, వైజయంతీవిలాసం మొదలైన ప్రబంధగాథలలో పూర్వులు వర్ణించినంత విపులంగా సానివాడలు, అందులోని విహారవిలాసాలు, మోదాలు, మోసాలు విపులంగా వర్ణించాడు.

అయితే ఇందులోని ప్రత్యేకత - ఆనాటి వైశ్యులజీవితాన్ని, వేశ్యలజీవితాన్ని బాగా చిత్రించాడు.

మిథిలాపురంలో రత్నాకరుడనే వైశ్యుడున్నాడు. ఆయన చేసే కర్తీకి అంతూ పంతూ లేదు.

మ. పడికొంచెంబుగ రాచు నుప్పుడులకుం బానీయ మర్పించు ద
క్కొడగట్టుం దినమెచ్చుగుందులుగ బూసెక్కొన్ నేతిలో నూనియల్
మిడుచున్ నూనియ నాముదంబు గలుపున్ మేలాముదం బందువె
ల్మిడినించుం గదియించు బ్రాదవుడు హాళిం గ్రొత్త బియ్యంబునన్.
[బహుళ. 5_10]

ఇటువంటి రత్నాకరశ్రేష్ఠికి సముద్రంలో చంద్రుడు పుట్టినట్టు కళానిధి పుట్టాడు. చంద్రునిలాగ పెరిగాడు. అతను ఒకనాడు గుడిలో జరిగే వసంత మహోత్సవం చూడడానికి వెళ్లాడు. 'అబ్బాయి, గుడిసేవ చూడగూడ'దని తండ్రి చెపుతూనే వున్నాడు. కాని కొడుకు లక్ష్యపెట్ట లేదు. ఆ వూరి దేవాలయంలో స్వామిని సేవించే భోగకాంతలు చాలా మంది వున్నారు. వారిలో మణిమంజరి చాలా అందగత్తె. ఆ చిన్నదాన్ని చూసి కళానిధి మోహించాడు. కాని ఆ వేశ్య ఎవరికో 'గుత్త' అని కొందరనుకొంటారు. 'కోవెలజియ్యాల కీయియారికిన్ హత్తుగడ' అని కొందరనుకుంటారు. అయినాసరే దానితో రమించాలని వైశ్య పుత్రుడు కళానిధి అనుకొన్నాడు.

చ. వైశ్యుల్నవ్విన నవ్వనీ, కటక విద్వత్కోటి చేటీ భటా
వళ్యాత్ముండని పల్కినం బలుకనీ, వాణిజ్యపూజ్యుల్ ధనే
దేశ్యుల్ కంచపు పొత్తు హత్తదని ముందే ద్రోచినన్ ద్రోవనీ
వేశ్యాకమ్రకపోల చుంబనకళావృత్తిం బ్రవర్తించెదన్.
[బహుళ. 5_86]

కళానిధి ఆరాత్రి వేశ్యగుమ్మైన విప్రుణ్ణి పిలిచి వేవేలిచ్చి 'భవదంతేవాసినం గూర్పుడు' అన్నాడు. ఆయన వెళ్ళి వేశ్యదాని కీ సంగతి

చెప్పాడు. అది తీరుబాటుగా పని చక్కబెట్టింది. ఈలోగా దుకాణంలో వ్యాపారం చేస్తున్న కళానిధికి పరధ్యానం జాస్తీ అయింది. కవిలె నిల్చిన యప్పు జవిలిప్రాయగబోయి బుజవైచె వేనూళ్లపూటలెక్కనొక్కనికొకకొన్నిరొక్కదూకలొసంగి కాసులలెక్కలోప్రాసికొనియె వక్కలలో దక్కవపు వైచిన బరీదులొకనికి సరుపుతో నొడినివైచె వైకమిచ్చిన నొంటిపడి కంగడికి నిడ్డ కలపెసల్ గంపెము గొలిచివిడిచె

మాట యరవిన్కి నారునిపై నాటుజూడ్కి
బయలు పయికంబునకు జూచు బాణి లంజె
తగవునకుగొంత పిస వెట్టి నగవుగనియె
వేశ్యసుద్దికి జెవియిచ్చి వైశ్యసుతుడు. [బహుళ. 5_95]

ఆ దుకాణందగ్గరకు వెలయాలిపరిచారిక వచ్చింది. తన ఏలికసాని సంగతి సెట్టితో చెప్పింది. అరటిపళ్ళు ఒలిచి చక్కెర అద్దుకుంటూ తింటూ కబుర్లు చెప్పింది. డబ్బుఖర్చుకు వెనుకతీయవద్దంది. 'ధనం నిన్ను గడించిందా? ధనాన్ని నువ్వు గడించావా?' అంది. "ఎంద రెందరో కోరినా మా విన్నది ఒప్పుకోలేదు; నిన్ను రమ్మంది" అని ఆ చెలికత్తె చెప్పిపోయింది.

కళానిధి వేశ్యవాటికకు 'బాపన చెలికాండ్రు వెంట నంట' బయలుదేరాడు.

ఒకనికి దుప్పటి యొకనికి-సితవస్త్రము వేరొకనికి సికతాయెతులిం
టికి వచ్చియిత్తునయియె-శకునము బాగాయె నన్న సంభ్రమపరుడై.
[బహుళ. 5_110]

వేశ్యయింటికి చేరాడు. చప్పరంలో పడకింటిముందర చాది తిన్నెపై వన్నెల తివాసి వుంది. దానిపై 'వీణావైష్ణవుడు', 'ద్విపద బాపడు','చదివించువిప్రుడు','చెల్లెలుభరతమయగారు','విడెమిచ్చుపడతి' మొదలైన వేశ్యాపరివారం వుంది. ఆ కొలువులో కళానిధి గోరకస్తూరి వాదివంటి కానుకలు తెచ్చి కూర్చున్నాడు. మణిమంజరి వచ్చింది.

తమ్ముడు తెచ్చియిచ్చిన వీణ తీసుకొని వాయించింది. కొంత పాడి 'అమ్మను పిలువే' అంది. తల్లివచ్చి 'ఈ కానుకలు ఎవరు తెచ్చా'రంది. కూతురు కళానిధిని చూపెట్టింది. వేశ్యమాత ఆమోదించింది. 'ఈయన స్నేహింప దగువాడు, చేపట్టు కుంచం, రాజుల చేతి నిమ్మపండు మన పాలిటి దేవుడు, ఇతణ్ణి విడవకు' అని చెప్పింది. మణిమంజరి అతణ్ణి విడువలేదు. రతులలో ఓలలాడించింది.

చక్కనివాడవీవె కద జాణవు నేర్పరి వంచు నక్కపై
మక్కువ వ్రాలి తక్కరుమై సవరించి సిగందివంచి యు
చ్చెక్కిలి మిక్కిలిం గఱచి చేతికొలంది నురంబు గ్రుద్ది తా
నక్కడ ముద్దువెట్టుకొని యాసతిదాసునిచేసి నవ్విటున్.

[బహుళ. 5_141]

దాసుడైనా ఆ కళానిధి 'ఇదే పరమానందం. ఇదే పరబ్రహ్మ' మనుకొన్నాడు. డబ్బేకాక ప్రతిరోజూ నూనె, సీకాయి, పంచదార, కొత్తిపోకలు, మిరియాలు, ఇంగువ, బెల్లం, ముత్తెసరులు, పైసలు 'గుత్త లంజకు నెత్తి పుత్తెంచి' సెట్టి అంగడి రిత్తచేశాడు. ఆ వేశ్య యింట్లో ఎవరు పడితే వారు అతణ్ణి దోచుకొన్నారు.

అల్లుడటంచు తల్లి, తమ యాత డటం మను గూతు, రన్నిటం
బల్లిదుడేలికే నను చు బానిసె వానిని భావయంచు న
చ్చెల్లెలు నచ్చినట్లు పయిజేతులు వైచుచు ముద్దువెట్టి పై
వ్రాల్చుచు నల్లిబిల్లి వగతీసిరి వాసిపరాలు రాసిగన్.

[బహుళ. 5_146]

కళానిధి చేతికి ఎముక లేదు___

అడుగనివానిదె పాపము_పొడగని పద్యంబు జదివి పొగడగనిడు తా
నుడుగని యావులు వలరా_నడగని నుడుగుల మిటారినను పెట్టిదొకో.

[బహుళ. 5_148]

"ంపుడుకత్తె యెదుట అడిగితే ఇంక చెప్పాలా?

ఉద్యోగరాహువుండని - పద్యంబులు నూక గేరి పంచల చదువన్
విద్యాధికులకు వల్లము - చోద్యంబుగ విడిచి లంజ చూడగ నిచ్చున్.

[బహుళ. 5_150]

ఇలాగ మంచి నీళ్లలాగా డబ్బు ఖర్చు పెట్టి ఇల్లుగుల్లచేసిన కొడుకు సంగతి తండ్రికి తెలిసింది. బావురుమన్నాడు. 'నీవలె నీవల తిరిగిరె కోవిల వెలయాండ్రనంటి కోమటి బిడ్డల్' అని ప్రశ్నించాడు.

ఎక్కువ తెచ్చి తక్కువకు సంటికడన్నరకమ్మ జూచుటో
వక్కలు నాకు లమ్మి బుధవారపుసంతకు జట్టిగట్టుటో
లెక్కల సంపుటంబు బ్రబలించుటో కోమటివారి పిన్నవా
డొక్కడ లంజబేర మది ఎక్కడ నెక్కడి కెక్క డక్కటా!

[బహుళ 5_157]

నెత్తీ నోరూ మొత్తుకొని హితోపదేశం చేశాడు. 'కుంచెకు కుంచము కూడబెట్టినన్ మంచము మాయచేసిం'దనే సామెత నిజం చేశావన్నాడు. సానులెలా డబ్బు లాగుతారో తెలియజేశాడు. 17 పద్యాలలో చీవాట్లు పెట్టాడు. అయినా కొడుకు చెవినిపెట్టలేదు. ఇంటిల్లిపాదీ అతణ్ణి ఏవగించుకొన్నారు. రెపిస్తాను, ఎల్లుండిస్తానని చెపుతూ కళానిధి వేశ్యకు గడువు పెట్టాడు. ఇవ్వలేకపోయాడు. దానితో వేశ్యమాతకు ఒళ్ళుమండింది. తిట్టి మెడపట్టి వెళ్లగొట్టింది.

తల్లీ, తండ్రీ ఇంటికి రానివ్వరు. ఎక్కడా డబ్బు పుట్టదు. ఏం చెయ్యాలో తోచక కళానిధి అత్తవారింటికి వెళ్లాడు. వారి యిల్లు దూరి కమ్మలు, కడియాలు పట్టుకొని మళ్ళీ సానియిల్లు చేరాడు.

ఆ సొమ్ము చెల్లగానే వేశ్యమాత వెళ్లగొట్టింది. 'రెంటికి గొరగాని తొంటి రేవణుడై' కళానిధి దేవాలయందగ్గిర పడిగాపులు పడ్డాడు. అక్కడ దేవుని సేవకోసం మణిమంజరి వస్తుంది. దేవ్రనిని 'తాలాటపు

పాట'పాడి ఆమె యింటికి వెళ్లిపోయేటప్పుడు 'కాసెమోసుకొని ఇంటికి వెళితే' మనసు కరుగుతుం దనుకొన్నాడు. దేవుని మంటపందగ్గిర కూర్చున్నాడు. విశ్రాంతి తీసుకున్నాడు. పశ్చాత్తాపం పడ్డాడు. ఆ సాని పాపకు 'కలవిత్తంబెల్ల హత్తించానే' అని బాధపడ్డాడు.

నేనాద్రవ్యము వెట్టి గట్టిగుడియేనీ కట్టిన ట్లాయెనా
కానీ మీకు మణీకిరీట ముఖ కైంకర్యంబు గావించుచో
ఆ నాకీమణి కిచ్చుటల్ త్వదనుకంపానర్హ్యాడై తింగదా
యేనా దేవరమాయయం దాటుట తండ్రీ జానకీ వల్లభా!

[బహుళ. 5_220]

అని దేవుణ్ణి తలచుకొన్నాడు. మరికొంత బాధపడి కన్ను మూశాడు. నిద్రపోయాడు. కలగన్నాడు. ఆ స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించారు. అనుగ్రహించారు. సిరులు మళ్లీ కలిగాయి. తల్లి తండ్రులు ఆదరించారు. కీర్తిప్రతిష్ఠలు వచ్చాయి.

ఈ కళానిధి కథను శుకయోగి పరీక్షిత్తుకు చెప్పాడు. దానితో వెంగళ రాజు కావ్యం ముగిసింది. తనకాలంలో ఇతరకవులంతా చేసే ఆష్టాదశవర్ణనలూ చేస్తూనే వాళ్లు చెప్పని పద్ధతిలో కథగానికథను ఆయన చెప్పాడు.

దామెర్లవెంగళరాజుకాలం ఏది? అన్నది ఒకప్రశ్న. వీరేశలింగంగారు ఇతడు 1602 ప్రాంతాలవా డని చెప్పారు.[1] క్రీ. శ. 1580 లో బహుళాశ్వ చరిత్ర విరచితమైనదని చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడ్డారు.[2] అయితే దీనిని కవి క్రీ. శ. 1620 ప్రాంతాలలో వ్రాశాడని చెప్పవచ్చును. దానికి చారిత్రిక ఆధారా లున్నాయి.

దామెర్లవారిది సుప్రసిద్ధమైన కుటుంబం. వీళ్లకు, వెలుగోటివాళ్లకు సంబంధబాంధవ్యా లున్నాయి. వెలుగోటి యాచమనాయకుడు ఈ వెంగళ రాజుగారికి మేనత్తకొడుకు. 17 వ శతాబ్దం తొలిపాదంలోని రాజకీయాలలో

---

1. ఆంధ్రకవుల చరిత్ర, రెండవ భాగం.
2. ఆంధ్రకవితరంగిణి 10 వ సంపుటి. 58 పుట.

ఈ యాచమనాయకుడు పాల్గొన్నాడు. క్రీ. శ. 1614 నుండి 1619 దాకా పాలించిన శ్రీరంగరాయలకు యాచమనాయకుడు ఒక్కడే అండదండగా ఉన్నాడు. క్రీ. శ. 1619 లో గద్దెనెక్కిన రామదేవరాయలు నిజానికి యాచమనాయకునికి పూర్తిగా బుుణపడిఉన్నాడు. రామదేవరాయలకోసం యాచమనాయకుడు ఎన్నో యుద్ధాలు చేశాడు. తన మేనత్తకొడుకును దామెర్ల వెంగళరాజు బహుళాశ్వచరిత్రలో ఇలా వ్రశంసించాడు:

ఉత్తరమల్లూరి యొద్ద దావలపాప విభుని గొట్టిననాటి విజయకలన
తిరుమలచేరి ధాత్రిని మన్నెరాజుల బారద్రోలిన నాటి బాహుబలము
చెంగలిపట్టు వీక్షించి లగ్గలుచట్టి యాక్రమించిననాటి విక్రమంబు
పాలెంబుకోటవెల్పట నాజి యతిరాజు జరగచేసిననాటి శౌర్యపటిమ
మున్నెతోపూరుజగ్గరాణ్ముఖులనొంచిమధురదొరచెంచిమన్నీనిమదమడంచి
తిరిచినాపలి బారదోలు తేజమొగల • మేటి వెలుగోటియాచని సాటిగలరె?

[బహుళ. 1_37]

ఈ పద్యంలో ఎన్నో యుద్ధాల ప్రసక్తి ఉంది. తోపూరుయుద్ధం క్రీ. శ. 1617 లో జరిగింది.[1] ఈయుద్ధాలను పేర్కొన్న బహుళాశ్వచరిత్ర క్రీ. శ. 1620 ప్రాంతాలలో వ్రాయడం సంభవమవుతుంది. ఈ కావ్యాన్ని దామెర్ల వెంకటరాజు తండ్రి వెంకటాద్రి కంకితం ఇచ్చాడు. ఈయనకు నలురు కొడుకులు. పెద్దవాడిపేరు చెన్నప్పరాజు. ఇతని పేరనే చెన్నపట్టణం కట్టారు. అదే ఉత్తరోత్తర మచవాసు అయింది. దామెర్ల వెంగళరాజుగారు బహుళాశ్వచరిత్ర వ్రాసేసరికి చెన్నప్పరాజు చాలా వైభవంగా రాజ్యంచేస్తున్నాడు. అందుకే గద్యలో 'వెంకటాధీశపుత్ర, చెన్నభూపాలకలిత సౌభ్రాత్ర' అని వెంగళరాజు చెప్పుకొన్నాడు.

చెన్నప్పరాజుకు ముగ్గురు కుమారులు. పెద్దవానిపేరు అంకరాజు. ఇతడు కవి. ఉషాపరిణయం వ్రాశాడు. రెండవకుమారుని పేరు అయ్యప్ప

---

1. 1616 లో జరిగిందని నేలటూరి వెంకటరమణయ్యగారి భావం. తోపూరుయుద్ధానికివెడుతూ తంజావూరు రామనాథనాయకుడు క్రీ. శ. 1616 జూన్ 9వ తారీఖున పలమనేరులో మరణించేశాడు. (రఘునాథ నాయకాభ్యుదయం, ఇంగ్లీషు పీఠిక, పుట 23)

రాజు. మూడోవాడు వెంకటప్పరాజు. ఇతడు వందవాసి రాజధానిగా పాలించేవాడు. అయ్యప్పరాజు పూనమల్లి రాజధానిగా కోస్తాప్రాంతాలను పాలిస్తూ ఉండేవాడు. ఇతని కాలంలోనే ప్రళయకావేరిలోని డచ్చివారు, మైలాపూరులోని పోర్చుగీసువారు పరస్పరం పోట్లాడుకొంటూ ఉండేవారు. ఈ యుద్ధాలను ఆపడానికి ఆ రెండుపట్టణాలకి మధ్య తన తండ్రిపేర చెన్న పట్టణం నిర్మించాడు. ఈ సంగతి దామెర్ల అంకరాజు తన ఉషాపరిణయంలో ఇలా చెప్పాడు:

ప్రళయకావేరి మైలాపురంబుగల్మి - బీరమున బోరనది నుట్టు పెట్ట తండ్రి
పేర చన్నధ్యభూమిని బృథువిభూతి - నలవరిచె చెన్నపట్టణమయ్యనృపతి.
[ఉషాపరిణయం, 1-94]

ప్రళయకావేరిని ఇప్పుడు పులికాట్ అంటారు. ఇది పొన్నేరికి 10 మైళ్ల దూరంలో ఉంది. మైలాపూరు నేడు మద్రాసులో ఒక పేట ఈ రెండింటి మధ్య చెన్నపట్టణాన్ని ఎప్పుడు నిర్మించారన్నది ఒక ప్రశ్న. క్రీ. శ. 1544 అని టంగుటూరు ప్రకాశంగారు, 1550 అని నిడుదవోలు వెంకటరావుగారు చెప్పారట.[1] అయితే ఈ తారీఖులు చారిత్రకంగా నిలుస్తాయా లేదా అని చూడాలి. డచ్చివాళ్ల వ్యాపారనౌక మొట్టమొదట క్రీ. శ. 1595 ఏప్రిల్ 2 వ తారీఖున తూర్పునముద్రాలపై ప్రయాణం చేసింది. ఈ నౌకాయానానికి ఆజ్ఞలు జారీచేసిన జాన్ హ్యూగెన్‌వాన్ లిన్స్‌చోటెన్ క్రీ. శ. 1563 లోగాని జన్మించలేదు. ఈ వ్యాపారనౌక క్రీ. శ. 1597 ఆగస్టు 20 తేదీన కొన్ని విలువైన దిగుమతులతో మాతృదేశం చేరుకొంది. హాలెండ్‌లోని వర్తకులు ఈ నౌకాయానం పురస్కరించుకొని క్రీ. శ. 1602 మార్చి 20 తారీఖున డచ్చి ఈస్టుఇండియా కంపెనీ స్థాపించారు.[2] డచ్చివారికీ, పోర్చుగీసువారికీ మధ్య నున్న పోరు ఆపడానికి అయ్యప్పరాజు చెన్నపట్టణాన్ని నిర్మించాడని అతని తమ్ముడు అంకన్న చెప్పాడు. డచ్చివాళ్లు క్రీ. శ. 1602 లోగాని వ్యాపారసంస్థను నిర్మించలేదు. క్రీ. శ. 1610 లోనే వాళ్లు పులికాట్‌వద్ద ఫ్యాక్టరీ నిర్మించారు.[3] ఇది చూసి పోర్చుగీసువారు మండిపడి క్రీ. శ.

1. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం - III, పుట 728
2. Encyclopedia Britannica, Vol 7 [P 769.]
3. Early History of Madras Region - K.V.Raman.

1612-13 లో డచ్చివాళ్లతో యుద్ధంచేసి వాళ్లను వెళ్లగొట్టారు. మళ్లీ క్రీ. శ. 1614 లో పులికాట్ డచ్చివాళ్ల స్వాధీనం అయింది. ప్రళయకావేరికీ, మైలాపూరుకూ క్రీ. శ. 1615 దాకా తొలియుద్ధాలు నడిచాయి. క్రీ. శ. 1621 లో ఇంగ్లీషువాళ్లుకూడా పులికాట్‌లో ఒక గిడ్డంగి కట్టుకొన్నారుగాని డచ్చివారితో గొడవలు పెట్టుకోలేక దానిని క్రీ. శ. 1623 లో విడిచిపెట్టవలసి వచ్చింది. ఈ పరిస్థితుల దృష్ట్యా అయ్యప్ప క్రీ. శ. 1625 ప్రాంతాలలో తన తండ్రిపేర చెన్నపట్టణం నిర్మించాడని భావించవచ్చును.

చెన్నపట్టణనిర్మాణానికి కారణం చెప్పిన అంకనరాజు ఆ నగరం కట్టినతరువాతనే తన గ్రంథం వ్రాసిఉంటాడని వేరేచెప్పనక్కరలేదుగాని చెన్నపట్టణం కట్టిన కాలంలో అంకన్న తన ఇంకోసోదరుడు వెంకటాద్రి చెంజిరాజుని ఓడించి తన తండ్రిపేరిట సాగరం అనేఊరు కట్టించినట్లు చెప్పాడు (ఉషా. 1-92). క్రీ. శ. 1649 లో చెంజిదుర్గాన్ని వరదప్పనాయకుడు మహమ్మదీయుల కైవసం చేశాడు. అంతతో చెంజినాయకరాజచరిత్ర సమాప్తమైంది.[1] అందుచేత ఉషాపరిణయం క్రీ. శ. 1649 కి ముందు, 1625 కి తరువాత పుట్టిందని చెప్పచ్చు.

ఇది అయిదాశ్వాసాల కావ్యం. ధీనిని కలలో కనబడి అడగడం వల్ల అంకన్న దేవునికి అంకితం ఇచ్చాడు. తన కలసంగతి చెప్పగానే సోదరుడు వెంకటాద్రి నిండుసభలో ఇలా అన్నాడట:

అనఘాత్మ్మలార! మాయాం_కన నిన్నటిరేయిగన్న కల వింటికె మ
మ్మానగృతి తన కిమ్మనెన_య్యినకులు కారుణ్యమహిమయెంతవవచ్చున్?
[ఉషా. 1-42]

---

1. మధుర తంజావూరు నాయకరాజుల నాటి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర – నేలటూరి వేంకటరమణయ్యగారు, పుట 70, అధోజ్ఞాపిక.

ఈ పద్యంవల్ల అంకన్నే కాక అతని సోదరుడు వెంకటాద్రికూడా ఒక కావ్యంద్వాని శ్రీరామునికి నమర్పించాడని తెలుస్తూంది. అయినా ఆ కావ్యం పేరుగాని, అందులోని విషయంగాని ఏమీ చరిత కెక్కలేదు. తన తమ్ముని కలసంగతి చెప్పాక సభలోనివాళ్లు 'తమురామునకున్ అంకితమొనరింప మిరంకన్నపతి కానతియొసంగు'డని చెప్పారట. దేవునికి కావ్యం ఇవ్వటానికి కూడా ఆరోజులలో రాజాజ్ఞ కావాలి కాబోలు. ఆసభలోనివాళ్లు అంకన్నను చూసి ఇలా అన్నారట:

అలర జేయగ నేర్తు వసవాయశూరత ఘటికాశత గ్రంథ కల్పనంబు
సరింపనేర్తువు సర్వతోభద్ర కంకణబంధము ఖ చిత్ర కావ్యరచన
ప్రకటింపనేర్తువు వికచపంకజబృంద మకరంద నిష్యంద మధురఘణితి
ఘటియింపనేర్తువు కమనీయపదబంధ సంధాన సరస విస్తరణ సరణి
నీకె తగునౌ నచుంబితారిక తాన-జాతి వార్తాధ్యకవనలీలాతిమూఢి
యరినృపాళిర్వగర్వసంహరణజాగ్ర-దాగ్రహాటోపదామెరకయ్యభూప.

[ఉషా. 1-16]

ఈ పద్యంలోని ఇతర గుణాల సంగతి ఎలా ఉన్నా నర్వతోభద్ర కంకణబంధాలవంటి చిత్రకవిత్వరచన అంటే అంకన్నకు చాలా ఇష్టమని చెప్పవచ్చును. ఒకపద్యంలోనే ఆరుబంధాలు ఇమిడ్చాడు. పంచదళపద్మ బంధం, దశదళపద్మబంధం, చక్రబంధం, షడ్దళపద్మబంధం, శ్లేషబంధం అనే ఆరుబంధాలకు ఈపద్యం చెప్పాడు.

సురచరవరహారం సుత - పరభార హర ధర ధరదర కరపరతారధరి
స్థిరతర ఖరపుర హార - శరసుర పరభర వరమురహర హారసుర సారకరా.

[ఉషా. 2-61]

వాములు మింగే స్వాములవారికి గడ్డిమోపులు ఫలహారం. ఒక పద్యంలో 108 పద్యాలు లాగడమే కాకుండా పదకొండు బంధాలలో అదే పద్యాన్ని యిమడ్చగల దామెర్ల అంకన్నకు ఒక పద్యాన్ని ఆరేడుబంధాలకు సరిపోయేటట్టు వ్రాయడం నల్లేరుమీద బండినడక. 108 కందాలను సాధించ గల పద్యాన్ని ... కల్పద్రుమం అన్నారు. ఇందులో 'ప్రదక్షిణమాన విష్ణుస్తుతిపరాలు యాభైనాలుగున్ను, అప్రదక్షిణక్రమాన శివస్తుతిపరాలైన యాభైనాలుగున్ను కలిపి, 108 కందాలు, గర్భిత కందాలు, ఖడ్గబంధమున్ను, అష్టదళపద్మబంధమున్ను, చక్రబంధమున్ను ద్వాదశదళ పద్మబంధమున్ను, ద్వాత్రింశద్దళ పద్మబంధమున్ను, షడ్దళపద్మమున్ను, షట్కోణబంధమున్ను, గోమూత్రికాబంధమున్ను' ఉన్నాయి.. ఆ సర్కసు పద్యం చూడండి:

... తెలుగు వెంకటేష్ ... Cell : 9392055065

పరదా వరదా భరదా - పరద వరద భరద వరద పరదాభరదా
వరదాసరదా భరదా - వరద పరద భరద వరద సరదా భరదా.

[D. 427. పుట 180]

ఈ పద్యంలోని పరదాలకు, వరదలకు ఏకాక్షరనిఘంటువుతో అర్థం చెప్పుకోవాలి. ఇందులో 54 అక్షరా లున్నాయి. ఈ అక్షరాలనే పొడగించి, పొట్టిచేసి ప్రదక్షిణక్రమంలోను, అప్రదక్షిణక్రమంలోను 108 కందాలు చచ్చి చెడీ ఇసుకలోంచి తైలం పిండినట్టు పిండవచ్చు. వరదాలు పరదాలూ కొంతసేపటికి 'పదరా వదరాభదరా'లుగ మారుతాయి. మరికొంత సేపటికి 'ధరవా దరభా దరపా' అని మారుతాయి. ఈ మార్పు లెలాగాచేసుకోవాలో కవే చెప్పాడు.

ఫలకంబుమీద నేబదినాల్గు లఘు వర్ణములు గంకణాకారముగ లిఖించి.
ప్లుతయుత సంబుద్ధి పొసగించి వేర్వేర సగణత్రయం బాది సంఘటించి

నలఘుత్రయిలోన నెలకొల్పిమరింటి యట్టుల సగ్గణ ద్వయంబమర్చి
దళమగు రెండవ దళము నిట్టు లమర్చి వళులు ప్రాసంబులు గలుగజేయ
గదమను ప్రతివర్ణ మీగతి బ్రదక్షి-ణ ప్రదక్షిణాకారచనల హరివారనుతి
నూటయెనుబదికందముల్ నూలుకొలిపె-దామరంకనకవి సంతతులు
మెచ్చ.

[D. 427, పుట 180]

ఈ రకంగా వచ్చే 108 పద్యాలలోని 1728 గణాలతో ఏర్పడే రెండు వేల పైచిలుకు మాటలకు అర్థాలు చెప్పుకొన్నపిమ్మటే పాఠకుడు తరువాత పద్యానికి సాగాలి. బొత్తిగా పొద్దుపోనివాడుతప్పించి ఇంత సాహిత్యజంజాటం పెట్టుకోలేడు. ఉషాపరిణయం అచ్చుకాలేదు. దాని అముద్రిత ప్రతి మద్రాసు ప్రాచ్యలిఖితగ్రంథాలయంలో ఉంది (D 427). తొలిపుటలో ఎవరో బహుశా బ్రౌనుదొరగారు 'A pedantic composition of small value' ('కొద్దిపాటి విలువగల విద్యాగర్వభూయిష్టరచన') అని వ్రాశారు. అది అక్షరాలా నిజం. ఈకావ్యంలో కవిత్వంకంటే కసరత్తే ఎక్కువ.

కవిత్వం అమరఘోటకం లాగా ఉండాలని దామెర్ల అంకనగారి ఉద్దేశం. గ్రంథాది నిలా వ్రాశాడు:

మంజులతర దేవమణిహర్మ్యమానమై యధికశబ్దఝర్ఝరి నతిశయిల్లి
చంపకమాలాది చతుర బంధంబుల చిత్ర వర్తనలచే చెలువు గాంచి
చటుల దారాశుద్ధి చాతుర్యధుర్యమై సురనదీ వీచిక స్ఫురణ దనరి
లక్షణాలంకార లలిత పదన్యాస శోభితమై వడి సొబగుమీరి
పరకవిగురువర్తనమునుంబ్రబలనీక - నిజమహాశ్వముకలిమిచే నెగడుచుండి
యమర ఘోటకము రీతి నమరు సుకవి-కవిత వర్ణింపతరమె వాగ్గానికైన.

[ఉషాపరిణయం, 1-6]

ఈ పద్యంలోని ఎత్తుగీతిలోని మొదటిపాదానికి నాలుగు అర్థాలున్నాయి. 'క' అనే ఏకాక్షరానికి బుద్ధి, బ్రహ్మ, అనిలం, అగ్ని, సూర్యుడు అనే నానార్థాలున్నాయి. క, విగురు, కవి, గురు అని పదాన్ని విరిచి అర్థాలు లాగవచ్చు. ఈపాదంలో యింత పాండిత్యప్రకర్ష ప్రకటింపవచ్చని కవే భావించి అర్థాలు కావ్యంలో వ్రాశాడు. దామెర్ల అంకన్న తన పినతండ్రి వెంగళరాజుగారిలాగ సాఫీగా కవిత్వం చెప్పనట్టు కన్పించినా కొన్నిచోట్ల అయన పోలికలు లేక పోలేదు. బాణాసురుడు ఈ కావ్యంలో అఖర్న ఒక విందుభోజనం పెడతాడు. దీనిని వర్ణిస్తున్నప్పుడు అంకన్న బహుళాశ్వచరిత్రలోలాగే సుదీర్ఘంగా వ్రాశాడు. 'సరసకావ్యంబునకు బలె నానారససమన్వితంబును, రంగస్థలంబును, ననేక సువర్ణ పాత్రాంచితంబును' అయిన భోజనశాలను పెద్దవచనంలో ప్రశంసించి, అందులో హరిహరులను ప్రవేశపెట్టి 33 గద్యపద్యాలలో దామెర్ల అంకన్న విందు చేయించాడు. వెంగళరాజుగారి బహుళాశ్వచరిత్రలో 52 గద్య పద్యాల విందుంది. రెండింటిలోనూ విస్తళ్లు వేయడం దగ్గిరనుంచి చేతులు కడుక్కోడందాకా విపులమైన వర్ణన ఉంది. ఈ రెండు కావ్యాలలోనే కాక కాకమాని మూర్తి అనే మరోకవి వ్రాసిన కావ్యాలలో కూడా ఇలాగే భోజనవర్ణన సుదీర్ఘంగా ఉంది. అతడు రాజవాహన విజయం అనే ప్రబంధంలో ఒక విందును 13 పద్యాలలో వర్ణించాడు (2-96 నుంచి 108 దాకా). పాంచాలీపరిణయం అనే మరొక కావ్యంలో 27 పద్యాలలో విస్తళ్లముందు కూర్చోవడం మొదలు చేతులుకడుక్కోవడం దాకా వర్ణించాడు (4-34 నుండి 60 దాకా). ఈ రెండు కృతులే కాక కాకమానిమూర్తికూడా బహుళాశ్వవిజయం అనే కావ్యం వ్రాశాడని ఒక అనంతరలాక్షణికుడు చెప్పాడు. అందులోని ఉదాహరణలను ప్రమాణాలుగా చూపించాడు. అయితే అవన్నీ దామెర్ల వెంగళరాజుగారి బహుళాశ్వచరిత్రలో కనబడతాయి. ఈ ప్రయోగాలు ఇచ్చిన లాక్షణికుడు కూచిమంచి తిమ్మకవి. ఇతడు క్రీ. శ. 1715 నుంచి 1750 దాకా రచనలు చేశాడు. ఇతని లక్షణ గ్రంథంపేరు సర్వలక్షణసారసంగ్రహం. అందులో 'కాకమాని రాయని బహుళాశ్వచరిత్రనుండి' అని చెప్పి ఉదాహరించిన పద్యాలను, అవి వెంగళరాజుగారి పుస్తకంలో ఏ ఆశ్వాసంలో ఎన్నో నెంబరు పద్యాలో ఈ పట్టికలో పొందుపరిచాను, చూడండి.

బహుళాశ్వ చరిత్రనుండి తిమ్మకవి ఉదాహరించిన పద్యాలు

పద్యం	సర్వలక్షణ సారసంగ్రహం	బహుళాశ్వ చరిత్ర
1. అంచుత్రినాయడి వన్నెరాబులు గుజ్జెడాసీనులూతల్గొనం బంచోస్యంబుల డుల్లు పాపదొరగ్రామ్య బ్రహ్మచారుల్దివా లించం బచ్చన భాత్ర లూడిపడు మేల్కొల్లుఱి మన్యంబులో చంచద్వాహములుంచు మంటపము పంచం జేరిపిశ్రాంతుడై.	1-సంధి - 210	5-218
2. లెక్కలుపెట్టగవచ్చుం-జొక్కల దద్భక్ష్యభోజ్య చోష్యాదుల క మ్మక్క మతిలెక్కయొక్కడి-దక్కడి యొకొక్కకడివెయూరులు సేయుక్	2-ఏ శబ్ద - 116	4-33
3. అంగమునన్ కురంగమద మందముగాగ నలంది మూళి సం పంగి విరుల్ సిరుల్గన రుమాలుధరిం బిరుటంపుడంగి పై రంగుమెఱుంగు బంగరు చెఱంగుల రెంటెము నాల్గుకొంగులు స్రగ్నింగుల వార గట్టి నుమణీ రమణీయసరాభిరాముడై [దీనిలో మూడవపాదాన్నే తిమ్మకవి ఉదాహరించాడు.]	3-సాధుశేఫ-51	4-5
4. ఆరేడు వగలబారు-ల్నూరువిధంబుల రసావళుల్ వేయువహల్ కూరలు బచ్చళ్ళూ ర్బిండ్లూరుంగాయలఱ లెక్కయున్ మతికలదే		
5. కారుమెఱుగు తలనుదారున్ నారుల్వోసిన విలోకనమ్ముల నారుల్ యారాటువగలబెట్టిన యూరుంగాయలు ఘటించిరొండొరులెడలన్	3-శ శేఫ - 160	4-52
6. ఒకమాట చక్కెర పానకమా చనుసారు సామనస కందుకమా తృకనూ ఈ నాతుక మానికమా మొకమోసరోజనారి ఘరకనూ.	3-శ శేఫ-161 3-శ శేఫ-196 సర్వ.1-సంధి 44	4-37 ?

దామెర్లవారి గద్య కనబడుతున్న పుస్తకంలోంచి ఉదాహరణ లిస్తూ 'కాకమానిరాయని బహుళాశ్వచరిత్రలోంచి' అని కూచిమంచి తిమ్మకవి ఎందుకు చెప్పాడో భావి పరిశోధనవల్లగాని తేలదు. కాకమాని రాయని గ్రంథాలలోనూ, దామెర్లవారి కావ్యాలలోనూ భోజనఘట్టాలు ఒకేరకంగా ఉన్నాయి. ఉషాపరిణయంలో ఈ పద్యం చూడండి:

తరళాయతాక్షి యొక్కతె - తరణిం నగజాలు రత్న తాటంకరుచుల్
నెరయగ సద్యోఘృతములు - దొరలను వడ్డించె పసిడిదొన్నెల నిండన్.

[D. 427. పుట 220]

సద్యోఘృతం పసిడిగిన్నెలలో వడ్డింపజేయడం కాకమానిరాయనికి కూడా ఇష్టం. అతని పద్యం చూడండి:

గేస్తులకు బసిడిగిన్నెల - కస్తూరి యనంగ నెంత కర్పూరంబే
శస్తమన వాసి కెక్కిన - నిస్తుల సద్యోఘృతంబు నెలతుకవంచెన్.

[పాంచాలీ పరిణయం, 4-44]

కాకమాని మూర్తికవి దామెర్లవారి ఆశ్రితుడై వాళ్ళకు కావ్యరచనలో సహాయం చేసిఉంటాడు. అతడే కొన్నిగ్రాని వాళ్ళ పేరు పెట్టాడని అనుమానించడం చాలా సులభమేగాని నిరూపించడం చాలా కష్టం. సాహిత్య డిటెక్టివులు ఎన్నో విషయాలు దర్యాప్తుచేస్తేనే గాని ఈ సమస్య తేలదు. ప్రస్తుతానికి దామెర్లవాళ్ళూ, కాకమానిమూర్తీ ఒక కాలంవాళ్ళని మాత్రం చెప్పవచ్చును. ఇతడు గ్రాసిన ఇతర గ్రంథాలు రెండు లభిస్తున్నాయి. గాని అందులో ఇతనిగురించి వివరా లేం లేవు. ఇతని తండ్రి రామలింగ భట్టు. వీళ్లది కౌండిన్య గోత్రం. కాకుమాను అనే గ్రామం గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలో ఉంది. మూర్తికవి పూర్వీకులు ఈ గ్రామంనుంచి కర్ణాటక రాజ్యానికి వచ్చిఉంటారు. తన గ్రంథాలగురించేగాని తన గురించి కవే చెప్పుకోలేదు కనుక మనంకూడా వాటిని గురించే చెప్పుకొందాం.

మన ప్రబంధకవులలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. పెద్దనగారి అల్లికలో జిగి, బిగి ఉంటాయి. ముక్కు తిమ్మనగారి పలుకులు ముదు ముద్దుగా ఉంటాయి. రామకృష్ణుడు పదగుంభనానికి ప్రసిద్ధుడు.

ఈ ప్రత్యేకతలను తొలిసారిగా పేర్కొని అవన్నీ తనలోనే ఉన్నాయని కాక మానిమూర్తి చెప్పుకొన్నాడు. అతడు పాంచాలీ పరిణయం ప్రారంభమనుకొనే రోజుల్లో ఒకనాడు కలలో శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై అతనితో ఇలా అన్నాడట:

ఉల్లసానివాని యల్లిక బిగిసొంపు - ముక్కుతిమ్మనార్య ముద్దుబలుక
బొంబురంగ సుకవి పద్యంపు హొరవును - గాకమానిరాయు నీకె కలదు.
[పాంచాలీ. 1-13]

అంతటితో దేవుడు ఊరుకోలేదు. శ్రీమూర్తికవిని "తెనుంగు కవితావి రించివి" అని ప్రశంసించి పాంచాలీ పరిణయం అంకితం పుచ్చుకొన్నాడు. మరోసారి మూర్తి కవి ఇంకో కావ్య కథనానికీ గ్రథనానికీ సమకట్టిఉన్న సమయంలో మళ్లా దేవుడు కలలో కనబడి ఆ పుస్తకంకూడా తనకు ఇమ్మన్నాడు. కవి నిలా మెచ్చుకొన్నాడు :

కృతిలో ప్రతిపద్య చమ_త్కృతి గులుకగ బలుక నేర్చు కృతిపీవుమహో
కృతిమాకొనరుచుభాషా - కృతి భారవి కాకమాని శ్రీమూర్తికనీ.
[రాజ. 1-19]

దేవుడు 'ప్రతిపద్య చమత్కృతి' అని అంటే భక్తుడు తన రచనలో పతి పద్యమే కాదు, పాటిలోని ప్రతి వాక్యమూ ఉన్నతి ఉన్నదే అన్నాడు. అసలు కృతి మొదలు పెడుతున్నప్పుడు దేవతలను చమత్కృతికోసమే ప్రార్థించాడు. 'గజాస్యం డిచ్చి కృతికిష్టవచోరచనా చమత్కృతుల్' (రాజ-1-5) అనీ, 'భారతి ఇచ్చుగాత ప్రతిభారతి మత్కృతికిం జమత్కృతిన్' (రాజ-1-6) అనీ అర్థించాడు. అంకితం అడగడానికి కలలో ఏడుకొండల వాడు ప్రత్యక్షమైన వైనం కవి ఇలా చెప్పాడు:

ప్రత్యక్షంబై నాపై - ప్రత్యక్షరహృద్యగద్య పద్య సముద్య
త్కృత్యక్షయ రచనార్థ - ప్రత్యక్షరఫణితిపైగృపారసమొలక్కన్.
[రాజ. 1- 6]

ప్రతిపద్యంలోనూ, ప్రత్యక్షరంలోనూ చమత్కృతి చూపించాలనే తాపత్రయం చేమకూర వెంకటరాజుగారి విజయవిలాసం ప్రచారంలోకి

వచ్చాక ఎక్కువైంది. చమత్కార బంధురంగానే గాక రాజవాహన విజయాన్ని కాకమాని రాయడు సలక్షణప్రబంధంగా రూపొందించాడు. ఇందులోని కథ పాతదే. దండి రచించిన దశకుమార చరిత్రలో రాజవాహనుడు కథానాయకుడు; రాజకుమారుడు. ఇతని కథతోపాటు మరి తొమ్మండుగురు కుమారుల కథలు కలిసి దండి దండిగా దశకుమార చరిత్రను వ్రాశాడు. దానిని మూలఘటిక కేతన కాకతీయ యుగంలోనే అనువదించాడు. దశకుమారచరిత్రలోని ఇతర కుమారుల కథలను మినహాయించినా అష్టాదశ వర్ణనలలో ఏ ఒక్కటీ మినహాయించకుండా ఒక్క రాజవాహనుని చరిత్రనే మూర్తికవి అయిదాశ్వాసాల ప్రబంధంగా వ్రాశాడు. కావ్యంలో కథానాయకుని ప్రతిభకన్న అతిగా కవిగారి ప్రభే ప్రకాశించాలనుకొనే కాలం కనుక మూర్తి కవి తన ప్రజ్ఞ చూపెట్టడానికే ఈ కావ్యం రచించాడు. అది రకరకాల పోకడలు పోయింది.

రాజవాహనుని పురిటివార్తను రాజుగారికి చెలికత్తెలు వినిపించారు. 'పురుడు' అనే మాటకు సమానం అనే అర్థంకూడా ఉంది. చమత్కరించడానికి అవకాశం ఉంటే కవిగారు ఊరుకొంటారా? పురిటిసమయంలో 'పురుడు' అనే మాట పట్టుకొని ఇలా పద్యం చెప్పాడు:

పురుడుపరిపాలిశాలకాపుర శేష-భుజగనూపురుడును గాకపుడమిగలడె?
యనగ సిరిగన్న రాజన్యతనయమణిని-వ్వా మందిరి యంతఃపురాబ్జముఖులు.

[రాజ. 2-17]

పురిటికందు అలకాపురం పాలించే కుబేరునికి, భుజగనూపురాన్ని ధరించే శివునికి సమానుడట. సమాసాలు కట్టడానికి సరిపోతాయి కాబట్టి ఈ సామ్యాలు తెచ్చాడేగాని చమత్కరిస్తున్నప్పుడు ఈ పద్యంలో ఇవే మాటలు ఎందుకు వాడాలి, ఈ పోలికలె ఎందుకు తేవాలి అన్న ఆలోచనలు మనకి వస్తాయిగాని కవిగారికి రాలేదు. ప్రతి పద్యంలోనూ చమత్కరించాలన్న తాపత్రయమేగాని అది అతుకుతుందా అతకదా అన్న గొడవే లేదు.

అవసరంలేని చమత్కారాలు చేసినా, మూర్తి కవిలో ఒక సుగుణం ఉంది. తన కావ్యంలో సమకాలిక జీవితాన్ని బాగా ప్రతిఫలింపజేస్తాడు. రాజవాహనుడు యువరాజు పట్టం కట్టుకొని దిగ్విజయానికి బయలుదేరాడు. ఆ యాత్రను మూర్తి విపులంగా వర్ణించాడు.

సలాముచేస్తూ యవనవ్రాతం వచ్చింది. తరువాత కైజీతపురాజులు, కత్తులూ ఆరిగెలూ పట్టుకొన్న బంట్లు ఒంటరిమూకలు కదిలాయి. దండుతోపాటు దండునుండలు కదిలారు. ఒకరితో ఒకరు పరిహాసాలు ఆడుకొన్నారు. రాజుగారి భోగపత్ని పరదాలున్న పల్లకిలో కదలింది. పట్టెవర్ధనాలున్న ఇద్దరు బ్రాహ్మణులు రాఘవాష్టకం చదువుతూ కదిలారు. రాజుగారి ముద్దులమరిది అప్పగారి పల్లకిలోనే కదిలాడు. కథ చెప్పుతూ ద్విపదపాడే బ్రాహ్మణుడు వెంటరాగా రాచమూకలు సాగాయి. పంట పొలాలు దున్నేస్తూ, అడవులు తగలెడుతూ పంటకాపులు కంట నీరుపెట్టేటట్టు రాజు దండు దిగాడు.

భోజనం చేశాక ఈగలు తోలుకొనేవారు, గుర్రపు వెంట్రుకల కుంచెతో విసురుకొంటూ గజ్జితో బాధపడేవారు, చాపలతో కట్టిన పాకల్లో ఉన్న అంతఃపుర స్త్రీలను కొలుచుకొనే గణికలు, దండు కదలిసప్పుడు ఇష్టమైన ధాన్యాలూ అవీ వదిలేశామే అని ఏడ్చేవాళ్లు-ఇలాగ రకరకాలవాళ్లు ఆ దండులో ఉన్నారు. అందులో లెక్కలు వ్రాసే నియోగికూడా ఉన్నాడట. అతడు ఎప్పుడూ అంకెలలాగే కన్పిస్తాడట. చలిగాలి వీచి విల్లు వంగినట్టు వంగితే ఒకటి (౧) లాగా ఉంటాడట. గుండెలమీద తలపెట్టుకొంటే రెండు (౨) లాగా ఉంటాడట. కాళ్లు ముడుచుకొని పడుకొంటే మూడు (3) లాగా కనబడుతాడట. నిద్దరపోతున్నా ఈ బక్క నియోగి లెక్కలు మానడని భటులంటూ వుంటారట.

వలఁయి విల్లు వంక గని వ్రాసెడినొక్కటి లెక్క యక్కనం
దలయిడి రెంటి లెక్కయిడి నాడు ముడించిఁ కాళ్ళసొంపుచే
నిలపెడి మూటి లెక్కభళి నిద్దురపోవుము లెక్కమానడీ
బలకరపుందవుల్ గలుగు బక్కనియోగి యటంచ్రు తద్భటుల్

[రాజ. 2_71]

ఇలాంటి వాళ్లందరితోటీ దండెత్తిన రాజవాహనుడు ఒక్క సీన పద్యంలో కుంతల సింధు సౌరాష్ట్ర గాంధారాది దేశాధిపతులని అవలీలగా ఆద్భుతంగా జయించాడు. రాజవాహనుడు వింధ్య శైలం దగ్గరకు వచ్చాడు. అక్కడ ఒక తపోవనం ఉంది. అది శాండిల్యమునిది. రామాయణంలో భరద్వాజుడు విందుచేసినట్లు ఈమునికూడా రాజవాహనుణ్ణి సేనాసమేతంగా భోజనానికి పిలిచాడు. కవి రాజవాహనునిచేత స్నానం చేయించి, బొట్టు పెట్టించాడు. పసిడి పళ్లెరాల చుట్టూ 'తెగబారె డనటి మేలిమి చిగురాకులు' వేయించి నీళ్లు చిలికించాడు. విందు వర్ణింపసాగాడు. బంతుల వెంబడి వడివడిగా వడ్డనలు చేయించాడు. షడ్రసోపేతంగా తినిపించాడు. చల్లని నీటితో చేతులు కడిగించాడు. మునిచేత అతిథులచేతికి గంధం పూయించాడు. దుప్పట్లు కప్పించాడు. తాంబూలా లిప్పించాడు. అంతటితో పొద్దు వాలింది.

దండయాత్రకు బయలుదేరిన రాజవాహనుడు మెల్లగా విందుభోజనాలు చేస్తూ మాళవదేశానికి వచ్చాడు. ఆ దేశపు రాజకుమార్తె అవంతిసుందరి వనవిహారం చేయడం చూశాడు. ఆమె అతణ్ణి చూసింది. చూసీ చూడగానే ఆ రాకుమారికి వచ్చిన భావాలు మహా దొడ్డవి. ఈ అబ్బాయి పెదవిమీద గంటుపెట్టగలిగే యువతి భాగ్యం ఎలాంటిదో తన చెలికత్తె నడిగింది.

కంటివె కల్వకంటి మనకంటికి వేలుపు గట్టుచంటిపా
లింటికి దుంటవింటిదొర లీలలమీరిన మేటిబోటియా
పంటవలంతి రేడు మణివంటి చొకారపుమో వి పై
గంటి యొకింత సేయు కలకంఠి యనంతిత భాగ్య మెట్టిదో!

[రాజ.3_132]

ముద్దుపెట్టుకొనడం కాక పెదవి గంటు చేద్దామనే కోరిక తొలి చూపులోనే కలిగే ముగ్ధలు ప్రబంధాలలోనే ఉంటారు. శ్లేషలో విరహబాధనుపడే నాయకులుకూడా అక్కడే కనబడతారు. రాజవాహనుడు అవంతిసుందరి కోసం పరితపిస్తూ ఎలా తన భావాలు చెప్పాడో చూడండి.

అతిమధురంబుగా పెదవి యభ్రముగా నెరికొప్పు జ్యోత్స్నగా
సతతము లేతనవ్వు ఘనసారముగా ననుదేటమాట యం

చితదరదంబుగా గళము చిత్రముగా నిలువబ్జ నేత్రస
మ్మతి గనుగొన్ రసజ్ఞనకు మందునకుం దగ వందమందదే?

[రాజ. 4_12]

ఇందులో రెండర్థా లున్నాయి. ఆ చిన్నదాన్ని చూస్తే పెదవి అతి మధురంగా, కొప్ప మేఘంలాగా, నవ్వు వెన్నెలలాగ, పలుకులు పచ్చ కర్పూరం లాగా, కంఠం శంఖాన్ని చీల్చే దరదంలాగా సరసునికే కనపడి నప్పుడు మూఢులు ఎందుకు మోహించరు అని ఒక అర్థం. రసవైద్యం చేసే వైద్యుని కీ అమ్మాయి పెదవి అతిమధురం అనే గ్రంథ్యాణంలాగ, కొప్ప అభ్రకంలాగ, నవ్వు పొట్లతీగెలాగ, పలుకులు పచ్చకర్పూరంలాగ, కంఠం పావరసంలాగ కనబడతాయట. అందం మందుకు తగినట్టు అమరు తుందట.

అయితే మన ప్రబంధ నాయకుల విరహానికి మందు వివాహమే. మూర్తికవి తన చిత్తమొచ్చినంత టైము తీసుకొని ఇష్టమొచ్చిన వర్ణనలు చేసి చివరకు నాయికా నాయకులకు పెళ్ళి చేశాడు. సారెగదిలో భార్యా భర్తలు ప్రవేశించారు. అత డామె పైట లాగాడు. ఆమె చేతులతో గుండెలు కప్పుకుంది. అప్పు డా రెండు చేతులూ స్వస్తిక బంధంలో రెండు భుజాలను అంటుకున్నాయి. ఆమె కుస్తీకి తలపడే మల్లు జబ్బ చరుస్తున్నట్టు కన బడిందట.

ధరణీరమణుడు పయ్యెద_సరవింగొని తివియ మగువ స్వస్తికబంధో
ద్ధుర బాహాంతరయుగుచో_స్మరసంగరమునకు మల్లచరచుట దెల్పెన్.

[రాజ. 5_91]

అష్టాదశ వర్ణనలలో ఒకటైన రతినికూడా వర్ణించాక కావ్యాన్ని అంతం చేయవచ్చు. అయితే మూర్తి కవి ఒక్కసారి లెక్కవేసి చూసుకొన్నాడు. అన్ని ప్రబంధాలలోనూ ఉండే వేనవి వర్ణన తన కావ్యంలో లేదు. ఎందు కేనా మంచిదని ఒక నాల్గు పద్యాలలో ఎండాకాలాన్ని వర్ణించి కావ్యం అయిం దనిపించాడు. ఈ ప్రబంధంలో మొత్తం 581 గద్య పద్యా లున్నాయి. కాని కథ లేదు. దశకుమార చరిత్రలో దండి బోలెడు కథ చెప్పాడు. దానిని ఇంత క్లుప్తంగా ప్రబంధీకరించడానికి ధైర్య ముండాలి.

వండి కావ్యంలోని సజీవ పాత్రలను మూర్తి కవి ఉత్త కీలుబొమ్మలుగా చేసినందుకు బాధకల్గుతుందిగాని, దండిలాగే ఇతడూ తన సమకాలిక జీవితాన్ని కావ్యంలో ప్రతిఫలింపజేసిననందుకు అభినందించాలి. ఆ కాలంలో రాజులు, సామంతులు ఎలా దండు కదలేవారో, ఆనాటి ఆచార వ్యవహారాలేమిటో, రాజవాహన విజయం బాగా స్పష్టపరుస్తుంది. ఆ నాటి దండయాత్రలలోని సాంఘిక వివరాలను ఈ గ్రంథంలో నుంచి క్రోడీకరించి సురవరం ప్రతాపరెడ్డిగారు సుదీర్ఘంగా పొందుపరిచారు.[1]

రాజవాహన విజయం ప్రకాశకనో, దానికి ముందో మూర్తి కవి పాంచాలీ పరిణయం అనే ఆయిదాశ్వాసాల కావ్యాన్ని ప్రకాశదు. నన్నయ గారు సుమారు 130 గద్య పద్యాలలో చెప్పిన ద్రౌపదీ కళ్యాణ కథను మూర్తి కవి 403 గద్య పద్యాలలో ప్రబంధంగా ప్రకాశదు. ఇది బహుశా అతని ప్రాథమిక రచన కావచ్చును. పద్య రచనలో అల్లసానివాని అల్లికను అనుసరించడం కనపడ్డా, పాండురంగవిభుని పదగుంఫనం జటిలంగా లేదు. పెద్దనగారు మనుచరిత్రలో అరుణాస్పదమనే పురాన్ని ఇలా వర్ణించారు:

అచటి విప్రులు మెచ్చ రఘిల విద్యాప్రౌఢి ముదిమదిదప్పిన మొదటివేల్పు
అచటి రాజులు బంటునంపి భార్గవుసైన బింకాన పిలిపింతురంకమునకు
నచటి మేటి కిరాతు లలకాధిపతిసైన మునుసంచి మొందలిచ్చి మనుపదక్షు
లచటి నాలవజాతి హలముచ్చాత్ర విభూతి నాది భిక్షువు భైక్షమైన మెచ్చు
నచటివెలయాండ్రురంభాదులైననొరయ గాసెకొంగునవారించికలవగలరు
నాట్యరేఖా కళా ధురంధరనిరూఢి నచట బుట్టిన చిగురుకొమ్మైన చేవ.
[మనుచరిత్ర, 1_50]

ఈ అతిశయోక్తులను అనుసరిస్తూనే వాటిని మించిపోయేవి ప్రకాశస్తూ మూర్తికవి పాంచాలీ పరిణయంలో పురవర్ణన చేశాడు.

అచటి ప్రాజ్ఞుల కమర్త్యాచార్య డజ్ఞాతఘణితి పత్రికప్రాసి పంట తెలియు
అచటి రాజనివాస మస్త్రాసనాభ్యాస భాగ్యంబునకు గాచు భార్గవుండు
అచటి కోమటుల యాహార్యశూడవసరంబై యప్పు పడియైదుఅడుగబంపు

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుట 220_223.

అచటి రెడ్డికొమాళ్ల నల హలాయుధపాణి నాగునకడుగు ధాన్యంబుకొంత
అచటి యొకపాటిదొరమదహస్తులకును-నెత్తుగున్నలుదిక్కులమత్తకరులు
అచటి వేరాచలాయింపుటలతి తేజి_కింత రెండవతరబడి యింద్రహయము.
[పాంచాలీ. 1-39]

రాజవాహనవిజయంలో లేని ఒక సుగుణం పాంచాలీ పరిణయంలో కనబడుతుంది. మొదటిదానిలో సమకాలిక జీవనమే కనబడుతుంది గాని రెండోదానిలో దానితోపాటు నమకాలిక భాషకూడా వినబడుతుంది. పాంచాలి పరిణయాన్ని చూడడానికి గ్రామ్య సుధీజనం వచ్చిన వైనాన్ని మూర్తికవి ఇలా చెప్పాడు.

ఇప్పుడే తెంచితిరే లెస్సలా మీపురాణంబు విందురా రాచవారు
రామవధానికి క్షేమమా సామమాద్యంతముల్ మావద్ద నభ్యసించె
మాశిష్యుడే వారి మాధ్వరి పిన్ననాడ మును చెప్పితిమి కాండత్రయంబు
నోహుహోవహో కంటిమే హరిన్మవ జనార్దను మూర్తిపాత మెందాకవచ్చె
నారసింహము చేరిటి నడిమివాని_వడుగుచేసితిగో లేదొ పదుచుపెండ్లి
వింటిమేక దయనుకొండ్రువీధిజేరి_యుత్సవము జూడవచ్చినయూళ్లద్విజులు.
[పాంచాలీ. 1-71.]

ఈ స్మార్తులేకాక అళఘుసింగరి, ఉప్పళి అప్పయాళ్వార్, భట్టరు పాటరు, వడగునంబి అప్పగారు మొదలైన ఆచార్యపురుషులు 'శ్రీనివాసాయ గారే అడియేన్' అనుకొంటూ వచ్చారు. వైదికజాతి ముత్తయిదువులుకూడా వచ్చారు. కూనలమ్మ కోక ఎగగట్టిన కోమట్లు, కోడెరెడ్లు, రెడ్డిసాన్లు మొదలైనవాళ్లు వచ్చారు. వీళ్లతోపాటు పాండవులూ వచ్చారు. వాళ్లు ఒక కుమ్మరి ఇంటికి వెళ్లారు. దానిని మూర్తి కవి కన్నులకు కట్టినట్లు వర్ణించాడు.

అలతి యరంగు మంజవికె యావపుబూడిద వూతకోత పెం
కల మదురందు నిండుఘటికాక్రయ ధాన్యపు గువ్వలాసనం
బులు గొఱెతోళ్ళు జాగిలపు ముంగిలిచట్టులు చట్టిమూతలుం
గలుగు కులాలగేహము ప్రఘూణము చేరిరి పాండునందనుల్.
[పాంచాలీ 2-4]

ఆ యింటి యజమానితో 'సెట్టీ, ఈ పూట కిచట వసించెద. మిమ్మి పట్టని యిచ్చట కుంతిని బెట్టి' పాండవులు స్వయంవరానికి వెళ్లారు. విప్ర వేషంలో ఉన్న అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టాడు. తామే కొట్టినట్లు గ్రామ్యభూసురులు గెంతులు వేసి గొంతులు రాయ గోయని కూతలు పెట్టారు. రాజులు ద్రుపదునిపై రేగారు. పాండవులు ఆదుకొన్నారు. రెచ్చిన రాజులుజారుకున్నారు. వచ్చిన ప్రజలు తప్పుకొన్నారు. మూర్తికవి లా వర్ణించాడు.

ఈ పాళెంబున నిల్ప మింతయిన మీకేవైష్ణవుల్ నేటికిన్
బాపావాగులు తత్త్వవాదు లదయుల్ పాపా స్వయంపాక మే
లా పల్లెంగలదన్న మందరు బుధుల్ యజ్వల్ విమూతక్షుధన్
రేపే చేరెద మూరికంచు బ్రజజారెవిచ్చి మొగ్గెవడిన్.

[పాంచాలీ. 2_74]

శిష్టులు ఇలా అనుకొంటూ ఉంటే జానపదులు హాయిగా భోజనం చేశారు.

తెచ్చిన చల్దికూళ్ళు తిని తిత్తులు బియ్యము గార్చి కాసులున్
వెచ్చ మొనర్చి వక్కలును వీడెము చేసియు గోకమాసియున్
వెచ్చని నీళ్లువాసి పొదివసియు జానపదోచ్చయంబు ము
న్వచ్చిన యచ్చువో దిగి వచ్చె హుటాహుటి నూళ్లు చేరగన్.

[పాంచాలీ. 2_76]

గ్రామీణుల భోజనాలేకాక కలవారి లోగిలిలోని పెళ్ళిళ్ళనుకూడామూర్తి కవి బాగా వర్ణిస్తాడు. ద్రౌపదిని పెళ్లికూతురుని చేశారు. ముత్తయిదువలు గౌరీకళ్యాణం పాడసాగారు. వైష్ణవం పెరిగిన రోజు లాయె. 'గౌరి కళ్యాణ మున కేమి కంతుగన్న తల్లి ధవళంబు పాడరాదా లతాంగి' (4-22) అని అభి ప్రాయపడ్డారు. పాటలు పాడేవాళ్లు తమలో తాము దెబ్బలాడుకున్నారు.

నీకేవచ్చు సువాలయుం ధవళ మింతీ యల్లా నేరేళ్ళు గా
రీ కళ్యాణము లంచు నింటికడ నేరీతిం విజృంభింతువే

వాకీ విచ్చటనంచు నిద్దఱుసతుల్ వాక్యోపవాక్యంబులన్
గాకై ముందఱపట్లకుం దొడగి రా కళ్యాణ వేదిస్థలిన్.

[పాంచాలీ. 4_24]

ఈ ఆడవాళ్లు చేరిన కల్యాణవేదికపై బ్రాహ్మణులు ఎలా ఉన్నారంటే.

ఆర్ష్యుషలోచనల్ పఱుకనప్పుడు విప్రులు హామవేళ మీ
రార్ష్యుఁడు రండు తెండు సమిధోత్కర మీ యగధాని బ్రహ్మ యీ
యర్ష్యుఁడు లోన యీపనస యన్న వసిష్ఠులుమీరు శ్రోత్రియుం
దర్ష్యుఁడయిం చు బంచుకొని రందఱు వేల్చుచు ద్రవ్య దక్షిణల్.

[పాంచాలీ. 4_25]

ఈ విధంగా బ్రాహ్మలు సంభాషించుకొంటూ చేయించిన పెళ్లి అయింది. అందరూ భోజనాలకి కూర్చున్నారు. సుమారు ముప్పయి పద్యాలలో మూర్తికవి విందు భోజనాన్ని వర్ణించాడు. సంతర్పణలు వర్ణించడం అంటే మూర్తికవికి ఒళ్లంతా నోళ్లవుతాయి. వేనో క్లూరేటులు వేసిన అరిటాకులు, వడించిన వంటకాలు, వీచే వాసనలు, తినే తీరులూ తృప్తిగా మూర్తికవి వర్ణించగలడు. శ్రీనాథుని తరువాత ఇంతగా భోజనాలను వర్ణించే కవి మరొకడు కనబడడు. భోజనశాలలో స్థలాల కేటాయింపు దగ్గరనుంచి వరిసాడు.

ఇక్కడ కూరుచుండుటల కీరలపెద్దలు లేచిరండు మీ
రొక్కరు వంటశాల కడు యోగ్యము మీకది తేమకేమి యీ
ముక్కలిపీటమీద యదిమూర్ఖుచోటిట మేలటంచు స
ద్వాక్కుల నక్కులాధికులు వైదికులన్ దగుచోటనుంచినన్.

[పాంచాలీ. 4-41]

మూర్తికవిలాగే అతని కావ్యాలలోని భోజనప్రియులు కూడా చేత్తో మెతుకు అంటకుండానే వడ్డించిన వాటిని మెచ్చుకోగలరు.

చేత మెతుకంటకుండన్-శీతాభోగములవారి చిరయోగిరమా
రా తుమ్మపూల తెలుపా_హాతావి యమారె వేడియని వేడిరొగిన్.

[పాంచాలీ. 4_43]

మస్తుగా అమృతమస్తుగా భోజనాలు పెట్టిన పెళ్లి అయాక, ఏగుపెళ్లి నాడే పెళ్లికూతురును మొదట పెళ్లికొడుకును కూర్చాలని ద్రుపదుడు దంపతులకు పడక ఇల్లు ఏర్పాటు చేయించాడు. రాజవాహన విజయంలో లాగే ఇక్కడా భార్యా భర్తల కుస్తీపట్లు మూర్తికవి వర్ణించాడు.

పైటను లాగుబాడి కటిపై ఘటియించిన చేవిదల్పులన్
బాటిలి నీవికై పెనగి పైబడి చేతుల తట్టి వేతల
న్నీట్టుగ నాటబట్టు బలిమిం గరమిం దగదొట్టి జెట్టి పో
రాటములాయె నాయన కొయారి యెడాటములన్ హుటాహుటిన్.

[పాంచాలీ. 5_20]

ఈ ఒక్కచోటనే గాదు. మరికొన్ని ఘట్టాలలో రెండు గ్రంథాలలోనూ సమానమైన భావాలు కనబడతాయి. రాజవాహన విజయంలో పెళ్లిని చూస్తున్న ముత్తయిదువల నిలా వర్ణించాడు:

పెట్టి చేతంగొని చే తడియారదే ముక్కరపడిలమే ముఖరవదన
ఎరవలసొమ్మువారిడినది పఱుకింతపైపీచకే చటులనయన
నీమోది నూపెమన్నెకొమాళ్ళ నొకవింత గుట్టుతోనుండవే కుందరదన
తోదోపులకును పోదురపె యెరుంగవా వలపుక త్తెయటించు కలువకంటి
చెంతకైవచ్చి వీడెంబు చేతికిచ్చిరమణుడనుమాట వినవయోరాజుజూచి
మగనిమరువంగదగున లేయిగురుబోడి! యనుచునుత్సవమొసీంచిరబ్జ
ముఖులు. [రాజ. 5_65]

ఈ పద్యంలో విపులంగా ఉన్న భావాలే పాంచాలీ పరిణయంలో కుదించి మొదట చెప్పాడు. ద్రౌపదీ స్వయంవరం నుంచి వెడుతున్న చేడెల వరన చూడండి.

అక్కమక్కర పదిలమోయమ్మ కమ్మయెచ్చరిక చీరగదద కట్టింత గట్టు
యట్టె జతనంబు నను జంక పెట్టుకొమ్మచెట్టవిడకంచు నడిచిరి చేడెలెల్ల.

[పాంచాలీ. 2_72]

లాక్షణికులు ప్రామాణిక కవిగా పరిగణించిన మూర్తికవి రచనలను నేటి సాహితీపరులు ఇలాగ పూర్తిగా చదివితే ఎన్నో సాంఘిక విషయాలు

తెలుస్తాయి. సాహిత్య చరిత్రలో పేర్కొనవలసిన కొన్ని వివరాలు దొరుకుతాయి. అయితే ఇతర ప్రఖ్యాత కవుల గ్రంథాలలోని రసాలవల్ల కడుపు నిండిన సాధారణ పాఠకులు ఇటువంటి ప్రబంధాలను అక్కడక్కడ రుచి చూసి వదిలేస్తారు. ఒక పెళ్లి భోజనాన్ని వర్ణిస్తూ చిట్టచివర కాకమాని మూర్తికవి ఇలా చెప్పాడు :


ఒకవ్రేల జవిచూచి యోరగ్రోచినబజ్జి యూఘ్రుణమునజేర్చు నామ్రఫలము
లాస నిడ్డెన నేత నద్ది నిల్పిన దొప్ప పై చప్పరింతల పనసదొనలు
చక్కెరబొరలించిచాలించురసచాళ్ళు కడగ్రుంచియుంచిన కమ్మవడయుమి
మిాది మిాగడమాత్రమే గ్రహించిన దధి యంటిపై చిన కలశంటకములు
కొరికివిడిచినయూర్ధాయకొంతనాల్క-మోపిపడవైచుజొన్నలుమూతినుట్టి
మిాటు పర్ణపుటీక్రమే ఘటిల్లె-భోజనాంతాన మత్కృతీ భోజనములు.

[పాంచాలీ. 4_59]

అవును! కడుపునిండాక గారెలు చేదు. అయితే నిజానికి కాకమాని మూర్తికవి కావ్యాలు మసాలా గారెలు.

16

క్షేత్రయ్య



లుగు భాషలోని తీయదనాన్నంతా గుత్తకు పుచ్చుకొన్న కవుల కూటంలో పెద్ద వాటాదారుడు ఎవరంటే నిస్సందేహంగా క్షేత్రయ్య అని చెప్పాలి. తేనెకన్నా మధురంగా, వానకన్నా చల్లగా, గాలికన్నా స్వేచ్ఛగా పాట పాడి, పాడినదంతా పచ్చిబంగారంగా చేసే పాటవిక శిఖామణులను ఎన్నిసార్లు లెక్కపెట్టినా క్షేత్రయ్య ఒక్కడే గణనకు వస్తాడు. అతడు భక్తులలో పెద్ద భక్తుడు; రసికులలో మొదటి రసికుడు; వీధిని పడి వేడుకతో నడచుకొన్న వీటరాయుడు. వెళ్లిన ప్రతి ఊళ్లోనూ స్వామివారిని దర్శించి, సానివాడను హర్షించి ఇద్దరినీ ఏకకాలంలో చరితార్థం చేసిన బయకారుడు; శృంగారాన్ని కాచి వడబోసిన వెజ్జు; దేవునికే పాఠాలు చెప్పిన ఒజ్జ; కమ్మని కామాన్ని అమ్మకానికి పెట్టిన బచ్చు; పడకగదిని బజారుకు లాగిన ఆకతాయి; పరమాత్మతో నేస్తంకట్టిన యోగి; పరస్త్రీల

రహస్యాలు తెలిసిన భోగి; ప్రణయంలో ఎన్ని రకాల సన్ని వేశాలు రాగలవో అన్నీ అనుభవించిన అదృష్టవంతుడు. మువ్వ గోపాలుని చల్లని మోవీ, పిల్లనగ్రోవీ తానే అయిన ధన్యుడు. క్షేత్రయ్య పాడని ప్రణయవేళ, చూడని మధుర లీలలు లేనే లేవు. అతడు చూచిన ప్రతి దృశ్యంపైనా పదం పాడి లక్షణగ్రంథాలకే భిక్షపెట్టిన జాణ.

క్షేత్రయ్య జీవిత చరిత్ర నిన్నటిదాకా ఎవరికీ తెలియదు. రేపటికిగాని తెలదు. ఇవాళ మాత్రం ఎవరికి తోచినట్లు వాళ్లు ఊహించుకోవాలి.

'ఈయన ఊరేమిటి? పేరేమిటి? సాధన ఎలాంటిది? సిద్ధి ఏరూపాన కల్గింది' అనే ప్రశ్నలు తండోపతండాలు. "ఇలాంటి ప్రశ్న లన్నింటికీ వెరసి సమాధానం ఒక్కటే. నిజం చెప్పాలంటే మనకు తెలియదు. తెలుసు కొనేందు కెలాంటి ఆధారమున్ను యింతవరకు కానరాలేదు" అని మా గురు పాదులు కీ. శే. మల్లాది రామకృష్ణశాస్త్రిగారు నిర్మొహమాటంగా వ్రాశారు.[1] క్షేత్రయ్యను గురించిన భోగట్టాలో ఇంతవరకు తెలిసిన తబిసీళ్లను వారు ఇలా బేరీజు వేశారు.

1. "కృష్ణాజిల్లా మువ్వగ్రామం కాపురస్థలం. గ్రామనామమే గృహ నామం, తొలుతటి పేరు వరదయ్య; కన్నవారి నామము లెవరూ పేర్కొనలేదు.

2. చిన్నతనంలో చదువు సంధ్య లబ్బని జులాయితనం.

3. వయసులో, చేరువనున్న సానివాడలో విహరించుతూ ఆ తగు లాటం ఫలితంగా ఆటపాట లంటే ఆసక్తి కల్గింది! మరో లెక్క ప్రకారం - ఒక గొల్ల పడుచుతో చెలిమిచేసి శృంగారి అయినాడు! ఆ ప్రణయం తాలూకు వన్నెచిన్నెలే, ఈ శృంగారపదములు.

---

1. తెలుగు మహాజనసమాజం, మదరాసు-అష్టమ వార్షిక సంచిక, 1963.

4. బందరులో మేనమామ వేణుగోపాలస్వామి ఆలయం ధర్మకర్త. ఆయన కుమార్తె - అనగా వరపుత్రి - రుక్మిణి. ఆ చిన్నదాని చెప్పచేతలలో మెలగి చిన్నవాడు జాణ అయినాడు. మనిషి కొమ్ములు. తిరిగిన దక్షిణనాయకుడు !

5. సదరుహీ మేనమామకు సయాం కుమార్తె మరో రుక్మిణి, చిన్నప్పుడే తల చెడి, మువ్వలో ఉంటూంది! ఆ అమ్మాయికి వయస్సు వచ్చిన తదుపరి,ఈ వరదయ్యమూలకంగా రగడజరిగి, పెద్దలు, ఇతగాడిని దుయ్యబట్టు కోగా, ఈ కుర్రవాడు ఊళ్లో ఉండడానికి మొగం చెల్లక, సంచారంపోగా, ఎవరో ఒక యతి దారిలో తగిలి గోపాల మంత్రం ఉపదేశించి, ఉద్ధరించి నాడు! అనాటినుండి వరదయ్య పదకర్త అయినాడు.

6. కంచిలో, 'మగువ తన కేళికామందిరము వెడలెన్' రచన;-విజయ రాఘవ నాయకుడు ఆహ్వానించగా తంజావూరు వెళ్లడం, అక్కడనే ఉంటున్న రోజులలో మధురకు కూడా వెళ్లడం, ఆ తరువాతనేమో గోలుకొండ పాదుషావారు కోరగా, వారి ఆస్థానంలో కొంతకాలం ఉండి కొన్ని పదములు రచించడమున్నూ జరిగింది. ఆతగాడు అక్కడే - అంటే తంజావూరి లోనే - చరమ జీవితం గడిపాడు.

7. పుణ్యాక్షేత్రము లన్నింటిని సందర్శించినందువలన వరదయ్య 'క్షేత్రయ్య' అయినాడు! కొంతకాలం సంస్థానాలను అంటిపెట్టుకొని ఉండి, సన్యసించి, తిరిగి మువ్వగ్రామం జేరుకొని గోపాలుని సన్నిధిలో తరించాడు!

ముక్తసరిగా యిదీ యింతవరకు తెలిసిన వైనం - చిల్లర మల్లర విషయాలు మినహాయించి :

క్షేత్రయ్య ఆనలుపేరు మువ్వ వరదయ్య అనే సంగతిని ప్రతిపాదించి, అతడు కృష్ణాజిల్లా దివితాలూకాలోని మువ్వ కాపురస్తుడని ప్రచారం చేసిన వారు విస్సా అప్పారావుగారు. అంతటివరకూ గుజిలీ పుస్తకాలలో ఉండే క్షేత్రయ్య పదాలను చక్కగా ముద్రించి విపులమైన పీఠిక వ్రాస్తూ అప్పా

రావుగా రీ వైనాలు చెప్పారు.[1] ఇవాళ రమారమి అందరూ ఈ విషయాలను చర్చించకుండా ఆమోదిస్తున్నారు. అయితే చాలా ముఖ్యమైన సందేహాలు లేకపోలేదు. ఆ శంకలను మా గురువుగారే ఇలా అడిగారు:

1. కృష్ణామండలంలో 'మొవ్వ' 'మువ్వ' ఎలాఅవుతుంది? రాయలసీమ లోదికాదా? దివి తాలూకాలోనిదే అయితే దేవరకోట సంస్థానపు దండకవిలెలో ఎక్కడా ఈ ప్రసక్తి లేదే,-ఆదినుంచికూడా, తమ పరగణాలలో ఉన్న మహా మహులను, గౌరవించ నోచుకొన్న దేవరకోట సంస్థానాధీశ్వరులు క్షేత్రయ్యను ఎందుకు గౌరవించలేదు? కానుల పురుషోత్తమకవి అయినా, తన శతకములలో, క్షేత్రయ్య పేరు ఎత్తకపోవడానికి కారణం వేరే ఏదైనా ఉన్నదా? లేక పద కవిత అంటే అప్పట్లో, ప్రభువులకు ప్రజలకు ఆదరణ లేదా?
2. తాళ్లపాక తిమ్మక్క పేర్కొన్న మువ్వ గోపాలుడు మాటేమిటి? క్షేత్రయ్యకు ఇష్టదైవం అత డేల కాదు? అయివుండరాదు?
3. కృష్ణామండలం వాడయితే, ఆ ప్రాంతాన్ని ఎరుగనట్లు ఎందుకు ఊరుకున్నాడు? 'ఆ పరగణాలలో ఎందరో ప్రభువు లుండిరే-ఒక్కడూ ఈ మహాకవిని గుర్తించి ఆదరించనేలేదా? కృష్ణామండ లంలో క్షేత్రయ్య పదాల ప్రాతప్రతి మచ్చుకైనా ఈనాటికీ దొరక్క పోడానికిన్ని ఏమిటి హేతువు?

ఇవి తేల్చుకోవలసిన ప్రశ్నలే. విస్సా అప్పారావుగారు పరిశోధనలు చేయకముందూ క్షేత్రయ్య స్వగ్రామంగురించి మూడురకాల వాదా లున్నాయి. ముగ్గురు దక్షిణాది ప్రముఖులు వాటిని తెలియజేశారు.

1. టి. యన్. వాసుదేవన్‌గారు - కృష్ణాజిల్లా మొవ్వ.

2. సి. ఆర్. శ్రీనివాస అయ్యంగారు: ఉత్తరార్కాటుజిల్లా మోవపురం.[2]

---

1. క్షేత్రయ్య పదములు-సంపాదకుడు: విస్సా అప్పారావుగారు. ఆంధ్రగాన కళాపరిషత్తు, రాజమహేంద్రవరము, 1950.

2. ఉత్తరార్కాడులో మోవూరులేదు. దక్షిణార్కాడుజిల్లాలో చిదంబరంవద్ద వుంది. చూ॥ List of Villages of Madras Presidency (1924) P. 41.

3. పి. సాంబమూర్తి ప్రభృతులు - చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకా ముప్వలవారి పల్లె.

ఈ మూడు వాదాలలో మూడవ వాదాన్ని ఖండించి మొదటిదానినే అప్పారావుగారు స్వీకరించి నిరూపించడానికి ప్రయత్నించారు. శ్రీనివాస అయ్యంగారు చెప్పిన మోవపురి ఎందుకు క్షేత్రయ్య స్వగ్రామం కాలేదో వారు ఖండించడానికైనా ప్రయత్నించలేదు. 'కృష్ణాజిల్లాలోని ముప్వ తప్పించి ఇంకెక్కడా ముప్వపురి లేదు' అని విస్సావారు అభిప్రాయపడ్డారు. అయితే దక్షిణాదిన మోవ అనే పదభాగా లున్న గ్రామాలకు కొదవ లేదు. చూడండి.

1.	చెంగల్పట్టుజిల్లా	తిరువళ్ళూరు తాలూకాలో	మోవూరు
2.	ఉత్తరార్కాడుజిల్లా	ఆరణితాలూకాలో	ముప్వాంపల్లం
3.	దక్షిణార్కాడుజిల్లా	చిదంబరం తాలూకాలో	మోవూరు
4.	తంజావూరు జిల్లా	అరంతాంగితాలూకాలో	మూవనూరు
5.	తంజావూరుజిల్లా	మన్నారుగుడితాలూకాలో	మూవస్టల్లూరు
6.	తంజావూరుజిల్లా	మాయవరంతాలూకాలో	మూవలూరు

వీటిలో ఏ ఒక్కటైనా క్షేత్రయ్య స్వగ్రామం ఎందుకు కాకూడదు? నిజానికి ఈ గ్రామాలలో ప్రతిదాన్ని ఖండిస్తేనేగాని కృష్ణాజిల్లా మొవ్వును స్వీకరించరాదు. క్షేత్రయ్య దర్శించిన క్షేత్రాలు 18 లెక్కకు తేలుతున్నాయి. అందులో నగం చెంగల్పట్టుజిల్లా మోవూరుకు నూరుమైళ్ళ కైవారంలో ఉన్నాయి. నేను దక్షిణాదిని ఉన్న మూడు మోవూరుగ్రామాలు చూశాను. వాటి విపరాలు తెలుపుతాను.

1. తిరువళ్ళూరుదగ్గర మోవూరు: ఇది సుప్రసిద్ధమైన వీరరాఘవ క్షేత్రానికి అయిదారుమైళ్ళ దూరంలో వుంది. తిరువళ్ళూరు వీరరాఘు వునిపై క్షేత్రయ్య పదాలు చెప్పాడు. క్రీ. శ. 1600 ప్రాంతాలలో ఈప్రదేశం తెలుగు కవిత్వంతో మారుమ్రోగుతూ వుండేది. చింతలపల్లి

కవులలో వానికెక్కిన వీరరాఘవుడు, లేకమళ్ల రంగశాయి తిరువళ్లూరు వాళ్ళే. క్షేత్రయ్య ఈ ప్రాంతాలవాడు కావచ్చునని మోవూరుకు వెళ్ళాను. అది ఖగ్రామం. రెండు మూడు వందల సంవత్సరాల క్రిందట అక్కడ కరుంబ గొల్లలు ఉండేవారట. కొందరు తెలుగురెడ్లు ఎక్కడో మోవూరునుంచి వలసవచ్చి ఇక్కడ ఆ పేరు పెట్టుకొన్నారు. ప్రతిష్ఠ జరిగిన దేవాలయం ఏదీ లేదు.

2. కొడియూళ్ళ మోవూరు: దక్షిణార్కాడుజిల్లాలోని మరొక సుప్రసిద్ధ క్షేత్రం చిదంబరం. దీనినే తిల్ల అని పిలిచేవారు. తిల్ల గోవిందరాజులపై క్షేత్రయ్య కొన్ని పదాలు చెప్పాడు. చిదంబరానికి ఏడెనిమిది మైళ్ళ దూరంలో మోవూరు అనే గ్రామం ఒకటి ఉంది. దీనినే కొడియూళ్ళ మోవూరు అంటారు. ఇదికూడా తిరువళ్లూరు దగ్గర నున్న మోవూరులాంటి ఖగ్రామం. అమ్మవారిగుడి తప్ప మరే ఆలయాలూ ఇక్కడ లేవు.

3. ముట్టం - మోవూరు: ఇదికూడా చిదంబరం తాలూకాలోనే ఉంది. చిదంబరానికి పాతిక మైళ్ళ దూరంలో నున్న కాట్టుమన్నారు గుడికి సమీపంలో ఈ మోవూరు ఉంది. కొడియూళ్ళ మోవూరుకూ, దీనికీ తేడా తెలియడానికి దీనిని పక్కనున్న ముట్టం గ్రామంతో కలిపి 'ముట్టం - మోవూరు' అని పిలుస్తారు. వీటిలో ముట్టం గ్రామం చాలా ప్రాచీనమైనది. విజయరాఘవ నాయకుడు డచ్చివారికి కట్టడచేసిన పది గ్రామాలలో ముట్టం ఒకటి.[1] ఈ గ్రామానికి పక్కనున్న మోవూరు కూడా నాయకరాజుల కాలంలో ఉన్నదనే భావించవచ్చు. ఇట

---

1. The Nagapatam grant from the Batavia Museum. K. A. Nilakanta Sastry, M. A., Proceedings of the Indian Historical Records Commission, 1937 Vol. XIV Page 42. ఈ కానుకను నిడుదవోలు వెంకటరావుగారు ఉదాహరించారు. —"దక్షిణకోశ ఆంధ్ర వాఙ్మయం", పుట 546.

ఇప్పుడు సుమారయిన గ్రామం. పూర్వం ఒక వీధి వీధంతా బ్రాహ్మణ వాడకట్టు ఉండేదట. ఇవాళ నాలుగైదు కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామానికి ప్రస్తుతం తెలుగువాళ్ళే కరణీకం చేస్తున్నారు. అయినా ఈ మోవ్వూరు క్షేత్రయ్య స్వగ్రామం అనడానికి ఆస్కారం మరింత పరిశోధన జేస్తేగాని లభించదు. ఈ గ్రామం ప్రాచీనమేగాని ఇక్కడ గోపాలస్వామిగుడి ఏదీ లేదు. రెండు ఆలయా లున్నాయి. ఒకటి శివాలయం. రెండోది లక్ష్మీనారాయణ పెరుమాళ్ళది. నాయకరాజుల కాలం నాటి గ్రామమే అయినా దీనికి మోవ్వూరు అనే పేరు ఎప్పటినుంచి ఉందో తెలియదు. మధ్యలో ఎవరో చంద్రశేఖర పిళ్ళైయారు పాలించడంవల్ల ఈ గ్రామానికి కొన్నాళ్లు చంద్రశేఖరపురం అనే నామాంతరం ఉండేదని కొందరు స్థానికులు చెప్తారు.[1]

దక్షిణాన ఉన్న ఇతర 'మోవ' గ్రామాలనుకూడా చూసి ఆ తరువాత క్షేత్రయ్య స్వగ్రామం ఏదో నిర్ణయించడం బాగుంటుంది. ఆనాటికి 'మూవ' నేటికీ అదే పేరుతో ఉందో లేదో నిర్ణయించాలి. చాలా పరిశోధన జరగాలి. క్షేత్రయ్య ఏ ఊరివాడో తేలకపోయినా అతని జీవిత చరిత్రను కొంత కాక పోతే కొంతయినా ఊహించవచ్చు.

క్షేత్రయ్య అసలు పేరు, విస్సా అప్పారావుగారు చెప్పినట్లు, వరదయ్య కావచ్చు. అతడు చిన్నతనంలో ఒక సానిపిల్లతో స్నేహం కట్టి ఉండవచ్చు ఆ ప్రణయాన్నే చాలామటుకు మువ్వ గోపాల పదాలలో అతడు ప్రతిఫలింప జేసి ఉండవచ్చు. ఈ జీవిత చరిత్ర ఇలా నడపడానికి, అతడు కృష్ణాజిల్లా లోని మువ్వలోనే జన్మించ నక్కరలేదు. అతడు దక్షిణాన ఉన్న ఏదో మోవ్వూరులో పుట్టి పెరిగాడు. కంచిలో చదువుకొన్నాడు అని ఊహించ వచ్చును. చిన్నప్పటినుంచీ 'సూనశరుని పాటలు సొంపుమీర' పాడుకొంటూ

---

1. ముట్టం–మోవ్వూరు గ్రామకరణం శ్రీ అత్తనూరు రామస్వామి గారు తెలుగువారే. ఆయనే ఈ ఆలయాలు నాకు చూపించి వివరాలు చెప్పారు. అందుకు కృతజ్ఞుడిని.

ఉండేవాడు. తాళ్లపాక అన్నమయ్యగారి శృంగార కీర్తనలన్ని గరతలా మలకం చేసుకొన్నాడు. ఆ బాణీలు అలవరచుకొని స్వంత గొంతుక విప్పాడు. అన్నమయ్య ఆదిలో ఎన్నో క్షేత్రాలు దర్శించాడు. వెళ్ళిన ఊళ్ళో ప్రతి దేవుణ్ణీ వెంకటేశునిగా భావించి వెంకటేశముద్రతో కీర్తనలు రచించాడు. ఉదాహరణకు, మధుర చొక్కనాధునిపై రచించిన సంకీర్తనలో ముద్ర ఇలా వేశాడు: "పూనిక వెంకటాద్రి నుండి వచ్చి నను గూడె సూనాస్త్రగురుడైన చొక్కనాధుడు."[1] అలాగే 'శృంగారాలే తరచాయె శ్రీ రంగ నాథ' అని పాడుతూ "శ్రీ వెంకటాద్రిమీద చేకొని నిల్చితివి. యేవేళ చూచిన నీవె యిటు శ్రీ రంగనాథ" అన్నాడు.[2] ఇలాగ ఇతర క్షేత్రాల దేవుళ్ళకు తన ఇష్టదైవంతో అభేదం కల్పించే తారుకాణలు అన్నమయ్యగారి రచనలలో కోకొల్లలు కనబడతాయి. తాళ్ళపాక కవుల రచనలన్నీ పుణికి పుచ్చుకొన్న క్షేత్రయ్య ఈ అభేదముద్రను అన్నమయ్యదగ్గిరే నేర్చుకొని ఏఊరు వెళ్ళినా ఆ దేవుణ్ణి 'మువ్వ గోపాల' అని పిలిచి పదాలు వ్రాశాడు.

కంచిలోని క్షేత్రయ్యకు నూనూగు మీసాల నూత్నయౌవనం వచ్చి వుంటుంది. కాంచీపురం నిజంగా శృంగారదేవతకు కాంచీదామమే. 'కంచి అరవత లసమాస్త్ర ఖడ్గలతలు' అని శ్రీనాథుడు కీర్తించాడు.[3] ఈ సంగతి స్వానుభవంపై తెలుసుకొని క్షేత్రయ్య 'కాయజుని తలిరు పదను కత్తులయ్య ఈ చెలులు' అని పాడాడు. అత డా ఊరిలో ఉన్నప్పుడు ఒక చిన్నదానిని వలచాడు. ఆ సానిపాప చాలా వైభవం కలది. అడపకత్తెలు గల సిరి నంపద లున్నాయి. (వి-122) ఆమెను క్షేత్రయ్య చూశాడు. మోహించాడు. కబురు పెట్టాడు. "చక్కని యీ చెలిని గూడని జన్మ మేమిటికి జన్మమే" అన్నాడట. ఈ సంగతి చెప్పిన దూతిక "ఇంతిరో వరదునికి నీపై నెంత మోహమే" అని ఆశ్చర్యపోయింది. ఆ సానిపాపపేరు పేరుంచేవి. ఆమెకూడా వరదుని చూసి మనసుపడింది. "నా మనసువంటిది నీ మనసైతే నా నోము ఫలమిడేరురా-అది కాక వేమారు చెరకున పండు పండినట్లు వేడుక లినుమ

---

1. తాళ్లపాక కవుల కృతులు: శృంగార సంకీర్తనలు - 3వ సంపుటి, పుట 159.
2. అందులోనే పుట 162.
3. కాశీఖండం, 3-109.

డించేరా ఓరోరి వరద" అని ఆమె భావించింది. ఆప్పటికే వరదుడు కంచిలో చాలా గ్రంథసాంగుడు. "ననుబోటి సఖులెల్ల నీవు నా సఖు డంటే విన సంతోషమైయుండురా" అని ఆమె అనుకొంది. "ఎననిన తమ రహస్య మిది నికె తెలియు. నే నెవరితో విన్నవింతురా" అని దాచుకొంది. (గి. 3-62)

వరదుడు వచ్చాడు. అతని వద్దకు వెళ్ళమన్నారు చెలులు. "చిన్న దాన నేనేమెరుగ నిగ్గాయెనమ్మా" అని తల తిప్పుకొని నవ్వుకొంది. 'మదన శాస్త్రము నేను చదివినదానగాను నదయుడని వానితోను సరసమాడుదు నేను" అని బిడియపడింది. (వి-174) ఆ రాత్రి వాళ్ళ కలయిక "చక్కెరవలె నున్నది చల్లనై ఉన్నది. కలసి మెలసి ఉంటే నిద్దురరాదు." (వి.213) ఆలసి సొలసి ఉంటే ఆమె ఉరముపై వరదుడు పడుకొన్నాడు. తెల్లవారింది. శాంతరసం మూర్తీభవించినట్లు 'మగువ తన కేళికామందిరము వెడలి' వెళ్ళడం వరదుడు చూశాడు (వి-248). అతడంటే పేరుందేవికి ఉన్నంత ప్రేమ ఆ వాడకట్టులోని ప్రతి వెలయాలికీ ఉంది. అతనిపై అందరూ కన్నువేశారు. వరదుణ్ణి ఎక్కడ దాచుకోవడ మనే పెద్ద సమస్య వచ్చిపడిం దామెకు. అతను వచ్చేదారిలో ఆడ్డంపడి మొక్కేవాళ్ళూ మోవి ఇవ్వమనేవాళ్ళూ, పైట తీసి పరవసింపచూసేవాళ్ళూ, నోరువిడిచి 'నన్నుం చుకో'మనేవాళ్ళూ కోకొల్లలు (వి-187).

నిజానికి వరదుడు వంచకుడు. ధూర్తనాయకుడు. 'కొత్తవలపు రెఱ్ఱిళ్ళు'. పేరుందేవిని విడిచి ఇతరచోట్ల విహరించాడు (వి-221). అతణ్ణి పిలిపించా లనుకొం దాముద్దరాలు. కబురు పెట్టించింది. దూతిక వెడితే 'ఎవరు నువ్వు' అన్నాడు. పంపించిన వలపువక్కాణం తెరచి చదువలేదు. అయితేముద్దియదయ మరువకుమని ముమ్మాటికీ చెప్పమన్నాడట. అంచేత వచ్చేమనసో రానిమనసో తెలుసుకోమని దూతిక అన్నది.(వి-283). అయినా వరదుడు రాలేదు.అతడు రాకపోతే'వలిరాయడున్నాడునేనున్నాను'అని ఆమె నిస్పృహ చెందింది (వి-184). అతడు వస్తాడని మళ్ళి ఆశలు పెట్టుకొంది. రాగానే బెట్టు చేయాలనుకొంది. అతడు పడకిల్లు చొచ్చితే నిద్దుర లేపవద్దని చెప్పమంది. నాలుగైదు దినాలదాకా బతిమాలించాకగాని భయంపుట్టరా దంది (వి-302). అయితే అతడు రాగానే వాని మోము చూచినప్పుడే వలపు రెట్టించి చాల 'ఈనినమలినాటికోప' మెక్కడికో పోయింది.[1]

---

1. గి. 1-48. ఇందులో వరదముద్ర లేదు.

అతడు వచ్చాక 'మునుపటివలె నాపై నెనరున్నదో' అని అడిగింది. 'చిన్ననాటినుంచి చేసిన దెంచక నన్ను చౌకచేసేది న్యాయమా ?' అని అడిగింది (వి-257). 'ముంచేవో దరిచేర్చేవో మోహంబుధిలో' అని విన్నవించుకొంది (వి–153). వాళ్లు మళ్ళీ కలుసుకొన్నాక ఎన్నాళ్లు సుఖంగా గడిపారో తెలియదు. ఒకనాడు 'ఈ రాతిరే పైన'మన్నాడు. ఆమెను విడిచి వెళ్ళిపోతున్నాడు. 'తాళగలనా ? కంచి వరదా ! నేనిన్ను నెడబాయ' అని ఆమె వాపోయింది. అతడు వెళ్ళక తప్పలేదు. ఆమె ఆ కడసారి వీడ్కోలును మరిచిపోలేక పోయింది. "తిన్నగ ఊరికి పోవుచు నన్నే తిరిగి తిరిగి చూసిన వగ లెన్ని తలచుకొందునమ్మా" అని చింతించింది (వి-100). అతనితోపాటు ఊరికి వెళ్లడం భావ్యం అనుకొంది. 'ఊరికి పోక నేడుండేది మేర?' అని బాధపడింది. వెళ్ళింపో లేదో తెలియదు. మళ్ళీ వాళ్ళు కలుసుకొన్నారో లేదోకూడా ఊహించలేం.

ఇదీ క్షేత్రయ్య పదాలనుండి మనం క్రోడీకరింపతగ్గ అతని ప్రేమ కథ. అతని పేరు వరదయ్యే అనీ, అతడు తన కథనే 'కంచివరద', 'వరద' అనే ఉపముద్రలున్న పదాలలో చెప్పాడనీ మనం భావించడం సమంజసమయినప్పుడే ఈ కథకి కాళ్ళూ చేతులూ ఉంటాయి. క్షేత్రయ్య చెప్పిన వందలాది పదాలలో దాదాపు ముప్పయి పదాలలో మాత్రం కంచివరద, వరద, కరిగిరివరద, ఇభరాజవరద అనే ఉపముద్ర లున్నాయి. వాటి వివరాలు ఇవీ.

కంచివరద : విస్సావారి ప్రతిలో 77, 100, 122, 153, 154, 170, 173, 174, 187, 213, 221, 226, 248, 257, 283, 302; గిడుగువారి ప్రతిలో 3_56. మొత్తం - 17.

వరద : విస్సావారి ప్రతిలో 32, 43, 93, 148, 184, 227; గిడుగువారి ప్రతిలో 3_62. మొత్తం - 7.

కరిగిరివరద : విస్సావారి ప్రతి 83, 309. షరా. వి 302 లో కంచివరద, కరిగిరివరద అనే రెండు ఉపముద్రలు ఉన్నాయి. మొత్తం - 2.

ఇభరాజవరద : విస్సావారి ప్రతి 51. మొత్తం - 1.

ముద్ద గోపాల ముద్ర లేని పదాలలో వరదుని పేరున్నవి గిడుగు వారి ప్రతిలో 4 (?)-14, (?) 22.

ఈ ఉపముద్ర లున్న పదాలలోంచి కాక వేరే సాధారణ పదాలలో కూడా క్షేత్రయ్య జీవితం ప్రతిబింబిస్తుంది. నిజానికి విస్సా అప్పారావుగారు ఇతర పదాలలోంచి కూడా అతని కథను ఊహించారు. 'పిలువనంపె న న్నివేళ' అనే పదంలోని రెండవ చరణంలో ఇలా ఉంది:

ఎమ్మెకాడు నేను నెనసిన చిన్ననాడే
సమ్మతిగా నొకచోట జదువుచుండగ
పమ్మిన వేడుకతో భామ నీవు ప్రొద్దైతే
కమ్మవిల్తుని కేళి కలసేమన్నది నిజమై పిలువనంపె [వి-237]

ఈ చరణంవల్ల వరదయ్యా, అతని ప్రేయసీ కలసి చదువుకొన్నారని విస్సావారు ఊహించారు.[1] అయితే ఇందులో ఆల ముద్ద గోపాలుడగు వెంకటేశుని కథే గాని వరదయ్య కథ లేదు. అలాగే క్షేత్రయ్య అసామాన్య తను ఊహించడానికి తీసుకొన్న 'సామాన్యముకాదే వాని పొందు' అనే పదం కూడా వరదయ్యకు సంబంధించినది కాదు.[2] అది విజయరాఘవ నాయకునిపైన క్షేత్రయ్య చెప్పిన పదం.

వాస్తవానికి క్షేత్రయ్య జీవిత చరిత్రను ఊహించడానికి అతడు తన పదాలలో చెప్పిన విటుల కథలనుగాక, అతనికి ఏయే చారిత్రక వ్యక్తులతో సంబంధం ఉందో చూడాలి. దానిప్రకారం అతని జీవితగాథను ప్రతిపాదించాలి. క్షేత్రయ్య స్వగ్రామం చెంజిమండలానికి దగ్గిరలో ఉండవచ్చు. అతడు విద్యాభ్యాసం ముగించుకొని, ఆ కాలంలో చెంజిని పాలిస్తున్న తుపాకుల వెంకటకృష్ణయ్య నాయకుని ఆశ్రయం సంపాదించుకొన్నాడు. ఆ ప్రభువుమీద ఎన్ని పదాలు చెప్పాడో తెలియదుగాని నేడు ముచ్చటగా మూడు మాత్రమే దొరికాయి. ఒక నాయిక ఇలా తన నవతులగురించి చెప్పుకొంది.

---

1. 'క్షేత్రయ్య పదములు' - విస్సావారి సంపాదకత్వం, పీఠిక, పుట 12.

2. అందులోనే - పీఠిక, పుట 14.

ఓయమ్మ వీరెంత ఓర్వజాలరమ్మ
సోయగమున తుపాకి కృష్ణుడు నేను గూడియుంటే.

పంటికొద్ది నామోవిపై విభుడు నొక్కిన
గంటు జూచి నవ్వే నా కలికీ
జంటబాయక నాతో మచ్చటలాడవద్దని
కొంకెతనమున గసరుకొనియె నా మగువ. — ఓయమ్మ.

ఒత్తి వాని మోవి నామోవిపై నుంచగా జూచి
బత్తిగాదనియె నా తరుణి
హత్తి మోవితో మడుపు లందీయ వెరగంది
యిత్తరి యివిగాక దయలనియె నాయింతి — ఓయమ్మ.

వన్నెమీర విభుడు నావద్దకి రాగానె మ్రొక్కితె
ఎన్ని నేర్చెననియె నాభామ
నన్ను గూడి తుపాకి కృష్ణ నరనాథు డాదరించితె
తన్ను తిట్టుకొనియె నా తామరసనేత్రి — ఓయమ్మ.

[కీ. 3-40]

క్షేత్రయ్య ఆశ్రయించిన ఈ తుపాకులరాయడు 'గొప్ప సరదారై యుండవలెను' అని విస్సా అప్పారావుగారు భావించారు.[1] కాని ఈ పదం వల్ల తుపాకి కృష్ణుడు నరనాధుడని స్పష్టమవుతోంది. చెంజి నాయక రాజ్యాన్ని క్రీ. శ. 1620 దాకా కృష్ణప్పనాయకుడు పాలించాడు. ఇతణ్ణే ఒకసారి తంజావూరు రఘునాథ నాయకుడు క్రీ. శ. 1595 ప్రాంతాలలో

1. విస్సావారి 'క్షేత్రయ్య పదములు' – పీఠిక, పుట 20.

రాయ కారాగారంనుండి విడుదల చేయించాడు. ఈ కృష్ణప్పనాయకుడు వీరవైష్ణవుడు. ఇతని మండలంలో చిదంబరం అనే క్షేత్రం ఉంది. అది ఆదినుంచీ శైవక్షేత్రం. అయితే వైష్ణవులు దీనిని తమ పట్టుకొమ్మగా మార్చడానికి చాలా ప్రయత్నాలు ఎన్నో శతాబ్దాలనుంచీ చేస్తున్నారు. శైవులు ప్రతిఘటిస్తూ వచ్చారు. కృష్ణప్పనాయకుని హయాంలో శృతిమించింది. కృష్ణప్ప, రాయ కారాగారంనుండి విడుదల కాగానే, క్రీ.శ. 1597 లో, చిదంబరంలోని వైష్ణవ దేవాలయాలకు స్వయంగా మరమ్మత్తును చేయించాడు.

శివక్షేత్రంలో వైష్ణవ విగ్రహం ప్రతిష్ఠింపదలచాడు. శైవ ధర్మకర్తలు ప్రతిఘటించారు. కృష్ణప్పనాయకుడు లక్ష్యపెట్టలేదు. ఆ పేదభక్తులు దేవాలయం గోపురం ఎక్కి కిందికి దుమికి ప్రాణత్యాగం చేసుకొంటామని హెచ్చరిక చేశారు. కృష్ణప్ప పెడచెవిని పెట్టాడు. అన్నప్రకారం ఒక ధర్మకర్త ఆత్మార్పణ చేశాడు. కృష్ణప్ప చూసీ చూడనట్టు ఊరుకుని మరమ్మత్తులు కొనసాగించాడు. ఒకరి తరువాత ఒకరు చొప్పున ఇరవైమంది శైవులు ఇలాగ గోపురంమీద నుంచి దుమికి ప్రాణాలు ఇచ్చారు. ప్రజలు రెచ్చిపోయారు. కృష్ణప్పనాయకుడు ఆగ్రహించాడు. ప్రజలపై తుపాకులు పేల్పించాడు. ఒక ఇల్లాలు క్రోధావేశంతో గొంతుక ఉత్తరించుకుంది.[1] అయితే పేదవాళ్ల కోపం పెదవికే కాక ప్రాణాలకే చేటైంది. తుపాకుల బలంతో కృష్ణప్పనాయకుడు తన ఆశయం నెరవేర్చుకొని చిదంబరంలో గోవిందరాజులను ప్రతిష్ఠించాడు.

ఆదిలో చిదంబరం ప్రాంతాలలో అగరుచెట్లు చాలా ఉండేవి. వాటిని తిల్లచెట్లు అంటారు. అందువల్ల ఆ ప్రాంతాలకు 'తిల్వారణ్యం' అని నంస్కృతీకరించి పేరుపెట్టారు. చిదంబరాన్ని తిల్ల అని స్థానికులు వ్యవహరించేవారు. గోవిందరాజస్వామిని తిల్లగోవిందరాజని క్షేత్రయ్య స్తుతించాడు. ఈ దైవంపై అతడు చెప్పిన పదాలలో నేడు 4 మాత్రమే దొరుకుతున్నాయి. (గిడుగువారి ప్రతిలో 1-41, 1-147, 1-163, 3-77) తన పోషకుడు తుపాకులతో ప్రతిష్ఠించిన దైవంపైన క్షేత్రయ్య నాలుగు పదాలనే చెప్పాడా! ఇంకా ఎన్నో చెప్పి ఉంటాడు. అతడు తుపాకుల రాయడిపై కూడా అనేకం

1. A History of Gingee and its Rulers-by Rao Bahadur C. S. Srinivasachari, P. 121.

చెప్పా డనుకోవచ్చు. వాటిలో కనీసం మూడైనా కాలగర్భంలో కలవ కుండా మిగలడం విశేషమే.

చెంజి కృష్ణప్పనాయకుడు క్రీ. శ. 1580 నుండి 1620 దాకా పాలించాడని చారిత్రకులు భావిస్తున్నారు.[1] క్షేత్రయ్య కీర్తించిన ప్రభు వితడే అయితే క్రీ. శ. 1620 లో ఇతడు గతించాక వేరే ఆశ్రయం అర్థిం చుతూ క్షేత్రయ్య పోయిఉంటాడని భావించవచ్చు. తంజావూరులో రఘునాథ నాయకుణ్ణి అతడు దర్శించినప్పుడు 'ఎందు కొచ్చా'వని ఆ ప్రభువు అడి గాడు. అప్పుడు మువ్వగోపాల భక్తుడైన క్షేత్రయ్య ఇలా సమాధానం చెప్పా డని లోకులు చెప్పుకొన్నారు:[2]

తము తా మె పత్తు రగ్గులు - క్రమ మెరిగిన దాత కడకు, రమ్మన్నారా
కమలంబు లున్న చోటికి - భ్రమరంబుల నచ్యు తేంద్ర రఘునాథ నృపా!

ఈ సమాధానానికి రఘునాథుడు సంతోషించే ఉంటాడు. కాని అటు వంటి ప్రశ్నకు ఇటువంటి జవాబులు చెప్పడం కొత్తేమికాదు. చింతలపూడి ఎల్లన్న తన రాధామాధవంలో అంతకు నూరేళ్లక్రిందటే ఇలా వ్రాశాడు:

సరసుఁ డి త్తగిం పుడని చాటను మామక వాణి సన్మనో
హర యగునేని వారి హృదయంబుల కింపొనరింపకున్నె, యె
వ్వర పిలువంగవచ్చి యళివర్గము లాత్మల జొప్పఁ దేనియల్
గురియు ప్రసూనగుచ్ఛభర కుంచిత మల్లిమతల్లికావనిన్.

[రాధమాధవం, 1-16]

---

1. The City of Gingee at the end of the 16th century - by Rev. Heras, Indian Antiquary, Vol. 54, March 1925.

2. మండ అక్కినరసింహకవి తన ఆంధ్రకౌముదిలో దీనిని చెప్పాడు. 'మువ్వ గోపాలభక్తేన క్షేత్రజ్ఞకవి ఉక్తత్వాచ్చ' అని పద్యం ఉదాహరించాడు.

కృష్ణదేవరాయలవారి ఆస్థానంలో ఇటువంటి సంజాయషీ సర్వ సామాన్యం. ముక్కుతిమ్మనగారు సాళువ తిమ్మరుసుగారిమీద చెప్పిన చాటువులో తుమ్మెదలకు బదులు కోయిల లున్నాయి, చూడండి.

ఏతెంతురు తము తా మే - దాతల సన్నిధికి నర్థితు లుర్వి పిక
వ్రాతమునకు చూతమహీ - జాత మ్మంపినదె కమ్మ సాళువతిమ్మా.
[చాటువు]

తన ప్రాచీనుల పద్యాలలోని యుక్తిని అనుసరించి రఘునాథుని కొలువులో పద్యం చెప్పిన క్షేత్రయ్య ఆ నాయక రాజుపైన పదాలు చెప్పాడో లేదోగాని చేమకూర వెంకటరాజుగారి పద్యాలను అనువదించి కొన్ని రచనలు చేశాడు. విజయ విలాసంలో సుభద్ర తన మేనబావను 'ఎగుభుజం బులవాడు మృగరాజ మధ్యంబు బుడికి పుచ్చుకొను నెన్నడుము వాడు' అని వర్ణించినట్లు వెంకటరాజుగారు వ్రాశారు (2-164). ఈ పద్యంలోని భావాలను వారు తాళ్ళపాక తిమ్మక్కగారి ద్విపదలోంచి తీసుకొన్నారో లేదో దేముడికే తెలియాలిగాని చేమకూరవారి పద్యం చదివాకనే బహుశా క్షేత్రయ్య ఈ క్రింది పదం చెప్పా డనుకోవచ్చు:

ఎంత చక్కనివాడే నాసామి వీ - డెంత చక్కనివాడే
ఇంతి ముద్దుగోపాలుడు సంతతము నామది
సంతోషము చేసెనే "ఎంత"

మొలక నవ్వులవాడె ముద్దు మాటలవాడె
తళుకారు చెక్కుటద్దముల వాడె
తలిరాకు జిగి దెగడ దగు మోవి కలవాడె
తెలిదమ్మికేల కన్నుల నమరువాడె "ఎంత"

చిరుతప్రాయమువాడె చెలువొందు విడియచం
దురు గేరు నొసలచే మెరయువాడే
చెరకు విల్తుని గన్న దొరవలె నున్నాడే
మెరుగు చామనచాయమే నమరువాడే "ఎంత"

పొదలు కెందామరల పెంపొందవు పదములవాడే
కొదమసింగపునడుముకొమరమరువాడే
మదకరి కరముల మరువు చేతులవాడే
సుదతి మువ్వగోపాలు డెంత సొగసుగలవాడే "ఎంత"

[విస్సా.73]

రఘునాథ నాయకుని ఆస్థానంలో ఎన్నాళ్ళున్నాడో తెలియదుగాని క్షేత్రయ్య తంజావూరునుండి మధురకు వెళ్ళాడని భావించవచ్చు. అప్పుడు మధురను తిరుమలనాయకుడు పాలిస్తూ ఉండేవాడు. అతడు క్షేత్రయ్యను అదరించాడు. ఆదినుంచీ చెంజి, మధురనాయకులకు ప్రాణ స్నేహం. ఈ రెండు రాజ్యాలవారూ కలిసికట్టుగానే రాయసింహాసనంపై తిరుగుబాట్లు చేస్తూ వచ్చారు. చెంజి కృష్ణప్ప పోషణలో కొన్నాళ్ళున్న క్షేత్రయ్యను తిరుమలనాయకుడు గౌరవించడంలో ఆశ్చర్యం లేదు. అతడు మంచి బహుమానమొసగి ఎదుట కూర్చోమని చెప్పి పదాలు చెప్పించుకొన్నాడు. మధురలో క్షేత్రయ్య రెండువేల పదాలు పాడి ఎంచుకోమన్నాడట. అప్పుడు చదురుమీద నున్న సామికి సంతోషమైందట.

మధురలో క్షేత్రయ్య పాడిన వన్నీ మువ్వగోపాల పదాలే కావచ్చు. అతడు తిరుమలేంద్రునిపై ఏమైనా రచనలు చేశాడో లేదో తెలియదు. ఈ నాయకరాజు క్రీ. శ. **1623** నుండి **1659** దాకా పాలించాడు. ఈ **36** సంవత్సరాలలో ఏ ఒకటి రెండేళ్ళో మధురలో ఉండి ఉంటాడు. తరువాత తంజావూరు చేరి విజయరాఘవుని ఆశ్రయించినట్లు చెప్పవచ్చు. క్రీ. శ. **1633** లో విజయరాఘవుడు పట్టం కట్టుకొన్నాడు. అతడు ప్రబంధ రచనలకన్న మధురకవితలనే మన్ననచేసే రసికుడు; క్షేత్రయ్య కీర్తి విని అతణ్ణి రప్పించుకొని ఉంటాడు. చలువ చప్పరంలో ఉన్న విజయరాఘవుడు మనుజుల వెంబడిని తన పొడగాంచి పలుకరించగానే క్షేత్రయ్య వేయి పదాలు చెప్పాడట.

మువ్వ గోపాలుని శృంగారలీలలకన్నా మితిమించిన విహారాలు చేసే విజయరాఘవుడు తన మీద కూడా ఎన్నో పదాలను క్షేత్రయ్యచేత చెప్పించు

కొన్నాడు. వాటిలో 12 మాత్రమే నేడు మిగిలాయి. విజయరాఘవుని విపరీత చర్యలకు, క్షేత్రయ్య పిచ్చలవిడి పదాలకు సరిపోయింది. విజయరాఘవుడు పల్లకీదొర. అందుచేత కనపడ్డ ప్రతిస్త్రీ పైటపై చెయ్యి వేయగలడు. అది క్షేత్రయ్య వర్ణించగలడు (గి 2-98). తన విశృంఖల విహారాన్ని కీర్తించే క్షేత్రయ్య అంటే విజయరాఘవునకు అభిమానం, ఇతర ఆస్థాన కవులకు ఉత్కోషం సహజంగానే పెరుగుతూ ఉంటాయి. ప్రతి పదంలోనూ క్షేత్రయ్య నాయకుణ్ణి 'రా' కొట్టిస్తాడు—'ఏరా' 'పోరా' అని. ఇంత చౌకచేసే పదకర్తను మన్నించడ మేమిటని ఆస్థానకవులు ఆక్షేపించేవారట. క్షేత్రయ్య ఇది విన్నాడు. తనలాంటికవి మరొకడు లేడు కనుకనే రాజు తనను ఆరాధిస్తున్నాడని వాళ్ళకు చెప్పా లనుకొన్నాడు. వాళ్ళలో ఏ ఒక్కరూ తన దరిదాపులకు రాలేరని రుజువుచేయదలచుకొన్నాడు. వెంటనే ఒక పదం ఇలా మొదలుపెట్టాడు:

వదరక పోపోవె పోవే వాడేల వచ్చిని వద్దు రావద్దనవే!
అదియొక్కయుగము వేరే జన్మ మిపుడు
అత డెవ్వరో నే నెవ్వరో ॥వదరక॥

నిచ్చ నిచ్చలు నీడే వచ్చిని రేపైన వచ్చిననుచు మదిలో
నిచ్చలుగా బలుపేడి నిట్టూర్పులచేత నింతిరో పెదవులెండి
హెచ్చైన వెన్నెల చిచ్చులరాతులు
యెన్నెన్నో గడిపితి నిక నేటిమాటలే? ॥వదరక॥

వలపుకా డిదేకదా వచ్చు ననుచు దెరువులు చూచి వేసారితి
సెలలెంచి యలసితి నిలుపరాని శ్రమము నెమ్మది నడచుకొంటి
కలకంఠ శుకనాదములు వినుచు మధుమాస
ములు గడిపి తీవట్టి ముచ్చట లిక నేలే ॥వదరక॥

భామగో శకునము లడిగితి ముద్దుగోపాలుడు వచ్చు ననుచు
కామించి నాధుల గలయు చెలుల జూచి కరగి చింతనొందితి.

ఇక్కడిదాకా పదం చెప్పి, చివరి చరణంలో కడమ రెండు పాదాలూ ఎవరైనా పూరించమని నవాలుచేసి సేతుస్నానానికి వెళ్లిపోయాడట. ఆయన

తిరిగి వచ్చాడుగాని అది పూరించవలసిన భావం ఏ ఒక్కరికీ రాలేదు. 'మీరే చెప్పండి' అన్నారట. అప్పుడు క్షేత్రయ్య తడుముకోకుండా,

రామరామ ఈ మేనితో వాని
మోము జూడవలెనా యొందటి పొందే చాలు.

అని పూరించాడు. కవులందరూ జోహారులు చేశారు. 'నువ్వు సాక్షాత్తూ మువ్వగోపాలుడివే' అన్నారట. ఇలాంటి కొసమెరుపులలోనే కవి సాక్షాత్కరిస్తాడు. అయితే 'మొదటిపొందే చాలు' అనే భావం పదంలో చెప్పడం క్షేత్రయ్యకు కొత్తకాదు. ఇంకో రెండు పదాలలో వాడాడు. 'ఇక నేలనే వాడి గొడవ?' అనే పదంలో 'తొలిపొందె చాలుచాలు పదవే మీ చెలిచేతిలో దార పోసితిగదవే' అని నాయిక కట్టకడపటి అనుకొంటుంది (గి 1-50). ఇలాగే 'ఎందుకు నాపై బాళి' అనే పదంలో చివర 'తిల్లగోవింద, మునపటి పొందె చాలు' అనే ముగింపు ఉంది (గి 1-163).

ఒక భావా న్నిలా పలుసార్లు చెప్పడం కొంత సహజమే. ప్రతి మనిషికీ ఏదో ఊతపదం ఉన్నట్లు ప్రతికవికీ కొన్ని ఊతభావాలూ, ఊతసామెతలూ ఉంటాయి. అందని ప్రేమానిపండ్లకు ఆశించడ మనే సామెతకు బదులు బూరుగుపళ్ళకు చిలక ఆశించడం అనేది వాడడం క్షేత్రయ్యకు ఇష్టం. గి 1-64 – 1-149 – 2-52 పదాలలో ఇది కనబడుతుంది. క్షేత్రయ్య పదాలను కూలంకషంగా పరిశోధిస్తేనే ఇలాంటి పోలికలు కనపడుతాయిగాని మామూలుగా చదివితే "క్షేత్రయ్య పదము లన్నియును శృంగార రసభూయిష్ఠములై ఒక్క మచ్చుననే యున్నట్లు కనబడినను నే రెండు పదములలోని భావములు నొక్కతీరున నుండవు" అనిపిస్తుంది.[1] ఇలా అని పించబట్టే విజయరాఘవుడు అంత గౌరవించాడు. పలుకరించుకోగానే వేయి పదాలు చెప్పించుకొన్నవాడు ప్రతిరోజూ ఎన్ని వినిపించుకొనేవాడో!

విజయరాఘవుని పోషణలో క్షేత్రయ్య ఆట్టేకాలం లేడు. క్రీ.శ.1646లో గోలకొండ సైన్యాలు దక్షిణాదికి వచ్చాయి. అ తరువాత అలాగ తంజావూరుపై

---

1. గిడుగువారి 'క్షేత్రయ్య పదములు'-ప్రస్తావన, పుట XLIII.

దాడి చేస్తూనే ఉన్నాయి. నమ్ముకున్నవాళ్ళను నట్టేట విడిచి విజయ రాఘవుడు అడవులు పట్టాడు. గోలకొండ సైన్యాలు తంజావూరును కొల్లకొట్టాయి గాని వాళ్ళ నర్వాధికారి సాహిత్యాభిమాని కాబోలు. గోలకొండ సుల్తాను అబ్దుల్లా కుతుబ్‌షా పంపున మీర్‌జుమ్లా ఈ ప్రాంతాలపై దండెత్తాడు. అతడు క్షేత్రయ్యను ఆదరించి తానే పదాలు చెప్పించుకొన్నాడో, లేక గోలకొండకు పంపించాడో తెలియదు. బలవంతుడైన గోలుకొండ పాదుషా పెచ్చుకొని బహు మానమిచ్చి తులసిమూర్తి అనే కవితో వాదం పెట్టిస్తే 40 రోజులలో 1500 పదాలు తాను చెప్పినట్లు ఒక పదంలో వివరించాడు. ఎక్కడెక్కడ ఎన్నెన్ని పదాలు తాను చెప్పినదీ వివరిస్తూ క్షేత్రయ్య వ్రాసిన పదాన్ని మేరువపదం అంటారు. చూడండి.

వేడుకతో నడచుకొన్న విటరాయడే
ఏడుమూడు తరాలనుండి యెందునాగాని యెవతె
కూడుకొని మువ్వగోపాలుడు కృపగల్గినా విభుడు ॥వేడ॥

మధుర తిరుమలేంద్రుడు మంచి బహుమాన మొసగి
యెదుట కూర్చుండుమని యెన్నిన యిమ్మనినే
యిదిగో రెండువేల పదము లిపు డెంచుకొమ్మనిన
చదురుమీదనే నున్న సామికి సంతోస మింతింతగాదె ॥వేడు॥

ఆళిమీర తంజాపురి నేలకొన్న విజయరాఘవుని
వెలయ మంజుల కెంబడి వేగమె పొడగాంచి
చలువ చప్పరమున నుండగ చక్కగ వేయిపదముల
పలుకరించుకోగానె బహుమాన మిచ్చె నావేళ ।వేడు॥

బలవంతుడై గోలకొండ పాదుషా బహుమాన మిచ్చి
తులసిమూర్తితో వాదుదలచె నావేళ
వెలయ మువ్వగోపాలుడు వెయ్యిన్నేనూరు పదములు
నలువది దినములలోన నన్ను గలిసి వినిపించెనే ॥వేడు॥

ఈ పదంలో చెప్పిన లెక్కలనుపట్టి క్షేత్రయ్య పదాలు కనీసం 4500 ఉండి ఉండాలి. అయితే ఇవాళ 450 పదాలుకూడా లభించడంలేదు.

క్షేత్రయ్య పదాలు తిరిగీ వాటి గొప్పస్థానంలో ప్రతిష్ఠించడానికి భగీరథ ప్రయత్నాలు చేసి కృతకృత్యులైన విస్సా అప్పారావుగారు ఎన్నో అముద్రిత ప్రతులను, గుజిలీ పుస్తకాలను శోధించి 330 పదాలను సేకరించి చక్కగా ప్రచురించారు. వాటి తబ్బీళ్లు ఇవి.

మువ్వగోపాల ముద్ర ఉన్నవి	315
విజయరాఘవ ముద్ర ఉన్నవి	12
తుపాకుల ముద్ర ఉన్నవి	3
మొత్తం	330

అయితే ఇందులో ఒక ముద్ర పునరుక్తమైంది. 'ఎంచలేదని యెంచకురా' అనే 83 వ పదాన్నే మళ్ళీ 'ఇంత లేదని యెంచకురా' అని 309 వ పదంగా అచ్చు వేశారు. ఈ అదనాన్ని మినహాయిస్తే విస్సావారు ప్రచురించిన పదాల సంఖ్య 329 అవుతాయి. అప్పారావుగారు 1950 లో ఇవి ప్రచురించారు. మరి రెండేళ్ళకు గిడుగు సీతాపతిగారు అదనపు పదాలను సేకరించి ప్రచురించారు. క్షేత్రయ్య పదాలనే కాక క్షేత్రయ్య పదాలేమో అనే సందేహం ఉన్నవి, క్షేత్రయ్యలాగ వ్రాసిన ఇతర కవులవి కూడా ఇందులో ప్రచురించారు. సందేహమున్నవీ, ఇతరులవీ తప్పిస్తే గిడుగువారు సంపాదించినవాటిలో అచ్చంగా 381 క్షేత్రయ్య పదాలే అని సంఖ్యవల్ల కన బడతాయి. అయితే వాటిలో చాలా పునరుక్తా లున్నాయి. కొన్ని అనుపల్ల వులను పల్లవులుగా భావించడంవల్ల అవి కొత్త పదాలుగా భ్రమపెడతాయి. సీతాపతిగారు తమ ప్రతిని మూడు విభాగాలుగా చేశారు. స్వీయ, పరకీయ, సామాన్య అనే శీర్షికలలో పదాలను విభజించారు. అయితే ఒక భాగంలో ప్రచురించిన పదాలనే ఇంకో భాగంలో మళ్ళీ అచ్చువేశారు. ఈ పునరుక్తాల జాపితా ఇది.

1.	ఏల తెల్లవారె	1_21ని మళ్లా	1_93గా వేశారు.
2.	ఎందుకు బొంకావురా	1_22 ,,	3_26.

3.	ఇటువంటి నావలపు	1_52 అ.ప.తో	1_174 'చిటుకుమన్న కోపం' అనే పల్లవి చేర్చారు.
4.	ఇటువంటివాడ వని	1_55	మళ్లా 3_25గా వేశారు.
5.	ఎక్కడి నే స్తము	1_75	,, 2_16 ,,
6.	తలిరుబోణి వారు	1_162 లోపల్లవి	3_87 'వలచేది ఒకరి కోసం' అ.ప. వేశారు.
7.	ఊరికే చాలము	1_160	2_15గా వేశారు.
8.	విడిచిపోలేక	2_106అనే పదం	3_20 ఈరీతి మదన సామ్రాజ్య మనే పద భాగాలు.
9.	ఎంత లేదని	3_10అనేదేమళ్లా	3_24లో ఎంత లేదని ఇచ్చారు.

ఈ తొమ్మిది పునరుక్తాలు పోగా గిడుగువారి క్షేత్రయ్యపదాలు నికరంగా **372** తేలుతాయి. విస్సావారి ప్రతిలో **329** ఉన్నాయి. రెండింటికీ తేడా **43** పదాలు. అయితే గిడుగువా రిచ్చిన కొత్తవాటిలో **12** పదాలకు ముద్ర లేదు.[1] మిగతా **81** పదాలలో ముద్ర లున్నాయి. వీటిలో 'మంచిదినము నేడే మహరాజుగ రమ్మనవే' అనే సుప్రసిద్ధమైనది కూడా ఉంది **(1-26)**. ఈ అదనపు పదాలలో కంచి వరదునిమీద, శ్వేత వరదునిమీద, సత్యపురి వాసుదేవునిమీద, శ్రీశైలనిలయునిమీద తలొక పదం లభిస్తూంది. క్షేత్రయ్య పదాలలో ఉన్న ఈ ఉపముద్రవల్ల అతడు యేయే క్షేత్రాలను దర్శించాడో తెలుస్తుంది. విస్సావా రీక్షేత్రాలలో కొన్నిటినే వివరించారు. వేదపురి, చలువ చక్కెరపురం, కరిగిరి మొదలైన క్షేత్రాలు వారు గుర్తించలేదు. ఇప్పటివరకు లభించిన పదాలను పట్టి క్షేత్రయ్య చూసిన క్షేత్రాలను జిల్లాలవారీగా తాలూకాల విభజనతో పొందుపరుస్తున్నాను.

---

1. వాటి వివరాలు ఇవి: 1_20, 1_28, 2_68, 2_71, 2_97, 3_2, 3_18, 3_58, 3_62, 3_74, 3_89, 3-94.

క్షేత్రయ్య దర్శించిన క్షేత్రాలు

క్షేత్రం	తాలూకా	జిల్లా	దైవం పేరు	పదాల సంఖ్య	మొత్తం పదాలు
1. కరిగిరి	గుడియాత్తం	ఆర్కాటు(ఉ)	కరిగిరివరదుడు	1_105, 3-10, 3-24	3
2. యెలగిరిమలై	తిరుపత్తూరు	,,	యసుగిరిచెలువరాయడు	1_119, 2_33	2
3. చక్కరాపురం	చెంజి	ఆర్కాటు(ద)	చలువచక్కరపురినిలయుడు	1-39	1
4. కోవిలూరు	కృష్ణాచలం	,,	కోవల్లూరు ముద్దుగోపాలుడు	1_69	1
5. చిదంబరం	చిదంబరం	,,	తిల్లగోవింద	1_41, 1-147, 1-163, 3-17	4
6. తిరువళ్లూరు	తిరువళ్లూరు	చెంగల్పట్టు	తిరువళ్లూరు వీరరాఘవుడు	2_56, 3_11, 3_81, 3_97	4
7. వేదనారాయణపురం	చెంగల్పట్టు	,,	వేదపురినిలయుడు వేదనారాయణుడు	2_86, 3_30	2
8. కంచి	కంచీపురం	,,	(1) కంచి వరదుడు	1-104, 1-106, 1-123 1-136 1-169, 2-18, 2-27, 2_35 2-41, 2_54, 2_82, 3_18, 3_22 3_48, 3_56, 3_68, 3-95	17
			(2) చెవ్వంది లింగడు	1-82, 3_44, 3_48	3

క్షేత్రం	తాలూకా	జిల్లా	దైవం పేరు	పదాల సంఖ్య	మొత్తం పదాలు
9. సత్యవేడు	పొన్నేరి	చెంగల్పట్టు	సత్యపురివాసుదేవుడు	1_180, 2_81	2
10. తిరుపతి	చంద్రగిరి	చిత్తూరు	శ్రీవెంకటరమణుడు	1-105, 2_30, 2_49,2-51	
			శ్రీవెంకటేశుడు	3_72	5
11. కడప	కడప	కడప	కడప వెంకటేశుడు	1_49	1
12 పాలగిరి	కమలాపురం	కడప	పాలగిరి చెన్నుడు	3_51	1
13. ఇనగలూరు	పులివెందల	కడప	ఇనపురిస్వామి	1_14, 1-102	2
14. శ్రీశైలం	నందికొట్టూరు	కర్నూలు	శ్రీనాగశైలమల్లికార్జునుడు	1_139, 2-75	2
15. హంపి?	హోస్పేట	బళ్లారి	హేమాద్రిస్వామి	1_93	1
16. మధుర	మధుర	మధుర	మధురపురీశుడు	1-130	1
17. శ్రీరంగం	తిరుచినాపల్లి	తిరుచినాపల్లి	శ్రీరంగేశుడు	1_86, 1_129	2
18.మహాదేవపట్నం	మన్నారుగుడి	తంజావూరు	(1) ఆదివరాహుడు	1-91,3-1(3-39?)	2
			(2) శ్వేతవరాహుడు	1-113	1

సూచన : ఈ పదసంఖ్యలు 'గిడుగువారి క్షేత్రస్థ్య పదములు' ప్రతిలోని నెంబర్లు.

ఈ పట్టికవల్ల క్షేత్రయ్య రాయలసీమలోనూ, తమిళ జిల్లాలలోనూ మాత్రమే పర్యటనం చేసినట్లు కనబడుతుంది. క్షేత్రయ్య రాయలసీమవాడే అనే ప్రచారంకూడా లేకపోలేదు. ఈ సంగతి చెప్తూ మిత్రులు తిమ్మావజ్ఝుల కోదండరామయ్యగారు ఇలా వ్రాశారు: "కొన్ని అప్రసిద్ధములైనా సాధారణంగా దక్షిణదేశ యాత్రికుని మార్గంలో తగులని గ్రామదైవతములమీద క్షేత్రయ్య పదాలు చెప్పిఉండడంచేత క్షేత్రయ్య ఈ ప్రాంతాలవాడే యేమో అనే సందేహానికి కూడా అవకాశం కల్గుతోంది. క్షేత్రయ్య దర్శించిన స్థలములను బట్టి మాత్రమేకాక ఇతడు తన పదములలో వాడిన భాష, నానుడులు, పదప్రయోగములు, కారకములుకూడ కొన్ని ఇతనికి దత్తమండల ప్రాంతీయతను ధ్రువపర్చు చున్నవి" అని ఉదాహరణ లిచ్చారు.[1] ఒక పదంలో "క్షేత్రయ్య పామాడి జోగివలె పాయెనాబతుకు" అన్నాడు (వి-13). పామిడి అనంతపురం జిల్లాలో ఉంది. ఆ వూళ్ళో మెట్టవేదాంతు లుండే వారట.

క్షేత్రయ్య జీవితంలో మెట్ట వేదాంతం ఉందో లేదోగాని అతని పదాలలో వేదాంతాన్ని చూడడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మువ్వ గోపాలుడు ఒక నాయికతో క్రీడిస్తూ ఆ మంచంమీదకే మరొక ప్రేయసిని రప్పించుకొన్నాడు. మరునాడు నాయిక ప్రశ్నించింది. 'ఇద్దరినందున పవ్వళించిన యింతపే రేమిటిరా? గద్దరి వగల మువ్వగోపాల, గాజుల చప్పుడు నే వింటిగదరా' అంది. ఇందులో నాయిక జీవాత్మ; నాయకుడు పరమాత్మ; నందున పడుకొన్నది మాయ అని వ్యాఖ్యానం కూడా చేస్తున్నారు.[2] మువ్వ గోపాలుడు పరమాత్మ డంటే అంగీకరించవచ్చును. విజయరాఘవనాయకుని వంటి పచ్చినిటుణ్ణి కూడా దేవుణ్ణి జేసిన పెద్ద లున్నారు. "క్షేత్రయ్య తన పదములందు ధ్వనింప జేసిన వేదాంత మిది! విజయరాఘవుడే పరమాత్మ, జీవులు స్త్రీ ప్రాణులు, రాఘవుడు ప్రియతముడు"అని చెప్పినవారే మొత్తం మీద క్షేత్రయ్య పదములలో మోక్ష కామోపేతమైన ఉజ్వల శృంగారము యొక్క ఛాయలు తక్కువ అని వివరించారు.[3]

---

1. భారతి, ఆగష్టు, 1951.
2. విస్సావారి 'క్షేత్రయ్య పదములు' – పీఠిక, 62, 63.
3. సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశము – సంపుటి 3, పుట 163.

క్షేత్రయ్య పదములలో వేదాంతం కోసం వెతకడం ఉత్తశ్రమ! "అలౌకిక మైన భక్తి శృంగారం క్షేత్రయ్య పదాలలో నాకు ఎక్కడా కనపడదు. గోపాల మకుటం వున్నంత మాత్రాన లౌకికం అలౌకికం అవుతుందా?" అని పాకాల రాజమన్నారు గారు నిలదీసి ప్రశ్నిస్తున్నారు.[1] నిజమే. క్షేత్రయ్యలో పచ్చి శృంగారం పరవళ్ళు తొక్కుతుంది. అతని నాయికలు కొంచెకత్తెలు కారు. నమర్తాని నెలపూట లయిన దగ్గిరనుండి కాతంతింటూ కతకర లాడేపచ్చి ఒడ లున్న బాలెంతల దాకా అన్ని వయస్సుల వాళ్ళూ ఉన్నారు. "ఒక్క సారికే ఇలాగైతే ఓ హొ ఇదేమి రతిరా?" అని ప్రశ్నించగలరు (వి.150). "ఇంకొక్క సారి నేనే ఓలలాడింతునో" అని నిర్మొహమాటంగా అడగగలరు[2] (వి. 166). అత్తవారి ఊరికి పోతూ "కత్తికోతగాడు మగ డేమిచేసునొ" అని బాధపడి, పోరాడి యెటులైన బొంకి వస్తాననేవా ళ్లున్నారు (గి. 1-13).

క్షేత్రయ్య నాయికలలో బరితెగించినవాళ్ళు వీళ్ళే కాదు. ఇంకా ఉన్నారు. ఎప్పుడైనా మువ్వ గోపాలుడే దోషం, నీచం అనే పట్టింపులు పెట్టుకో వచ్చు. నాయికలకు మాత్రం ఆ బెడదలు లేవు. 'చెరగుమాని ఉన్నానని యోచన సేయవద్దుర సామి! దొరయైన మువ్వ గోపాల, పరసతులకు దోస మెన్నడు లేదురా' అని హితోపదేశం చేస్తుంది. పైగా 'ఇన్నాళ్ళవలె కాదురా నేటి సుఖ మెరిగితే మరవవురా నా సామి' అని ఊరిస్తుంది (గి. 2-93). అయితే "చెరకు తీపని వేరుతో పెకలించవ'ద్దని చెప్తూ. అత్తింటి కాపురాలు చేస్తారు, 'బొట్టుకట్టిన' వాడింటికీ వెడతారు. చీర చిక్కితే వెదకి వేరు వెల్లంకి తెమ్మంటారు. ఇలాంటి నాయికను చూసి క్షేత్రయ్య ఒక ప్రశ్న వేశాడు:

చూడరె ఆది నడిచే హొయలు నుదతి చేయు జాడలు
ఆడది కులకాంత అత్తింటి కోడలు
అల గోపాలుని విడిదికి వెడలెను. ॥చూడరె॥

---

1. విస్సా వారి 'క్షేత్రయ్య పదాలు'—తొలిపలుకు, పుట VI.

2. ఇనవురి ఉపమాద్రవున్న రెండు పదాలలోనూ ఈ ప్రశ్న లుండడం గమనించదగిన విషయం.

కొండంత కాపురము రానుపోను కోమలి కండలమె
దండున గలిచే మగడు తక్కువేమే
తండ్రికొలివరికి తప్పించ వళమే. ॥చూడరె॥

పాటి కొంగు జారినను సేలియక భయ మించుకయు లేక
తోటివాగు నవ్వుదురని యెంచక
దోచునటె అది గయ్యాళి బల్ జాణ ॥చూడరె॥

అత్త మామ బావమరుదులను తిట్టి అవమానమును గొట్టి
గుత్తగాను మువ్వ గోపాలదేవుని
గూడునటె అది మనిషా మ్రాకా. ॥జూడరె॥

[ఖ. 1_17]

అది మనిషి కాదు, మదనలతలు పూచిన మ్రాకే! క్షేత్రయ్య వనంలో నిత్యం వసంతమే. అతని పువ్వుల చుట్టూ ఉన్న ముళ్ళు చాలా సొంపుగా ఉంటాయి. ఈ ముళ్లు గుచ్చుకొన్నా మెత్తగానే ఉండొచ్చు. అయితే అది వేరే విషయం. క్షేత్రయ్య పదాలలోని అశ్లీలాలను గురించి చర్చ మొదలుపెట్టి సాహిత్య ప్రాడ్వివాకులు పాకాల రాజమన్నారుగారు ఇలా అన్నారు:

"ఈ కాలం వాళ్ళు కొందరు ఈ పదాలలో పచ్చిశృంగారం చాలా ఉందని ఆక్షేపించవచ్చును. ఆ తప్పు (అది తప్పయితే) ఆయనది కాదు; బలహీనులైన ఈ కాలం వారిదే. అజీర్ణ వ్యాధిగ్రస్తునకు పనసకూర అపథ్యమైతే తప్పు పనసకూరదా? మన తాతలు తిన్నంత మనం తిన గల్గుతున్నామా? మన జీర్ణశక్తి తగ్గిపోయింది. జీర్ణశక్తితోపాటు రసాస్వాదనశక్తి కూడా మనకు తగ్గిపోయింది. అంతే! కొన్ని పదాలు విని కొందరు చెవులు మూసుకోవచ్చు. ఏ పదంగాని రసవంతమైతే అశ్లీలం ఎలాగ అవుతుంది? ఇదీ నా సమాధానం."

ఇది తీర్పు! దీనికి అప్పీలు లేదు!!

Acc. No 30653.
Cl. No 7.

L. L. A. BRANCH LIBRARY
D/.....
INTUR

చెంగల్వ కాళయ్య

మెర్ల వెంగళరాజుగారు వ్రాసిన బహుళాశ్వ చరిత్రవల్ల ఆ కాలంలో వేశ్యలకు విద్యా గురువులుగా విప్రు లుండేవారని తెలుస్తూంది. తంజావూరులో రఘునాథ నాయకుని కాలంలో ఉన్న రామభద్రమ్మకు, విజయరాఘవుని కాలంలో రాణించిన కృష్ణాజీకి తెలుగు కవిత్వం నేర్పిన గురువు పేరు చెంగల్వ కాళకవి. ఈయన పాకనాటివాడు; కాళహస్తీశ్వర భక్తుడు. ఇతని తండ్రి ఎవరో శ్రీకంఠునివద్ద మంత్రిగా ఉండేవాడు. ఆయన పేరు వెంకటయ్య. అతడుకూడా కవే. పార్వతీ పరిణయం అనే ప్రౌఢ కావ్యాన్ని వ్రాశాడు. అది నేడు నష్టమైంది. పాకనాటినుండి చెంగల్వవారు ఎప్పుడు తంజావూరు వచ్చారో తెలియదు. 'రణరంగ గంధవారణ' అనే బిరుదు ధరించిన శ్రీకంఠునివద్ద తండ్రి మంత్రిత్వం చేస్తే కాళకవి

తంజావూరులో విద్యా వ్యాసంగం చేశాడు. నాగవాసం లోని జవరాళ్లకు చదువులు చెప్పాడు.

రామభద్రమ్మకు చదువులు చెప్పినా ఈ కవి రఘునాథ నాయకుని దృష్టిలో పడలేదు. ఇతణ్ణి విజయరాఘవుడే ఆదరించాడు. చెలికత్తెలతో పాటు స్వయంగా కాళయ్య ఇంటికి విజయరాఘవుడు విచ్చేసి విందులు ఆరగించి ఇంటిలి పాదికీ బహుమతులు ఇచ్చేవాడు. ఎంతటి భాగ్యశాలి, ఇత డెంతటి ధన్యుడని భావిస్తూ పాండు రాజకుమార్తెవంటి అంతఃపుర కాంతలు కొలుస్తూ ఉండగా, విజయరాఘవుడు ఇతణ్ణి కన్నుల నప్పుకొంటూ అత్యంత బహుకృతులు నలిపేవాడు.

తన ఇంటికి వచ్చే చెలికత్తెలతోపాటు విజయరాఘవుడు వచ్చేవాడో చెప్పలేదు గాని, ఆ నాయకుని మనసు రంజింపజేసే తొమ్మండుగురు నాట్యకత్తెల పేర్లను అతడు 'రాజగోపాల విలాసం' అనే కావ్యంలో చెప్పాడు. విజయ రాఘవుని కొలువులో ముద్దు చంద్ర రేఖ అనే నర్తకి ప్రముఖస్థానం అలంక రించింది. ఈ జాణ వీరవెంకటరాయలవారిని మెప్పించి బిరుదులు పొందింది. ఈమె తంజావూరు వచ్చి, విజయరాఘవ నాయకుని ప్రేయసి అయింది. బహుశా ఈమె మూలంగానే కాళ కవికి విజయరాఘవుని దర్శనం లభించింది కాబోలు. ఆమె సిపార్సువల్లే విజయరాఘవు డీ కాళయ్య రచించిన రాజగోపాల విలాసం అనే కావ్యాన్ని అంకితం పుచ్చుకొన్నాడు. ఆమె మేలు మరచిపోలేక కాబోలు, కాళకవి ప్రతి ఆశ్వాసం చివర అమె పేరు తలుచుకొన్నాడు. విజయరాఘవుని ముద్దు చంద్రరేఖానాథునిగా సంబోధించాడు. రాజగోపాల విలాసాన్ని చంద్రరేఖా చిహ్నితం చేశాడు.

రాజగోపాలుడు మన్నారుగుడిలోని దేవుడు. ఇతడు విజయరాఘవ నాయకుని ఇష్టదైవం. మన్నారుదాసు డనేది విజయరాఘవునికి ఇంకో పేరుగా రూఢి అయింది. ఆ రాజగోపాలస్వామి విలాసాలనూ, ఆ స్థల పురాణాన్నీ అంకితం పుచ్చుకొనడానికి చంద్రరేఖ సిఫార్సు లేకపోయినా విజయరాఘవుడు అంగీకరించేవాడు. అతడు (కీ. శ. 1633 లో గద్దె నెక్కిన వెను వెంటనే అంకితం పుచ్చుకొన్న గ్రంథాలలో ఇది మొదటిది. ఇది అయిదాశ్వా

సాల కావ్యమేగాని ఇందులో 440 గద్య పద్యాలకన్న ఎక్కువ లేవు. అయినా ఈ కావ్యంలో ఒక ప్రత్యేకత వుంది.

మన అలంకార శాస్త్రాలలో శృంగార నాయికలను వివిధ రీతులలో విభాగించారు. అవస్థా భేదాలవల్ల అష్టవిధ నాయికలను అందరూ పేర్కొన్నారు. ఒక్కొక్క నాయిక ఎలా ఉంటుందో, ఏ విధంగా భావిస్తుందో వివరిస్తూ అలంకార శాస్త్రజ్ఞులు ఉదాహరణ లిచ్చారు. నాయికా భేదా లెలా ఉంటాయంటే—

1. గుణమువల్ల— ఉత్తమ, మధ్యమ, అధమ.
2. వయస్సు, [illegible] మధ్యమ, ప్రగల్భ.
3. [illegible]
4. [illegible]
5. [illegible]
6. అవస్థలవల్ల — [illegible] గురు.

Cell : 9392055065

వీళ్లుకాక ఊఢానూఢలు, ఉదాత్త, శాంతలలితలు, సామాన్య, పునర్భువు, స్వైరిణి, రూపాజీవ, గణిక, విలాసినులు అనేక రకాలు, నాయిక, ప్రతినాయిక, ఉపనాయిక అనే బేధాలు ఉన్నాయి. సరస్వతీకంఠాభరణ ప్రకారం నాయికా భేదాలు 32. సాహిత్య దర్పణం ప్రకారం 384 మంది.[1] శాస్త్రరీత్యా ఇన్ని తేడా లున్నా స్వాధీనపతికాది ఎనమండుగురే ప్రసిద్ధులు. ఈ అష్టవిధ నాయికలను ఒకే కావ్యంలో చిత్రించాలని కాళయ్య భావించాడు. కృష్ణునికి ఎనమండుగురు భార్య లున్నారు. ఈ అష్ట మహిషులని అష్టవిధ నాయకలుగా అతడు ఊహించి రాజగోపాల విలాసాన్ని వ్రాశాడు. ఈ కావ్యాన్ని తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంవాళ్లు ప్రచురించారు. నిడుదవోలు వెంకటరావుగారు విమర్శనాత్మకంగా పరిష్కరించి సుదీర్ఘమైన పీఠికను ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ వ్రాశారు. తెలుగులోనూ, సంస్కృతం లోనూ అనుబంధాలు చేర్చారు. ఈ కావ్యం గురించి విపులంగా తెలుసుకొందాం.

---

1. ప్రతాపరుద్ర యశోభూషణం (నాయికా ప్రకరణం)-చలమచర్ల రంగాచార్యులగారి రచన, పుట 31.

రాజగోపాలుని పట్టమహిషులలో ప్రతిఒక్కరూ కృష్ణుడు తమనే వలచాడని తమకంలో భావించుకొనేటట్లు ఆయన వారిని ఆనందవార్ధిలో తేల్చాడు. అష్టవిధ నాయికల లీలలు అలరగోరి ఆ అష్ట మహిషులను, ఆ జాడలను కృష్ణుడు అనువుపరచాడు. ఒకరికి తెలియకుండా ఇంకొకరి వద్దకు దూతులను పంపించాడు.

తనమీద నేరం మోపి, ఎంత వేడుకొన్నా అలుక తీరకుండా రుక్మిణి ఉన్నదని తెలిసి ముందు ఆమె మేడలోనికి వెళ్లాడు. పొంచి అక్కడి సంగతులు విన్నాడు. రుక్మిణి బాధపడుతోంది. "ఎందుకు కొండెములు విన్నాను! ఎందు కతనితో దెబ్బలాడాను? ఇప్పు డెలాగ వేడుకొంటాను," అని పశ్చాత్తాపం చెంది ఇలా తలపోసింది:

చెలువుడ నీవు నా డచట చెక్కులపై కొనగోర కస్తురిన్
వలపున మన్మథాంకములు వ్రాయుచు నేర్పిన నాటనూదినన్
చెలులు కనుంగొనంగ జడచే నిను కొట్టిన యట్టి నేరముల్
తలపున నిల్పి నీవు దయతప్పిన నిప్పుడు తాళనేర్తునే?

[రాజగో. 1_104]

ఈ విధంగా బాధపడే శృంగార నాయికను కలహాంతరిత అంటారు. సర్వజ్ఞ సింగభూపాలుడు రసార్ణవ సుధాకరంలో ఇలా నిర్వచించాడు:

యా సఖీనాం పురః పాదపతితం వల్లభం రుషా,
నిరస్య పశ్చా త్తపతి కలహాంతరితా తు సా.

[రంజనోలాసం, 1_32]

చెలులయెదుట తన పాదాలపై బడ్డ నాయకుణ్ణి తిరస్కరించి తరువాత పశ్చాత్తాపం పొందేది కలహాంతరిత. రాజగోపాల విలాసంలో రుక్మిణి అవస్థ ఈ లక్షణాలకు సరిపోతుంది. అయితే కావ్య పరిష్కర్తలు ఇక్కడ రుక్మిణిని స్వీయ అని పేర్కొన్నారు.[1] అష్టవిధనాయికా భేదాలలో స్వీయ

---

1. ఒక చోట కాను, రెండు చోట్ల-గ్రంథంలో 1_92 పై ఉపశీర్షికలోనూ, పీఠిక 45 పుటలోనూ రుక్మిణి స్వీయగా పేర్కొనబడింది.

అనే పేరు ఉండదు. ఈ కావ్యంలో కాళకవి అవస్థావిభాగంలోని అష్టవిధ నాయికలనే తీసుకొన్నాడు. అదీకాక శ్రీ కృష్ణుని భార్యలు ఎనమండుగురూ స్వీయతేగాని పరకీయలు గారు. రుక్మిణినే స్వీయగా పేర్కొనడం తప్ప.

చెలులముందు నాథుని చులకనచేశా నని బాధపడుతున్న రుక్మిణి ఇంకా ఇలా బాధపడింది:

వాటములైన బంగరు కవాటములం గలయట్టి యందముల్
నీటున మీటు నీయురము నిండగ గుబ్బల నాని పల్ మొనల్
నాటగ నొక్కి చొక్కి జతనంబున వాతెర తేనె యూనకే
మాటల దీరునా యువతి మన్మథ మన్మథతాపవేదనల్?

[రాజ. 1_110

ఆమె మన్మథ తాపాన్ని తీర్చాలని కృష్ణుడు కనికరించాడు. కలసి కీడించాడు. ఇక్కడ రుక్మిణి ఇంట ఆలా ఉండగా భద్ర ఇంట్లో ఆమె నొక దూతిక కలుసుకొంది. 'నువ్వు వచ్చేదాకా సురపొన్నలపజ్జ తేటమించు తెలివాకల మావిమూకల గొజ్జంగి పరిమళాల మధ్య స్వామివారు ఉంటా మన్నారు' అని సంకేతం చెప్పి,

సమయోచిత శృంగారము_సముచితముగ బూనవమ్మ సారసముఖి నీ
రమణుడు నాతో చెప్పిన_సమయస్థలి చేర నిపుడె చనవలయుజుమా!

[రాజ. 2_13]

అని దూతిక హెచ్చరిక చేసింది. భద్ర అలంకరించుకొని వెళ్లింది. ప్రియుని కలుసుకొనడానికి వెళ్లే శృంగార నాయికను అభిసారిక అంటారు. కాని ఈ కావ్య పరిష్కర్త నిడుదవోలు వెంకటరావుగారు భద్ర 'జారిణి' అని 2-4 పైన ఉపశీర్షికలో అన్నారు. పీఠికలో ఈమె కలహాంతరిత అన్నారు (పుట 45). రాజగోపాల విలాసంలోని పద్యాలను సరిగా పరిశీలిస్తే రుక్మిణే కలహాంతరిత అనీ, భద్ర అభిసారిక అనీ తెలుస్తుంది. జారిణి అనే పేరు అష్టవిధ శృంగార నాయికలలో లేదు. కట్టుకున్న భార్య తన కాంతుణ్ణి కలుసుకోడానికి వెడితే జారిణి ఎలా లవుతుంది? అభిసారికగా భద్ర తనను కలుసుకోవచ్చేలోపున సంకేత స్థలంలో కృష్ణుడు విరహాన్ని అనుభవిస్తాడు.

'క్రీగన్నుల నవ్వునట్టి కలకంఠిని కౌగిట చేర్చుటెన్నడో' అని పలవరిస్తాడు. ఆమె చూపులం దంటిన తన మనస్సు మరలడం లేదంటాడు.

విరహిజనులపై వేట వెడలు మరుని
జిగురు గండెలు కాబోలు చెలువచూపు
లందు గట్టిగ నంటిన యట్టి నాదు
మనసు మరలకయున్న దేమనగ నేర్తు? [రాజ. 2_22]

అంతలో ఆ సంకేత స్థలానికి అభిసారిక భద్ర వచ్చింది. నాయికా నాయకులు క్రీడించారు.....వారి బడలికలు ఆ పరిసర కాసారతీరంలో ఉండే హంసలు రెక్కల విసనకర్రలతో హరింపజేశాయి. ఇక్కడ ఇలా ఉండగా, లక్షణ, కాంతుడు వస్తాడని ఇల్లంతా అలంకరించింది. ఒళ్లంతా ముస్తాబు చేసుకొంది. నాయకునికోసం అలంకరించి ఎదురుచూసే నాయికను 'వాసక సజ్జిక' అంటారు. స్త్రీల గృహద్వారాన్ని వాసకమని భరతముని చెప్పాడు. వంతు దినాన్నికూడా వాసకము అంటారు. రాజగోపాల విలాసంలో లక్షణ ఆ నాడు తన వంతు దిన మని అలంకరించుకొంటుంది...

వారము నేడె యంచు యనువల్లభు రాకను గోరి లక్షణా
సారసగంధి కేళిమణిసౌధము తా గయిచేసి వేడుకన్
హారపదాంగద ప్రముఖ హారిణియై తపనీయ మందిర
ద్వారమునందు నిల్వ నొక వారిజలోచన చేరి యిట్లనెన్.[రాజ. 2_42]

ఆ చెలికత్తెను లక్షణ నాయకునివద్దకు పంపింది. అతడు వచ్చాడు. ఆమెతో భాషించి క్రీడించాడు. అంతలోనే ఒక ప్రణయకలహం వచ్చింది. 'లోలాక్షీ, నీ కటాక్ష సరసాలోకంబులో కాళిందీసవిలాస వైఖరుల జోకల్ మించె' అని కృష్ణుడు అన్నాడు. సవతి పేరు ఎత్తినందుకు లక్షణ ముఖం చిన్నబుచ్చుకుంది. ఎడమోము పెడమోమై ఏకశయ్యను విరహతాపంలో మగ్గిపోయారు. అతడు చివరకు అనునయించాడు. ఈ కావ్యంలో లక్షణను వాసకసజ్జికగా కవి చిత్రించినా ఆమెకూడా 'జారిణి' అని పరిష్కర్తలు 2-42 పద్యంపై ఉపశీర్షికలో ప్రకటించారు.

లక్షణ నా్టివిధంగా తేలించిన కృష్ణుడు జాంబవతి ఇంటికి వెళ్లాడు. ఆమె దూతికతో చెప్పే మాటలను వినాలని చిగురాకు జంపాల నందున దాగాడు. అతడు వస్తాడని రాలేదు, వంచించాడు. 'చెలువుని వంచనకు తనదు చిత్తములోన' బాధపడుతూ జాంబవతి వాపోయింది. ఈ విధమైన శృంగారనాయికను విప్రలబ్ధ అంటారు. కావ్యాలంకార చూడామణిలో విన్న కోట పెదన ఇలా నిర్వచించాడు:

పంచిన యొడ కేతెంచక_వంచించిన దయితుతో వివాదము సంపా
దించి చెలితోడ్తదుఃఖో_దంచితయగు విప్రలబ్ధ తత్వరబుద్ధిన్.

[చూడామణి, 3_70]

ఈ లక్షణానికి సరిపోయేటట్లు జాంబవతి దూతికతో తన గోడు వెళ్ల బోసుకుంటూంది. 'వల్లభు డాడు మాట నెరవంచన యంచు తలంచనైతిని' అంటుంది.

మగవారికి కల గుణముల_మగువల కలపించు దనుక మమకారంబుల్
మగువలు వలచినపిమ్మట_దగవులు మరి వేరె కావ తామరసాక్షీ!

[రాజ. 3_12]

ఈ విప్రలబ్ధ తన భర్త నిలా నిందిస్తే చెలికత్తె ఊరడించి "కుల కాంతల్ పతినేర్పు నేరముల కెగ్గుల్పట్టి పల్లార్తురే," అని హితోపదేశం చేసింది. ఆ తరువాత కృష్ణుడు వచ్చాడు. ఆమెను అనందింప జేశాడు. జాంబవతితో క్రీడించిన గుర్తులతోనే కృష్ణుడు మిత్రవింద ఇంటికి వెళ్లాడు. అతని ఆకారాన్ని చూసి మిత్రవింద కోపించింది.

చెక్కుట గోరులున్ నిదురచిన్నెలు చూపెడి వాలుచూపులున్
బుక్కుటి వీడియింబును గుబుల్కొను మేను జవాదివాసనల్
కెక్కులు చూపి మీన్ బిరుదు కెక్కుము వాని విలాసవైఖరిన్
జొక్కుచువచ్చినీ నాయకుని చూసి కషాయితలోచనాంతయై.

[రాజ. 3-29]

హేతుగర్భంగా చీవాట్లు పెట్టింది. అన్యకాంతతో క్రీడించి వచ్చిన పతిని చూసి కోపించే నాయికను ఖండిత అంటారు. మిత్రవింద అన్న మాట లన్నీ విని ఆమె నెలాగో అనునయించి కృష్ణుడు ఆమెతో రమించాడు. తరు

వాత విరహదురంతమైన సుదంతను చూడాలని వెళ్లాడు. ఆమె ఎలదోటలో ఒ> మనోహరమైనచోట చలువగంధపు గిన్నెలు, తాటాకు విసనకర్రలు, తామరతూళ్లు మొదలైనవి పట్టుకొని చెలికత్తె లామెని ఊరడిస్తున్నారు. 'సొలపుల్ మీరగ వాడు వచ్చి కను మెచ్చుల్‌చేయ డేమందునే!' అని ఆమె విచారించింది. ఆతని దోషాలు లెక్కించుదా మనుకొంది.

అతనిపై నేరముల నెన్నునట్టి వేళ
నతని సద్గుణములే యాత్మ దోచు
మమత లిటువంటి వతనికి మరులుకొంటి
తామసించిన నింక నే తాళజాల. [రాజ. 3_69]

కాంతుని శంకించక, రాత్రంతా అతని ఎడబాటుకి విలపించే నాయికను 'విరహోత్కంఠిత' అంటారు. కావ్యాలంకార చూడామణిలో విస్నకోట పెద్ద రాజు ఇలా నిర్వచనం చెప్పాడు:

వరుడనురక్తుం డయ్యు ని _ తరమగు పని గలిగి రాక తడయుట విభా
వరియందు నడలు పొలతుక_విరహోత్కంఠిత యనంగ విశ్రుతికెక్కున్.
[చూడామణి, 3_64]

సుదంత ఇలాగ విరహవేదన పొంది చంద్రుని, మన్మథుని. చల్లగాలిని నిందిస్తుంది. ఆ తరువాత రాజగోపాలుడు వచ్చి ఆమెను రతులలో తేల్చు తాడు. ఆ పిమ్మట కాళిందివద్దకు దూతికను పంపించాడు. తను పొరు గూరు వెడుతున్నట్లు వర్తమానం తెలియజేశాడు. ఆమె ఇలా బాధపడింది:

వద్దకు వచ్చు నాధు డను వార్తలు నీ వన నమ్మిరాముండి యే
నద్దమ రెయిదాక నడియాసల నాతని రాక గోరగా
ప్రొద్దుగ్రోదు నన్ను మరి ప్రోషితభర్తృక గా నొనర్చి యే
గద్దరిసుద్దు లెంచి వడిగా జనెనో హరి గొల్లపల్లెకున్? [రాజ. 4-6]

మగడు వేరే స్థలానికి వెళ్లినప్పుడు వియోగానికి విలపించే నాయికను ప్రోషిత భర్తృక అంటారు. ఈ లక్షణానికి సరిపోయేటట్టు చిత్రించడానికి శ్రీకృష్ణుడు గొల్లపల్లెకు వెళ్లా డనే భావాన్ని కాళిందికి చెంగల్వ కాళకవి కల్పించాడు. ఇమె ఇలా విలపిస్తుంది:

పలుకుల దెచ్చుకోల్వలపు పై బచరించుచు వింత వింతలౌ
పలుకుల లేని మచ్చికల గూర్పుచు నైతవనర్మ మర్మముల్
సొలపుల జూపు జంతలకు జొక్కుదు రింతయొ కాక గట్టిగా
వలచినవారిపట్ల మగవారల కెక్కడి మోహమక్కటా! [రాజ.4-8]

నిజానికి కృష్ణునికి ఆమెమీద మోహ ముంది. కొంతసేపు ఆమెను కోపింపనిచ్చి కృష్ణుడు అక్కడకు వచ్చి ఆమెను అనురాగంతో తేలించాడు. అక్కడినుంచి అతడు సత్యభామ ఇంటికి వెళ్లాడు. వచ్చిన కృష్ణునికి ఆమె ఎదురువెళ్లి....కైదండ తీసుకొని రాజసంతో కెంపుల మేడకు తీసుకువెళ్లింది. ఆడలో పూలపాన్పుపై కూర్చుని సరస సల్లాపా లాడుకొన్నారు. వరుడు కైవసమైన నాయికను స్వాధీనపతిక అంటారు. సత్యభామకు కృష్ణునికి నమాను రాగాలు కల్గాయి. వాళ్లు ఆనందాబ్ధిలో ఓలలాడారు. అంతటితో తెల్లవారింది. రాజగోపాల విలాసంలో అష్టమహిషులను ఇలాగ అష్టవిధ నాయికలుగా చెంగళ్వ కాళకవి రూపొందించాడు. ఇవాళ సాధారణ ప్రజల ఉద్దేశ్యంలో నత్యభామ ఖండితగా, కలహాంతరితగా కనబడుతుంది. రుక్మిణిని నిత్య స్వాధీనపతికగా ఊహించుకుంటాం. అయినా కాళకవి సంతుష్టితాత్మగా సృష్టించాడు.(అత డే నాయికను ఏమహిషిని రూపొందించాడో ప్రక్క పుటలోని పట్టికలో క్రోడీకరించాను.)

ఈ విధంగా నాలు గాశ్వాసాలలో అష్టవిధ నాయికలుగా అష్టమహిషులని చిత్రించాక .29 పద్యాలలో ద్వారకానగరాన్ని వర్ణించాడు. పంచమాశ్వాసంలో దక్షిణ ద్వారకగా పేరుగాంచిన మన్నారుకోవెల స్థల పురాణాన్ని, మహత్వాన్ని వర్ణించాడు. ఈ క్షేత్ర మహాత్యం బ్రహ్మాండ పురాణంలోని విష్ణు క్షేత్ర ఖండం ఉత్తర భాగంలో ఉంది.

ఈ కవిగురించి నిడుదవోలు వెంకటరావుగారు పీఠికలో చాలా ప్రశంసించారు. "ఈతని సమానరచన నన్నయ శ్రీనాథుల రచన దలపించును', "నన్నయవలె మత్తేభ వృత్తము నడిపించుటయందు కాళకవి గట్టివాడు. వస్తువర్ణన గావింపక భావస్ఫోరణీయముగా సంభాషణమూలముననే శృంగార రసావిష్కరణము కావించిన కాళకవి ప్రతిభ యనమానమైనది"[1] అని

1. రాజగోపాల విలాసం, పీఠిక, 46. 47, 48.

మెచ్చుకున్నారు.గాని వారి మాటలు"వ్రతానాము త్తమం వ్రత మనున్యాయము బడి చెప్పిన మాటలని తోచుచున్న"దని నేలటూరివారు అన్నారు.[1]

వరుస	మహిషి	నాయిక	లక్షణం	ఆశ్వాసం పద్యం
1.	రుక్మిణి	కలహాంతరిత	మొదట ప్రియుని తూల నాడి పశ్చాత్తాపం పొందేది.	ప్రథమ. 92_125 (34పద్యాలు)
2.	భద్ర	అభిసారిక	ప్రియునివద్దకు వెళ్లేది.	ద్వితీ. 3_40 (38పద్యాలు)
3.	లక్షణ	వాసకసజ్జిక	ఇళ్ళు వళ్ళు అలంక రించుకొనేది.	ద్వితీ. 42_79 (38పద్యాలు)
4.	జాంబవతి	విప్రలబ్ధ	ప్రియుడు వస్తానని రాక పోతే వంచితురాలైనది.	తృతీ. 3_27 (25పద్యాలు)
5.	మిత్రవింద	ఖండిత	అన్యకాంతతో గడిపి వచ్చిన వాణ్ణి చూసి కోపించేది.	తృతీ. 28_55 (28పద్యాలు)
6.	సుసంద	విరహో త్కంఠిత	అనురక్తుడైన ప్రియుని ఎడబాటుకు బాధపడేది	తృతీ. 56_84 (28పద్యాలు)
7.	కాళింది	ప్రోషిత భర్తృక	పొరుగూరు వెళ్ళిన భర్తకై విచారించేది.	చతుర్థ. 3_26 (24పద్యాలు)
8.	సత్యభామ	స్వాధీనపతిక	భర్తను స్వాధీనం చేసు కొన్నది.	చతుర్థ. 27_50 (24పద్యాలు)

1. మధుర తంజావూరు నాయక రాజులనాటి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర_నేలటూరి వెంకటరమణయ్య, పుట 33.

కాళయ్య కవిత్వంలో స్వతంత్ర కల్పన లేమీ లేవు. వివిధ అలంకార శాస్త్రాలలో వివరించిన అష్టవిధ నాయికల మనోభావాలను మించి ఇతడు చెప్పినది ఆట్టే లేదు. ఇతని పద్యం కుంటదు.గాని సమాస కల్పనలలో శ్రీనాథునిలాగా ప్రదర్శింప లేడు. రఘునాథ నాయకుని కాలంలో ఉన్నా, అప్పుడు రాణించక, విజయరాఘవుని కొలువులో సత్కారాలు పొందడంలోనే కాళయ్య ఎంతటివాడో తెలుస్తుంది. సాధారణ కవులు రఘునాథుని విద్యల మెప్పింప శక్యం కాదని చేమకూర వెంకటరాజుగా రన్న మాటలు సత్యం.

18

రామభద్రమ్మ, రంగాజమ్మ మరికొందరు



ని దేవతగా ఒక పక్క ఆరాధిస్తున్నా నిత్య జీవితంలో ఆమెకు ఇవ్వవలసిన స్వాతంత్ర్యాన్ని గాని, సముచిత స్థానాన్నిగాని, మన పూర్వులు ఇవ్వక పోవడంచేత మన సాహిత్యంలో మహిళా రచయితలు ఇవాళదాకా కొద్ది సంఖ్యలోనే కనబడతారు. తెలుగులో కవిత్వం చెప్పిన తొలితరం ముత్తయిదువులను వేళ్లమీదనే లెక్కపెట్టవచ్చు. నాయకరాజుల యుగం మొదలయ్యేదాకా, ఎంతసేపు లెక్కించినా, తాళ్లపాక తిమ్మక్క, మొల్లమాత్రమే కావ్యాలు వ్రాసినట్టు తేలుతుంది. చాటువులు చెప్పిన ఒకరిద్దరినికూడా కలుపుకోవచ్చు. ఖడ్గ తిక్కన భార్య చానమ్మ, అతని తల్లి పోలమ్మ చెరొక చాటువూ చెప్పారని సంప్రదాయంవల్ల తెలుస్తూంది. యుద్ధంలో ఓడిపోయి వచ్చిన భర్తను నులకమంచం చాటున, చిరుబంతి

పసుపాడమని చానమ్మ ఏర్పాటు చేసింది. ఈ అవమానానికి అతను వగచినప్పుడు ఆమె ఈ క్రింది పద్యం చెప్పిందట.

పగరకు జిక్కిచ్చినచో - నగరే నిను మగతనంపు నాయకు లెందున్
ముగురాడవారమైతిమి - వగపేటికి జలకమాడ వచ్చినచోటన్?

గోరుచుట్టుమీద రోకటిపోటులాగ, భార్య చేసిన పరాభవం చాలదన్నట్టు, విస్తట్లో అన్నం పెట్టి విరిగిన పాలు వడ్డించిన తల్లి ఇలాగ సంజాయిషి చెప్పిందట:

అసదృశముగ నరివిరుల - మసిపుచ్చక విరిగివచ్చు ముగపంద్రక్రియన్
గసవున్ మేయగ బోయిన-పసులున్ విరిగినవి తిక్క! పాలుక విరిగెన్.

ఈ చాటువులను చెప్పిన అత్తా కోడళ్లు మన తొలి తెలుగు రచయిత్రులని కొందరు భావిస్తున్నారు.[1] ఈ చాటువులు చెప్పిన కాంతల కాలం క్రీ. శ. 1260 ప్రాంతాలు. తాళ్లపాక తిమ్మక్క 1460 ప్రాంతాలలో ఉంది. అంటే రెండువందల సంవత్సరాలదాకా చాటువులు చెప్పే మగువల పేర్లు సైతం మరుగున పడ్డాయన్నమాట. తిమ్మక్క తరువాత నూరేళ్ళకు మొల్ల పేరు వినబడింది. ఆ తరువాత ఓ ముప్పాతిక శతాబ్దం పైన క్రీ. శ. 1630 ప్రాంతాలలో పసుపులేటి రంగాజమ్మ ప్రముఖ రచయిత్రిగా పేరు పొందింది. ఆమె వ్రాసిన కావ్యాలు నాలుగైదు తెలుస్తున్నాయి. రెండు అచ్చు పడ్డాయి. తంజావూరు సాహిత్య భవనంపైన రంగాజమ్మ పేరు రమణీయ పతాకంగా రెపరెపలాడుతుంది. ఆమెకు విజయరాఘవ నాయకుడు కనకాభిషేకం చేశాడు.

కావ్యాలు వ్రాసి, కనకాభిషేకం చేయించుకొని తెలుగులో రంగాజమ్మ ప్రసిద్ధురాలైనా, ఆమెకుముందు తంజావూరులో రచనలు చేసిన విదుషీమణులు, కనకాభిషేకం చేయించుకొన్న కవయిత్రులు లేకపోలేదు. రఘునాథ నాయకుడు మధురవాణి అనే రచయిత్రికి కనకాభిషేకం చేశాడు. ఆమె

---

1. అఖిల భారత కవయిత్రులు - ఓటుకూరి లక్ష్మీకాంతమ్మగారి సంకలనం, పుట 52.

సంస్కృతభాషలో సుందరకాండదాకా రామాయణాన్ని వ్రాసింది. ఆ కావ్యం తొమ్మిదోసర్గచివర తాను 'మాధుర్యైక ధురంధరాంధ్ర కవితా నిర్మాణ నమ్మాన్య' నని చెప్పుకొంది. అయితే ఆమె వ్రాసిన ఆంధ్రకవిత ఏమీ మనకు దక్కలేదు. మధురవాణి అశేషప్రజ్ఞ గల విదుషిమణి. ఘటికార్ధంలో నూరు శ్లోకాలు నిర్మించగలదు. సద్యోవిస్మయం కల్గించే కవిత్వం-అందులోనూ నిరో ష్ఠ్యంగా-చెప్పగలదు. ఆశువుగా షడ్భాషా రచనలు చేయగలదు. రఘునాథ నాయకుడు తనకు స్వర్ణాభిషేకం చేశాడని ఈమె తన రామాయణం పద కొండో సర్గ చివర చెప్పుకొంది.

మధురవాణిలాగ కనకాభిషేకం చేయించుకోకపోయినా రఘునాథుని మన్నన పొందిన మరొక కవయిత్రి పేరు రామభద్రాంబ. ఈమెకూడా మధురవాణిలాగ ఆశు కవిత్వంలో దిట్ట. తాను 'శతలేఖిని సమసమయలేఖినీయాష్టభాషా కల్పిత చతుర్విధ కవితానుప్రాణిత సాహిత్య సామ్రాజ్య భద్ర పీఠారూఢ' నని చెప్పుకొంది. ఈమె పన్నెండు సర్గలలో 'రఘునాథ నాయకాభ్యుదయం' అనే చారిత్రక కావ్యాన్ని సంస్కృతంలో వ్రాసింది. 900 శ్లోకా లున్న ఈ గ్రంథం నాయకరాజుల చరిత్రను తెలుసుకొనడానికి మన చరిత్రకారులకు పనికివస్తూంది. ఈమె చెంగల్వ కాళకవి అనే తెలుగు కవి శిష్యురాలు. మధురవాణితోపాటు ఈమె రఘునాథ నాయకుని విద్యా వినోదాలలో పాల్గొనేది.

ఆ పదుచు లిద్దరూ ఆంధ్ర గీర్వాణ ప్రాకృత సమస్యలు పూరించ డానికి ఉబలాటపడేవారు. రఘునాథ నాయకుడు కొల్వుదీరి, ఆ సభలో అష్ట భాషా కవిసార్వభౌములచేత వాళ్ళను పరీక్షింపజేసేవాడు. "అమ్మయ్య! స్వామినగర లక్ష్మ నరస్వతులు సాక్షాత్కరించి యుండగా పరీక్ష లెందుకయ్య? అయినను మీ రానతిచ్చిన మీరరాదు" అని ఆ కవిరాజులు రాజుతో చెప్పి పరీక్షించేవారు. 'రారాజని యచ్యుతేంద్రు రఘునాథనృపా' అనే తెలుగు సమస్యను రామభద్రమ్మ ఇలా పూరించిందట.[1]

ఏరీ నీ సరిరాజులు - భూరమణులు నిన్ను జూల బొగడుదురు భళీ
స్వారాజని రేరాజని - రారాజని యచ్యుతేంద్రు రఘునాథనృపా!

1.రఘునాథ నాయకాభ్యుదయం (యక్షగానం)—కర్త: విజయ రాఘవ నాయకుడు, పుట 19.

రఘునాథ నాయకుని ఆస్థానంలో ఎందరెందరో తెలుగు కవయిత్రు లున్నా వాళ్ళ రచనల మింజుమలె ఈ ఒక్క సమస్యమాత్రమే మనకు లభిస్తూంది. విజయరాఘవ నాయకుని కాలంలో వెలసినవాళ్ల రచనలు మాత్రమే గ్రంథరూపంలో దొరుకుతున్నాయి. అయితే అందరి రచనలూ లభించడం లేదు. విజయరాఘవ నాయకుని ఆస్థానంలో కృష్ణాజీ అనే కవ యిత్రి ఉండేది. ఈమెకూడా రామభద్రమ్మలాగే చెంగల్వ కాళకవి శిష్యు రాలు. ఈమె గొప్పతనాన్ని గురువుగారే తాను వ్రాసిన కావ్యంలో ఇలా ప్రశం సించారు:

ప్రస్తారసంఖ్యను పదమూడు కోటులు నలువదిరెండు లక్షల పదేడు
వేలు నేభ్నూఱును వింశతియును నాఱు వృత్తంబులందు నీ వృత్తమునకు
నీవర్ణన సమస్య నీవు కూర్పు మటన్న నావృత్తమున సమస్యను రచించి
యందుకు శ్లోకంబు లాశువుగా జెప్పి యవి తెలుంగునను పద్యములుచేసి
ఇరువదారును ఛందంబు లెరిగి యిట్లు_కవిత చెప్పినవార లీ భువిని కలరె
యనుచు నందరు వినుతింపఘనత గాంచె-కీర్తనీయగుణాలంబ కృష్ణమాంబ.

[రాజగోపాల విలాసం, 1_27]

13,42,17,726 వృత్తాలలో అడిగిన వృత్తంలో కోరిన సమస్యను రచించి, దానికి శ్లోకాన్ని చెప్పి అది తెనిగించగల్గిన ప్రతిభ కృష్ణాజీకి ఉందట. ఇంతటి సామర్థ్యమున్న ఈ కవయిత్రి వ్రాసిన గ్రంథా లేవీ మనకు మిగలలేదు. ఈమె విజయరాఘవుని కొలువులో ఇతర విదుషీమణులతో పాటు వసంతకేళిక వినిపించేదని రంగాజమ్మ వ్రాసిన వాక్యాలవల్ల తెలుస్తోంది.

మరియు నా దండ నిస్తుల గుణప్రశస్తయగు కస్తురమ్మయు, నతి విశాల నయనాంబుజయగు యంబుజ వల్లెమ్మయు, విశదగుణరేఖయగు శశి రేఖమ్మయు, ప్రఖ్యాత కీర్తిగల మోహనమూర్తమ్మయు, సరసగుణ నిష్ణాత యగు కృష్ణాజమ్మయు... మొదలుగా గల కాంతామణులు సంతసంబున వసంతకేళిక వినిపింప... [మన్నారుదాస విలాస ప్రబంధం, 1_15]

....విజయరాఘవుడు కొలువులో ఉండేవాడు. అందులో 'తాము రచించిన సరస మధురంబులగు ప్రబంధములు' ఆ వెలదులు వినిపించేవారు. ఇటువంటి సభలోనే ఒకనాడు విజయరాఘవ నాయకుడు కూర్చుని రంగాజమ్మను చూసి ఆమె నొక కావ్యాన్ని వ్రాయమన్నాడు.

అయ్యాదినము రామభద్రమ్మ మధుర-వాణీకాంబయు సరసగీర్వాణభాష
సిద్ధికృతులను రచియించి యిలను గీర్తి-చాల గాంచిరిసుకవులుసన్నుతింప.

[మ. దా. విలాస ప్రబంధం, 1_18]

ఎటువంటి కావ్యం వ్రాయాలో విజయరాఘవుడే నిర్దేశించాడు. ఇతి వృత్తాన్ని ఆదేశించాడు.

శృంగారైక రసంబులౌపదములన్ చెల్వొంద మెప్పించితో
సంగీతజులు మేలునా నుభయభాషాచాతురిన్ నీ వికన్
రంగత్కౌశిఖి ప్రబంధ మొక్కటి యొనర్పంగావలెన్ మత్కథన్
రంగాజీ! భవదీయ వాగమృత ధారావైఖరుల్ మీరగన్.

[మ. దా. విలాస ప్రబంధం, 1_19]

నిండు కొలువులో అందరిముందూ విజయరాఘవుడు ఇలా ఆదేశించగానే రంగాజీ 'ధన్యోస్మి' అనుకొంది. దానికి కారణం ఉంది "....మద్భర్తవు, మహీభర్తవు నైన స్వామి సకల విద్యా విశేషంబుల నవతులేని నా నవతులైన యింద రిందుముఖుల ముందరనుం గటాక్షించి యింపుమీర గృతి నిర్మింపుమని యానతిచ్చిరి. (మ. దా. వి. ప్రబంధం 1-20) ఈ వచనంవల్ల విజయరాఘవ నాయకుని భోగపత్నులలో రంగాజమ్మ ఒకర్తె అని తెలుస్తూంది. ఆమె పసుపులేటి వెంకటాద్రి కుమార్తె. అప్పటికే ఆమె రామాయణ భారత, భాగవతాలకు సంగ్రహాలు వ్రాసింది. ఈమె ఎవరి శిష్యురాలో తెలియదుగాని తాను అసాధారణ ప్రతిభావంతురాల నని చాటుకొంది. ఆమె వ్రాసిన గ్రంథాల చివర చెప్పిన గద్యవల్ల ఆమెవైదుష్యం తెలుస్తుంది. ఆమె ప్రజ్ఞ లివిః

1. అనుక్షణ ప్రవర్ధమాన సారస్వత ధురీణ.
2. విచిత్రతర పత్రికాశత లిఖిత వాచి కార్థావగాహన ప్రవీణ.
3. తత్ప్రతి పత్రికా శత స్వహస్తలేఖన ప్రశస్తకీర్తి.
4. శృంగార రసతరంగిత పద కవిత్వ మహనీయ మతిస్ఫూర్తి.
5. అతులితాష్ట భాషా కవితా సర్వంకషా విశేష విశారద.
6. రాజనీతి విద్యా విశారద.

ఇన్ని ప్రజ్ఞ లున్నట్టు చెప్పుకున్నా మన్నారుదాస విలాసం అనే ప్రబంధాన్ని వ్రాయడంలో ఆమె ప్రతిభ అంతటినీ వినియోగించినట్టు లేదు. ఇది అయిదాశ్వాసాల కావ్యం. తంజావూరు పాలకుడైన విజయరాఘవ నాయకుడు ఒకనాడు రాజగోపాలస్వామివారి తిరువీధి మహోత్సవాన్ని తిలకించాడు. అప్పు డతణ్ణి కాంతిమతి అనే రాజకుమార్తె చూసి మోహిస్తుంది. ఎన్ని శైత్యోపచారాలు చేసినా మదనతాపం తీరదు. ఆ జవరాలు తన చెలికత్తెను విజయరాఘవునివద్దకు రాయబారం పంపిస్తుంది. నాయకుడు కూడా నాయికను చూసి అనురక్తు డయ్యాడు. అతని మోహాన్ని తెలుసుకొన్న గురువు శతక్రతు శ్రీనివాస తాతాచార్యులవారు ఈ ప్రేమకు పూర్వ జన్మలోని ఒక సంఘటన కారణం అని ఒక కథ చెప్తాడు. అది బ్రహ్మాండమైన అబద్ధం. అతిశయోక్తి. వినండి :

ద్వాపరయుగంలో శ్రీ కృష్ణపరమాత్ములవారు సూర్యుని కుమార్తె అయిన కాళిందిని పెళ్లి చేసుకున్నారు. ఇది చూసిన చంద్రుడు ఊరుకోలేక పోయాడు. 'సూర్యునికన్నా నే నేం తీసిపోయాను? నా కూతుర్ని కూడా స్వామివారు పెళ్ళాడాలి' అనుకున్నాడు. శ్రీకృష్ణుని దర్శనం చేసుకొని 'ప్రభూ, సూర్యుడూ, నేనూ తమకు రెండు కళ్ళు కదా. ఈ రెండింటికి భేదం లేదని చాటడానికి తాము నా కుమార్తెను కూడా పెళ్ళాడా'లని విన్నవించుకొన్నాడు. పదహారువేలమందిని పరిణయం ఆడిన అయనకు ఇంకో పెళ్ళి భారం అవదుగాని వావీ వరుస కొంచెం చూడా లనుకొన్నాడు. చంద్రుని సోదరిని అయన ఇంతకుముందే పెళ్ళి చేసుకొని ఉన్నాడు. అందు చేత చంద్రుని కూతురు మేనగోడలి వరుస అవుతుంది. "కలియుగంలో తంజావూరులో విజయరాఘవ నాయకునిగా అవతరించినప్పుడు నీ కూతుర్నీ

చేసుకొంటాను" అని బాస చేశారు. ఆ చంద్రుడే ఈ రాజచంద్రుడు. అతని కూతురే కాంతిమతి.

ఇలా ఒక పూర్వజన్మ వృత్తాంతాన్ని సృష్టించి మన్నారుదాసుణ్ణి గురువుగారు సంతోషపెట్టారు. దాన్ని గ్రంథస్థం చేసి రంగాజమ్మ పుణ్యం కట్టుకొంది. మన్నారు దాసచరిత్రను విన్నా, చదివినా, వ్రాసినా 'ఆయురారోగ్య పుత్ర పౌత్రాభివృద్ధి', 'ధన కనక వస్తువాహన సమృద్ధి' మాత్రమే కాక 'నిరుపమాన కవిత్వ పాండిత్య మహిమ'కూడా కల్గుతుందని రంగాజమ్మ ఫల శ్రుతికూడా చెప్పింది. ఇవాళ మనకు ధన కనక వస్తువాహనాలు లభించినా లభించకపోయినా అనాడు ఈ కావ్యాన్ని వ్రాసినందుకూ, సభలో చదివినందుకూ, అందరికీ వినిపించినందుకూ విజయరాఘవుడు మెచ్చుకొన్నాడు. కనకాభిషేకం చేశాడు.[1] కావలసినంత గౌరవం చేసి ఆమెను ధర్మపత్నిని చేసుకొన్నాడు. ఆమెతోనే ప్రౌఢస్తమానం గడిపేవాడు. ఇది చూసి పట్టమహిషి కోపం పట్టలేకపోయింది. తిడుతూ తన చెలికత్తెచేత కబురంపింది. దానికి జవాబుగా రంగాజమ్మ ఈ క్రింది పద్యం వ్రాసి పంపిందట:

ఏ వనితల్ మముం దలప నేమిపనో? తమ రాడువాకు గా
రో? వలపించు నేర్పొరుగరో? తమ కొగిటిలోన నుండగా
రావదియేమిరా విజయరాఘవ యం చిలుదూరి బల్మిచే
దీరరకత్తెనై వెనగి తీసుకవచ్చితినా తలోదరీ?

[చాటుపద్య మణిమంజరి, పుట 1_64]

బలిమిచేత కాక చెలిమితోనే రంగాజమ్మ విజయరాఘవ నాయకుణ్ణి కట్టేసుకుంది. అతణ్ణి అద్భుతంగా పొగడడం ఆమెకు తెలుసు. నిజానికి ఆమెకే తెలుసేమో. ఒకసారి ఆయన మంచంపై కూర్చున్నప్పుడు ఈ చాటువు చెప్పింది:

---

1. మన్నారుదాస విలాసం ప్రబంధంలో తాను 'విజయరాఘవ మహీపాల నిత్య సంభావిత'నని రంగాజీ చెప్పుకొంది. అనంతర కృతుల గద్యాల్లో 'విజయరాఘవ మహీపాల విరచిత కనకాభిషేక' నని చాటుకొంది.

ఇంతీ, పానుపుపై నిదె_కంతుడు కూర్చున్నవాడు కనుగొను వహ్వా
కంతు డనంగుడు నీ తెలి_వింతేనా విజయరాఘవేంద్రుడె చెలియా!

విజయరాఘవుడు మన్మథాకారుడే కాక, సుమకోమలుడని చెప్పడానికి ఇంకో సంవాదపద్యం వ్రాసింది.

'రాజనిభాననా! సరసురాలవు, జబ్బుగ నల్లి నా వదే
మే జడ?' 'యింతకంటె వలెనే?' వలనొప్ప చిగించి యల్లకే
యోజవరాల 'వేఱె పని యున్నది', దోసమె, 'దోసమే మహా
రా జగునట్టి యవ్విజయరాఘవు మై చిగురాకె కోమలీ.'

[చాటుపద్య మణిమంజరి-1, పుట 64]

విజయరాఘవ నాయకుని విలాసాలను కీర్తించే మన్నారుదాస విలాస ప్రబంధాన్ని సభలో వినిపించినప్పుడే హరివంశ కథయైన ఉషాపరిణయాన్ని ప్రబంధంగా వ్రాయమని రాజు రంగాజమ్మను ఆజ్ఞాపించాడు. ఆమె వ్రాసింది. అందులో అయిదు ఆశ్వాసాలు ఉన్నట్టున్నాయి కాబోలు. నేడు నాలుగో ఆశ్వాసంలోని 70 పద్యాల దాకానే గ్రంథం దొరుకుతూంది. ఈ కావ్యం ఏమంత గొప్పదీ, చెప్పుకోతగ్గదీ కాదు.

ఈమె 'కృతియందు కావ్యశిల్పముగాని, కథా కథనమున నైపుణిగాని కానరాదు. అయినను ఇందలి శైలి సమాసాడంబరము లేక చక్కని పలుకుబడితో సులభగ్రాహ్యమై ఉన్నది. తంజావూరి నాయకరాజుల కాలము నాటి ఆచార వ్యవహారములును అంతఃపురమున జరుగు శృంగార క్రియా కలాపములును నిందు వర్ణితములగుటచే ఇది వాఙ్మయ చరిత్రకారులకు నుపయుక్తము' అని నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు.[1] ఇదికూడా సానుభూతితో అన్నదేగాని చరిత్రకారులకు ఉషాపరిణయం ఆట్టే తోడ్పడదు.

అయితే ఉషాపరిణయాన్ని ప్రత్యేక గ్రంథంగా వ్రాసినవాళ్లలో రంగాజమ్మ ప్రథమురాలని పరిశోధకులు భావిస్తున్నారు.[2] కాని తాళ్ళపాక తిరువెంగళనాథుడు (క్రీ. శ. 1498-1561) దీనిని ద్విపద కావ్యంగా మొదట చెప్పాడు. ప్రత్యేక పద్యకావ్యంగా వ్రాసిన వాళ్ళలో రంగాజమ్మ మొదటిది అనుకోవచ్చు. తెలుగులో ఉషాపరిణయం కథనంచేసే గ్రంథాలు పాతికపై చిలుకే ఉంటాయి.

---

1. ఉషాపరిణయం, తంజావూరు_సరస్వతీమహల్ ప్రచురణ, పీఠిక సువిందరశర్మ, పుట 18.

2. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయం, పుట 140.

ఈ పాతిక గ్రంథాలలో మొదటి మూడు గ్రంథాలలోనే ఉన్న ప్రౌఢ రచన రంగాజమ్మ కావ్యంలో కనబడదు.

వరుస	గ్రంథం పేరు	రచయిత	వివరాలు
1.	హరివంశం	ఎర్రాప్రెగడ	ఉత్తరభాగం - 7, 8 ఆశ్వాసాలు
2.	ఉత్తరహరివంశం	నాచనసోముడు	పంచమాశ్వాసం 46 వ పద్యం మొదలు
3.	భాగవతం	బమ్మెరపోతన	దశమస్కంధం ఉత్తర భాగం 311 నుండి 447 దాకా 136పద్యాలు
4.	ఉషాపరిణయం	తాళ్ళపాక తిరువెంగళనాథుడు	ద్విపద (ముద్రితం)
5.	అనిరుద్ధ చరిత్ర	భావనపెమ్మన	పద్యకావ్యం 57పద్యాలు. పెదపాటి జగ్గన్న ఉహరించాడు.
6.	ఉషాపరిణయం	దామెర్ల అంకరాజు	పద్యకావ్యం. అముద్రితం.
7.	..	రంగాజమ్మ	పద్యకావ్యం. అసమగ్రం.
8.	వజ్రాభ్యుదయం	కోన నారాయణ	పద్యకావ్యం. అసమగ్రం.
9.	ఉషాపరిణయం	విజయరాఘవ నాయకుడు	యక్షగానం (నష్టం)
10.	,,	శ్రీనివాసుడు	యక్షగానం
11.	,,	అనంతకవి	,,
12.	,,	విరిపాటిసృసింహాకవి	,,
13.	,,	యమ్మనూరి వెంకటసుబ్బ వేములపల్లి [య్య	,,
14.	,,	వెంకటసుబ్బ కవి	,,
15.	,,	మాసరగండ ఓబుళరాజు	,,

వరుస	గ్రంథం పేరు	రచయిత	వివరాలు
16.	,,	తిరువీధి చెంచుసుబ్బదాసు	,,
17.	అనిరుద్ధ చరిత్ర	గురురాజకవి	,,
18.	ఉషాపరిణయం	ఆనందదాసు	,,
19.	,,	మెరట్లూరి వెంకటరామశాస్త్రులు	,,
20.	,,	చెన్నయ్య	,,
21.	,,	కైపా మానయ్యకవి	పద్యకావ్యం
22.	,,	మూళగిరి	యక్షగానం
23.	,,	పోతుల వెంకటరామయ్య	,,
24.	,,	నడిమింటి రామజోగి	గేయం
25.	,,	దుర్గరాజు చిదంబరం	యక్షగానం
26.	,,	ధర్మవరం కృష్ణమాచారి	స్టేజి నాటకం
27.	,,	వేదం వెంకటరాయశాస్త్రి	,,

ఆ రోజులలో చెలామణిలో ఉండే వాద్యాల పేర్లు ఒక పద్యంవల్ల తెలుస్తాయి. చెలికత్తెలతో ఉష వినోదిస్తూంది. అప్పుడు జరిగిన సంగీత మేళాన్ని రంగాజమ్మ బాగా పేర్కొంది.

దండె తంబుర స్వరమండలంబు రబాబు వేటుగజ్జలు ముఖవీణె డక్కె చెంగు కామాచి యుపాంగంబు కిన్నెర వీణె తాళంబు(ను) బిల్లగోవి చిటితాళము రమ్మయుశేషనాదంబు రావణహస్తమును జంద్రవలయములును మురజంబు నావజంబును మొదలుగాగల్గుకమనీయవాద్యముల్ గరిమెదాల్చి రంగురక్తులు గులుకంగ రాజముఖులు ముంగలను జేరి త్రిభువనమోహనముగ జెలగి సంగీతమేళంబు జేసి కొలువ వేడుకలు మీర నెంతయు విభవమలర.

[ఉషాపరిణయం, 2-4.]

నాయకరాజుల కాలంలో రాజాంతఃపురంలోని ఈతల చెరువులలో జారుడు బల్లలు ఉండేవి.

మాటిమాటికి జారుడుబీట లెక్కి - సారసాక్షులు కొందరు జారి సారె
నొండొరులమీద జలములు నిండుకొనగ-జల్లులాడిరి సరసిలో సరసముగను.

[ఉషా. 2-12.]

ఆ రోజులలో రాజులు ఎలా దాడి వెళ్ళేవారో ఒక పద్యంవల్ల తెలుస్తుంది. ఉషమీద మన్మథుడు దాడిచేసిన వైనం ఇది.

చెలరేగి యెలదేటి యెలగోలుమూకలు దొలిదుల మునుమున్ను దుముకులిడగ
దండిమై రాయంచ దండిబారావెంట మెండుగా నల్దడ నిండి నడవ
నిరువంకలను జేరి గోరంక బన్నీలు బలుబింకములు తోడ బ్రబలి కొలువ
గుంపుగూడుక గండు కోయిల మాస్టీలు వెన్నానికై మదోద్భ్రాంతి కాగ
చిఱుత తెమ్మర దళవాయి సరసజెలగ దేజమమరంగ రాచిల్క తేజి నెక్కి
తమ్మిదోదుమ్మి కలుక కేడెమ్మి బూని-తలిరు విఱకాడు బోటిపైదాడివెడలె

[ఉషా. 2-26.]

-అలాగ దాడివెడలిన మన్మథు డిలాగ కత్తి దూశాడటఃఃః

రంగాజమ్మ వ్రాసిన ఉషాపరిణయంవల్ల కాక మన్నారుదాస విలాస నాటకంవల్ల అనాటి సాంఘిక పరిస్థితులు కొన్ని తెలుస్తాయి. అంతకు ముందు తాను ప్రబంధంగా వ్రాసిన విలాసాన్నే ఆమె యక్షగానంగా రూపొందించింది. రెండింటి కథలలో మార్పేమీ లేదు. ప్రబంధంలోని మొదటి నాలుగు ఆశ్వాసాలలో కొత్తపనం ఏమి లేదు. సాంఘిక చరిత్రకు పనికివచ్చే విషయాలుకూడా ప్రత్యేకంగా లేవు. అయితే అయిదో ఆశ్వాసంలో రంగాజమ్మ చేసిన పెళ్ళివర్ణన చాలా విపులంగా ఉంది. ఎన్నో సంగతులు తెలుస్తాయి. నిశ్చయతాంబూలంనుండి నిషేకందాకా అన్నీ తీరుబాటుగా వివరించింది. పెళ్ళి మంత్రాన్ని సైతం అనువదించింది. 'మాంగళ్యతంతు నానేన మమజీవనహేతునా' అనే మంత్రం ఇలా తెనిగించింది :

ఎలమిని మదీయజీవన హేతువై న
యట్టి మాంగళ్యతంతువు నమరబూని
కోరికలు (మీర ననుం) గూడి వారిజాక్షి
యింపుతోడుత ధాత్రి వెయ్యేళ్ళు మనుము.

[మన్నారు-ప్రబంధం, 5-47]

మంగళసూత్రధారణ తరువాత కొంగుముళ్ళు వేయడం, సప్తపదులు మెట్టడం మొదలైనవి వర్ణించింది పెళ్ళి భోజనాలను ఒక వచనంలో వివరించింది. 67 రకాల వంటకాలను పేర్కొంది. ఈ పలువగల వంటకాలలో శాకాహారాలే కావు, మాంసాహారాలు కూడా ఉన్నాయి. విందుభోజనాల తరువాత నాగవల్లి వేడుకలను వర్ణించింది. ఉప్పేనుగులు, పప్పేనుగులు ఇరుగడల వ్రాశారట. నాగపసానిచేత దేవతల పూజ చేయించారు. నాగవల్లి కుతికంటు మంత్రోక్తంగా కట్టాక వేడుకలు ఇలా జరిగాయని రంగాజమ్మ వర్ణించింది.

ఆచార్యార్యుండు నప్పుడు ప్రోలున-కిరుగడ నవ్వధూవరుల ననుపనుప్పేను గిచ్చెద బప్పేను గిమ్మని-విజయరాఘవమహీవిభుడు బల్కసిగ్గుచే నయ్యెడ జెలగినా యేనుగ-పడిలక్ష్మి అని పలెక్క భామ నగుచు

బప్పేను గిచ్చెద నుప్పేను గిమ్మని_పెండ్లికూతు రడుగ బ్రేమ మీర
గొమ్మ నా యేను గిది పదికోటు లనుచు_బలుక మన్నారుదాసు డా
పడతితోడ
నతులితా మోదమునను దంపతుల జూచి_నవ్విరందరు కలకలనాద
మెసగ.

[మన్నారు-ప్రబంధ, 5-67]

నాగవల్లిలో ఈ ఉప్పేనుగు-పప్పేనుగల బేరా లయ్యాక, పాన్పు, మూసివాయనాలు మొదలైనవి రంగాజమ్మ వర్ణించింది. తెలుగుతనం ఉట్టి పడే ఈ వివరాలన్ని ప్రబంధంలో ఉన్నా నాటకంలో లోపించాయి. అయితే నాటకంలో సాంఘిక వాతావరణం కనబడుతుంది. పంచాంగం బ్రాహ్మణులు, విద్వాంసులు, పునిస్త్రీలు ఒకరి నొకరు తిట్టుకోవడం జాస్తి. పామర వినోదం ఎక్కువ. విజయరాఘవనాయకుని ఆస్థానంలో వెలసిన ఇతర యక్ష గానం బాణీ నాటకాలలో ఉండేమాదిరిగానే ఇదీ ఉంది. ఈ సంగతులు తరువాత తైపారువేద్దాం. రంగాజమ్మ తాను శృంగార రస తరంగిత పద కవిత్వాన్ని చెప్పగలనని గద్యలో వ్రాసుకొందిగాని, మన్నారుదాస విలాసంలోని పద్యాలు, దరువులు కూడా ఏమంత గొప్పగా లేవు. "కులకాంత లేయూరు వలపు లేయూరు" (పుట.16) అనిపించింది. ఈ మన్నారుదాస విలాస నాటక పీఠిక వ్రాసిన జయంతి రామయ్యగారు ఇది స్త్రీ కవిత్వమగుటచేతను పండితాదరము నొందకపోదని నమ్ముచున్నారము అని వ్రాశారు.[1]

ఇది నేడు పండితాదరం పొందడం సంగతి అటుంచుదాం. ఆనాడు రాజాదరం పొందింది. ప్రభువును మెప్పించే విద్య రంగాజమ్మకు తెలుసు కనుక ఆమె రచనలను అనంతర రచయిత్రులు కొల్లగొట్టారు. సౌందరి అనే రచయిత్రి ఒకామె రంగాజమ్మ రచనలను యథాతథంగా తీసుకొని పాత్రల పేర్లు మార్చి తన పేర ప్రకాశం చేసింది. మన్నారుదాస విలాసాన్ని అక్కడక్కడ మార్చి 'అల్లాడ విజయసింహభూపతి సింహ విలాసం'అనే పేరిట సౌందరి చాటుకొన్నది. సౌందరి గ్రంథం ప్రతి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది [డి-786]. డిస్క్రిప్టివ్ కాటలాగులో ఇలా వ్రాశారు:

---

1. మన్నారుదాస విలాస నాటకము. ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణ, పీఠిక తొలిపుట.

'రాజరాజనరేంద్రుని అనంతరము రాజమహేంద్రపురాధీశ్వరుడయిన యల్లాడ విజయభూపతిసింహుని శృంగార చరిత్రము నాతని భార్యయు, రాచవీటి నరపతికిని మూక్తికాంబకును గూతురును నగు సౌందరీదేవి, అల్లాడ విజయభూపతిసింహవిలాసమను పేర ప్రబంధముగా రచించిన ట్టింగు గలదు. ఇది వట్టి బూటకముగా తెలియవచ్చుచున్నది. తంజావూరి తెలుగురాజై సుప్రఖ్యాతుడైన విజయరాఘవనాయకుని ప్రేమపాత్రమగు రంగాజీ యను స్త్రీ రచించిన విజయరాఘవనాయక చరిత్రమే యగు మన్నారుదాస విలాసమను ప్రబంధమే యిది యగును. కర్త పేరు, కృతినాయకుని పేరు మొదలగున విందస్యథాకరింపబడినవి. ఇం దిప్పుడున్న విధమున గృతినాయకాదులు చరిత్రాంశ పరిశీలనకు గోచరింపకున్నారు.

[కేటలాగు, సంపుటి 2, భాగం 2, పు 1041]

మన్నారుదాన విలాసమేకాక రంగాజమ్మ వ్రాసిన ఒక దండకాన్ని సహితం దొంగిలించి అల్లాడ విజయసింహభూపతికి అంకితంగా అంటకట్టిన సంగతి కూడా గ్రంథాలయ పరిశోధకులు తెలియజేశారు (డి. 2001). యక్ష గానాలు - దండకాలు అను శీర్షికను మదరాసు ఓరియంటల్ లైబ్రరీవారు ప్రకటించిన డి. కేటలాగు 8వ సంపుటి పుట 2253 లో ఈ సంగతులు ఉన్నాయి.

విజయరాఘవుడు మెచ్చిన రచనలు చౌర్యం చేసైనా తన రాజుకు అంకితం ఇస్తే రంగాజమ్మలాగ కనకాభిషేకాలు చేయించుకోవచ్చునని సౌందరి భావించిందేమో. అయితే రంగాజమ్మలాంటి గౌరవం నోచుకొనేవాళ్లు చాలా అరుదు.

.....

126

19

కొందరు నాటక కర్తలు

ఏకరాజుల యుగం ఒకరకంగా నాటకాల యుగం అని చెప్పవచ్చును. అంతదాకా పండితసభలలోనే పాల్గొన్న సాహితి కాళ్లకు గజ్జెకట్టి బహిరంగవేదిక ఎక్కింది. రాజులూ రసికులూ పండితులూ పామరులూ అందరూ 'కావ్యేషు నాటకం రమ్యం' అని గుర్తించారు. రాఘవ యాదవపాండవీయంవంటి శ్లేష కావ్యాలు వ్రాస్తేనేగాని తన ప్రజ్ఞ బయటపడదనే ఎలకూచి బాలసరస్వతివంటివాడు 'రంగకౌముది' అనే నాటకం వ్రాశాడు. ఆంధ్రశబ్దచింతామణివంటి వ్యాకరణగ్రంథానికి వ్యాఖ్యానంగా లక్షణగ్రంథాన్ని వ్రాసుకొన్న అప్పకవి లాంటి శాస్త్రకారుడు 'అంచికావాదం' అనే యక్షగానం వ్రాశాడు. ఉత్తరరామాయణాన్ని వ్రాసిన కంకంటి పాపరాజు తన రచనావ్యాసంగాన్ని 'విష్ణుమాయావిలాసం' అనే యక్షగానంతోనే ప్రారంభించి తాను 'విష్ణుమాయావిలాసాభిధాన యక్షగాన నిర్మాణ ప్రవీణతావిధానుణ్ణని', సగర్వంగా

ఉత్తరరామాయణగద్యంలో చెప్పుకున్నాడు. వాణీవిలాస వనమాలికలాంటి విజ్ఞానసర్వస్వాలు వ్రాసిన చేకుమళ్ల రంగశాయి 'జానకీ పరిణయం' అనే యక్షగానం మొదట వ్రాశాడు. శేషధర్మాలసు తెనిగించిన వెణుతురుపల్లి విశ్వనాథం కూడా 'శ్రీరామ విజయం' అనే యక్షగానం వ్రాశాడు. వీళ్ళంతా నాయక రాజుల కాలంలో ఉన్నా నాయకరాజుల సీమకు వెలుపల ఉన్నవాళ్ళు.

తంజావూరులో యక్షగానాలు మొదట ప్రఖ్యాతమై అవి నాటకాలుగా మారాయి. రఘునాథనాయకుడు స్వయంగా రుక్మిణీకృష్ణ వివాహ యక్షగానం వ్రాశాడు. శ్లేషకావ్యాలు వ్రాసే కృష్ణాధ్వరి కూడా 'కళ్యాణ కౌముదీ కందర్ప నాటకం' అనే దృశ్య కావ్యం వ్రాశాడు. తంజావూరులో నవరత్నమయమైన నాటకశాల తొలి నుంచీ ఉండేది. ఇప్పటికీ అది చెక్కు చెదరలేదు. దానిని ప్రస్తుతం 'సంగీత మహలు' అని పిలుస్తున్నారు. దీనిని రంగస్థల నిర్మాణం ఎలాచేయాలో తెలిసిన ప్రాచీన ఇంజనీర్లు కట్టారు.[1] నాల్గు గోడల మధ్య రంగ స్థలాలే కాక నాయక రాజుల కాలంలో బయట నాటకశాలలు కూడా ఉండేవి. "విజయరాఘవ నాయ నయ్య వా రవధరింపగదరయ్య! దేవర పద పద్మ ములను మీ బైట నాటకశాల పడుచనైన లీలావతిని పదివేల దండంబులు వెటి చేయంగల విన్నపంబు" అని ఒక కమ్మవక్కాణాన్ని ఒక రచయిత వ్రాశాడు.[2] దీనివల్ల నగర నాటకశాలలో నటించేవారూ, బైట నాటకశాలలో నటించేవారూ వేరు వేరు అని ఊహించవచ్చును.

---

1. The Sangeetha Mahal which is now an object of wonder in accoustics existed from the early part of the 16th century. Peeps into Saraswati Mahal by S. Gopalan.

2. విజయరాఘవ చంద్రికా విహారం. కామరసు వెంకటపతి సోమ యాజి. పుట 59. ఈ లీలావతి నాటకంలో పాత్ర. ఈమె ఒక కవయిత్రి అని పొరబడి ఈమె వ్రాసిన కమ్మవక్కాణం లభ్యం అయిందని నిడుద

రఘునాథ నాయకుడే నాటకశాలలో స్త్రీ పాత్రలను స్త్రీలే వేసే పద్ధతిని పెట్టి నట్టుంది. చేమకూర వెంకటరాజుగారు 'రఘునాథుడు భరతవిద్యా దురంధరుడౌట రంగస్థలం రామాకృతం' చేశాడని చెప్పారు. (విజయ : పీఠిక 21) నాటక రంగంలో మాత్రం విజయరాఘవుడు తండ్రిని మించిన కొడుకు. స్వయంగా పాతిక ముప్పయి నాటకాలు వ్రాసి యక్షగానాలలో రూపకకళలను ప్రవేశపెట్టాడు. తంజావూరు నాటకకర్త లందరూ ఇతణ్ణి అనుసరించారు. విజయరాఘవుని నాటకాల గురించి ఇంతకు ముందు విపులంగా చెప్పుకున్నాం. ఇప్పు డతని ఆశ్రితుల గురించి తెలుసుకొందాం.

1. కామరసు వెంకటపతి సోమయాజి : ఈయన విజయ రాఘవుని పట్టపు కవి. ఇంతకుమించి ఇతని గురించి వివరాలేం తెలియవు. అయితే పట్టపు కవికి కావలసినంత ప్రతిభ ఇతనిలో ఉంది. పదకవితలో దిట్ట. క్షేత్రయ్య తరువాత అంత బాగా తీయగా పదాలు వ్రాయగల ప్రౌఢత్వం ఇతనిలో రాణిస్తుంది. నిజాని కితని పదాలు కొన్ని క్షేత్రయ్య పదాలుగా చెలామణి అవుతున్నాయి. ఈయన విజయరాఘవ చంద్రికా విహారం అనే నాటక చాటుకావ్యం వ్రాశాడు. ఇందులో కథేం లేదు. విజయరాఘవుడు ఒకనాడు పాదచారియై వెన్నెలవేళ సానివాడకు వెడతాడు. అప్పు డతన్ని బైట నాటకశాల పడుచు లీలావతి చూసి మరులుకొంటుంది. కమ్మవక్కాణం ఒకటి వ్రాసి పంపుతుంది. విజయరాఘవు డామెను కనికరిస్తాడు పెళ్ళాడుతాడు. ఆ నారీమణితో 'రత్నసింహాసనం'పైన కూర్చుంటాడు. ఈ నాటకంలో విజయరాఘవుడు సానివాడకు వచ్చినప్పుడు ఒక పడుచు వువ్విళ్ళూరుతూ ఒక పదం ఇలా పాడుతుంది.

సుదినమాయెనే ఈపొద్దు సుదినమాయెనే యీ
మదనావతారుని సేవ మనకు గల్గెగా
ప్రొద్దున నిలువుటద్దము పొడగన్న ఫలము - ఇతని
మొద్దుమోము చూడగల్గె ముద్దుల గుమ్మ ॥సు॥

లోలు వారు వ్రాశారు. తంజావూరు నాటకాలలో పాలకడలిరాజు వంటి పాత్రలకమ్మవక్కాణాలు చాలా ఉన్నాయి. వాళ్ళంతా కవులు, కవయిత్రులు అనుకోరాదు.

ఈ పొద్దు పూర్ణకుంభము లెదురైన ఫలము - ఈ
భూపాలకుంజరు నే పొడగంటి నమ్మా
ద్విజరాజుల సేవించిన దివ్యశకునముచేత
విజయరాఘవ శౌరి వీధిలో గంటి.

ఇది విజయరాఘవముద్ర గల క్షేత్రయ్యపదంగా నేడు ప్రచారంలో ఉంది.[1] క్షేత్రయ్యలాగే ఈ కవి అంత్యప్రాసలు, అనుకోని తళుకులు చాలా బాగా గుప్పించగలడు. క్షేత్రయ్యలాగ పచ్చిగాకూడా ప్రాయగలడు. "అక్కరో ఓర్వలేనివారు" అనేపదంలో క్షేత్రయ్య, "రామ! వాని వలచినపుడే రవికె క్రిక్కిరిసెగుబ్బ; లేమా రొమ్మొల్ల నిందునే వాని మాటంటే నా మనసు పైపై నుండునే" అని ప్రాశాడు.[2] ఇంతకన్నా పెచ్చురేగి కామరుసుకవి ఈ చంద్రికావిహారంలో ఒక ప్రౌఢకాంత రవికెకీలు పటుక్కున తెంపాడు.

కటకటా ఈ రాజకందర్పుని నాకన్నులు చూచినప్పుడె నా
బటువుగుబ్బ లుబ్బి పట్టురవికెకీలు పటుక్కున వీడెగాదే!

అని ఒక జిక్కవ గుబ్బెతచెత కామరసుకవి పాడించాడు.

క్షేత్రయ్యపదాలను నాటి నాటకరచయితలు బాగా అనుకరించేవారు. విజయరాఘవుడే తన విప్రనారాయణచరిత్రలో బంగారుగిన్నె ఇచ్చాక దేవదేవిని విప్రనారాయణుడు కూడినప్పుడు "అలుకలు దీరెనటే మీ ఇద్దరి యలుకలు దీరెనటే" అనే పదం ప్రాశాడు. సారంగరాగంలో "అలుకలు తీరెనా - నేడైన మీయలుకలు దీరెనా" అని క్షేత్రయ్య ప్రాసిన పదం విన్న తరువాత దీనిని విజయరాఘవుడు ప్రాశాడుకాబోలు. అయితే క్షేత్రయ్య రచనాశిల్పం కామరసు సోయయాజులకు పట్టుపడినట్టు ఆనాటి కవులలో ఇంకెవరికీ అబ్బలేదు. విజయరాఘవుడు చంద్రికావిహారానికి వెళ్లినప్పుడు

---

1. గిడుగు సీతాపతిగారి క్షేత్రయ్య పదాలలో ఇది సామాన్య-98; విస్సావారి క్షేత్రయ్య పదాలలో విజయరాఘవ విభాగంలో నెం. 11.

2. విస్సావారి క్షేత్రయ్య పదాలు, నెం. 5.

ఒక ఉత్తమాంగన తన ప్రౌఢ చేడియతో ఇలా ఆడుకొందని కామరసుసోమ యాజులు వ్రాశాడు.

వేడుకైన జూడకూడదు వింతవారిని, నా
తోడికోడలుం నన్ను తొంగిచూడ నియ్యదు
పాడిదప్పి మగడు మిగుల పగచాటును, ఈ
మేడమీదికి వచ్చేనంటే మెదలనియ్యడు—

వంచన చేసి ఇతని జూడవచ్చే నంటేను
పొంచియుండు మఱది ఇరుగుపొరుగుపంచల
పంచశరుని మించిన యీ పట్టభద్రుని
ఇంచుకసేపు జూడకూడ దేమిసేతును—
అత్తచేత బోయ మిగుల నధికమాయెను
కతిపాడ సాము నాపగదలరాదుగా
బత్తితో విజయరాఘవపార్థివేంద్రుని నేడు
క్రొత్తగా జూచిన చూపు కోటిసేయదా?

ఈ పదంలోని "కొత్తగా జూచిన చూపు కోటిసేయదా" అనే కొనమెరుపు చక్కని పదకర్తకే చేతనవుతుంది. పదాలు వ్రాయడంలో పదునుతేరిన కామరుసుకవి చంద్రికావిహారంలో ఎక్కువగా గేయాలే నింపాడు. పదాలలో యమకాలు గుప్పించాడు. విజయరాఘవుని చూసి మరులు కొన్న లీలావతి విరహాన్ని చూసి చెలికత్తెలు గేలిచేశారు. అప్పు డామె ఇష్టసఖి ఊరడించింది. ఈ సంవాదం ఇలా వ్రాశాడు:

మనుమని చెలులెల్ల నను దీవించేవారు
మనసిచ్చి నేడేల మాటాడరమ్మ!
అనుమాన మేలమ్మ యచ్యుతభూపాలుని
మనుమని చెలులెల్ల నిను దీవించేరే.
కనకాంగి వినవే నా కన్నుల ముందర
తన యానికి చూపెనే తలిరువిలుకాడు

ననబోణి నిన్ను రఘునాథభూపాలుని
తనయునికి జూపేటి తగవు గాదటవె

[చంద్రికావిహారం, పుట 37]

ఇటువంటి యమకాలు చేమకూరవెంకటరాజుగారు తంజావూరులో ప్రచారం చేశారు. ఆ సొగసులు పదకర్తలు కూడా వాడడం విశేషం.

చంద్రికావిహారంలో ఈయమకాలు వాడిన నాయిక పూర్వజన్మలో ఊర్వశి అని కవిఉద్దేశం. అందుచేత ఆమె విరహంలో పడినప్పుడు రంభ ఎరుకల సానివేషం వేసుకొని వస్తుంది. తంజావూరి నాటకాలలోనేకాక ఆంధ్రయక్ష గానాలలోనే తొలిసారిగా కొరవంజి ప్రవేశించడం ఈ చంద్రికావిహారంలోనే.

మన సాహిత్యంలో ఎరుకచెప్పించడం బమ్మెరపోతరాజుగారి గ్రంథంలో మొదట కనబడుతుంది. పార్వతి విరహంలో ఉన్నప్పుడు "వెలదిమేన కల్గు వీరుడు వెలదియై యెరుక యెరుక యనుచు నేగుదెంచె" అని పోతరాజుగారు వ్రాశారు (వీరభద్రవిజయం, 2-170). చాలా విపులంగా 45 పద్యాలలో ఎరుకఘట్టం వ్రాశారు (2 : 166-210). అయ్యలరాజు రామభద్రుడు కొరవంజిమేళాల సంగతి చెప్పాడు (రామాభ్యుదయం, 2-131). గాని వారు ఎరుకచెప్పారని విశదంచేయలేదు. మట్ల అనంతరాజుగారు కొరవంజివే ఎరుక నెరపించారు (కాకుత్స్థవిజయం, 3-86). పుష్పగిరి తిమ్మనగారి సమీరకుమారవిజయంలో ధర్మదేవత ఎరుకతవేషం వేసుకొని అంజనావేవికి ఎరుక చెప్తుంది. "ధర్మువు కొరవంజితీరు దాల్చి" వచ్చిందని ఆయన కొరవంజిని పేర్కొన్నారు (2-64). తరువాత కామరుసుసోమయాజి నాటకాలలో ఎరుకలసాని కొరవంజి దరువులు పాడుకొంటూ వస్తుంది. ముత్యాలుతెప్పించి మొరిపెకో నిండించి చెయ్యి చూస్తుంది. పాత్రోచిత భాషలోనే కామరుసుసోమయాజులు ఎరుక చెప్పించాడుగాని ఈ నాటకంలో సంభాషణలు చాలా తక్కువ. అవి హుందాగానే సాగాయి. ప్రాంతీయ పదాలు, చౌకబారుహాస్యాలు, సమకాలిక మోసాలపై విసురులు ఇలాంటి వేమీ ఇందులో లేవు. అవి రంగాజమ్మవ్రాసిన మన్నారుదాసవిలాసంలో కొల్లలుగా కనబడతాయి.

2. రంగాజమ్మ:— ఈమె వ్రాసిన కావ్యాలగురించి విడిగా చర్చించుకొన్నప్పుడు నాటకరచయిత్రిగా ఈమెప్రత్యేకత తరువాత చెప్పుకొందామనుకొన్నాం. రంగాజమ్మ నాటకాలను వ్రాసిన మొదటి మహిళగా కన్పడుతుంది. అయితే బాలపాపాంబ అనే కవయిత్రి 'అక్కమహాదేవిచరిత్ర' అనే యక్షగానాన్ని వ్రాసింది. 'ఈమె సంగీతసాహిత్య సరసలక్షణాల రంగుమీరిన యట్టి రమణి' అని తెలుస్తూంది. తను వీరవసంతరాయల పెద్దకూతుర్నని చెప్పుకొంది. సేలం, కోయంబత్తూరు జిల్లాలలో క్రీ. శ. 1567 నుంచి 87 దాకా ఒక వీరవసంతరాయల శాసనాలు కనబడుతున్నాయి. బాలపాపమ్మ అతని కుమార్తే అయితే ఆమె ప్రప్రథమాంధ్రయక్షగాన రచయిత్రిగా విశిష్టస్థానాన్ని ఆక్రమిస్తుందని యస్వీ జోగారావుగారు వ్రాశారు.[1] బాలపాపమ్మ వ్రాసిన యక్షగాన ప్రతి ఒక్కటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది (D 1834). ఇందులో షష్ట్యంతాలు మొదలైనవి ఉన్నాయి. 'అవనిలో యక్షగానావళికెల్ల - రవళి మించిన శిరోరత్నమా యనగ' ఈ కృతిని తాను ఇంగిత జ్ఞానినై వ్రాశానని బాలపాపమ్మ చెప్పుకొంది.

మన సాహిత్యంలో తొలి యక్షగానాన్ని వ్రాసిన రచయిత్రిగా బాలపాపమ్మను గౌరవిస్తూనే రంగాజమ్మను తొలి తెలుగునాటకాన్ని వ్రాసిన మహిళగా పేర్కొనాలి. ఈమె వ్రాసిన మన్నారుదాసువిలాసం అనే నాటిక చాలా విలక్షణమైనది. దానిని ఆమె క్రీ. శ. 1663 లో వచ్చిన శుభకృత్‌లో వ్రాసింది. అప్పటికి తంజావూరులో చాలా నాటకాలువెలిశాయి. రూపక లక్షణాలను బాగా సంతరించుకొన్న ప్రహ్లాదచరిత్రవంటి నాటకాలను విజయరాఘవుడు చాలా వ్రాశాడు. అతడు ప్రవేశపెట్టిన పద్ధతులను రంగాజమ్మ అనునరించింది. గొల్లల వెకిలిమాటలు, వెర్రిశివాలు, పురోహితుల చిన్నగుణాలు మొదలైన చెణుకులు ఉన్నాయి.

విజయరాఘవుడు పూతనాహరణంలో దబ్బరమంత్రాలు చెప్పి గోదానాలు పుచ్చుకోవా లనుకొన్న పురోహితులపై వ్యంగ్యంగా వాతలు వేస్తే నగరింటి సహస్రనామ పూజలో సువర్ణపుష్పాలు అపహరించి వాటి బదులు మొలాము చేసిన పూలు పెట్టిన నరసంభట్లులాంటివాళ్ల మోసాలు ఈమె

1. ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర, ద్వితీయభాగం, పుట 18.

బయటపెట్టింది. తంజావూరునాటకాలలో ఇటువంటిఘట్టాలుప్రాసి అనాటిరచయితలు తమ సంఘంలోని అవినీతిని విమర్శించేవారు. కొందరిని అపహాస్యం చేసేవారు. 'కులకాంత లేయూరు - వలపు లేయూరు'[1] అనే భావం కల రంగాజమ్మ అనాటి బాపనమున్తయిదువుల తాంబూలమైనా వేసుకోలేని అనాగరికస్థితిమీద విసుర్లు విసిరింది. "నగరింటి పెండ్లినాడైనా ఒక వక్క బద్ద వేసుకొని సవలరావషవో" అని పోలుభట్ల యెల్లమ్మను రంగావర్ధుల తిమ్మక్క అడుగుతుంది. "నాకు పక్కబద్ద యొకటి కొదవా? నిన్న మావారు సుక్కారం సంతలో పిండికూర కంచున్ను గానుగబిండి దెచ్చిరి. పెళ్లి పందిట్లో నోరు మెవలించవలె నంచున్ను యింత తెచ్చుక తించున్నా నింతే!" అని యెల్లమ్మ జవాబుచెప్పింది. రంగాజమ్మ నాటకంలో కూడా పండితులు "త్వమేవ శునకః త్వమేవ సూకరః" అని తిట్టుకొంటారు. నిజంగా తంజాపూరికొలువులో, విజయరాఘవనాయకుని సమక్షంలో ఇలాగ పండితులు తిట్టుకొంటే అది శోచనీయమే.

చంద్రికావిహారంలో కామరుసు కవి రంభచేత ఎరుకచెప్పిస్తే మన్నారు దాసవిలాసంలో రంగాజమ్మ హేమాబ్జ నాయికచేతనే ఎరుక చెప్పించింది. ఆ నాటి ఎరుకతలు యేనాది మానవతు లని ఈ నాటకంవల్ల తెలుస్తుంది. మన్నారుదాసువిలాసం "ప్రౌఢకావ్యములలో నెన్నదగినది కాకపోయినను దేశచరిత్ర పరిశోధనకును నుపయోగించునుగావునను స్త్రీకవిత్వమగుటచేతను పండితాదరము" పొందుతున్నదని జయంతి రామయ్యగారు భావించారు.[2] ఈమె వాడిన సంభాషణలెంతో పరిశోధకులకు ఉపయోగిస్తా యనడంలో సందేహం ఏమీ లేదు. అయితే ఈమెకన్నా ఎక్కువగా సంభాషణలతోనే నాటకం నడిపిన నాటకరచయిత ఇంకొక డున్నాడు.

3. పురుషోత్తమ దీక్షితులు:—తంజావూరునాటకాలలో సంభాషణలుకొన్ని కేవలం ప్రహసనాల ధోరణిలో ఉన్నా వాటిలోని నాయికానాయ

---

1. మన్నారుదాస విలాస నాటకం, పుట 16.

2. మన్నారుదాసు విలాస నాటకం. ఆంధ్ర సాహిత్య పరిషత్ ప్రచురణ.

కులు ఉత్తమపాత్రలు కనుక స్థాయి పూర్తిగా దిగిపోలేదు. నీచపాత్రలనే సృష్టించి ఆదినుంచి అంతందాకా శుద్ధప్రహసనాలుకూడా అనాడు లేకపోలేదు. పురుషోత్తమదీక్షితులు అనే నాటకరచయిత "సత్రమరులు" అనేప్రహసనం వ్రాశాడు. దీనికే అతడు "తంజావూరుఅన్నదాన మహానాటకం" అనే పెద్ద పేరు పెటాడు గాని ఇది ఉత్త ఫార్సు.

తంజావూరునాయకరాజులు అన్నదానానికి ప్రసిద్ధులు. రఘునాథ నాయకుడు "నిరతవారితాన్న సత్రసంతోషితపంచాశత్సహస్రభూసుర" అనే బిరుదును తన గద్యలో చెప్పుకొన్నాడు. ఆయన హయాంలో మొదలైన అన్న సత్రాలు చివరిదాకా కొనసాగాయి. 'తంతుమాత్రపువాడైనా తంజావూర ఉపవాసం ఉండరాదు' అని నాయకరాజుల శాసనం. భుజంమీద జందెమున్న ప్రతిబ్రాహ్మణునికి బొజ్జనిండా తిండి పెట్టడానికి సత్రాలు వేయించారు. రామానుజకూటం, మధ్వకూటం, పెద్దసత్రం మొదలైన చోట్ల రోజూ అన్నదానం జరిగేది. సత్రాలలో భుజించని ఆచారవంతులకు స్వయంపాకాలు ఇచ్చేవారు. ఈ సత్రాలలో పడి తినడానికి ఎక్కడలేని సోమరిపోతులూ హాజరయ్యేవారు. వాళ్ళ వెకిలిచేష్టలను, చిన్నబుద్ధులను బయటపెట్టే ప్రహసనమే ఈ అన్నదాననాటకం.

సత్రంవేళ కాకముందే పప్పుతిప్పాభట్లు అనే బ్రాహ్మణుడు సకుటుంబంగా విచ్చేశాడు. అతనేకాక అతని కొడుకూ సోమరిపోతే! తిప్పాభట్లు 'అదెవ్రా మంచిగా' అని కొడుకును పిలుస్తాడు. 'ఓపలేనే'అని సుపుత్రుడు జవాబుచెప్తాడు. 'ఏమిరా పిలువకమునుపే ఓపలే ననేవు?' అని తండ్రి ప్రశ్నిస్తాడు."పనిలేక పిలుతువటె?"అని మంచిగాడి జవాబు. ఈపూరిసత్రం అధికారి నెల్లూరి యల్లమరాజు మహాధర్మాత్ముడు అని తిప్పాభట్లు అయిదో వేదంలో ఎనిమిది అట్టాలకు అవలిఅట్టంలోని మంత్రాలతో ఆశీర్వచనం చేస్తాడు. సత్రంఅధికారి 'ఒక ప్రశ్న చెప్పండి'అంటే ఇలా చెప్పాడు:

"ఓహోహో మామహా చెప్పేమే. ఉదయాదూఢచత్రాలు చూసి చెప్పేము. ఉదయం తూర్పునను, ఛత్రంరాజుదగ్గరను. ఆదూఢం మేషం అశ్వని భరణి కృత్తికాఃపాదం మేషం. భరణి పెట్టెలోను, మేషం మేకల మందలోను, వృషభం ఆవులమందలోను, మిథునం స్త్రీపురుషులు

గూడిన చోటను, కర్కాటకం బొక్కలోను, సింహం అడవిలోను, కన్య పుట్టింటను, తుల సెట్టివాని ఇంటిలోను, వృశ్చికం పిడకల పచ్చిలోను, ధనుస్సు పట్టినవానిచేతను, మకరం సముద్రంలోను, కుంభం కుమ్మరివానిఇంటిలోను, మీనం చెరువులోను పండ్రెండురాసులును యొక్కడివక్కడనే ఉండేవి. [అన్నదాన, పుట 200]

ఈ జ్యోతిషం విన్నాక పొంతనాలు చెప్పించుకొని 'మీరు వృషభం, మీకు వాహనం శునకం'అనిపించుకొని 'మహామేలయ్యా, ఎండనక వాననక, మంచనక మాలనక మహా వస్తిరయ్యా, సత్రంవేళయితే విడిచేముగాని అటు గూర్చుండుండ'మని సత్రం అధికారి అన్నాడు. అప్పుడు భోగాలవాళ్లు త్యాగాలకోసం వచ్చేరు. 'భోగాలవా రంటే ఆడవారేనా?అంతా ఆడవారో! కొంతఆడవారో' అనే అనుమానం తిప్పాభట్లుకి కలుగుతుంది. వాళ్లు నిద్రకు పైడి తీస్తారని తెలుసుకుంటాడు. 'నిద్రకు పైడితీస్తే మేలుకొంటే పైడితీతురే' అనుకొంటాడు. ఆ సానులలో ఒకదాని పేరు వెంగసాని. దానిని 'లంజమ్మ' అని గౌరవంగా పిలుస్తూ తిప్పాభట్లు ప్రేమలో పడి కవిత్వంకూడా చెప్పాడు.

ప్రాసున్న న్నన్నవి కోకిలంబు లివిగో కోలాహలప్రక్రియన్
వేసున్నాడు మనోభవుం డషిషుగా వేమారు నీవు న్ననున్
చూస్సుందానవు నీకు ధర్మమషవే శుద్ధాత్ముడన్ బ్రాహ్మడన్
ప్రాసున్నా నిడ గూర్త మొక్కటి రతిం దేలింపవే లంర్ఘుమా !

[అన్నదాన, పుట 210]

ఈ తిప్పంభట్లు గురజాడఅప్పారావుగారి కొండుభట్లుకి ముత్తాతకోవలో వాడని చెప్పాలి. అప్పారావుగారి కొండుభట్లుకూడా శార్దూలంలో 'ధర్మం కాదిది మంజువాణి వినుమా' అంటూ ఒక పద్యం చెప్తాడు (తృతీయాంకం పుట 81). రకరకాల శ్లోకాల వరుసలో సంభాషిస్తాడు. అప్పారావు గారీ అన్నదానం పార్సు చదవకుండా ఈ పోలికల రచన చేయడం ఒక విశేషమే. అన్నదానసత్రానికి వచ్చిన తెలుగువాడు తిప్పంభట్లు. అప్పంవాత్స్యారి అనే అరవ బ్రాహ్మణుడుకూడా ఇంత వెకిలిగానూ ఉంటాడు. ఇద్దరూ సానులను

చూసి మోహపడతారు. భోజనాలు చేశాక అధికారి ఇలా అంటాడు: "అదె వరో వెంగసాని, యేమో జిక్కులరంగసాని రావో, పలుకసాని ముద్దు! ఈ పప్పు తిప్పాభట్లు అప్పం వాత్యారిగారు మహా దూరదేశాన్నుంచి వచ్చినారు. మంచి యోగ్యులు. వీరికి వూరికే ఉండవశంగాదట. వీరిని సంతోషపెట్టుండ" (పుట232) ఆ సానులు సరే అంటారు. 'తిప్పాభట్లుగారు, మీరు ఈ రూపాన ఉంటే స్త్రీలు తీసిపోదురు. మీ తపోమహిమచేతను మున్నుచ్యవన మహాముని రీతిని దివ్యరూపము ధరించి వేడుకగా వీరితో విహరించవయ్యా' అని అధికారి వేడుకొంటాడు. తిప్పాభట్లు మన్మథు డవుతాడు. సాను లతనితో కూరిమితీరా ఆడుతారు.

ఈ ప్రహసనం చాలా విలక్షణమైనది. నిజానికి తెలుగుసాహిత్యంలోని తొలిప్రహసనం ఇదే అని చెప్పవచ్చు. దీనిని పురుషోత్తమదీక్షితులు క్రీ. శ. 1669లో వచ్చిన కీలకలో వ్రాశాడు. ఇతడు విజయరాఘవుఫ్ఫి కైవారంలో చాలా పొగడాడు. కృత యుగంలోమరుత్తుడట. త్రేతాయుగంలో నాభాగుడు. ద్వాపరంలో మద్రరాజాంతకుడైన కుంతీసుతుడు. కలియుగంలో విజయ రాఘవుడు. ఇటువంటి పొగడ్తలకు విజయరాఘవుడు చాలా ఆనందిస్తాడు. ఆస్థానకవులు ఇలా వ్రాస్తే విజయరాఘవుని కుమారుడు మన్నారు దేవుడు కాలాతీతవ్యక్తిగా తండ్రిని చిత్రించాడు. ఆ వైనం వించాం.

4. మన్నారు దేవుడు:— ఇతడు విజయరాఘవుని ప్రియ పుత్రుడు. అయినా కోపించి విజయరాఘవుడు ఒకసారి ఇతణ్ణి బంగారు సంకెళ్లు వేయించి చెరలో పెట్టాడు. ఎందుకు బంధించవలసివచ్చిందో తెలియదు. తండ్రిని మెప్పించడానికి మన్నారుదేవుడు 'హేమాబ్జనాయికా స్వయంవరం' అనే నాటకం వ్రాసి తన తండ్రే ఆ ఆదిదంపతుల వివాహాన్ని జరిపించినట్లు వ్రాశాడు. క్షీరసాగరమథనం అయ్యాక హేమాబ్జనాయిక రాజగోపాలస్వామిని చూసి మరులుకొంది. చెలికత్తె చే కబురుపెట్టింది. రాజగోపాలుడు తన ముద్దులపట్టి అయిన విజయరాఘవుణ్ణి పిలిచి "రయమున నీ ప్రొద్దు కడలిరాజుతో మాటలాడి ప్రియముగా మాకు ఈ పెండ్లి యొనగూర్పుము"అంటాడు. విజయరాఘవుడు పెళ్లిళ్ల పేరయ్య అవుతాడు. హేతులు యథాప్రకారం పరస్పరం 'వ్రజశుంఠ' అని ట్టుకొంటారు

బాహ్మణ ముత్తయిదువులు మరీ అసౌచిత్యంగా మాట్లాడుకొంటారు. 'ఓసమ్మా! మీవార్ని మావార్నీ మార్చుకొందామషే!' 'ఓసమ్మ! నీకు నడుమేల పట్టుకొనెనే!' 'ఓసెమ్మ వింటివషే! మావారు నిన్న రాత్రి గంపెడేసి బందాలు పటించేరే!' అనే సంభాషణలు జరుగుతాయి.[1] ఈ పేరంటాళ్లు దేవుని పెళ్లికి సువ్వాలలు పాడుతారు. ఈ పెళ్లి జరిపించినందుకు రాజగోపాలస్వామి మెచ్చుకొని ఇలా దీవించాడట :

విజయరాఘవవత్స ఈ పెండ్లి నీవు
సంఘటింపగ మామది చల్లనయ్యె
ప్రబలి నీ వాయురారోగ్య భాగ్యములను
ధరణి వర్ధిల్లు మాచంద్రతారకముగ.

దేవు డిలా దీవించిన మూడేళ్లకు విజయరాఘవుడు మరణించాడు. ఈ నాటకాన్ని మన్నారుదేవుడు క్రీ. శ. 1670లో వచ్చిన సౌమ్యచైత్రంలో వ్రాశాడు. క్రీ. శ. 1673లో తంజావూరుపతనం అయింది. అయితే ఈ లోగా విజయరాఘవునికీ ఒక నాటకంలో గొప్ప కల్యాణాన్ని అతని ఆస్థానకవి జరిపించాడు.

5. కోనేటిదీక్షితచంద్రుడు:— ఇతడు క్రీ. శ. 1670లో వచ్చిన సౌమ్యవైశాఖంలో 'విజయరాఘవకళ్యాణం' అనే సుదీర్ఘమైన నాటకం వ్రాశాడు. ఈయన సంగీతసాహిత్యవిద్యాధురీణవరేణ్యుడ నని చెప్పుకొన్నాడు. ఇతని తండ్రిపేరు రామానుజాచార్యులు. రాజగురువు తాతాచార్యులవారికి కోనేటిదీక్షితులుకూడా శిష్యుడు. ఇది నవరసశృంగాటకమైన నాటకం అని రచయిత చెప్పుకొన్నాడు. ఇదికూడా మిగిలిన తంజావూరినాటకాల మూస లోని కథనే చెప్తుంది. విజయరాఘవుడు ఒకసారి వేటకు వెళ్లాడు. మదన మంజరి అనే రాజపుత్రిక వనకేళికి వచ్చి అతణ్ణి చూసింది. వలపు, విరహం. దూతికను పంపడం, రాజు సుముఖుడు కావడం, ఎరుకలసాని రావడం,

---

1. హేమాబ్జ సాయికా స్వయంవరం [యక్షగానము]. తంజావూరు. ఆంధ్రవిశ్వ విద్యాలయ ప్రచురణ పుట, 168.

పెళ్లి, పురోహితుల మాటలు, ముత్తయిదువుల కబుర్లు — ఇలా ఇదికూడా పాత నంవిధానంలోనే సాగింది. అయితే ఇందులోని వేట చాలా సహజంగా వర్ణించాడు. ఆనాటి పల్లెపదాలను చాలా పేర్కొన్నాడు. వాటికి పారడీలు వ్రాశాడు. అశ్లీలాలు లేవు. హాస్యం బాగానే ఉంది. శాస్త్రజ్ఞులు కవులు "కవితైవ విద్యా"యని కవిత్వంగదా ప్రధానవిద్య అని సమస్యలు ఇస్తారు. 'శాస్త్రప్రసంగః కవే రుచ్చాటన మంత్రః' అని చర్చ చేస్తారు. బ్రాహ్మణ ముత్తయిదువులు యథాప్రకారం "విడెమనేవికారమేగాని గానుగపిండికి గలిగినంత కమ్మదనం వున్నాదషమ్మ!" అని తెలక పిండే తింటారు.

నాయకరాజుల పోషణలో వెలసిన నాటకాలు చాలామటుకు తెలకపిండివడియాలు!!

20

సవరం చిన నారాయణి



ధుర, తంజావూరునాయక రాజ్యాల సాహిత్య చరిత్రలు ఒక కొమ్మనే పూచిన రెండు పువ్వులై తే చెంజిచరిత్ర ఆకుచాటున దాగిన అరవిరి మొగ్గ. విజయనగరసామ్రాజ్యం స్థాపించిన కొద్ది రోజులనుండీ చెంజిపై తెలుగువాళ్ల అధికారం నెలకొంది. క్రీ. శ. 1355 నుండి 1377 దాకా పాలించిన మొదటి చొక్కరాయల కాలంలో కుమారకంపరాయలు దక్షిణ దిగ్విజయం చేశాడు. మధురను ఆక్రమించుకొన్న మహమ్మదీయులను తరిమివేయడమే ఆ దండయాత్ర ముఖ్యోద్దేశ్యం. అతనితోబాటు సాళువ మంగరాజు, గోపన్న మొదలైన సేనానులు వెళ్లారు. తుండీరమండలాన్ని జయించారు. చెంజిరాజ్యాన్నే తుండీరమండలం అంటారు.

ఆ కాలంలో చెంజిని కృష్ణాపురం అని పిలిచేవారు. ప్రక్కనే సింగవరం ఉండేది. సింగవరంకొండగుహలలో కొన్నాళ్లపాటు శ్రీరంగనాథుని

దేవాలయంలోని విగ్రహాలు ఉండేవి. మధురను మహమ్మదీయులు స్వాధీనం చేసుకొన్నప్పుడు శ్రీరంగంలోని పూజారులు భయపడి విగ్రహాలను తిరుపతికి చేరవేశారు. కుమారకంపరాయల సేనలో ఉన్న గోపన్నకు ఒకనాడు కల వచ్చింది. రంగనాథుడు కనబడి తిరిగి తనను శ్రీరంగంలో ప్రతిష్ఠించమని కోరాడు. తిరుపతినుండి విగ్రహాలను తీసుకొని మధ్యలో చెంజిలో మకాం చేసి గోపన్న శ్రీరంగానికి వెళ్లి విగ్రహాలను ప్రతిష్ఠించాడు. ఈసంగతి అనంతార్యుడు తన 'ప్రపన్నామృతం'లో చెప్పాడు.[1]

అయితే సాళువమంగరాజు ఈ పుణ్యకార్యం చేశాడని తెలుగు సాహిత్యంలో సాక్ష్యం ఉంది. పిల్లలమర్రి పినవీరయ్య తన జైమినిభారతంలో కంతోక్తిగా ఈ ఘనత సాళువమంగుకే దక్కించాడు (1-32). ఇతర దక్షిణదుర్గాలతోపాటు చెంజినికూడా సాళువ నరసింహుడు స్వాధీనం చేసుకొన్నాడు.[2] తొలిరాయల యుగంలోని పినవీరయ్యగారి జైమినిభారతం నుండి ఈ యుగంలోని చాపెర్ల అంకన్నదాకా అక్కడక్కడ తెలుగుసాహిత్యంలో చెంజిప్రస్తి కనబడుతుంది. అయితే యథాలాపంగా చెప్పిన ఈ కొద్దిపాటి భోగట్టాలవల్ల చెంజిచరిత్ర తెలియదు. ఇప్పటిదాకా ఎవరూ సమగ్రంగా చెంజినాయక రాజ్యచరిత్రను తెలుగులో వ్రాయలేదు. ఉన్నంతలో నిడుదవోలు సుందరేశ్వరరావుగారి వ్యాసమే విపులంగా ఉంది.[3] ఇంగ్లీషులో వ్రాసిన దానికికూడా ఆకరాలు . తక్కువకావడంవల్ల అది సంతృప్తికరంగా లేదు.[4] ఇతరప్రాంతాలచరిత్రలు వ్రాయించినట్టే కర్నల్ మెకంజీ జింజి గురించికూడా స్థానికచరిత్రను సేకరించాడు. 'కర్నాటకరాజాక్కళ్ సవిస్తార చరిత్తిరం' అనే పేరిట తమిళభాషలో నారాయణకోన్ అనే స్థానికుడు చాలా భోగట్టాలను కాగితంపైపెట్టాడు. దానిని మద్రాసుప్రాచ్యలిఖితగ్రంథాలయం

---

1. Sources of Vijayanagar History, P. 35.
2. 1bid P. 8.
3. సంగమాంధ్రవిజ్ఞానకోశం, 4వ సంపుటి - చెంజి కోట.
4. A History of Gingee and its Rulers by C. S. Srinivasachari, Annamalai University. Historical Series No. 12.

వారు 1952లో ప్రచురించారు. ఈకైఫీయతువల్ల చెంజిని పాలించిన నాయకరాజుల జాపితాను చరిత్రకారు లిలా రూపొందించారు.[1]

1. వైయప్పనాయకుడు	క్రీ. శ. 1490.
2. తుపాకీకృష్ణప్పనాయకుడు	క్రీ. శ. 1490_1520
3. అచ్యుతవిజయరామచంద్ర నాయకుడు	క్రీ. శ. 1520_1540
4. ముత్యాలనాయకుడు	క్రీ. శ. 1540_1550
5. వెంకటప్పనాయకుడు	క్రీ. శ. 1570_1600
6. వరదప్పనాయకుడు	క్రీ. శ. 1600_1620
7. ఆప్పానాయకుడు	క్రీ. శ. 1620_1648

ఈ జాపితా నిర్దుష్టమైనది కాదు. ఎస్. ఎమ్. ఎడ్వర్డ్సుగారు మరొక వంశావళిని సేకరించారు. ఎవరో ప్రాచీనలేఖకుడు పీచుకాగితాలపై మోడీ లిపిలో వ్రాసిన విషయాలను ఎడ్వర్డ్సుగారు 'ఇండియన్ ఆంటిక్వరీ'లో ప్రకటించారు.[2]

1. ముత్యాలనాయకుడు	క్రీ. శ. 1476
2. కృష్ణప్పనాయకుడు	క్రీ. శ. 1516
3. చెన్నమనాయకుడు	క్రీ. శ. 1536
4. విజయప్పనాయకుడు	క్రీ. శ. 1555
5. గంగమనాయకుడు	క్రీ. శ. 1580
6. వెంకటకృష్ణనాయకుడు	క్రీ. శ. 1605
7. వెంకటరామనాయకుడు	క్రీ. శ. 1625
8. త్రియంబకమల్లకృష్ణప్పనాయకుడు	క్రీ. శ. 1645
9. వరదప్పనాయకుడు	క్రీ. శ. 165[illegible]

రెండు జాపితాలలోనూ చాలా విభేదా లున్నాయి. ఈ రెండింటినీ సమన్వయం చేయాలంటే శాసనాల ఆధారం కావాలి. చెంజినాయక రాజుల

1. History of Gingee and its Rulers, Pp. 82_83.
2. Indian Antiquary Vol. 55 (1926) Pp. 1-2.

శాసనాలు చాలా కొద్దిగా బయటపడ్డాయి. సర్కారువారు వాటిని రిపోర్టు చేశారేగాని పూర్తిగా ప్రకటించలేదు. వాస్తవానికి చెంజినాయకరాజులలో కటపటివాడు వరదప్ప క్రీ. శ. 1660లో చేసిన దానశాసనం ఒకటి లభిస్తోంది.[1] మధురతాలూకా తిరుప్పరకుంద్రం సుబ్రహ్మణ్య స్వామిదేవాలయంలోని గోపురంకుడివైపు గోడమీద ఒకతెలుగుశాసనం ఉంది. దానిలో వరదప్పనాయకునిదాకా 25పురుషాంతరాల చెంజినాయకరాజుల వంశావళి వర్ణన ఉంది. ఈ శాసనాన్ని జయంతి రామయ్యగారు చంపూరామాయణ పీఠికలో కొద్దిగా ఉదాహరించారు.[2] క్రీ. శ. 1918 గెజిటు (శాసననివేదిక)లో మరికొన్ని వివరాలు ఉన్నాయి.[3] ఈ శాసనంలో వరదప్పనాయకుడు తన పూర్వులు మణినాగరపురంనుండి వలసవచ్చారని చెప్పాడు. అలహాబాదు దగ్గిర మణిఖ్‌పూరే ఈ మణినాగపుర మని చరిత్రకారులు గుర్తించారు.[4]

చెంజినాయకరాజులకేకాక సవరంవారనే మరొక వీరకుటుంబానికి కూడా మణినాగపురంతో సంబంధం కనబడుతోంది. క్రీ. శ. 1650ప్రాంతాలలో సవరం చిననారాయణ అనే ఉత్తమకవి కువలయాశ్వ చరిత్ర అనే జాతి వార్తాచమత్కారమయమైన ప్రబంధాన్ని వ్రాసి తన పెంపుడుతండ్రి పెదనారాయణకు అంకితంఇచ్చాడు. షష్ఠ్యంతాలలో ఇలా ప్రశంసించాడు:

మణినాగనగర కాంతున-కణుమధ్యాజన మనోజయంతునకు గుభృ
ద్గణ గణిత రామణీయక మణిఘృణి ఘణితాతిమంజిమ నికాంతునకున్.

[కువలయాశ్వ చరిత్ర, 1-63]

ఈ పద్యంలోని మణినాగనగరప్రశస్తిని గుర్తించి సవరం చిననారాయణకూడా చెంజిరాజ్యకుటుంబానికి చెందినవాడై ఉంటాడని నేలటూరు వెంకటరమణయ్యగారు సమన్వయంచేశారు.[5] చిననారాయణ తన కావ్యంలో

---

1. ARE 860 of 1917.
2. చంపూరామాయణం. ఋగ్వేదకవి వెంకటాచలపతి-పీఠిక, పుట 3.
3. G. O. No 99. 29-8-1916.
4. A History of Gingee. P. 78.
5. దక్షిణాంధ్ర సాహిత్యం, పుట 9.

తనతో కలుపుకొని ఏడుతరాల వంశవృక్షాన్ని యిచ్చాడు. తన ముతాత తిప్పరాజుగారు హిందూఖాన్ అనే తురక సర్దారుతో యుద్ధం చేసి జయించి నట్టు చెప్పాడు (1-32,33). తిప్పరాజుగారి కుమారుడు తిమ్మయ్యకూడా చాలా యుద్ధాలలో మహమ్మదీయసైన్యాలను జయించాడు (1-39నుండి41). తన తాతముత్తాతల శౌర్యాలను కీర్తించాడేగాని వాళ్లు ఏడుర్గాలవద్ద యుద్ధాలు చేశారో చిననారాయణ చెప్పలేదు.

కువలయాశ్వ చరిత్రలో కీర్తించిన వంశావళిలో కనబడడుగాని నవరం చిన్నప్పనాయకుడనే ఒక మహావీరుడు క్రీ.శ. 1568నుండి రాయసామ్రాజ్యపు కొలువులోఉన్నాడు. పెనుగొండ పెద్దకోటకు ప్రతి పిల్లకోట వాకిళ్లుబురుజులు అగడ్తలు మొదలైనవి కట్టించాడు. 1568 లో ఆదిల్షా దండెత్తినప్పుడు నవరం చిన్నప్పనాయకుడే ఎదిరించి జయించాడు. మళ్లి క్రీ. శ. 1576లో ఆలీ ఆదిల్షా పెనుగొండపై దాడి చేశాడు. అప్పుడు శ్రీరంగదేవరాయలు సిరిసంపదలన్నింటినీ తరలించుకొని చంద్రగిరికి వెళ్లిపోతూ పెనుగొండ రక్షణభారాన్ని నవరం చిన్నప్పపై పెట్టాడు. శకవర్షాలు 1499 ధాతసంవత్సర మార్గశిరబహుళపాడ్యమినాడు నవరం చిన్నప్ప ఆదిల్షాను జయించినట్లు ఒక శాసనంవల్ల తెలుస్తూంది.[1] ఇది క్రీ. శ. 21-12-1576కి సరిపోతుంది.

ఈ నవరం చిన్నప్పనాయకుడికీ, ఈ కువలయాశ్వ చరిత్రలోని నవరంవారికీ ఏమిటి సంబంధమో తెలియదు. ఇంతటి మహావీరుని గురించి చిననారాయణ ఎందుకుచెప్పలేదో బోధపడదు. కువలయాశ్వ చరిత్రలోనూ, మెకంజీకైఫీయతులలోని నవిస్తారచరిత్రలోనూ కనబడకపోయినా ఎన్. ఎమ్. ఎడ్వర్డ్సుగారు ప్రకటించిన చెంజినాయకరాజుల జాబితాలో క్రీ.శ. 1536నుండి ఒక చెన్నపనాయకుడు కనబడుతున్నాడు. పెనుగొండదుర్గాన్ని రక్షించిన చెన్నప్పనాయకుడే ఈ చెంజి చెన్నప్ప అని గుర్తించడానికి భావిపరిశోధన చాలా అవసరం. చెంజివారి మణినాగపురసంబంధం నవరంవారికి సంక్రమిం డానికి ఇదొక అవకాశం అయిఉండవచ్చు. ఇంకా ఇతరకారణాలు ఉన్నా యేమో పరిశీలించాలి.

నవరం చిననారాయణ తన తాత తిమ్మరాజుగారుఎందరో యవనులకు వీరస్వర్గం కల్గించినట్లు వ్రాశాడు. స్వర్గానికెళ్లినా నవితిపోరు తప్పవచ్చుగాని

1. దక్షిణభారతశాసనసంపుటి, భా. 7. నంబరు 563.

తురకపోరు తప్పదు. తిమ్మరాజుగారి 'చికిలిదోదమ్మి దారి బలిమి దెగటారి' తురకలు స్వర్గానికి వెళ్లి దేవవేశ్యలను బాధించారట. మంజుఘోషను మోచేత్తో కొట్టారు. ఘృతాచిని దేశీయపుతిట్లు తిట్టారు. తిలోత్తమ ముచ్చెవాట్లు పడింది. ఊర్వశి చౌకు వేట్లు పడింది. స్వర్గం తారుమారైంది. అమర నాయకునిపై కాక పాదుషాపై ఆశ పల్లవించింది. రుద్రవీణల బదులు రబాబులు మారుమ్రోగాయి. అబ్జహితుని వివిధనామాలు మాటుమణిగి కర్తారుశబ్దమే రూఢికెక్కింది. యవనుల దారుణాల గురించి చెప్పుకుంటూ మగ్గంలో కండెలాగా నారదుడు తిరుగుతాడట. ఓననారాయణ ఇలా రస కల్పన చేశాడు.

నికరంబు పాపోసులకు ప్రొద్దుక్రమనుచు దే
వేంద్రనందను బట్టి యీడ్చిరనుచు
జ్యేష్టలుమాని దేశీయముల్ వినిపించు
మంచు దుంబురు నడ్డగించి రనుచు
సారాయికోపెర గంజాపొడుల్ దెమ్మంచు
నంగడుల్ వడి గొల్లలాడి రనుచు
లాయంబులో బసుల్ గావింప రమ్మంచు
హరిణితో గడునెగ్గులాడి రనుచు
దిమ్మనృపహతయవను లొందించులూటి
నమరపురి జేరవెరచు దిశాధిపతుల
కెరుగజేయంగ నచ్చటి కిచ్చటికిని
నారదుం డాసుగ్రోవిచందమున దిరుగు. [కువల - 1-41]

స్వర్గంమాట సత్యం కాకపోయినా క్రీ. శ. 1600 ప్రాంతాలలో తెలుగు దుర్గాలలో పరసేనల జులుం యీ పద్యాలవల్ల తెలుస్తాయి. సవరం తిమ్మ రాజుగారు ఏ తురకసర్దారులను జయించాడో తెలిస్తే మరికొంత స్పష్టంగా వీళ్లచరిత్రను చెప్పుకొనేవాళ్లం. ఈ తిమ్మరాజుగారికి ఆరుగురు భార్యలు, ఎనమండుగురు కొడుకులు. వీళ్ళలో రెండో భార్య మూర్తిమాంబ కుమారుడే పెదనారాయణ. ఇతడు కర్నాటకాధీశ్వరదయాసాంద్రుడు. క్రీ. శ. 1630-42దాకా రాయసింహాసనాన్ని అధిష్ఠించిన మూడవ వెంకటపతిరాయ

లకు విశ్వాసపాత్రుడు. అతనికరుణవల్ల చాలా పలుకుబడి సంపాదించాడు. ఏవో యుద్ధాలలో పాల్గొని 'వయిఖందుఖాననప్తాంగహరణు' డనే బిరుదు పొందాడు (1.16). ఇతని ప్రాభవాన్ని చిననారాయణ ఇలా వర్ణించాడు:

తనమాట కాంచికాతంజాపురీమధురాధినాథులకు నెయ్యంబు నెరుప
దనచీటి గోలకొండనరేంద్రముఖధరాధవపద్మబంధు లౌదల దలంప
దన కీర్తి మట్లనంతన్నృపాల ముఖ్య గోత్రామ రేంద్రులు గొనియాడికొనగ
దన దానగుణము గోదావరీతీరభూనిర్జరేశ్వరులు వర్ణించుకొనగ
వెలయు వేదండగండనిర్గళదనర్గళ మదధారాధునీనాథకుంభబంధు
కార్యకర్కండిమారావధుర్యసైన్య-డతడుప్రభుమాత్రుడే నారనాధిశేత.
[కువల. 1_60]

ఈపద్యంలో కంచి,తంజావూరు,మధుర,గోల్కొండ,సిద్ధవటం,గోదావరీ ప్రాంతాలు పేర్కొన్నా ఆనాటి ముఖ్యరాజ్యాలలో ఒకటైన చెంజిని చిననారాయణ పేర్కొనలేదు. అందుచేత పెదనారాయణ పాలించిన ప్రదేశం తుండీర మండలంలోని భాగమేమో అని అనుమానించ వచ్చు. క్రీ.శ. 1630 దాకా చెంజినాయకరాజులు రాయసింహాసనాన్ని ఎదిరిస్తూ వచ్చినా వీరవెంకటపతిరాయల కాలంలోనే చెంజి అత్యంతవిశ్వాసంగా కర్ణాటక చక్రవర్తికి సహాయం చేసింది. వీరవెంకటపతిరాయల కరుణకు పాత్రమైన చెంజి రాజ్యం చక్రవర్తికి మరీ ఆత్మీయంగా మారడం చూసి మధుర తంజావూరునాయకరాజులే కన్ను కుట్టుకున్నారు. మిత్రభేదం పెట్టడానికి కుట్ర పన్నారు.[1]

పరులు అసూయచెందేటంత పలుకుబడితో చెంజిగాని, సవరంవారు గాని క్రీ. శ. 1635నుండి 1642 దాకా వెలుగువెలిగారు. బహుశా ఆ మధ్య కాలంలోనే చిననారాయణ కువలయాశ్వచరిత్రను రచించి పెదనారాయణకు అంకితంఇచ్చాడు. పెదనారాయణకు పిల్లలు లేరు. అతనికి శ్రీరంగరాజు, కృష్ణంరాజు అనే ఇద్దరు సవతిఅన్నగార్లు ఉన్నారు. రంగరాజుగారి ఏడు గురు కుమారులలో చిననారాయణ ఒకడు. కృష్ణంరాజుగారి నలుగురు

1. Further sources of Vijayanagar History, Pp 340_341.

కొడుకులలో మూడవవాడు వెంకటపతి. ఈ ఇద్దరినీ పెదనారాయణ పెంచుకొన్నాడు. తండ్రితరువాతనో, తండ్రితోపాటో వెంకటపతి రాజ్యం చేశాడు. ఇతణ్ణి తంజావూరు విజయరాఘవుడు ఓడించాడు. ఈ విజయాన్ని అతని ఆశ్రితులు కీర్తించారు.

వీరుడౌ సవరము వెంకటపతిని _ పారదోలించి నీపనుపులచేత
బట్టైన సీమలో బందనల్లూరు _ కట్టించితివి ఘటికామాత్రమునకె.

[రఘునాథనాయకాభ్యుదయం, 1_182 నుండి]

మరీదక్షిణాన తెంకాసి - కుర్తాలంవద్ద ఒక పందనల్లూరు ఉంది. ఇది విజయరాఘవుని అన్నగారు ఏలుకొన్న గ్రామం.[1] ఈ పందనల్లూరులోనే నవరం వెంకటపతి ఓడిపోయాడని చరిత్రకారులు భావిస్తున్నారు.[2] అయితే చెంజికీ, సవరంవారికీ ఏదైనా సంబంధం ఉందనుకొంటే తుండీరమండలం వాలాజాపేటలోని పాండ్యనల్లూరే ఈ పందనల్లూరని భావించవచ్చును. పెంపుడుతండ్రీ, సోదరుడూ ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నా చిననారాయణ మాత్రం కలమేగాని కత్తి పట్టుకొన్నట్టు కనబడదు. ఎప్పుడూ భారతం, భాగవతం మొదలైన గ్రంథాలు వినడంలోనే కాలం గడిపాడు. తన గద్యలో 'సంతత భారతభాగవతాదిశ్రవణానంద' అనే విశేషణం వాడుకొన్నాడు.

చిననారాయణ సరసకవితావైభవుడు. జాతివార్తాకవిజనామోదసంధాయకుడు. ఏ కావ్యంలోనైనా కొన్నిచోట్ల శబ్దనిగుంభనాలు, కొన్నిచోట్ల యుక్తిక్రియాగౌరవాలు, మరికొన్నిపట్లలో అవసరమైన రసప్రకరాలు కనిపిస్తేనే అది ఆహ్లాదమవుతుందని అతనికి తెలుసు. ఆంధ్రప్రబంధహేలానిధులైన కవిత్రయంవారినీ, శ్రీనాథనాచనసోములను అతడు క్షుణ్ణంగా చదువుకొని కవితారహస్యాలు తెలుసుకొన్నాడు. బహువిధకథావిచిత్రమైన కువలయాశ్వ చరిత్ర అనే కావ్యాన్ని సరసజనసేవ్యంగా వ్రాయాలని సంకల్పించుకొన్నాడు.

నిజంగా ఈ కావ్యంలో కథావైచిత్రి కనబడుతుంది. ఇది సరసజనసేవ్యమనే చెప్పాలి. చిననారాయణ తీసుకున్న కథ చాలా పాతదే.

---

1. Nayaks of Tanjore by Vriddha Giresam, p 127.
2. రఘునాథనాయకాభ్యుదయం, వేలటూరివారి ఇంగ్లీషు పీఠిక, పుట 32.

మార్కండేయపురాణంలో మదాలసకథ వుంది. ఆమె కువలయాశ్వుని ప్రేమించి పెళ్లిచేసుకొని వియోగం పొంది మళ్లా కలుసుకొంది. ఈ కథను మారన తన మార్కండేయపురాణంలో సుమారు 200 గద్య పద్యాలలో చెప్పాడు (2 : 254 - 3 : 100 దాకా). ఆయన చెప్పిన కథ టూకీగా ఇది:

పూర్వం శత్రుజిత్తు అనే రాజు ఉన్నాడు. అతనికి బుుతధ్వజుడనే కుమారుడున్నాడు. ఆ రాకుమారుడు మిత్రులతో వివిధవిహారాలు చేస్తూఉండేవాడు. అతనితో నేస్తంకట్టాలని నాగలోకంలోని వాళ్లుకూడా ఉవ్విళ్లూరేవారు. నాగలోకాన్ని అశ్వతరుడనే రాజు పాలించేవాడు. అతని కొడుకులు మారువేషం వేసుకొని బుుతధ్వజుని స్నేహం చేసి హాయిగా ఉంటూ ఉండేవారు. పగలు భూలోకంలో గడపి రాత్రి నాగలోకానికి వచ్చేవారు. ఒకసారి కొడుకులు ఇంట్లో కనబడకపోయేసరికి అశ్వతరునికి సందేహాంకల్గింది. "ఏమిరాఅబ్బాయిలూ, రోజల్లా ఎక్కడ గడుపుతున్నారు" అని అడిగాడు. "బుుతధ్వజునితో విహరిస్తున్నా"మని చెప్పి, వాళ్ళు అతణ్ణి కీర్తించారు. అతడు ఉపకారపరుడు, స్నేహబాంధవుడు, గుణశాలి అని కొడుకులు చెప్పగానే అశ్వతరుడు ఆనందించాడు. "అటువంటి స్నేహితునికి మీ రేం ప్రత్యుపకారంచేశా"రని అడిగాడు.

నిజానికి బుుతధ్వజుడు చాలా కష్టాలలో ఉన్నాడు. అయితే అతణ్ణి ఆదుకొనేవాళ్ళెవరూ లేరు. ఆ త్రిమూర్తులు తప్పించి అతని కష్టాన్ని పోగొట్టలేరు. ఈ విషయం తన కుమారులు చెప్పగానే అశ్వతరుడు బాధపడ్డాడు. "మీ స్నేహితునికి వచ్చిన ఆపద ఏమిటో చెప్పండి" అన్నాడు. కొడుకులు చెప్పారు:

శత్రుజిత్తుమహారాజు వద్దకు ఒక అపురూపమైన గుర్రాన్ని వెంట పెట్టుకుని గాలవుడనే ముని వచ్చాడు. తమ ఆశ్రమంలో ఒక రాక్షసుడు నానాగొడవా పెడుతున్నాడని మొరపెట్టాడు. ఆ రాక్షసుడు నిజరూపంతో రాడు. సింహంలాగ, పెద్దపులిలాగ ఆకారంధరించి వస్తాడు. వాణ్ణి ఎవరు సంహరిస్తారా అని ముని దుఃఖపడుతూఉంటే ఆకాశంనుంచి ఒక గుర్రం దిగివచ్చింది. ఆకాశవాణి ఆదేశాన్ని ఇచ్చింది. "ఈగుర్రాన్ని

తీసుకువెళ్లి శత్రుజిత్తుకుమారుడు బృహద్ధ్వజునికి సమర్పించు. అతడు దీన్ని ఎక్కి ఆ రాక్షసుణ్ణి సంహరిస్తాడు" అని గగనవాణి పల్కింది. ఆ గుర్రంపేరు కువలయాశ్వం అని చెప్పింది. గాలవుడు దాన్ని శత్రుజిత్తుకు ఇచ్చాడు. రాజు తన కొడుకుకు ఇచ్చాడు. కువలయంఅనే గుర్రాన్ని అధిగోహించడంవల్ల బృహద్ధ్వజునికి కువలయాశ్వ డనే పేరు వచ్చింది.

గుర్రం ఎక్కి కువలయాశ్వుడు మునితో ఆశ్రమానికి వెళ్లాడు. రాక్షసు డొక ఉగ్రవరాహరూపం దాల్చాడు. వాడిని కువలయాశ్వుడు వెంటతరిమాడు. ఆ వరాహం పాతాళంలోకి వెళ్లింది. కువలయాశ్వుడు కూడా పాతాళంలోకి వెళ్ళాడు. వరాహం కనబడలేదుగాని వయ్యారిని చూశాడు. ఆమె రసాతల దేవతో, రసమయశ్రీయో అని కువల యాశ్వుడు అనుకున్నాడు. అతడు మారుడో, జయంతుడో అని ఆమె అనుకొంది. వచ్చినవాడికి హృదయం ఇచ్చేసి ముచ్చటగా మార్చ పోయింది. అప్పుడు కుండలఅనే చెలికత్తె సేవ తేర్చింది. 'ఈ జవ్వని ఎవ్వరు? ఏమి టీ ఈ అమ్మాయికథ?' అని కువలయాశ్వుడు అడిగాడు. కుండల ఇలా చెప్పింది:

విశ్వావసు డనే గంధర్వరాజు ఉన్నాడు. అతనికి మదాలస అనే కుమార్తె ఉంది. ఆమె ఒకనాడు తోటలో విహరిస్తున్నప్పుడు పాతాళకేతు డనే రాక్షసుడు మరులుకొని మాయాబలంతో ఎత్తుకు పోయాడు. పాత్ర కోరాడు. పాతాళంలో పెట్టాడు. మదాలస మరణించా లని అనుకొంది. అయితే ఈ రాక్షసుని చంపినవాడే ఆమెకు భర్త అవుతాడనే సంగతి తెలుసుకొని ఆ ప్రయత్నాలు మానుకుంది. కుండల వింధ్యాకేతుని కూతురు. పుష్కరాలి భార్య. అతణ్ణి ఎవడో రాక్షసుడు చంపేశాడు. భర్తో పాటు పుణ్యలోకాలకు పోతున్నప్పుడు మూకరరూపంలో నున్న పాతాళకేతుణ్ణి రాజకుమారుడు వెంటతరమడం ఆకాశంలోంచి చూసింది. పాతాళందాకా అనుసరించింది. మదాలసకథను

చెప్పాక కుండల 'అయ్యా, మీ రెవరు?' అని అడిగింది. అతడు చెప్పాడు. 'బాబూ, మీ మదాలసను మీరు పెళ్లిచేసుకొండి. దీని పెళ్లి అయిపోతే నేను పోయి తపస్సు చేసుకొని చనిపోయిన భర్తను పొందాలి.' అని కుండల చెప్పింది. సమ్మతించి కువలయాశ్వుడు మదాలసను పెళ్ళి చేసుకున్నాడు. కుండల తపస్సుకు తూర్చుంది. దివ్యగతికి వెళ్లింది.

మదాలసను గుర్రంమీద ఎక్కించుకుని కువలయాశ్వుడు వెళ్లిపోయాడు. పాతాళకేతుడు తెచ్చిన పిల్లను ఎవరో మానవుడు తీసుకుపోతున్నాడని రాక్షసులలో కలకలం రేగింది. పాతాళకేతువు సేనలతో అడ్డగించాడు. కువలయాశ్వుడు అందర్నీ సంహరించాడు. పెళ్లికూతురితో రాజధానికి వెళ్లాడు. తండ్రి సంతోషించాడు. దంపతులు సుఖంగా ఉన్నారు. అయితే దానికి అంతరాయం కల్గింది.

కువలయాశ్వుడు గుర్రా న్నెక్కి రోజూ కొన్నిగంటలు భూప్రదక్షణం చేసి శాంతిభద్రతలు కాపాడేవాడు. ఒకనాడు తడలా సూచరిస్తుండగా ఒక మాయామునిని ఎదురుపడ్డాడు. వాడు పాతాళకేతుని తమ్ముడు; తాళకేతుడు. అన్నచావుకు ప్రతీకారం చేయాలని నిశ్చయించాడు. కువలయాశ్వుని చూసి 'అయ్యా, నేను యాగం చేసుకొంటాను. దక్షిణగా మీ మెడలో ఉన్న కంఠహారం ఇవ్వండి' అన్నాడు. కువలయాశ్వుడు ఇచ్చాడు. 'ఇప్పుడే స్నానం చేసివస్తాను, నా ఆశ్రమాన్ని అంతదాకా కాపాడుతూ ఉండండి' అని పురమాయించి కంఠహారాన్ని పట్టుకొని పాతాళకేతుడు వెళ్లాడు.

ఇక్కడ నదిలో మునిగి, మదాలసదగ్గర తేలాడు. 'నీ భర్త మరణించాడు. అతనికి కొందరు శూద్రమునులు అగ్ని సంస్కారం చేశారు. ఇదిగో అతని కంఠహారం' అని తాళకేతువు చూపించాడు. ఆ వార్త వినగానే మదాలస గుండెపగిలింది. మరణించింది. కొడుకూ, కోడలూ ఇద్దరూ మరణించారని రాజదంపతులు వైరాగ్యం పొందారు.

పగ తీర్చుకొని తాళకేతుడు తన దొంగఆశ్రమంవద్దకు వచ్చాడు. అంతదాకా కువలయాశ్వుడు అక్కడే ఉన్నాడు. 'అయ్యా,చూడు, నువ్వు కదలకుండా వుండడం వల్ల నాకోరిక తీరింది. ఇంక వేంచెయ్యి' అని రాక్షసుడు వీడ్కోలు చెప్పాడు. ఇంటికి వచ్చిన కువలయాశ్వుడు బావురుమన్నాడు. 'నా మరణవార్త వినగానే భార్య ప్రాణాలువిడిచింది. ఆమె మృతిచెందిన వార్త తెలిసి ఇంకా జీవిస్తున్నాను. నా గుండె ఎంత కఠినమైనది?' అని అతడు వాపోయాడు. భార్యకు అంత్య క్రియలు చేశాడు. ప్రాణముండగా రెండోపెళ్లి చేసుకోనని శపథం చేశాడు.

తమ మిత్రునికి ఇంత కష్టమొచ్చిందని ఈకథనంతా నాగకుమారులు తమ తండ్రికి చెప్పారు. "అతని ఈడువాళ్లం మేము పొందే సుఖాలు అతనికి లేవు. ఈ కష్టంమరపించడానికి కువలయాశ్వునితో పొద్దుపుచ్చుతున్నాం" అని వివరించారు. అశ్వతరుని గుండె కరిగింది. ఎలాగైనా మదాలసను తెచ్చి కువలయాశ్వునికి ఇవ్వాలని అనుకున్నాడు. సరస్వతీదేవిని ప్రార్థించి గానప్రావీణ్యం పొందాడు. ఆ పాటతో శివుణ్ణి మెప్పించాడు. కావలసిన వరం కోరుకో మన్నప్పుడు మదాలస తన కుమార్తెగా ప్రభవించాలని అర్థించాడు. శివుడు వరమిచ్చాడు. పుత్రిక జనించింది.

తరువాత కొన్నాళ్ళకు అశ్వతరుడు కొడుకులని పిలిచి 'మీ స్నేహితుణ్ణి తీసుకురండి' అన్నాడు. వాళ్ళువెళ్ళి కువలయాశ్వుని తీసుకువచ్చారు. అశ్వతరుడు ఆతిథ్యంయిచ్చి 'అయ్యా, నీ కేం కావాలి?' అన్నాడు. 'మీ దయవల్ల నా కేం కొరత !' అన్నాడు కువలయాశ్వుడు. 'నీ మదాలసను నీకిచ్చి వివాహం చేస్తాను' అన్నాడు అశ్వతరుడు. "చచ్చినవాళ్లని మళ్ళీ తేగలవా! మాయ కాదుకదా" అని కువలయాశ్వుడు ఆశ్చర్యపోయాడు. 'పోనీలేండి. మాయామాపంలో ఉన్నా నా మదాలసను చూస్తేచాలు' అన్నాడు. అశ్వతరుడు ఆమెను

చూపించి మళ్ళీ ఎలా పుట్టిందో వివరించాడు. కువలయాశ్వమదాలసతో వివాహం చేశాడు.

ఇదీ మార్కండేయపురాణంలో మారన చెప్పిన కథ. ఈ ఇతివృత్తాన్నే తీసుకుని మార్పులుచేసి చిననారాయణ చాలా రసవంతంగా రచించాడు. మూలంలో నున్న శత్రుజిత్తుమహారాజు సంగ తేం చిననారాయణ చెప్పలేదు. పూర్వం సాకేతపురం వుంటేదని చెప్పాడు. దానిని ఇరవై పద్యాలలో వర్ణించాడు (1-69 నుండి 1-88 దాకా). నగరాన్ని పెళ్ళిపందిరితో నరి పోల్చి, కళ్యాణమని ఎత్తుగడ లోనే చెప్పాడు (1-70). ఆ సాకేతనగరాన్ని బుుతధ్వజుడు పాలిస్తున్నాడని ప్రకటించి అయిదు పద్యాలలో అతణ్ణి వర్ణించాడు. ఆ తరువాత వేసవి వచ్చిందని చెప్పి దాన్ని 11 పద్యాలలో వర్ణించాడు. దాంతో మొదటి ఆశ్వాసం అయిపోయింది.

రెండో ఆశ్వాసంలో బుుతధ్వజుడు కొలువు సింగారమై సభలోకి వచ్చాడు. అతనివద్దకు గాలవుడు కువలయాశ్వాన్ని తీసుకొనివచ్చి పాతాళ కేతుని అక్రమాలు చెప్తాడు. అంతకుముం దా రాక్షసుడు చాలా వినయ విధేయతలతో ఉండేవాడట. ఉన్నట్టుండి ప్రాణగొడ్డమయ్యాడు. వాడిలో వచ్చిన మార్పుని గాలవుడు ఇలా చెప్పాడు:

పొడగన్న సాష్టాంగముగ వ్రాలి చనువాడె ఎదురుగా రారంచుబదరసాగె
బిలిచిపెట్టిన వన్యభిక్ష గైకొనువాడె కోరిపెట్టరటంచు గొణగసాగె
నిలుచుండి చంక చేతులు కట్టుకొనువాడె కొలువరా రేమంచు గెలయసాగె
వినయంబుతో చేరి పని ఏమి యనువాడె యరయ కడ్డాదిడ్డు లనుపసాగె
దన వచోదోషము క్షమింపు డనువాడె, యేమనిన లేనివాతప్పులెంచసాగె
వినుము మహికాంత కొండంత పనికైనబలుకు లేటికి గిల్లాకుపనుపసాగె.

[కువల. 2-24]

ఇలా ఏకుమేకై కూర్చున్న పాతాళకేతుడు ఒకసారి ఆశ్రమంలో నానాగొడవా చేశాడు. ఒక అడవిలేడికి పొద్దులవేళ. మునికన్యలంతా అ ముచ్చటలో ఉన్నప్పుడు రాక్షసుడు పేరంటాలి రూపంలో ప్రవేశించి సింహం

లాగ మారిపోయాడు. అంతా గగ్గోలుపడ్డారు. వాణ్ణి శపిద్దామా అని గాలవుడు అనుకొన్నాడట. ఆయినా 'కుమ్మరి కొక్క యేడునుం గుదియ కొక్కపెట్టు' అన్నట్టు ఎన్నో ఏళ్లు కష్టపడి సంపాదించిన తపశ్శక్తులు వాడిమీద వృథా చేయడం ఎందుకనుకున్నాడు. అప్పుడు ఆకాశంనుండి గుర్రం వచ్చింది. అశరీరవాణి సలహా యిచ్చింది. గాలవుడు గుర్రాన్ని బృహధ్వజునికి యిచ్చాడు. అతడు కువలయాశ్వుడు అయ్యాడు.

అతడు గుర్ర మెక్కి ఆశ్రమానికి వెళ్లాడు. ఇతర మునులకు నమస్కరించాడు. వాళ్ళు ఇలా అన్నారు :

అయ్యయొ మాపు దండమిడినంత ఫలంబున రేంద్ర యీ
దయ్యముతోడి జాగరము డాటగ జేసి సుఖమ్ము లిమ్ము లే
వయ్య కొమాళ్ళ తండ్రి వయి యాశ్రితరక్షణ దుష్టశిక్షణా
క్షయ్యదయాపరాక్రమ విశాలుడవై మనుమయ్య యిమ్మహిన్.[కువల.2_78]

రాజు ముందు వెళ్ళాక సైన్యం తరువాత వచ్చింది. ఆశ్రమందగ్గిర విడిసింది. కువలయాశ్వుడు డేరిజవేయించి గుడారాలు ఎత్తించాడు (2-84). ఈ దండు ఎలా విడిసినదీ చిననారాయణ చాలా వివరంగా 33 గద్యపద్యాలలో వర్ణించాడు (2-84 నుండి 116 దాకా). తరువాత దానవసేనవర్ణన. తెల్లవారింది. జానకితాళ్ళు, తుపాకులు, ఫిరంగులు మొదలైనవాటితో యుద్ధం జరిగింది. ఇది చూస్తున్న శౌనకుడు, విశ్వామిత్రుడు మొదలైన మునులు తమలో తాము పందాలు వేసుకొన్నారు. ఈ యుద్ధం ముగియకముందే అశ్వాసం ముగిసింది.

మూడో ఆశ్వాసంలో రాజు ముత్తిక వేయించాడు. దానవుని కోట లగ్గలుపట్టించాడు. తుపాకిగుళ్ళు కురిపించి రాక్షసులను గెలిచి రాజు కోటలోనికి ప్రవేశించాడు. మేడలు మిద్దెలు గుళ్ళు గృహాంగణాలు చూసుకొంటూ వెడుతూ ఉంటే ఒక చోట ఇద్ద రాడువారి మాటలు వినిపించాయి. తన గురించే మాట్లాడుకొనే ఆ ఆడవాళ్ళు మదాలసా, ఆమె చెలికత్తె కుండల ఇంతకుముందే ఎప్పుడో బృతుధ్వజుడు వేటకు వెళ్ళినప్పుడు చూసి మదాలస మరులుకొందట. అతడు మాత్రం చూడలేదు. ప్రేమించిన క్షణంనుంచీ

ఆమె విరహంలో మునిగిపోయింది. ఆతణ్ణి పెళ్ళాడగలనా అని తలపోస్తున్న మదాలసను పాతాళకేతుడు ఎత్తుకువచ్చాడు. వాణ్ణి ఋతధ్వజుడు ఓడిసున్నాడు, ఇంక వస్తాడని కుండల చెప్తుంది.

రాజు ఆ మందిరంలో ప్రవేశించాడు. 'మీ రెవరు?' అని అడిగాడు. కుండల కథ చెప్పింది. కథేం ఖర్మ? కావ్యమే చెప్పింది. 3.65 నుండి 4-43 దాకా 144 గద్యపద్యాల్లో వనవిహారం, ప్రియదర్శనం, విరహం, ఉపాలంభనలు, రాక్షసుడు ఎత్తుకుపోవడం వగైరాలన్నీ చెప్పింది. మదాలసను పెళ్ళిచేసుకోమని అర్థించింది. మదాలసతోపాటు కుండలను కూడా తీసుకొని తన రాజ్యానికి వెళ్ళాడు.

పాతాళకేతుడు మరణించిన సంగతి అతని తమ్ముడు తాళకేతునికి విచిత్రంగా తెలిసింది. వాడు ఇంద్రుని వద్దకు ఒక రాయబారిని పంపాడు. దేవవేశ్యలలో తారారంభలు మంచి హుషారైనవాళ్ళు. వాళ్ళను తనకు అప్పచెప్పమని శ్రీముఖం పంపాడు. వెళ్ళిన రాయబారికి దేవసభలో ప్రవేశం కలుగలేదు. వాడు పడ్డ పాట్లు ఇన్నీ అన్నీ కావు.

దొర కాప్తులై కార్యసరణి తెల్సెండి కవీశ్వరులకు లంచపంచంబు లొసగి
సమ్ముఖమ్మునను౦డిచను దెంచు నలఘ్రాయసము వారి కాశపాశలు ఘటించి
బోనవెచ్చము గొంచుబోవు శచీదేవిదాదులకును బరిధానమిచ్చి
పిలువ నేతెంచు వేగులవారి వెంటనే యురుగు నియోగుల ననుసరించి
కినిసి వాకట వారడ్డగించుకతన_నేను వచ్చిన మాట దేవేంద్రుతోడ
దెలుపుమని యెంత వేడిన దెలుపరికి_విని విసమి చేసినోగాని వేల్పురేడు.

[భకల. 4_61]

చివరకు శుక్రాచార్యుని సహాయంవల్ల దేవేంద్రునివద్దకు వెళ్ళిన ఆ రాయబారి తన దొరగారి కోరికను చెప్పాడు. దేవేంద్రుడు నవ్వాడు. వాడి అయ్యగారి అన్న చచ్చి వాళ్ళ దగ్గిరకు చేరుకున్నాడని చెప్పాడు. రాయబారి తెచ్చిన ఈ వార్త విని తాళకేతు ఆగ్రహించాడు. మదాలసకోసం అన్నగారు వెళ్ళడం వాడికి తెలుసు. ఆ యువతిమూలంగానే పాతాళకేతు మరణిం

చాడు కనుక అమెకు హాని చెయ్యా లనుకొన్నాడు. మాయా మునివేషంతో కువలయాశ్వుని వద్దకు వెళ్ళి తన యాగం రక్షించమన్నాడు. గుర్రం మీద వాణ్ణి కూడా ఎక్కించుకొని రాజు కదిలాడు. అది పౌరకాంతలు చూశారు. "అయ్యో, నిన్న గాలవునితో వెళ్ళాడు. కొత్తపెళ్ళికొడుకైనా ముద్దూ ముచ్చటా లేకుండా మౌని వెంట వెడుతున్నాడే" అని నొచ్చుకున్నారు.

దొర నయ్యోద నని కోరుదు_రరయగ జను లెవ్వరైన నా పెనుబెడదల్
పరికింపరు దొరతనపున్_సరవుల్ మరి కత్తిమోది సాములు సుమ్మా.

[కువల. 4_82]

రాజరికం అంటే రసికునిలాగా భోగించడం కాదని తెలియజేసే ఇంకో పద్యం చిననారాయణ రచించాడు. మంత్రులకు మర్మకర్మాలు ఎరిగించడం, ఈతిబాధలు లేకుండా చూడడం మొదలైన రాచకార్యాలలో శ్రద్ధ చూపాలి గాని 'మనసువచ్చిన మిటారి కూడి తమిమీర నయ్యాటలాడి కొనుచు నడువ గూడునె మేదినీ నాయకులకు' అని పౌరకాంతలచేత అనిపించాడు (4-83).

మాయామునితో కువలయాశ్వుడు వెళ్ళాడు. మోసపోయి మణిహారం ఇచ్చాడు. కుండలతో పాటు మదాలసను మాయావిమానం ఎక్కించుకొని తాళకేతుడు ఎగరేసుకు పోయాడు. వారిని బంధించి బలవంతులను కాపు పెట్టాడు. తిరిగి వచ్చిన కువలయాశ్వుడు 'అక్కట యెందు బోయెనో యెయారపునంచుల ముద్దుగుమ్మ' అనుకున్నాడు. ఆ నడలు, ఆ మెరుంగు తొడలు, ఆకడగంటన చూచు సోయగాలు' అని తలచుకున్నాడు.

కైజా చేసిన బొండుమల్లె విరిబల్ఖండాజగాజోదుతే
జీజాడం దల వాంచి బోటి చెరగుం జేగటిగా జుటి ను
న్గాజుం గంబము చాటున న్నిలిచి క్రేగంట న్నుం జూచు నం
భోజాతాక్షిని సెజ్జకుం దిగుచు నేప్పుల్గల్గునే మీదటన్? [కువల. 4_99]

రాచకార్యాలు మానేసి చింతాక్రాంతు డయ్యాడు. అతని స్నేహితులు నాగకుమారు లీ దురవస్థ చూచి తమ తండ్రితో చెప్పారు. తనయుల స్నేహ

లాంఛనవిధానము లెంచి ఉపకారం చేయడానికి అశ్వతరుడు కైలాసానికి వెళ్ళాడు. పార్వతితో పరమేశ్వరుడు చదరంగం ఆడుతున్నాడు. గొప్ప పాటగాడు వచ్చాడని ఆడుతున్న ఆట అలా ఉంచారు.

మంచిది సగటుపై నిదె మంత్రికావ_లున్నదీచదరంగ మిట్లుండనిమ్మ్ము
పెనుక నాడుదమని సతివనజనయన-యభిముఖంబుగ గూర్చున్న యవసరమున.

[కువల. 4_108]

అశ్వతరుని పాట విని పార్వతి మెచ్చుకొంది. అడిగినవరం ఇవ్వ బోయింది. అయితే సవతి మీద ఉండే అసూయకొద్దీ గంగ అడ్డుపడింది. పరమేశ్వరుడు తుని తగవులాగ నర్దిపెట్టాడు. మదాలస ముందు విడుదల పొందుతుందని, తరువాత కుండలకు విమోచనం లభిస్తుందని చెప్పాడు. మూలంలో కుండలను అసలు రాజ్యానికి తీసుకురావడంగాని, ఆమెను తాళకేతుడు తీసుకుపోవడంగాని లేవు. ఆమెనుకూడా అనంతరకథలో చేర్చడంవల్ల చిననారాయణ ఈ మార్పు చేశాడు. కుండల ఆలస్యంగా రాడాని కొక కారణం కల్పించి, వచ్చే విధానాని కొక ప్లాటు సృష్టించాడు.

స్వర్గంలో తార అనే దేవవేశ్య ఉంది. ఆమె అందాన్ని జయంతుడు గుత్తకు పుచ్చుకొన్నాడు. తాడుకట్టినవాని చందాన ఏలుతున్నాడు. ఆమె నలకూబరునిపై మరులుకొంది. చాటుగా చీట్లు వ్రాసి మాటుగా రప్పించు కొంది. నారదుడు ఈ రహస్యాన్ని వెల్లడిచేశాడు. తారకోసం నలకూబరుడూ, జయంతుడూ కొట్లాడుకొన్నారు. అయితే చివరలో ఇద్దరూ తాళకేతును సంహరించి కుండలను రక్షించారు. ఈ కథ అనవసరం అయినా హాయిగా 114 గద్యపద్యాలలో (4:176-5:76 దాకా) చిననారాయణ కథనం చేశాడు. ఇది పూర్తిగా నాయకరాజుల యుగంలోని రాజకుమారులు భోగపుసానుల కోసం పెట్టుకొనే జగడాలను చిత్రిస్తుంది. అడుగడుగునా ఆ వాతావరణం కనబడుతుంది. ప్రతి పద్యంలోనూ వాస్తవికత తాండవిస్తుంది.

ఈ ఘట్టంలోనే కాదు-కువలయాశ్వచరిత్రలో ఎక్కడచూసినా కవికి ఉన్న అసమానవస్తుపరిశీలనాశక్తి గోచరిస్తుంది. గొల్లసివాలు, దమ్మరాజు

కతలు, కోడిపందాలు, కొల్లారుబళ్ళు, పరంగిపీటలు, నమ్మికకమ్మలు, త్రోవ బత్యాలు ఇలాంటి వెన్నో కనబడతాయి. ప్రతిపద్యంలోను జాతీయత సజీవంగా కనబడుతుంది. ఇది తెలుగువాడే తప్ప యింకొకడు వ్రాయలేడన్నంత చక్కగా దేశ్యాలు ఇందులో గుబాళిస్తాయి. నాచనసోముని తరువాత అంత విరివిగా సామెతలు, జాతీయాలు గుప్పించే కవి చిననారాయణే అని చెప్పాలి. అతడు వాడిన నానుడులు, పలుకుబళ్ళు కొన్ని చూడండి.

గుడిసెకై జిల్లేడుకొట్టడం(1_27) ఆసుక్రోవిచందం (1_41)కరువుకు తోడు ఆరపంట(1_101)ఇందు చెమ్మన్నచో ఎల్లెల్లగొనుట (2_23, 5_44)కుమ్మరి కొక యేడు గుదియకొక పెట్టు(2_37)పారెడు బళ్ళకు కాళ్ళు చాచడం (2_33)పిలవని పేరంటం(3_85)ఎడుగులకు మడుగులొత్తడం (3_86)గుండెలో గాలం(4_27)మూడుకాళ్ళ ముసలి(4_28) తడిపాతతో గొంతుకోయడం(4_30)తేనెపూసిన కత్తి(4_30)కత్తిమీద సాములు(4_82)శిగపట్లు(5_87)గువ్వులతో బొమ్మవెట్టడం(5_45)

నాచనసోముని నవీనగుణాలీలా జాతీయాలు వాడడంలోనే కాక ఇతరత్రాకూడా స్ఫుటంగా కనబడతాయి. సోమున ఉత్తరహరివంశంలో అనాటి తురకదాడులు, ముట్టడులు కొల్లలు కనబడినట్టే చిననారాయణ కావ్యంలో కనబడతాయి. పురాణగాథను కథనం చేస్తూన్నా తుపాకులు, ఫిరంగులువంటి ఆయుధాలు, రబాబులవంటి వాద్యాలు ఉపయోగిస్తాడు. 'పారసీలిపిని జొప్పడ భగవద్గీత లెన్నిక వ్రాసిన చిన్నిపలక'లు కూడా మనకు చూపిస్తాడు (2-88). చిననారాయణ ఇరవయ్యోశతాబ్దంలో జీవించి ఉంటే కువలయాశ్వచరిత్రలో యాటంబాబులు,టేపురికార్డర్లు సోఫా-కమ్-బెడ్లు వాడగల్గినంత వర్తమానకవి.

అతని శైలికి, లాలిత్యానికి వస్తు పరిశీలనాశక్తికి ఎంత ముగ్ధులమైనా పాత్రపోషణలో శ్రద్ధతీసుకొననందుకు నొచ్చుకోక తప్పదు. నేటి సాహితీపరులు చిననారాయణను చాలా శ్లాఘిస్తారు. "కథాసంవిధానమును కొలికి పూసవలె నమర్చుటయందును చిననారాయణ నాయకుడు. పింగళిసూరనకు సాటి రాగలడు. పాత్రసంభాషణములు మంచినీళ్ళ ప్రాయముగా జలజల

ప్రవహించు సెలయేళ్ళవలె పరిగెత్తును. పింగళిసూరన తరువాత నింత మధురకవి మరియొకడు లేడు" అని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు చెప్పారు.[1]

నాకుమాత్రం చిననారాయణలో కొద్దిగా పింగళి సూరపరాజుగారు, ముద్దుగా నాచనసోముడు కనబడుతున్నారు. 'మార్కండేయపురాణంలో మారన చెప్పినతీరు చూశాక చిననారాయణ కథనం వింటే మనస్సు చివుక్కు మంటుంది. మూలంలోలాగు నాగకుమారులు అశ్వతరునికి కథ చెప్పిన క్రమంలోనే కథ వ్రాస్తే ఎంతో ఔచిత్యం ఉండేది. మారన్న కథనక్రమమే శిల్పదృష్ట్యా మెరుగనిపిస్తుంది. అందులో బిగువు కనబడుతుంది. అశ్వతరుడు కైలాసానికి వెళ్ళడానికి తగినంత కారణం తొలినుంచీ మారన చెప్పిన కథలో మారుమ్రోగుతూ ఉంటుంది. మారనకథలో కువలయాశ్వుడు భార్యావియోగానికి ఉదాత్తంగా శోకిస్తాడు. చిననారాయణకథలో విప్రలంభ శృంగారపు పైపొరలే అతికినట్లు ఉంటుంది. మారనకథలో భార్యతోపాటు తాను మరణించనందుకు, గట్టిగా ఏడవలేనందుకు కువలయాశ్వుడు ధార్మిక కారణాలు తలపోసుకుంటూ తపిస్తాడు. చిననారాయణ చిత్రించిన కువల యాశ్వుడు కామాతురునిలాగే కనబడతాడు. సాధారణప్రబంధనాయకుల స్థాయిని మించడు. చిననారాయణ మారనకథను చదివాడు. ఆ పోలిక పద్యాలు కొన్ని వ్రాశాడు. నాగకుమారులు కువలయాశ్వుణ్ణి తమ లోకానికి ఆహ్వానించే ఘట్టంలో మారన ఈ పద్యం వ్రాశాడు.

శ్రీయుత నీవు ప్రియమ్మున_మా యింటికి రాగవలయు నావుడు మాయిల్
మాయిల్లని వేరడ మిటు_నేయుదురే యది సఖిత్వశీలము తెరగే.

[మార్కండేయపురాణం, 3_60]

ఈ సన్నివేశంలో చిననారాయణ చెప్పినది చూడండి: 'మానాన్న నీగుణాలు విన్నాడు. నిన్ను చూడాలనుకొని బయలుదేరాడు. మేము ఆపాము. నిన్ను తీసుకువస్తా మన్నాము.' అని నాగకుమారులు అంటే కువలయాశ్వు డిలా బదులు చెప్పాడు:

1. ఆంధ్రసాహిత్యచరిత్రసంగ్రహం, పుట 163.

మాయమ్మరె తా రావలెనా-యాయెడ కే నయగుదెంతు నాయిల్లనగా
నీయిల్లనగా వేరా-వోయగ రా విట్టులైన భువిసఖ్యంబుల్ [కువ.4-126]

ఇలాంటి పద్యాలలోకాక కథనక్రమంలో మా
రన్నను అనుసరిస్తే కువలయాశ్వచరిత్ర ఇంతకు పదింతలు
రాణించేది. ఈకావ్యం ఆంధ్రసాహితికి సవరమే గాని
నిజవేణి కాదు అని ఎవరైనా అనవచ్చు; అయితేనేం?
నైలానుసవరంలాగా చాలా మెత్తన!!

20

గణపవరపు వెంకటి కవి



విత్వాన్ని మన పూర్వులు నాలుగు రకాలుగా విభజించారు. ఆశు, చిత్ర, మధుర, విస్తర కవిత లని ఆచతుర్విధానాలకు పేర్లు పెట్టారు. క్రీ. శ. 1285 ప్రాంతాలలో తెలుగు చోడుల ఆస్థానంలో ఉన్న పెద్దయామాత్యుడు ఆశు, చిత్ర కవిత్వాలలో ఆద్యుడు. ఆనాటి నుంచి మన తెలుగు కవులు తమ చతుర్విధ కవితా ప్రావీణ్యాన్ని అప్పుడప్పుడు అక్కడక్కడ చూపిస్తూనే వస్తున్నారు. గాని నోరు విప్పితే చిత్రకవిత్వం చెప్పడానికి ప్రయత్నించేవాళ్లు అరుదు. అడుగడుగునా విలక్షణంగా రచనచేస్తూ పాండిత్యప్రాగల్భ్యాన్ని ప్రదర్శిస్తూ చిత్ర కవిత్వశిఖరాగ్రంపై తిష్ఠవేసుకొని కూర్చున్న వ్యక్తి ఒకడే ఒకడు మన సాహిత్యంలో కనిపిస్తాడు. అతని పేరు గణప వరపు వెంకటకవి.

ఆయన వ్రాసిన అపూర్వగ్రంథాలలో ఒకదానిపేరు 'ప్రబంధరాజవేంకటేశ్వర విజయవిలాసం.' అందులో ఆయన ప్రయత్నించని చిత్రకవితా ప్రక్రియ లేనేలేదని చెప్పాలి. అనులోమ విలోమాలు, అచల జిహ్వాలు, పాదగోపనాలు, పద్మభ్రమకాలు, సర్వతోభద్రకాలు, రకరకాల బంధాలు పద్యాలలో పద్యాలలో పద్యాలు, ఒకటేమిటి, ఎన్నివిధాలుగా వీట్లు చెయ్యాలో అన్నీ చేశాడు. ఈనాడు కొంతమంది కలవారి ఇళ్ళలో సీసాలలో చొప్పించిన స్టీమర్ల బొమ్మలను అలంకారప్రాయంగా చూస్తాం. గణపవరపు వెంకటకవి తన సీసాలలో చొప్పించే వింతలకు అంతే లేదు. సీసపద్యంలో ద్విపదలు, మత్తకోకిలలు, కందాలు, మత్తేభాలు ఇలాగ ఎన్నో ఇరికించగలడు. వాస్తవానికి అతడు ఒకే ఒక గర్భకవిత్వమున్న సీసపద్యంలోనే ఇరవైబంధాలలో ఇమిడే కందాన్ని వ్రాశాడు. ఇటువంటి పద్యం మన సాహిత్యంలో 'నభూతో నభవిష్యతి!' ఇది చిత్రకవిత్వావిష్కరణలో అతిశయోక్తి కాదు. పరాకాష్ఠ.

ఇంతటి ఉద్దండ పాండిత్యప్రకర్ష గల ఈయన కాటేపల్లి అనే గ్రామానికి దగ్గరలో ఉన్న గణపవరంలో పుట్టాడు. ఈ ఊరు ఎక్కడుందో సరిగ్గా చెప్పలేం. కామేపల్లినే పొరపాటున లేఖకులు కాటేపల్లి అని వ్రాసుకొని ఉంటారు. గుంటూరుజిల్లా నరసారావుపేట తాలూకాలో కామేపల్లి,గణపవరాలు ఉన్నాయి. కవి బహుశా అక్కడివాడే కావచ్చును. చిన్నప్పటినుంచి కవిత్వం చెప్పడం మొదలుపెట్టాడు. పన్నెండో ఏటనే తారావళులు వ్రాశాడు. మునిమని మీసాలు మొలచేటప్పుడు యమకశతకం రచించాడు. ఇరవయ్యో ఏటనే శృంగార మంజరి రచించాడు. పాతికసంవత్సరాల వయస్సు రాగానే కృష్ణమల్లకథను చతుర్భద్రగా చెప్పాడు. బాలరామాయణాన్ని ద్విపదగా చెప్పాడు.[1] తరువాత సర్వలక్షణశిరోమణి అనే గొప్ప లక్షణగ్రంథాన్ని తలపెట్టాడు. ఇందులో పది ఉల్లాసాలు ఉన్నాయి. కొన్నిమాత్రమే నేడు లభించాయి. వాటి వివరాలు ఇవి:

---

1. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసంలోని 26వ పద్యంలో ఈ వివరాలు ఉన్నాయి.

వరుస	ఉల్లాసం	రచయిత	వివరణ
1.	ప్రథమోల్లాసం	గణయతి ప్రాసలక్షణ సీసమాలిక.	అముద్రితం
2.	ద్వితీయోల్లాసం	వెంకటేశాంధ్రం–నిఘంటువు (అమరానికి బదులు చెప్పాడు 120 పద్యాలు).	ముద్రితం
3.	తృతీయోల్లాసం	ఆంధ్రకామధుక (వ్యాకరణం)–వేయి చరణాల సీసమాలిక.	ముద్రితం
4.	చతుర్థోల్లాసం	షట్ప్రత్యయాల ప్రస్తారసరణి, ఇర్వదారు ఛందముల వచనం అనే రెండు ప్రకరణాలిందులో ఉంటాయి.	అముద్రితం
5.	పంచమోల్లాసం	నిఖిల రేఫ అకార నిర్ణయ పద్ధతి.	అసమగ్రం అముద్రితం
6.	ఆరునుంచి తొమ్మిది ఉల్లాసాలు	వీటిలో ఎందులో ఏది ఉంటుందో తెలియదు గాని కవితా లక్షణం, నాయికా నాయక లక్షణాలు, కావ్యలక్షణం, రస ప్రకరణం, కావ్యదోష ప్రకరణం అనేవి ఉంటాయి.	అలభ్యం
7.	దశమోల్లాసం	ద్విరూపకోశం.	అలభ్యం

భాషలో మొట్టమొదటి నిఘంటువు. రెండుతరాల క్రిందటిదాకా తెలుగు వాళ్ళ ప్రాథమికవిద్య అమరకోశం వల్లెవేయడంతో ప్రారంభమయేది. సంస్కృతంలోని అమరంలాగే తెలుగులో కూడా ఒక నిఘంటువు అవసరం. అని గుర్తించి గణపవరపు వెంకటకవి దానిని ప్రారాడు. వెంకటేశ్వరునికి అంకితం ఇచ్చాడు. కనుక దీనికి 'వెంకటేశాంధ్రం' అని పేరుపెట్టారు.

అమరసింహసమానమై యతులసకల
కవులు బొగడంగ లోకోపకారముగను
క్షితి నాంధ్ర నిఘంటువుగా జేసినాడ
నంకితంబుగ నీపేర వెంకటేశ! [వెంక - 8]

ఈ లోకోపకారపు నిఘంటువులోని అచ్చ తెలుగుపేర్లు గమ్మత్తుగా ఉంటాయి. 'ఏనుమొగముల సాహేబు' అంటే శివుడు. 'నలుమోము పాదుషా' అంటే బ్రహ్మ. గరుత్మంతుడికి గరుటామంతుడనే పర్యాయపదం ఉంది. ఈ వెంకటేశాంధ్రాన్ని అనుసరించే పైడిపాటి లక్ష్మణకవి తన ఆంధ్ర నామ సంగ్రహాన్ని రచించాడు. ఇదే నేడు ప్రచారంలో ఉంది. తెలుగులో ఉన్న పద్య నిఘంటువులకు గణపవరపు వెంకటకవి ఒరవడి పెట్టాడని ఈ పట్టిక చూస్తే తెలుస్తుంది.

వరుస	కాలం	పేరు	కర్త
1.	క్రీ.శ. 1650	వెంకటేశాంధ్రం	గణపవరపు వెంకటకవి
2.	,,	అకారాది దేశీయాంధ్ర నిఘంటువు	,,
3.	క్రీ.శ. 1700	ఆంధ్రనామ సంగ్రహం	పైడిపాటి ఏకాగ్ర మంత్రిగారి లక్ష్మణకవి
4.	క్రీ.శ. 1700	ఆంధ్రరత్నాకరం	పైడిపాటి అమరయ్య గారి లక్ష్మణకవి
5.	క్రీ.శ. 1750	ఆంధ్రనామశేషం	అడిదం సూరకవి
6.	,,	సాంబ నిఘంటువు	కస్తూరి రంగకవి
7.	క్రీ.శ. 1769	ఆంధ్రభాషార్ణవం	నుదురుపాటి వేంకటకవి
8.	క్రీ.శ. 1800 తర్వాత	ఆంధ్ర పదాకరం	పూసపాటి వీరపరాజు
9.		పైగడపువారి కందలు	
10.		చౌడప్ప సీసాలు	
11.		నానార్థ నిఘంటువు	(D 1379 కర్త పేరు తెలియదు
12.		నానార్థసార సంగ్రహం (అసమగ్రం)	లక్ష్మణకవి (D 1382)

తెలుగులోని మొట్టమొదటి పద్యనిఘంటువు వ్రాయడమేకాక అకారాదిగా కూడా ఒక దేశీయ నిఘంటువును కూడా గణపవరపు వెంకటకవి రచించినట్లు తెలుస్తూంది.[1] మన భాషలోని పద్యనిఘంటువుల పట్టికలో చౌడప్పసీసాలు అనేవి ముప్పయి ఉన్నాయి.[2] వీటిని సుప్రసిద్ధుడైన కవి చౌడప్పే రచించిఉంటే ఈ ముప్పయి సీసాలే తెలుగులోని మొదటి నిఘంటు రచనా ప్రయత్నమని చెప్పాలి. ఈసీసాలకు పీఠికగా ముందు కందపద్యం ఒకటి వుంది.

కప్పు మెయిరేని పేరిట
ముప్పది సీసంబు లాంధ్రమున జెప్పెను చౌ
డప్పయు నీకబ్బంబున
తప్పించకు డార్యులార తగనుతిచేతున్. [R 863]

ఈ ముప్పయిసీసాలలో చాలావాటికి 'సూరిజనకల్ప వరదంధశూక తల్ప!' 'డంబు కరివేల్ప - పిట్టనిడంబుదాల్ప' అనే మకుటం ఉంటే ఐదవ పద్యంలో 'డంబు కరివేల్ప హొన్పచ్చరంబు దాల్ప' అనే మకుటం కనబడ తుంది. 'బంగరుజరీ బెడంగు మణుంగు దాల్ప' అనే మకుటం 10 వ పద్యంలో కనపడుతుంది. ఈ మకుటంవల్ల కవి బహుశా ఈ కవి వైదర్సు అప్పయ్యగారి కాలంలోవాడో, అతనికి అర్వాచీనుడో అని చెప్పాలి. క్రీ. శ. 1710 ప్రాంతాలలో కాకర్లపూడి పాయకరావుగారి పాలనలో విశాఖజిల్లా ఉప మాక గ్రామంలో వైదర్సు అప్పయ్య ఉండేవాడు. ఆయన 'భళిర కరివేల్ప పసిడిదువ్వలువదాల్ప' అనే మకుటంతో గునుగుసీసాల శతకం వ్రాశాడు. ఈ చౌడప్పసీసాలలోని మకుటానికి, వైదర్సు అప్పయ్య మకుటానికి పోలికలు ఉన్నాయి. అందుచేత గణపవరపు వెంకటకవే మన భాషలోని తొలి నిఘంటువు రచయిత అని ప్రస్తుతానికి చెప్పుకోవచ్చు.

---

1. సూర్య రాయాంధ్ర నిఘంటువు పీఠికలో జయంతి రామయ్యగారు చెప్పారు.

2. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారి బులెటిన్ 3 వ సంపుటి 2 వ సంచికలో వీటిని నిడుదవోలు సుందరేశ్వరరావు గారు పరిష్కరించి ప్రకటించారు.

అమరంలాంటి నిఘంటువును వెంకటకవి వ్రాశాక ఆంధ్రకౌముది అనే వ్యాకరణం రచించాడు. మన భాషలోని తొలివ్యాకరణం వ్రాసినవాడు మూలఘటిక కేతన. ఆయన తన గ్రంథంలో ఇలా అన్నాడు:

సంస్కృతప్రాకృతాదిలక్షణము జెప్పి
తెనుగునకు లక్షణము జెప్పకునికి యెల్ల
గవిజనంబుల నేరమి గాదు నన్ను -
ధన్యు గావింపదలచిన తలపుగాని. [ఆంధ్రభాషాభూషణం - 7]

సరిగ్గా ఇదే సంగతి ఇలాగే గణపవరపు వెంకటకవి కూడా తన ఆంధ్రకౌముది మొదట చెప్పాడు:

శ్రీకరమ్ముగాను సంస్కృతమునకును
ప్రాకృతమునకు గల లక్షణము జెప్పి
తెనుగున నావిధమ్మున లక్షణము చేర
రాకున్క యదియు నేరంబు గాదు
తొల్లిటి సుకవుల కెల్లను నను ధన్యు
గావించు తలపించె కాని యనుచు.

అని కేతనలాగే వెంకటకవికూడా భావించడం గమనించతగ్గది. ఈ ఆంధ్రకౌముది 'ఇప్పుడు కవులకు రానున్న కవులకెల్ల నుపకారముగ' వ్రాశాడు. ఇది వెయ్యి చరణాల సీసమాలిక. ఇందులో 'తొల్లి ఘనులు చెప్పిన ప్రయోగాలు' కూడా ఇచ్చాడు. అప్పకవిలాగ విపులంగా ఇవ్వలేదుగాని వెంకటకవి ఉదహరించిన గ్రంథాలు ప్రథమశ్రేణివే. అతడు వాడిన గ్రంథాలు ఇవి.

1. తిక్కనగారి భారతభాగం.
2. పెద్దనగారి మనుచరిత్ర.
3. కవుల షష్ఠం.
4. భట్టుమూర్తి హరిశ్చంద్రనలోపాఖ్యానం.
5. పినవీరయ్యగారి శాకుంతలం.

6. భాస్కరరామాయణ యుద్ధకాండ.
7. నూరపరాజుగారి రాఘవపాండవీయం.
8. చంద్రమౌళి ప్రాసిన హరిశ్చంద్ర కథ.

ఇలా కొద్దిపాటి పూర్వకవిప్రయోగాలను ఇస్తూ వ్యాకరణం రచించిన గణపవరపు వెంకటకవి తను చెప్పిన లక్షణాలనే ఈ గ్రంథంలో పాటించ లేదు. 'గ్రామాలు, అజాలు, పురాణాలు, దోషాలు, శాస్త్రాలు, వేదాలు' అనే మాటలు గ్రామ్యాలని చెప్పాడు. వాటిని 'తెగడునెడ నగవుతరి' మాత్రమే వాడాలన్నాడు. అయితే ఈ లక్షణగ్రంథంలోనే 'ఇంక వట్టువసుడి పొంకమూ శబ్దాలపేరులు చెప్తాను'అనే చోట గ్రామ్యప్రయోగం చేశాడు. శిష్టులు నిత్యం వాడే మాటలు కొన్ని గ్రామ్యాలని వెలివేయడంవల్ల వచ్చే బాధలు ఇన్ని అన్ని కావు. .అర్థం లేని మడి కట్టుకొన్న లాక్షణికులే ఇలాగ మైలపడతారు. ఆంధ్రకౌముదిలోనే కాక ఇతరగ్రంథాలలోకూడా వేంకటకవి చిత్తమొచ్చిన ప్రయోగాలు విచ్చలవిడిగా చేశాడు. అన్యదేశ్యాలను సంకోచించకుండా వాడు కొన్నాడు. అతని దృష్టిలో అన్యదేశ్యా లంటూ వేరే భాషావిభాగం లేదు. వాడు కలో ఉండే ఇతరభాషాపదాలు దేశ్యాలకిందే లెక్క. గుంటూరుసీమనుంచి పాండ్యమండలందాకా సంచరించి అన్నిప్రాంతాల పలుకుబళ్లూ వాడు కొన్నాడు.

గణపవరపు వెంకటకవి సత్కారాలు పొందిన రాజసభలు చాలా ఉన్నాయి. తాను ఆంధ్రకవితాసామ్రాజ్య ధురంధరు ణ్ణని చెప్పుకొన్నాడు. కర్ణాట, తుండీర, చోళ, పాండ్య మండలాల ప్రభువులు తనను సత్కరించి మత్తసింధురసైంధవాలు, అందోళికలు, ఇళ్లూ, వాకిళ్ళూ ఇచ్చారట. ఇతణ్ని సన్మానించిన కర్ణాటప్రభువు క్రీ. శ. 1630 నుండి 1642 దాకా పాలించిన మూడవ వెంకటపతిరాయలు కావచ్చును. కర్ణాటంనుండి వెంకటపతి తుండీరమండలానికి వెళ్లాడు. అంటే చెంజిరాజ్య మన్నమాట. క్రీ. శ. 1649 దాకా చెంజికోటను వరదప్ప నాయకుడు పాలించేవాడు. ఆయనపై వెంకట కవి ఏమైనా పద్యాలు చెప్పాడుకాబోలు. కనీసం ఒక గ్రంథమైనా చెప్పి ఉంటాడు. చెంజినుండి తంజావూరు వెళ్లి విజయరాఘవుని సభలో మన్న నలు పొంది చివరకు వెంకటకవి మధురలో స్థిరపడ్డాడు.

క్రీ. శ. 1659 నుండి 1682 దాకా మధురరాజ్యాన్ని చొక్కనాథనాయకుడు పాలించేవాడు. అతనికి ముద్దు అళగిరి అనే నవతితమ్ముడు ఉండేవాడు. అతడు కలియుగగోపాలుడు అని పేరు మోశాడు. మంచి విలాసపురుషుడు. సాహిత్యలోలుడు. అతడు వెంకటకవిని పోషించాడు. ముద్దళగిరిని మెప్పించడానికి వెంకటకవి విద్యావతీదండకం అనే ఒక రచన చేశాడు. ఇది బమ్మెరపోతరాజుగారి భోగినీదండకంలాంటిది. సర్వజ్ఞసింగభూపాలుడు దారంట పోతున్నప్పుడు భోగిని అనే వేశ్య అతణ్ని చూసి మోహించింది. అతణ్ని కూర్చమని తల్లిని కోరుకొంది. తల్లి మొదట అది సాధ్యం కాదంది. చివరకు సాధించింది. ఇది పోతరాజుగారి భోగినీదండకంలోని ఇతివృత్తం. నరిగ్గా ఇలాగే విద్యావతీదండకంకూడా ఉంటుంది చూడండి.

ఒకనాడు 'చౌవంచపూదూపు సాహేబురాచిల్క్రపైనెక్కు మేటెక్కుజక్కిన్' ముద్దళగిరి గుర్రంపైఎక్కి ఊళ్లో షికారు వెళ్లారు. 'ముద్దళ్గరిక్షేణిపాలుండు సాజన్యశీలుండు వాహ్యాళిగా వచ్చు నవ్వేళ తత్పౌరవారాంగనాకోటి వీక్షింప శాస్త్రీలలో రూపరేఖావయశ్శీలచే మించుగన్మించు బల్మించు విద్యావతీభామ చౌవంచవన్నెన్ దువాళింపుచున్' అతణ్ణి చూసింది. మరులుకొంది. తల్లిని చూసి తన కోర్కె చెప్పింది. 'ఈపొద్దు ముద్దళ్గరిస్వామితో నిన్ను నే గూర్చగా జాలనే'అని వేశ్యమాత చెప్పింది. ఆంతటితో ఊరుకోలేదు. 'అక్కటా నన్ను నే నెన్నుకోరాదుగా సాదుగానే వినే మున్ను నే కన్యగా నున్నచో' అని తన తొలినాటి అనుభవాలు చెప్పింది. సాధారణవిటులసు ఎలా ఆకర్షించాలో, ఎలా దోచుకోవాలో వివరించింది. పెద్దకుండలకు ఎసరుపెట్టక ఉన్నదానితో తృప్తి పడమంది. విద్యావతి వినలేదు. "నాతోడ యమ్మ ప్రసంగించవస్తే పాసంగీనటే సొంపెసంగీనటే?" అని చెప్పింది. భీష్మించుకొని కూర్చుంది. వేశ్యమాత చివరకు ముద్దళగిరిని చూసి పడిపడి దండాలు పెట్టింది. నమస్కారానికి పర్యాయపదాలయిన జోహారు, చేమోడ్పు, టెంకణాలు, చేమొక్కు, నలామ మొదలైన మాటలను కవి విరివిగా వాడాడు. వేశ్యమాత చేసిన వర్ణన, చెప్పిన తీరు విన్నాక కవీంద్రాళిపారిజాతుడైన ముద్దళగిరి పల్లకీ పంపించి విద్యావతిని పిలిపించి 'ఆత్మీయమౌనాట్యస్థలీపాత్రలందెల్ల నన్మానపాత్రంబుగా' చేశాడు. 'మన్మథాభోగసామ్రాజ్యభోగమ్ములం' తేలించాడు.

ఈ దండకాన్ని గణపవరపు వెంకటకవి పుష్పకోదండకం అన్నాడు. ఇది చాలా కాలం మరుగుపడి మొన్నమొన్ననే వెలుగు చూసింది.[1] దీనిని ప్రకటించడంవల్ల గణపవరపు వెంకటకవికాలం ఇదమిత్థంగా నిర్ణయించ డానికి వీలయింది. ముద్దళగిరి క్రీ. శ. 1673లో తంజావూరును పాలించాడు. ఈ విద్యావతీదండకం అంతకు ముందు వ్రాసినదే అవుతుంది. ఈదండకాన్ని వ్రాసినందుకు ముద్దళగిరి వెంకటకవిని మెచ్చుకొన్నాడు. బాగా సత్కరిం చాడు. రాజభోగాలను ప్రసాదించాడు. వెంకటకవి ఒకనాడు నిత్యకృత్యాలు తీర్చుకొని బహువిధభోజనామూల్య జాంబూనదాంబరసార గంధసారరుచిర విచికిలఘనసారతాంబూల ప్రియకామినీసంగీతగోష్ఠి సుమశయ్యాష్ట భోగాభోగ నంగతుడై 'హంసతూలికాతల్పంమీద వేకువ తేకువ సుఖసుప్తిలో' ఉన్నప్పుడు తిరుపతిలోని బాలవెంకటేశ్వరుడు కలలో ప్రత్యక్షమయ్యాడు. ప్రబంధరాజ వెంకటేశ్వరవిజయవిలాసాన్ని అంకితం ఇమ్మని కోరాడు.

ఇదొక అపూర్వగ్రంథం. అప్పటిదాకా ఎన్నో లక్షణగ్రంథాలను మన వాళ్ళు వ్రాశారు. అందులో పద్దెనిమిది వెంకటకవి చదువుకున్నాడు. వాటిలో చెప్పిన లక్షణా లన్నింటికీ ఇది లక్ష్యగ్రంథంగా ఉండాలని ఆశించాడు. ఆయన దగ్గిర ఇరవైనాలుగు నిఘంటువు లున్నాయి. అందులోని పదాలకు ఆస్పదంగా తన కావ్యం ఉండా లనుకొన్నాడు. అరవైరకాల యతిభేదాలు తనకు తెలుసు. అన్నింటినీ చూపించా లనుకొన్నాడు. రక రకాల చిత్రకవితలు అతనికి వచ్చు. అయిదిరవయిలు అంతకుముందే ఒక కావ్యంలో జొప్పించాడు. దాని పేరు 'కల్పిత కల్పలత'. దాని సంగతి ఇలా చెప్పుకొన్నాడు:

జగతిన్ వృత్తచతుష్టయ_మగణిత మతిచిత్రకవిత లైదిరువదు లొ
ప్పగ మెప్పుగనం దగు రూ_ఢిగ గల్పితగల్పలత ఘటించిన ప్రౌఢన్.

---

1. 1948లో మద్రాసుప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారు ప్రచురిం చారు. Bulletin of Govt. Oriental Mss. Library, Madras Vol. I No. I Pp 89-142.

పూర్వం కల్పిత కల్పలతలో చూపించిన చిత్రకవితలన్నీ ఈ కావ్యంలో కూడా చేయదలిచాడు. ఇందులో ప్రౌఢికి ప్రౌఢి, తేటకు తేట ఉండా లను కొన్నాడు. ఇది సనాతనవిద్వత్కవుల రచనావిధానాలకు ఘంటాపథం అన్నాడు. "ఇదానింతన సత్కవినికాయమ్మునకు, సహాయమ్మును భవిత వ్యకవికలాపంబున కాచార్యరూపంబును, నిఖిలభాషా విశేషంబుల కున్మేష ణంబును, మూఢజాతులకు బోధహేతువును, బ్రౌఢతతికి సమ్మతియును, సత్వజ్ఞవశికరమ్ముకాశ్చర్యాకరమ్మును, బహువిధంబులీ కవితా చమత్కృతికి వసతి" అయ్యేటట్లు ఈ కావ్యం నిర్మించదలిచాడు. గ్రంథంలో ఇన్ని ఉన్నా కథ లేకపోతే లాభంలేదు. అందుచేత చాలా చిన్నకథ ఒకటి ఎన్నుకొన్నాడు.

తిరుమల వేంకటేశ్వరుడు ఒకనాడు వేటకు వెళ్ళాడు. ఆయన కేలిడేగ వెళ్లి ఆకాశరాజుగారి అంతఃపురంలో వాలింది. రాజకుమార్తె నాంచారుదేవి అక్కడ ఉంది. డేగకోసం వెళ్ళిన స్వామివారు ఆమెను చూశారు. ఆమె సంగతి తెలుసుకోమని మంత్రిని పంపారు. అతడు తెలుసుకొని వచ్చి ఆమెను నఖ శిఖ పర్యంతం వర్ణించాడు. ఆమెను వివాహం చేసుకోవాలని స్వామివారు సంబరపడ్డారు. మంత్రిని పెళ్లిమాటలకు పంపారు. ఆకాశరాజు వెంటనే పెళ్ళిచేశాడు. కూతుర్ని కాపురానికి పంపించాడు. దారిలో నాగదత్తు డనే దొంగ అడ్డగించాడు. యుద్ధం జరిగింది. దొంగల ముఠా స్వామిపుష్కరణిలో పడి సారూప్యం పొందారు. అష్టదిక్పాలకులు స్వామివారిని స్తుతించారు.

ఈ చిన్న కథను గణపవరపు వెంకటకవి 882 పద్యాలలో చెప్పాడు. వాటిని అశ్వాసాలుగా విభజించలేదు. నాగదత్తోపాఖ్యానాన్ని చాలా విపులంగా 150 పైచిలుకు పద్యాలలో చెప్పాడు. అయితే ఈ కథ తెనాలి రామకృష్ణుని నిగమశర్మోపాఖ్యానానికీ, కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానానికీ పచ్చి అనుసరణ. నాగదత్తుడు చక్కని సత్కర్ముల యింట పుట్టాడు. పెరిగి పెద్ద వాడు కాగానే తల్లిదండ్రులు పెళ్లి చేశారు; గాని అతడు కాపురం చేయ లేదు. విటవిద్యకు బిరుదు వేశాడు. జూదంలో ఆరితేరాడు. ఒక వెల యాలిని వలచాడు. ఆ సానిపాపకు కూడా అత డంటే మక్కువ. నాగ దత్తుణ్ణి తప్ప మరో విటుణ్ణి చూడడం మానేసింది. ఇది వేశ్యమాతకు దుర్భరమైంది. కూతురికి హితోపదేశం చేసింది. నాగదత్తుడు ఉన్న డబ్బంతా

వెచ్చించి ఇంటికి వెళ్లాడు. బంధువులందరూ చెదరించుకున్నారు. తల్లి మాత్రం మొగసాల నున్నకొడుకును వగచాలక లోపలకు తీసుకు వచ్చింది.

> ఇంటియిల్లాలిచే తలయంట జేసి మజ్జనము భోజనంబు నమర్చి పిదప
> పీడియ మొసంగి సాత్వికజాడనున్న-కొడుకు తల దువ్వుచును తల్లి
> నుడివె నిట్లు.

అని అచ్చంగా నిగమశర్మ అక్క గారి కో [illegible] తరపు వెంకటకవి. ఇరవైఅయిదు పద్యాలతో తల్లి [illegible]

> అన్నా నిన్ గని [illegible] పెంచి [illegible] యీ
> కన్నన్ బెండ్లి యొనర్చి [illegible] గా
> కన్నుల్ జల్లగ జూతునంచు మది గాంక్షల్ మీర నే నుండగా
> జిన్నంబుచ్చితి విన్ని నాళ్ళు నను దుశ్శీలుండవై పుత్రకా.
>
> [ప్రబంధ. 702]

ఆతల్లి ఎంత మొత్తుకున్నా వాడు ఉలకలేదు; పలకలేదు. ఆమె ఇలా ఏడ్చింది :

> ఏమీ పల్కవు నేను బిల్వ దయ లేదే నీకు నా యయ్య, ని
> న్నేమంటిన్ సుకుమార, నాయెడను తప్పేదీ కుమారాగ్రణీ,
> నామీదన్ జల మేలరా తనయ, నన్ మన్నించరా పెన్నిధీ,
> నీముద్దుల్ గన నోచినా గదర తండ్రీ, నీతిపారంగతా.
>
> [ప్రబంధ. 705]

నాగదత్తుడు ఒకనాడు నీతిపారంగతుడే. తల్లి ఇలాగ శోకించాక కరిగినట్టు కనబడ్డాడు. మారినట్టు నటించాడు. 'వానిపై మమత యెంతో గాని పైనున్న సొమ్ము' ఆ తల్లి కోడలి కిచ్చింది. దాన్ని కాస్తా నాగదత్తుడు తస్కరించి సానిపాపకు పెట్టాడు. ఆ సొమ్ము చెల్లిపోయాక వేరే దారి లేక దొంగగా మారాడు. గణపవరపు వెంకటకవి ఈ కథలో పూర్వులను అనుసరించిన సంగతి స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఈ కావ్యం

లోని 26 పద్యాలు స్పష్టంగా రామరాజభూషణుని నవనభూపాలీయంలోని పద్యాలకు అనుకరణలని పూండ్ల రామకృష్ణయ్యగారు నిరూపించారు.[1] పూర్వులనే కాక తననే తాను అనుకరించుకొన్నాడు. విద్యావతీ దండకంలో వేశ్యమాతచేసే ఉపదేశంలోని భావాలను మళ్ళీ ఇక్కడ వాడాడు. వెలయాలి వలపు చెప్పుడువిద్య బిరుదులాంటిదట. మాస్టీని బీశం, ముష్టిపండు అందం, పలనాటి గొల్లల పాట, జాతిదొమ్మరి పెద్దతనం, శ్రోత్రియుని తెలుగు కవిత ఎలాంటివో సానిదాని వలపూ అలాగే ఉంటుందట. [ప్రబంధ. 752] విద్యావతీదండకంలో ఇలా వ్రాశాడు: "పఠాణీల వావుల్, ఖనోజీల వియ్యాల్, డుబాసీల బాసల్, పవాడంపు మాస్టీల సుద్దుల్, వినన్రాని పద్దుల్, మొసల్మీను మాటల్,కనున్ మెచ్చుట్మాటల్,కువాడంపు రీతుల్ విలాసంపు బూతల్ నెరా గొల్ల సంగీతముల్ మూర్ఖ సాహిత్యముల్ మూగసన్నల్వీటిలాగ సానివలపు ప్రసన్నత్వమింపొంద ఉండాలట. విద్యావతీదండకంలో నమస్కారశబ్దానికీ పర్యాయపదాలు చాలా వాడాడు. ప్రబంధరాజంలో నమస్కారశబ్ద కందద్వ యగర్భితవచనం' ఒకటి వ్రాశాడు. (నెం.880) ఇందులో నమస్కారశబ్దానికి 108పర్యాయపదాలే కాక 108 దివ్యతిరుపతుల పేర్లూ వ్రాశాడు. గ్రంథంలోని కొన్ని పద్యాలకు ఇతడు పెట్టిన పేర్లు వాక్యాలలాగా ఉంటాయి. కొన్ని పేర్లు పెద్ద పేరాగ్రాపులే. నాలుగైదు చూద్దాం.

1. ఏక ద్వి త్రి చతుఃపంచషట్సప్తాష్టాక్షర క్రమపాద నియమ సీసము. (ఇందులో మొదటి పాదంనిండా ఒకటే అక్షరగుణింతం, రెండో పాదంలో రెండు, మూడో పాదంలో మూడు—ఇలాగే ఉంటాయి.) [సంఖ్య 878.]

2. పుష్పమాలికా బంధయుక్త కంద మదనవిలసిత శ్లోకగర్భిత స్రగ్ధరావృత్తం. [సంఖ్య 863.]

3. పుష్పమాలికాబంధ గోమూత్రికాబంధ గుచ్ఛబంధ హలబంధ ఛత్రబంధ పంచక నిరోష్ఠ్యకందం. [సంఖ్య 851]

---

1. ప్రబంధరాజ వెంకటేశ్వర విజయవిలాసం. అముద్రితగ్రంథ చింతామణి ప్రచురణ. పీఠిక పుట 14.

4. దశావతారగర్భిత గుణితవర్ణాచలజిహ్వ్యోష్ఠ్యవర్ణ భుజంగ ప్రయాత వృత్తగర్భిత నిరోష్ఠ్యాచలజిహ్వ ప్రసగ్వినీవృత్తగర్భితౌష్ఠ్యాచల జిహ్వానిరోష్ఠ్యాచల జిహ్వాసంకీర్ణవర్ణ సమగణదండకం. [సంఖ్య 832.]

5. బహువిధ, చిత్రకంకణబంధ, ద్విగుణితసీసచరణ చతుష్టయ గర్భిత, కందద్వయ, సమవృత్త, చౌపదయుగళాటవెలది, తేటగీతి, మదన విలసిత, తురంగవృత్త, బహువిధతాళవృత్తాష్టక, ధవళ, శోభాన గానా రాత్రిక, గానజంపె, త్రిపుటార్ధచంద్రిక, సువ్వాల, లాలిపదేలా, మంజరి, సమతాడిండిమతాళవృత్త, మణిగణనికర, తురగవల్గనరగడోదాహరణ సంబుద్ధికళికోత్కళికా, రాహిరీరాగదళ, ముఖారిరాగాటతాళదళ, కాంభోదిరాగ దూపకతాళదళ, కాంభోదిరాగ సమపద, కన్నడరాగ సౌంగత్య, కొరవంజిదళ రేవగుప్తిరాగసమపద సావేరిరాగైకదాళతళ, బిలహరిరాగాటతాళ సమపద, పుష్పమాలికాబంధ, గోమూత్రికాబంధ, కార్ద్దబంధ, షోడశదళ పద్మబంధ, పాదుకాబంధ, నవరంగబంధ, ఖడ్గ బంధ, గుచ్ఛబంధ, ఛత్రిబంధ, చామరబంధ, గదాబంధ, చక్రబంధ, శకటబంధ, నాగబంధ, రథబంధ, వీణాబంధ, శంఖబంధ, మృదంగ బంధ, పాదభ్రమకబంధ, పాదార్ధభ్రమకవింశతిబంధ, భేదకంచానుష్టుప్ శ్లోకాంతర్గత చతుర్భద్ర, నవరంగ, సర్వతోభద్రాందోళికాబంధయుక్త నులోమవిలోమకంద, భాషాశ్లేషకంద, కందాటవెలది గర్భితాంత్యతేట గీతియుక్త చౌషష్టి భేదచిత్రసీసము. [సంఖ్య 808]

ఈ అఖరుదే సుప్రసిద్ధమైన గారడీపద్యం. ఇందులో నలభైగర్భితాలు, ఇరవైబంధాలూ ఉన్నాయి. గ్రంథవిస్తరభీతి ఉన్నా ఈ పద్యాన్ని, అందులో గర్భితమైన వివిధపద్యాలను పూండ్లవారి ప్రచురణనుండిఉదాహరిస్తున్నాను.

సీ. సారాగ్ర్యసారససమనేత్రయుగళ నారదరుచికాంతి నరఘున పనిత
సారాగధీరవిశదవీనతురగ ధైరవభవజైత్ర భరశుభకరణ
సారాతిహారవిసరచారణ హరిసారసహిత చంద్రశరజ జయనుత
వారాశి నారదవర పూజిత పదగౌరవ కటిఖడ్గ గరళగళసఖ

తే. హరినగనిలయ గిరిధర యసురదళన
మణిమయమకుట సురమణి మధువిళరణ
కరివరద వివరరుచిరతర వసన న
రహరిలసితదరనిగమవిహరణ హరి.

పై పద్యమునందలి గర్భితములు :—

1. ద్విపద :-

సారాగ్రసారసమనేత్రయుగళ-నారదరుచికాంతి నరఘునపనిత
సారాగధీరవిశదవీనతురగ-భైరవభవజైత్ర భరశుభకరణ
సారాతివిహార విసరచారణహరిసార సహితచంద్ర శరజజయనుత
వారాశినారద వరపూజితపద గౌరవకటిఖడ్గ గరళగళసఖ.

2. ప్రథమకందము :-

సారాసారససమనేత్రయుగళ-నారదరుచికాంతి నరఘునపనితసారా
ధీరవిశదవీనతురగ భైరవభవజైత్రభరశుభకరణ సారా

3. ద్వితీయకందము :-

హారవిసరచారణహరి-సారసహితచంద్ర శరజ జయనుతవా
నారదవరపూజితపద-గౌరవకటిఖడ్గ గరళగళసఖ సారా.

4. సమవృత్తము :-

సారాసారససమనేత్రయుగళ-సారాధీరవిశదవీనతురగ
సారాహారవిసరచారణహరి-వారానారదవరపూజితపద.

5. ప్రథమమహానవమి చౌపది :-

సారాగ్రసారసమనేత్రయుగళ-నారదరుచికాంతి నరఘునపనిత
సారాగధీరవిశదవీనతురగ-భైరవభవజైత్రభవశుభకరణ.

6. ద్వితీయ మహానవమి చౌపది :—

సారాతిహారివిసరచారణహరి-సారసహిత చంద్ర శరజజయసుత
వారాశి!నారదవరపూజితపద-గౌరవకటిఖడ్గ గరళగళసఖ.

7. ఆటవెలది :—

నారదరుచికాంతి నరఘునపనిత సా-భైరవభవజైత్ర భరశుభకర
సారసహితచంద్ర శరజజయసుతవా-గౌరవకటిఖడ్గ గరళగళస.

8. తేటగీతి :—

సారససమనేత్రయుగళ నారదరుచి-ధీరవిశదపీనతురగ భైరవభవ
హారివిసరచారణ హరిసారసహిత-నారదవరపూజిత పదగౌరవకటి.

9. మదనవిలసితవృత్తము :—

నరఘునసనితా । భరశుభకరణా-శరజజయసుతా । గరళగళసఖా.

10. తురంగవృత్తము :—

తానాతానన॥ సారససమనేత్రయుగళ నారదరుచికాంతినరఘునపనిత.
ధీరవిశదపీన తురగ భైరవభవజైత్రభర శుభకరణ
హారివిసరచారణహరిసారసహిత చంద్రశరజజయసుత
నారదవరపూజితపదగౌరవ కటిఖడ్గ గరళగళసఖ.

11. బహువిధతాళవృత్తము :—

తానాతందనతానా॥
నారదరుచిధీరవిశద భైరవభవహారివిసర
చారణహరిసారసహిత నారదవరగౌరవకటి.

12. అష్టకము :—

సారససమనేత్రయుగళ । నారదరుచిరఘునపనితా
ధీరవిశదపీనతురగ । భైరవభవభరశుభా

హారవిసరచారణహారి । సారసహితజయనుతా
నారదవరపూజితపద । గౌరవకటిఖడ్గసా.

13. ధవళము :-

సారససమనేత్రయుగళ । నారదనరఘునపనిత
ధీరవిశద వీనతురగ । భైరవభవశుభకరణ.

14. శోభాన :-

సారససమనేత్రయుగళ । ధీరవిశదవీనతురగ
హారవిసరచారణహారి । నారదవరపూజితపద.

15. హారతి : (అనగా గానారాత్రికము)

సారాగ్యసారసమనేత్రయుగళఘన - భైరవభవజైత్రభరశుభకర
సారాతిహార విసరచారణహారిజనుత - గౌరవకటిఖడ్గ గరళగళసఖ

16. జంపె :-

సారాగ్యసారస సమనేత్రవరనుత - గౌరవకటిఖడ్గ గరళగళసఖ.

17. త్రిపుట రేకులు :-

హారవిసరచారణహారిసారసహిత చంద్రజయనుత
నారదవరపూజితపదగౌరవకటి
నారదరుచిశాంతి నరఘునసారస సమనేత్రయుగళ
ధీరవిశదవీనతురగ భైరవభవ.

18. అర్ధచంద్రికలు :-

కరివరదకువర హారి నగనిలయ

19. సువ్వాల :-

సారససమనేత్రయుగళ నారదరుచి నరఘున
ధీరవిశద వీనతురగ భైరవభవ.

20. లాలి :-

సారసమనేత్ర నారదరుచి భైరవభవత్రైత్ర భరశుభకరణ.

21. ఏల :-

ధీరవిశద వీనతురగ సారససమనేత్రయుగళ
హారవిసర చారణహరి సారసహిత నారదవరపూజితపద

22. మంజరి :-

నారదరుచికాంతి నరఘుసపనిత, వీనతురగహార విసర శుభకర
సారససమనేత్ర చంద్రజయనుత, శరజవారాశివిశద పూజితపద
మధువిశరణ మణిమయమకుటహరి, కరివరదహరినగనిలయ నిగమ.

23. సమతాడిండిమ తాళవృత్తము :-

తక్కతోంగధిక్కతోంగధిమిత తోంగధిమితతా
తనన తనన తనన తనన తనన తనన తననతా
సారద సమనేత్రయుగళ, నారదరుచి నరఘునా
ధీరవిశద వీనతురగ, భైరవభవ భరశుభా
హారవిసరచారణహరి, సారసహితజయనుతా
నారదవరపూజితపద, గౌరవకటిఖడ్గగా
హరిన, గనిల, యగిరి, ధరయ,సురద, శనమ, ణిమయమా.

24. మణిగణనికరము :-

నరఘుననుతభవభర శుభకరణా
హరిజయనుత వరగరళగళసఖా
సురమణిమధు విహ హరిగనిలయా
కరివరదకువర నరహరినిగమా.

25. తురగవల్గనరగడ :—

హారవిసరచారణహరి సారసహిత చంద్రశరజ
నారదవరపూజితపదగౌరవకటి గరళగళస
ధీరవిశద వీనతురగ భైరవభవభరశుభకర
సారససమనేత్రయుగళ నారదరుచి నరఘుననుత.

26. ఉదాహరణ సంబుద్ధి కళికార్థము:—

గౌరవకటిగరళగళస హారవిసరచారణహరి
సారసహితచంద్రశరజ నారదవరపూజితపద
భైరవభవభరశుభకర సారససమనేత్రయుగళ
నారదరుచినరఘుననుత ధీరవిశదవీనతురగ.

27. ఉత్కళికార్థము :—

హరినగనిలయ గిరిధరయ సురదళన మణిమయమకుట
సురమణికరివరదవరద నరహరి లసితదరనిగమ.

28. ఆహిరీరాగదరువు :—

సారాగ్యసారస సమనేత్రయుగళ
సారాగధీర విశదవీనతురగ.

29. ముఖారిరాగదరువు, ఆటతాళము:—

సారాగ్యసారస సమనేత్రయుగళ
భైరవభవత్రైభరశుభకరణా!

30. ఎఱుకల కాంభోదిరాగదరువు, రూపకతాళము :—

సారాతిహారవి సరచారణహరి
వారాశినారదవరపూజితపద.

31. కాంభోదిరాగసమపద దరువు :—

సారససమనేత్రయుగళ – నారదరుచికాంతి నరఘునపనిత
సారాగధీరవిశదవీనతురగ – భైరవభవజైత్రభరశుభకరణ.

32. కన్నడరాగ సాంగత్యదరువు పదము :—

సారాగ్యసారససమ నేత్రయుగళ–నారదరుచికాంతి నరఘునపనిత
సారాగధీర విశదవీనతురగ–భైరవభవజైత్రభరశుభకరణ.

33. కొరనంజిదళ, రేవగుప్తిరాగ సమపదదరువు :—

సారాతివిహారవిసర చారణహరి సారసహిత చంద్రశరజ జయనుత
వారాశినారదవరపూజితపద గౌరవకటిఖడ్గ గరళగళసఖ.

34. సావేరిరా గైకతాళదరువు :—

హరినగనిలయ గిరిధర యసురదళనమణిమయమకుట
సురమణిమధువిశరణ కరివరదకువరలసితవర

35. బిలహరి రా గాటతాళ సమపదదరువు :—

సారాగధీరవిశదవీనతురగ, నారదరుచికాంతి నరఘునపనిత

36. వింశతిబంధకందము :—

సారవరహారవారా–సారహరీనరహరి హరశర కరసారా
గౌరధరధీరచారా, – సారహరీ సురహరి నరసరసారభరా

అర్థము: సారవర = న్యాయముచేత శ్రేష్ఠమైనవాఁడా! హారవారా = హారసమూహము గలవాడా! సారహరీ = స్థిరాంశము గలిగిన స్వామీ! నరహరి = నరసింహావతారా! హరశర = ఈశ్వరునికి బాణమైనవాఁడా! కరసార = భుజాబలము గలవాడా! గౌరధరధీరచారా = మేరువువంటి ధైర్యప్రభావము గలవాడా! సారహరీ = అతిశయమైన నాగేంద్రుని గలవాడా! సురహరి = అమరేంద్రుని గలవాడా! నరసత సారభరా! = అర్జునునియొక్క సరసము చేత మిక్కిలి యతిశయమైనవాడా!

37. అనుష్టుప్ శ్లోకము:—

సారాసారరసారాసా। రాగహారరహాగరా,
సాహాయసాసాయహాసా। రరసామమసారర.

అర్థము:—సార = స్థిరమైన, అసార = అవిభేదము గలిగిన, రస = శృంగారరసమే, అ = భూషణమైన, రాసా = రాసక్రీడగలవాడా! రాగహార, రాగ = అనురాగమే, హార = హారముగా గలవాడా! రహాగరా, ర = శ్రేష్ఠమైన, హ = హంసలు గలిగిన, అగ = పర్వతమునందు, ర = మనోహరమైన అ = విష్ణువైనవాడా. సాహాయ; సా = కాంతికిని, హా = ఈవికిని, య = నిలయమైనవాడా! సాసాయహాసారరసామ, అసాయ = నాశరహితమైన, హాస = నవ్వుయొక్క, అ = భావముచేత, ర = నిపుణులైన రసా = భూమి తోడను, మ = లక్ష్మితోడను, న = సహితుడైనవాడా! (ఈసవర్ణము సమాస ప్రథమాక్షరము) మసారర; మ = ఈశ్వరునివంటి, సార = బలముయొక్క, ర = గౌరవముగలవాడా (నిఘంట్వాధారములు ఉన్నవి.

38. ఆందోళికాబంధయుక్తానులోమవిలోమకందము:—

మారామాసాదయభర భారశరాసా జలజసువదన నిజరసా
సారజ నినదవసుజలజ సారాశర భారభయద సామారామా.

అర్థము:—మారామాసాదయ; మారామ = లక్ష్మీదేవిని, అసాత్ = పొందిన; అయ = శుభమును గలవాడా! భరభారశరాసా; భర = అతిశయమును, భార = భరించినటువంటి, శరాసా = విల్లుగలవాడా! జలజ సువదన = జలజమువలె శోభనమైన ముఖముగలవాఁడా! నిజరసా = సహజమైన రసము గలవాడా! సారజనినదవసుజలజ; సారజ = సారమువలన బుట్టిన, నినద = ధ్వనిచేత, వసు = శ్రేష్ఠమైన, జలజ = శంఖము గలవాడా! సారాశరభార భయద; సార = బలవంతులైన, ఆశర = రాక్షసుల యొక్క, భా = కాంతిని, ర = గ్రహించిన, భయ = భయమును, ద = ఇచ్చిన వాడా! సామారామా! సామ = సామవేదమే, ఆరామా = ఉద్యానవనముగా గలవాడా!

39. భాషాశ్లేషకందము:—

మేలా నాయక బలిరా-యేలా చలమానగానదేరాలి వల
న్నిలాగీతేరగునా-వేలమ దయ కావగదర! వేంకటరమణా!

పై పద్యమున కాదిభాషార్థము (సంస్కృతము) మేలానాయక; మా = లక్ష్మికిని, ఇలా = భూమికిని, నాయక = నాయకుడైనవాడా! బలిరా - బలి = బలివద్దనుండి రా = గ్రహించేవాడా! ఏలాచలమానగానదేరాలివలత్; ఏలా = ఏలకితీగలచేత, అచల = నిశ్చలమైన, మ = కాంతియే, ఆ = భూషణముగా గలిగిన, నగ = పర్వతముయొక్క, అ = అంగమందలి, నద = నదముయొక్క, ఇరా = జలముయొక్క, ఆలి = సమూహమందు, వలత్ = సంచరించువాడా, నీలాగీతేరగు; నీలా = నీలాదేవియొక్క గీత = గానమును, ఇర = ప్రేరేచునటువంటి, గు = వాక్కులుగలవాడా! నావేల ముదయ = నా = జ్ఞానముచేత, అవేల = అధికమైన, ముత్ = సంతోషము గలవాతలకు, అయ = శుభావహవిధియైనవాడా! కావగదర = క = బ్రహ్మ యొక్క, ఆవ = రక్షణమును, గ = పొందిన, దర = శంఖముగలవాడా, వేంకటరమణ! = వేంకటరమణుడైనవాడా! అ = విష్ణువైనవాడా!

40. ఎత్తుగీతి యందలి కందము :—

హరినగనిలయ గిరిధర సుర_దళన మణిమయమకుట సురమణిమధుపి.
శరణ కరి వరదకువర రు_చిరతరవసన నరహరి లసితదరనిగమా.

41. ఎత్తుగీతియందలి ఆట వెలది :—

హరినగనిలయ గిరిధరయసురదళన మణిమయ మకుట సురమణి మధువిశ
రణకరివరద కువరరుచిర తరవస_ననరహరిలసితదరనిగమవిహా.

(పై పద్యమునందలి గర్భితములును, బంధభేదములును జేరి చౌషష్టి భేదము లని యెరుంగునది. మరియు ననుష్టుప్ శ్లోకమునకు అనులోమ విలోమకందమునకు రెండు వర్ణములును భాషాశ్లేషకందమునకు నారువర్ణము లును నీసీసములోనివి కావని యెరుంగునది.)

ఈ అసామాన్య పద్యంలోని ఇతరవైబంధాల బొమ్మలుకూడా ప్రకటించా లనే ఉంది. గాని పుటల సంఖ్య పరిమితం కావడంవల్ల ప్రకటించలేనందుకు విచారిస్తున్నాము. ప్రబంధరాజ వెంకటేశ్వర విజయవిలాసం ఎప్పుడో క్రీ. శ. 1892 లో అచ్చుపడింది. దానిని పూండ్ల రామకృష్ణయ్యగారు పరిష్కరించి సుదీర్ఘమైన పీఠికను వ్రాశారు. ఆరుప్రతులను సంప్రదించారు. 35 పుటల పీఠికలో ఎన్నో సంగతులు చెప్పారు. తెలుగుసాహిత్యంలో చిత్రకవిత్వ ప్రక్రియలను చేసిన గ్రంథాల వివరాలను విపులంగా ఇచ్చారు. ఈ ప్రబంధ

రాజం మళ్ళీ ప్రచురణ పొందడం చాలా అవసరం. కవిత్వం తక్కువైనా కనరత్తుల రికార్డు ఒకదగ్గిర ఉండడం ముఖ్యం. గణపవరపు వెంకటకవి తన ఇతర గ్రంథాలలోకూడా ఇటువంటి పీట్లు చేసి ఉంటాడు. అయితే దురదృష్టవశాత్తూ అతని గ్రంథాలన్నీ దొరకలేదు: అయినా కనీసం వాటి పేర్లు తెలుస్తూన్నందుకు సంతోషించాలి. ఆ జాబితాను చూడండి.

1. తారావళులు
2. యమకశతకం
3. శృంగారమంజరి
4. ఉదాహరణం
5. కృష్ణమల్లకథ
6. బాలరామాయణద్విపద
7. చాటుపద్యాలు
8. లింగనిర్ణయం
9. ఆంధ్రప్రతాపరుద్రీయం
10. రేఫఱకారనిర్ణయం
11. అభినవాంధ్రనిఘంటువు
12. ఆంధ్రకాముది
13. గణయతిప్రాసలక్షణసీసమాలిక
14. ఆంధ్రప్రయోగరత్నాకరం
15. షట్పత్యయప్రస్తారసరణి
16. ఇరవై ఆరు ఛందాల వచనం
17. అలంకారసారం
18. పరమభాగవతచరిత్ర
19. కల్పిత కల్పలత
20. వసంతతిలకభాణం
21. కఠినప్రాస శతకం
22. ద్విరూపకోశం
23. ఆంధ్రప్రక్రియాకౌముది
24. యతిరాజవిరుదుగద్య
25. జాంబవతీ విలాసం
26. విద్యావతీదండకం
27. చక్రవాళతారావళి
28. అఖిలపురాణసారం
29. యతిప్రాసలసీసమాలిక
30. ప్రబంధరాజం

ఈపట్టికలో అతడు ప్రబంధరాజంలో పేర్కొన్న గ్రంథాలుమాత్రమే ఉన్నాయి. ఈ కావ్యాలు వ్రాశాక అతడు ఎన్నో వ్రాసిఉంటాడు. ముద్దళగిరి క్రీ. శ. 1673 లో విజయరాఘవనాయకుని జయించాక తంజావూరును పాలించాడు. ఆతరువాత మహారాష్ట్రులతో యుద్ధం చేయవలసివచ్చింది. శివాజీ తమ్ముడు వీకోజీ తంజావూరుపై దండెత్తాడు. ముద్దళగిరి అతణ్ణి నాలుగు రోజులలో ఓడించాడు. ఈవిజయాన్ని నాలుగుఉత్పలమాలికలుగా గణపవరపు వెంకటకవి వర్ణించాడు. దానిని తంజావూరుకోట నాలుగుద్వారాలకు నాలుగు మాలికలుగా వ్రాశాడు. ఒకొక్కమాలికకు 74 పాదాలున్నాయి.

ఇది తక్కిన మూడుమాలికలలాగా శ్రీకారంతోనే ప్రారంభించలేదు. దక్షిణ మాలికలో 119, పడమటిమాలికలో 69, ఉత్తరపుమాలికలో 162 పాదాలున్నాయి. మొత్తం 424 పాదాలు. దీనిని మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారు ప్రచురించారు.[1] కర్తపేరు తెలియదని ప్రచురణకర్త లన్నారు. అయితేదానిని గణపవరపు వెంకటకవి ప్రౌఢనినిడుదవోలువెంకటరావుగారు చెప్తున్నారు.[2]

ఇటువంటి పొడుగాటి మాలికలు వ్రాయడం వెంకటకవికి మంచినీళ్ళ ప్రాయం. ఈమాలికలలో 'మకరబెబ్బులి, భత్తెసత్యములు' 'బజారులు, కిరీబురికీబు, బడాఫకీరులు, కిలేదారులు'వంటి మాటలు వాడాడు. 'ఇక్కవి శబ్దములు ప్రయోగించుటయందు సర్వతంత్రస్వతంత్రుడైనందున కొన్ని యప్రశస్తప్రయోగములు గ్రంథమునందగుపడుచున్నవి' అని దోషాలను వూండ్లరామకృష్ణయ్యగారు చూపించారు.[3] అయితే ఇటువంటి దోషారోపణకు గణపవరపు వెంకటకవి జంకడు. 'చంద్రునిలో మచ్చ ఉంటే నేం? వెన్నెల వెదజల్లడా?' అని ఇలా సగర్వంగా చెప్పుకొన్నాడు:

తప్పు గలిగిన చోటనె యొప్పు గలుగు
సరసకవితాచమత్కార సరళియంచు
గప్పుగలిగిన నీహారకరునివలన
నమృతధారప్రవృద్ధమై యలరినట్లు. [ప్రబంధ-19]

ఈ విచంద్రునిలో ఒకటి కాదు, చాలా మచ్చలున్నాయి. ఇతడు ప్రవృద్ధమవగానే చెరగని కారుమబ్బులు మూయడం దురదృష్టమే.

---

1. Bulletin of the Govt. Oriental Manuscripts Library, Madras. Vol. V. No. II Pp. 51-63.
2. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయ చరిత్ర, పీఠిక, పుట 27.
3. ప్రబంధరాజం పీఠిక.

21

సింగనమఠి తిరుకామయ్య



న ప్రాచీనులు ధర్మానికీ, అర్థానికీ ఎంత ప్రాముఖ్య మిచ్చారో కామానికి కూడా అంత ప్రాధాన్యం ఉన్నదని గుర్తించారు. సుఖపడడం వాళ్ళ దృష్టిలో ఎన్నడూ నేరం కాదు. సెక్సుని పాపంకింద ఎప్పుడూ మనవాళ్లు జమకట్టలేదు. సరి కదా, కాపురం చేసి సంతానాన్ని కనకపోతే పెద్దలు తరించ రని చెప్పారు. గృహస్థాశ్రమాన్ని ఎప్పుడో ఒకప్పుడు స్వీకరించాలని శాసించారు. ఏకపత్నీవ్రతాన్ని శ్లాఘిస్తూనే బహు భార్యలను చేసుకొన్నా తప్పు లేదన్నారు. దక్షిణనాయకుని ఘనతను ఉగ్గడించారు. సవతుల కయ్యాలను చూసి సంతోషించారు. పదహారువేలమందిని ఏక కాలంలో వీలుకున్న శ్రీకృష్ణుడు మన సాహిత్యంలో పరమనాయకు డయ్యాడు.

శ్రీకృష్ణుడు దేశంలోని ప్రజలకు ఆరాధ్యదైవం ఆయితే మంచిదేగాని ఆ గోపికాలోలునిలాగ దేశ మేలే రాజు కనపడ్డ ప్రతి ఆడదానినీ కామిస్తే ప్రమాదం. నాయకరాజుల యుగంలో ఇటు తంజావూరులో విజయరాఘవ నాయకుడు, అటు మథురలో ముద్దళగిరి నాయకుడూ తాము సాక్షాత్తూ శ్రీకృష్ణుల మనుకొని పచ్చికాముకులై జీవించారు. వాళ్ళ కాముక చర్యలను కవులు తెగ పొగిడారు. వాళ్ళ వ్యభిచారం ప్రచారం పొందింది. 'పదారువేల సీమంతినులన్ నిరంతరము మన్ననసేయు మురారికైవడిన్' ముద్దళగిరి 'అందర కన్నిరూపులై' మృగాక్షుల నేలుకొని శృంగారాబ్ధిలో తేలుతూ స్మర్మకళావిలాసములు మెరయ లాలించేవాడు. ఆతణ్ణి జనులు కలియుగ గోపాలు డని పిలిచేవారు.

విజయరాఘవనాయకుడు ఎప్పుడూ అందమైన ఆడవాళ్ళ మధ్యనే కాలం గడిపేవాడు. ఒకతె పదాలు పాడేది, ఇంకొకతె జక్కిణి, మరొకతె పేరణి, ఇలా తలొకరు తలొకరకంగా అతణ్ణి ఆనందింపజేసేవారని విజయ రాఘవుని ఆస్థానకవి చెంగల్వకాళయ్య వ్రాశాడు.[1] ముద్దళగిరి తీసిపోయాడా? అతడూ ఇంత వైభవంతో ఉండేవాడని మధురనాయకరాజుల ఆస్థానకవి లింగనమఖి తిరుకామయ్య సత్యభామాసాంత్వనంఅనే కావ్యంలో వర్ణించాడు.

నునుపుగా నొకవేళ గనకాంగి యొక్కతె శుభలీల బదముల నభినయింప
పనుపుగా నొకవేళ ననబోడి యొక్కతె వీణానినాదంబు వినికిసేయ
తనుపుగా నొకవేళ దరలేక్షణ యొకర్తు పంతుమార్గపు పాట వింత చూప
నినుపుగా నొకవేళ నీలవేణి యొకర్తు హితవైన శృంగారకృతులు చదువ
బనుపుగా నొక పంకజపత్రనేత్ర - మదవతుల రాయబారంపు మాటలాడ
జనులు కలియుగగోపాలు డనగ వెలసె-సరసగుణహారి ముద్దుళగిరి మురారి.
[సత్య. 1-25]

ఈ కలియుగగోపాలుని పేర అంకితంగా ఆ ద్వాపరగోపాలుని చరిత్రలో ఒక భాగం వ్రాసి తిరుకామయ్య దానికి 'సత్యభామాసాంత్వనం' అని పేరుపెట్టాడు. సాంత్వనం అంటే ఊరడించడం అని అర్థం. అలిగిన పెళ్ళాన్ని తియ్యారించడం జీవితంలో ఇబ్బందే కాని కావ్యంలో కమ్మగా ఉంటుంది.

---

1. రాజగోపాలవిలాసం, 1-23, 24.

మొగుడిమీద అలిగే భార్యలలో సత్యభామకే అగ్రతాంబూలం ఇవ్వాలి. తనను కాదని ఒక సవతికి పారిజాతం ఇచ్చినందుకు ఒకసారి మగనిని కాలితో తన్నిందని ముక్కుతిమ్మనగారు వ్రాశాడు. పదహారువేలమంది సవతులను తెచ్చినందుకు అలిగి జతతో కొట్టిందని తిరుకామయ్య సత్యభామా సాంత్వనంలో చెప్పాడు.

ఈ కావ్యాన్ని వ్రాయడానికి ముందు చాలా కాలంనుంచీ తిరుకామయ్య మధురనాయకుల ఆస్థానంలో ఉండేవాడు. అయితే అతని జన్మస్థానం కాళహస్తి కావచ్చు. అతడు కాళహస్తీశ్వరుని భక్తుడు. జ్ఞానప్రసూనాంబ దయవల్ల సారస్వతనంపన్ను దయ్యాడు. కాళహస్తిప్రాంతాలలో వెంగన్నగారి లింగన్న అనే ఒక సదాచారపరాయణుడు ఒకసారి యజ్ఞం చేశాడు. అతణ్ణి అందరూ లింగనమఖి అనేవారు. ఆ పేరే ఇంటిపేరై అతని సంతతివారు లింగనమఖివా రయ్యారు. ఈ కుటుంబంలో ఎన్నోతరంవాడో తెలియదుగాని నాగన్నగా రనే ఒకాయన ఉండేవాడు. అతడు కవిత్వం చెప్పేవాడు. అతని కొడుకే తిరుకామయ్య. తన తండ్రి 'నాగనకవిరాజు' అని తిరుకామయ్య చెప్పాడు. అయితే ఆ కవిరాజు వ్రాసిన గ్రంథా లేమిటో మనకు తెలియవు.

చిన్నప్పటినుంచీ తిరుకామయ్య సంగీతసాహిత్యాలలో ప్రజ్ఞ సంపాదించుకొన్నాడు. వీణ వాయించడంలో అతడు ధురీణుడు. మన సంగీత సంప్రదాయంలో వర్ణాలూ గీతాలూ నేడు సుప్రసిద్ధాలయినా నాయకరాజుల కాలంలో అవి కొత్తవి. ఈ నవీనకల్పనలలో తిరుకామయ్య ప్రవీణుడు. 'వల్లకీవాదనధురీణ, వర్ణగీతాదిగాంధర్వ సర్వనవీనకల్పనాప్రవీణ' అనే బిరుదులను తిరుకామయ్య తన గద్యలో వ్రాసుకొన్నాడు. అతడు తన పాటలతోనేకాక మాటలతోకూడా ఇతరులను రంజింపజేస్తాడు. 'ధీరజన హృదయ రంజకవిహార' అనే ఇంకో విశ్లేషణాన్ని అతడు చెప్పుకొన్నాడు.

ఏమాటలతో రంజింపజేశాడోగాని తిరుకామయ్యను తిరుమలనాయకుడు చాలా గొప్పగా సత్కరించాడు. ముత్యాల గుత్తులున్న వెల్లగొడుగులు, వింజామరలు, తమ్మపడిగలు, బంగారు అందలాలు మొదలైన రాజోపచారాలతో తిరుమలనాయకుడు తనను నన్మానించా డని తిరుకామయ్య చెప్పుకున్నాడు. తిరుమలనాయకుడు క్రీ. శ. 1623నుండి 59 దాకా మధుర

పాలించాడు. బహుశా 1650 ప్రాంతాలలోనో, లేక ఇంకా ఆలస్యంగానో తిరుకామయ్య మధురకు వచ్చివుంటాడు. తిరుమలనాయకుని తరువాత అతని కొడుకు ముద్దువీరప్ప ఆర్నెల్లు రాజ్యం చేశాడు. ఆ పిమ్మట ముద్దు వీరప్ప పెద్దకొడుకు చొక్కనాథుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు క్రీ. శ. 1659 నుంచి 82 దాకా పాలించాడు. ఇతని సవతితమ్ముడే ముద్దు అళగిరి. ఈ అన్నదమ్ములిద్దరూ తిరుకామయ్యను పోషించారు. మొదట బహుశా అళగిరి ఆశ్రయాన్నే తిరుకామయ్య పొందా డనుకోవచ్చును. 'రుక్మిణీ పరిణయం' అనే కావ్యాన్ని వ్రాసి అంకితం ఇచ్చాడు. ఆ తరువాత అభంగుర మైన శృంగారరసతరంగాల వచన రచనానుబంధంగా ఒక ప్రబంధం వ్రాద్దా మనుకొన్నాడు. అప్పుడు ముద్దళగిరి ఇలా ఆనతిచ్చాడు:

అనువుగ రుక్మిణీపరిణయంబును మున్ హవణించి యార్యులౌ
నన దనియించినావు మను నప్రతిమంబుగ నవ్యకావ్య మిం
పునరచియించుమీ సొగసు పొడిమి మీరగ సత్యభామసాం
త్వన మన గప్పురంపు చలువన్ గెలువన్ దిరుకామసత్కవీ!

[సత్య. 1–32]

కృతిపతి కోరినట్టే తిరుకామయ్య కావ్యాన్ని వ్రాశాడు. నాలుగాశ్వాసాలలో 648 గద్యపద్యాలు చెప్పాడు. మొదటి ఆశ్వాసంలో అవతారిక, కృతిపతి వంశావళి, షష్ట్యంతాలదాకా 121 గద్యపద్యాలు చెప్పాడు. తరువాత పాతిక పద్యాలలో ద్వారకానగరవర్ణన, శ్రీకృష్ణుని ప్రశంస చేశాడు. అంతకుముందు ఏకావ్యంలోనూ ఏ కవీ వర్ణించని 'కుంటెనకత్తియలగుంపు' పురవర్ణనలో పేర్కొన్నాడు (1-131). జందెపు మోపు నీటుకాండ్రు, పూయప్రాయపు బాపనబోనకత్తెలు ద్వారకానగరంలో ఉండేవారట (1-132). సాత్యకి, చంద్ర భానుడు, శివుడు, సాంబుడు మొదలైన యాదవరాజకుమారు లంతా వేశ్యావాటికలో నిత్యమూ క్రీడసల్పుతారట (1-133). దాదుల ఇళ్ళలో చీకటి నేస్తపుచెలులు చేరుతారట (1-139). ద్వారకలో ఎప్పుడూ గొల్లభామలు చల్లలమ్ముతారట. ఆ సంగతి ఇలా వర్ణించాడు:

ఉల్లాసం బొనగూడ జగ్గునడతో నొయ్యారపుం జూపు లు
ద్యల్లీలం దగ జేతు లెత్తి బసపుం దళ్కొత్తు పాలిండ్లతో

మల్లాడం దగు నిండు పైడికడవల్ మాళిస్థలిం బూనుచున్
చల్లో చల్లని చల్ల యమ్ముదురు నిచ్చల్ గొల్లచానల్ పురిన్.
[సత్య. 1–142]

ఇటువంటి ద్వారకానగరాన్ని శ్రీకృష్ణుడు పాలించేవాడని చెప్పి తిరుకా మయ్య ప్రథమాశ్వాసం ముగించాడు. ద్వితీయాశ్వాసంలో ఇంద్రాదులు ద్వార కకు వస్తారు. విమానంనుండి తివాసులు, దిళ్లు, పరంగిపీటలు మొదలైనవి సేవకులు దింపుతారు. ఇంద్రాదులు నరకాసురుని దారుణాలు కృష్ణునికి చెప్పుకొంటారు. ఆ రాక్షసుని సంహరిస్తానని కృష్ణుడు మాట ఇస్తాడు. తరు వాత వసంతోత్సవం జరుగుతుంది. కృష్ణుడు విహరిస్తాడు. సత్యభామతో క్రీడిస్తాడు. మణితాలు, చిరుమాల్గులు, ఊరడింపులు, గరిసింపులు, గాయ కాలు, కసరులు, కొసరులు, మురిపాలు మొదలైన సరసాలన్నీ వర్ణించాడు. తరువాత నరకాసురునితో యుద్ధానికి వెడతానని కృష్ణుడు చెప్పాడు. 'కంస శాసనా! నీవు నరకాసుర విజయంబు సేయుట ఈ దేవీసమాజంబునకు నే దెలుపదగినది కావున భూమివారు చూడ స్వామివారితోడనే నన్నుం దోడు కొని విజయంబు సేయవలయు'నని సత్యభామ హెచ్చరించింది (2–108). అప్పుడు కృష్ణుడు ఇలా అన్నాడట:

వెరవక పోరు జూచుటలు వెన్నెలకప్పలూ కాక గవ్వలో
గురుగులూ బొమ్మరిండ్లో మతి గుజ్జనగూడులూ కొండ్లివీడులో
పారిబోరి నిచ్చలున్ విసరు పువ్వుల రువ్వులూ తేటనవ్వులో
యరయరు కార్యముల్ మృగము లట్ల వెలందుల దెల్ప శక్యమే?
[సత్య. 2–109]

మృగాలలాగ ఆడవాళ్ళు కార్యాలు తెలుసుకోలేరని పెద్ద అభాండమే వేసి కృష్ణుడు సత్యభామని యుద్ధానికి రావద్దన్నాడు. ఆమె 'చతురురాలు' కనుక ఊరుకొని దీవెనపీడె మిచ్చి యుద్ధానికి పంపింది. కృష్ణుడు పగవాళ్ల సీమ పాళెం విడియించాడు. దానితో ద్వితీయాశ్వాసం ముగిసింది. దీనితో తిరుకామయ్య చేసిన మార్పు మొదలవుతుంది. సత్యభామ కృష్ణునితో కలిసి యుద్ధానికి వెళ్లిం దన్న సంగతి పురాణప్రసిద్ధం. అయినా ప్రబంధంలో విప్ర

లంభ శృంగారం ఉండాలికనుక మొగుడూ పెళ్లాలను తిరుకామయ్య విడ దీసి కథ నడిపాడు.

యుద్ధానికి వెళ్లిన కృష్ణుడు టేకుకంబాలు, రతనాల కుట్టుపను లున్న 'కుతినిగుడారు'లో కొంతసేపు కూర్చున్నాడు. తరువాత దూదిచిమ్మినకాని గుడారులో చేరాడు. తిరుబాటుగా విరహంలో పడ్డాడు. ప్రమదలు లేనిచో మగవాళ్ళ మనసు రాయిఅనీ, నేరం తలచవద్దనీ వస్తానన్న సత్యభామను తలచుకోసాగాడు. నేస్తకాండ్రు వినేటట్లు తమ శృంగారక్రీడలు పచ్చిపచ్చిగా నెమరువేసుకోసాగాడు. ఆమె కుచాలు, తన చేతులు ఎప్పుడు వియ్యమందు తాయో అని బాధపడ్డాడు. ఎదురుమంచా లెక్కి ఉయ్యాల లూగి, పనుమొన లతో ఆకుమడుపులు ఇచ్చుకోవడం ఇంకెప్పుడో అని బాధపడ్డాడు.

అది సాగ సౌనది మనసౌ_నది నయ మౌనదియు తాళ మది నిలుకడ యం
చెదురెత్తుచు దమి మాత్తుచు_ముదితా నీవెపుడు సురతమున మెచ్చెదవో!
[సత్య. 3_39]

సత్యభామ లేని గుడారు ఉత్త బిడారు అయిందని బాధపడ్డాడు. 'యుద్ధానికి దళకర్త నంపక యకట నేనె యేలవచ్చితి' అని పచ్చికాముకుని లాగ చింతించాడు (3-59). శ్రీకృష్ణునివంటి ఉదాత్తనాయకుడు తిరు కామయ్య దృష్టిలో ఇంత దిగజారిపోయాడు. ముద్దు అళగిరిలాంటి శుద భోగలాలసులు యుద్ధానికి దళకర్తలను పంపి తాము క్రీడిస్తూ ఉండవచ్చు. తిరుకామయ్య తన ప్రభువులాగే కృష్ణునికూడా చిత్రించడం చాలా శోచ నీయం. ఇటువంటి భీరవాక్యాలు ధీరోదాత్తుని నోట రాకూడదు. అందుకే కృష్ణుని చెలికాండ్రే ఇలా చీవాట్లు పెట్టారు.

వలచినవారలు లేరో _ వలపించినవారు లేరొ వనితల నిట్లా
తలచుకొని సమరముఖమున_బలవించినవారు గలరె పద్మదళాక్షా!
[సత్య. 3-62]

శ్రీకృష్ణుని విరహం ఉడ్డోలంగా, విడ్డూరంగా ఉంది. ఆమె పెదవి అను కొన్నట్లు తన మోవి తానే అనుకొంటున్నాడు; ఆమెను కౌగిట చేర్చినట్లు తన రొమ్ము తానే అదుముకొంటున్నాడు (3-66). తన తొడలు తానే గదియించు కొంటున్నాడు. ఆమె రైక ఎంత తపం చేసిందో, ఆమె పావడా ఎంత భాగ్యం

నోచిందో అని నోరెత్తి అరుస్తున్నాడు (3-67). అప్పుడు కలవింకు డనే హాస్యగాడు ఇలా అన్నా డట:

నలినాక్షి విరహ మనగా_నలుపో తెలుపో యిదేటి నటనలు బళిరా!
నలుపై న చీక టేదియొ_ తెలుపైనన్ వచ్చినేది తెలిసిటు చెపుమా.

[సత్య. 3–74]

విరహాన్ని తెలుపా నలుపా అని అడగడం మన సాహిత్యంలో కొత్త కాదు. తాళ్లపాక అన్నమాచార్యులవారు ఇలాంటిదే ఒక సంకీర్తనం (వాశారు.

నాకు చెప్పరే వలపు నలుపో తెలుపో
నూకి పోవగ రాదు నుయ్యో కొండో.

[శృంగా సం. 12_192]

తిరుకామయ్య సంగీతంలో పుంచి ప్రవీణుడు. కనుక అన్నమయ్య సంకీర్తన అతని నోటికి వచ్చే ఉంటుంది. దానిని జ్ఞాపకంచేసుకునే కల వింకునిచేత విరహం నలుపా తెలుపా అని ప్రశ్నింపజేశాడు. ఈ హాస్యగాడు అంతతో ఆగితే బాగుండును. అధికప్రసంగం చేశాడు. యుద్ధానికి వచ్చినప్పుడు వట్టి గొడవ ఇల్లాలిపై బాళి అన్నాడు (3-79). వెలయాండ్రు కర్వ యినా రొకో అన్నాడు (3-83). 'వసుధ పరకాంత నొల్లని వానివలెనె నిచ్చ నిల్లాలిపై బాళి యెంచనేల' అన్నాడు (3-82). తిరుకామయ్య చిత్రించిన శ్రీకృష్ణుడు పరమకాముకుడే కావచ్చునుగాని కొంచెం పుడికట్టుకొన్నవాడే. పేరు పేరు వరసలు చెప్పి ఆ వారకాంతలలో ఒకదానిని 'తళుకు గలదానిగా చిన్న దానిగా పొంకముగ నేర్పరించి అలంకరించి తోడి తెచ్చెద' అని కలవింకుడు అనగానే కృష్ణుడు ఏవగించుకొన్నాడు. 'ఏమిరా పాపజాతి నీవు బాపన జాతి నెటువలె పుట్టితివో....యేపనికి రోయవు' అని తిట్టాడు. (పేమ నంగతి పప్పును మెక్కు పల్లరపుబాపని కేమయినాను తెలుసునా?' అన్నాడు. కృష్ణుడు (3-90) వెలకాంతల నిలా తిట్టాడు:

కలపొక చో బిలు పోక చో_బలుకులు వేరొక్క చోట భావం బొక చో
వెలయిం చు వెలమిటూరుల_తలకగపడి మోసపోవు వారలుగలరే?

[సత్య. 3_93]

వెలకాంతల నిలా నిందించాక కృష్ణుడు కులకాంతల నిలా మెచ్చుకొన్నాడు:

మేలెంతురు కులకాంతలు_తేలింతురు రతుల గొంత తీర్చినకొలదిన్
పాలింతురు కులధర్మము_తాలిమి పచరింతు రెంతి తవాతవాయినన్.

[సత్య. 3-94]

ఆ తరువాత మహావిరహంలో పడ్డాడు. సత్యభామ తనకు తలంటడం, మగవేషం వేసుకొని మగపతాలు సలపడం, మరుడక్కను మరిపిస్తూ ఆమె మణితం చేయడం మొదలైనవి గుర్తు తెచ్చుకొన్నాడు. అప్పుడు సత్యభామ పెంపుడుచిలుక అక్కడికి పచ్చింది. అది సాధారణశుకం కాదట. శివుని సభలో పార్వతిముందర గడియ కనేక పద్యాలు గ్రక్కున రచించే నేర్పున్నది. కృష్ణుని వరించాలని ఆదిలో సత్యభామ గౌరినోము నోచింది. అప్పుడు అంబ ప్రత్యక్షమై వరంతోపాటు చిలుకనుకూడా ఇచ్చింది. అదే చిలుక ఇప్పుడు రాయబారం చేసింది. కృష్ణుడు ఎంత విరహబాధ పడుతున్నాడో సత్యకూడా అలాగే సతమత మవుతోంది. 'ఇంకా మేలిమితోడ నుండదు. సుమీ యేణాక్షి' (3-132) అని చెప్పి అపందగునట్టివారి ననిపి సత్యభామను రప్పించమని చిలుక సలహా యిస్తుంది. 'మీపిన్నమ్మను తీసుకురా' అని చెప్పి ప్రద్యుమ్నకుమారుణ్ణి కృష్ణుడు ద్వారకకు పంపిస్తాడు. దానితో మూడో ఆశ్వాసం ముగిసింది.

అయితే తిరుకామయ్య చేసిన మార్పులు ముగియలేదు. అసలు కథ చిన్నదని మరొక కొత్త కథ కలిపాడు. నరకాసురుని గూఢచారి ఒకడు మారువేషంలో వచ్చి ఇక్కడి యుద్ధసన్నాహాలు చూస్తున్నాడు. వాణీ భటులు పట్టుకొన్నారు. కృష్ణుని ముందు పెట్టారు. ఈ రాక్షసుడు నిజంగా శాప గ్రస్తుడు. పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడు. చెడుతిరుగుళ్ళు తిరిగాడు. నీలాటి రేవుకు వచ్చే ఒక ఇల్లాలిని మోసగించి క్రీడించాడు. అతని కాముక చర్యలు బోలెడు. తన ఇల్లాలిని చెరిచాడని ఒక ముని కోపించి ఆ బ్రాహ్మణునికి శాపం ఇచ్చాడు. దానివల్ల రాక్షసుడయ్యాడు. కృష్ణదర్శనంవల్ల శాపం పోయింది. చిలుకచేత ఈ పూర్వకథను తిరుకామయ్య చెప్పించాడు. 41 గద్యపద్యాలలో వ్రాసిన ఈ పిట్టకథ ప్రయోజనం గ్రంథం పెరగడం తప్ప మరేం లేదు.

సత్యభామ వచ్చాక ఋతువర్ణన, తరువాత యుద్ధం, నరకాసుర సంహారం, భూదేవి రావడం, కుండలాలు ఇవ్వడం, వాటితో ఇంద్రలోకానికి వెళ్ళడం, అదితికి ఇవ్వడం, భగదత్తుని పట్టాభిషేకం, ఆతరువాత నరకుని చెరలో ఉన్న పదహారువేలమంది కన్యలను కృష్ణుడు పెళ్లాడడం తిరుకా మయ్య చెప్పాడు. ఇంతమంది సవతులు రావడం అష్టమహిషులకు కోపం కల్గించింది.

కొరకొర మించె రుక్మిణికి, ఘూర్ణిలె లక్షణ యెంతయేని, చు
క్కురమనె భద్ర, జాంబవతి కుందె, గళిందజ గండెజాల, వే
సరుకొనె మిత్రవింద, నగె జాల దపించె సుదంత వారిలో
నరయగ సత్య తా సరసు రాలగుటక్ మది కిన్క మాటుచున్.

[సత్య. 4_129]

నరసురాలుకనుక సత్యభామ వారిని ఊరడించింది. తాను బాధపడ సాగింది. 'మగ డెడసి చౌకచేసిన మగువకు కాదనతరంబె' అనుకొంది. 'కదిసి సుఖించగ సవతులు పదియార్వేలైన నెట్లు బ్రతుకగవచ్చు' అను కొంది. అప్పుడు చెలికత్తెలు ఇలా అన్నారు:

సొగసొ తానికి తుమ్మెద_జగతిని వేవేల లతల జరియించదొకో
మగవాడు నటులె కాదా_మగువలయెడ నీకు నచట మచ్చరమేలే!

[సత్య. 4_169]

ఇలా హితోపదేశం చేసిన చెలికత్తెలకు కృష్ణుడు లంచం యిచ్చాడని సత్య తిట్టిపోసింది. కృష్ణునిమీద అలిగింది. కృష్ణుడు వచ్చాడు. సొగసులు చెల్లించుకోమని కాంత లన్నారు:

అనినం గాంతలచేత వీడుగద యట్లాడించె నంచున్ మనం
బున గోపం బుబుకంగ నీదు వినయమ్మ్మొం గంటిగా నంచు బై
టను లేగానును చారిచుట్టి చెలియొడ్డారమ్మ్మన్ లేచి చ
క్కని శౌరిన్ జడగొట్టె గంకణరుణత్కారంబు తోరంబుగన్.

[సత్య. 4_183]

జడతో కొడితే నీచేయి నొవ్వలేదా అని కృష్ణు డన్నాడు. తరువాత 'మోము ప్రాయాలి పదయుగళమునను జేర్చి సాగిలెను శౌరి వలపుల బాగు

మీరి' (4-193). అప్పుడు హరి జారుసిగను కోపం తీరేటట్టు తన్నింది. తాయె తలు, అందెలు ఘల్లుమన్నాయి.

ఘల్లని యందెలు మొరసిన _ కొల్లోకొల్లనుచు జనిరి కోమలు లపుడే
యల్లన బొటనవ్రేలును_మెల్లన హరిపంట నంటి మెఱుపుమించు నొక్కన్.
[సత్య. 4–196]

తన్నిన కాలు మునిపంట పట్టుకొని శృంగారచేష్ట చేయగానే నత్య కోపం మంచులాగా కరిగిపోయింది.

కామునకు డటువలె బంటన్_వేమారున్ వ్రేలు నొక్క_ వెలసిన కళచే
మైమిగుల రుఘుఘ్మరుఘ్మన_గామిని కోపంబు మరచి కలకల నవ్వెన్.
[సత్య. 4_197]

నత్యభామను ఇలా తియ్యారించి కృష్ణుడు ఏలుకొన్నాడు. దంపతీనిష్ఠ. మైన శృంగారమే 'సాంఘికాభ్యుదయహేతువు'అని ప్రబోధించే యీ కావ్య కర్త గొప్ప శృంగారరసవివేచనకలవా డని నిడుదవోలు వెంకటరావుగారు భావిస్తున్నారు.[1] అయితే నేలటూరి వెంకటరమణయ్యగారు 'ఎంతటి ప్రౌఢ మైన ధైనను యిట్టి కవిత్వ మేవగింపు పుట్టింపకపోదు'అని చెప్పి 'కామేశ్వర కవి ప్రతిభావంతుడే కాని న్వశక్తికొలది యెరుగక మహాకవులతో దులతూగ పోయి చతికిలబడినవాడు'అని రుజువుచేశారు.[2]

నంది తిమ్మనగారి పారిజాతాపహరణంలోని మంచి పద్యాలను కొన్ని తిరుకామయ్య అనుకరించాడు. అయితే ఇతని 'చెడ్డ' పద్యాలను తరువాత శృంగారకవులు అతిగా అనుకరించారు. నాయికతో తాను చేసిన శృంగారచేష్టలను నాయకుడు తలపోసుకొని విరహం పొందడం ఈ కావ్యంతో మొదలైంది.

సత్యభామాసాంత్వనం ప్రాశాక తిరుకామయ్య ధేనుమాహాత్మ్యం అనే వచనగ్రంథం రచించి చొక్కనాథునికి అంకితం ఇచ్చాడు. ఇందులో ధర్మ రాజుకు భీష్ముడు చెప్పిన ఆవులమాహాత్మ్యాన్ని రచయిత తేటమాటలతో వివరించాడు. ఈ గ్రంథం అచ్చుపడలేదు. తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంలో దీనిప్రతులు రెండు ఉన్నాయి. గద్యలోని పద్యంవల్ల దానిని తిరుకామయ్య రచించా డని తెలుస్తోంది.

---

1. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము, పీఠిక, పుట 2.
2. దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము, పుట 41.

విధి కలాకలాపఖని వెంగనలింగమఖేంద్రు నాగస
త్కవి తిరుకామ కోవిదశిఖామణి ధీరులు పాకవైరిలో
కవికచకల్పకస్తబక గంధధురంధర సూక్తి యుక్తి నౌ
నవునని మెచ్చ నావుల మహోత్మ్య మొనర్చెను తేటమాటలన్.
[తంజావూరు, D. 676]

మరొక ప్రతిలోని ఆదిపద్యంవల్ల ఈ అవులమహాత్మ్యం చొక్కనాథునికి అంకితం అని తెలుస్తూంది.

శ్రీరామామణి వింతగా నురమునం జెన్నొంది కొల్వుండ నెం
తే రంగంబును కట్టుమట్టున సదాదీవ్య త్కృపాధారతీ
రాహుఢిందగ కామధేనువువలెన్ రక్షించి లోకంబులో
శ్రీరంగేశుడు చొక్కనాథ...శౌరిన్ వేమఱన్ బ్రోవుతన్.
[తంజావూరు D. 677]


ఆద్యంతాలలో పద్యా లున్నా ఇది వచనగ్రంథం. మధురలో వెలువడిన వచనరచనలలో ఇది మొదటిది. తిరుకామయ్య ఇదికాక మరేమైనా గ్రంథాలు వ్రాశాడేమో తెలియదు. ఆవుల మహాత్మ్యంలో ధర్మాలు చెప్పినా తిరుకామయ్య రచనలు చాలామట్టుకు శృంగారకృతులే అని చెప్పాలి. వాగ్దేవి ముఖమనే ఇందూదయంలో తన చిత్తకలశాంభోరాశిపై తేరేపాలతేట పలుకుల పొల్చే రత్నాలే తన శృంగారకృతులని అతడు చెప్పాడు (సత్య. 1-17). 'మహీపతుల్ కూర్మిన్ వాని జేకోరొకో' అన్నాడు. తన కాలంలోని మహీపతులను మెప్పించడానికి సమకాలిక భోగలాలసత్వం పురాణపురుషులకు అంటగట్టాడు. వనమాలిని బైసిమాలిగా వర్ణించడం అలాగ ఉంచుదాం. కృష్ణుని కొలువుకూడా ముద్దళగిరి కొలువే!

...సజ్జ గొలువున్న పసిగాపు సామిసరస
తామరసపత్రనేత్ర లందఱు వినంగ. [సత్య. 2_2]

ఒక వాద్యరవం వినబడిందట. సామిసరసను తామరస నేత్ర లేకాని కవులు మంత్రులు, పండితులు మొదలైనవాళ్లు ఈనాయకరాజుల కొలువులో కనబడరు! పెంటివిద్యలు పెరిగి పోయాయని వాపోయిన బైచరాజు వెంకటనాథుని శోకం ఈ యుగంలో తారసాయిని అందుకొంది.

23

నారాయణ తీర్థులు, సిద్ధేంద్రయోగి



టకచేరీలోనో, భజనకూటంలోనో, లేక కూచిపూడివారి నాట్యంలోనో ఎక్కడో ఒక దగ్గిర ఎప్పుడో ఒకప్పుడు తరంగాలు వినని సంస్కారవంతుడు ఉండడు. వేదికపైన కూర్చున్న గాయకుడు 'జయజయ గోకులబాల' అని కురంజిలో పాడడంగాని, చిరతలు పట్టుకొన్న భక్తుడు 'ఏహి ముదం దేహి, కృష్ణా, కృష్ణా'అని పరవసించి ప్రార్థించడంగాని ఇప్పుడు అరుదుగా వినిపించినా కూచిపూడివారి ధర్మమా అని నేడు వివిధరంగస్థలాలమీద 'బాలగోపాల మా ముద్దర!' అనే తరంగం మోహనరాగంలో వినబడుతుంది. అందులో మరీ ప్రత్యేకంగా 'ఇందిరామందీరా భక్తా-సుందరహృదయారవింద'అనే పాదభాగం రకరకాల కాలాలలో ఒక గంటసేపు వినబడుతుంది. ఈ తరంగాలన్నీ 'కృష్ణలీలాతరంగణి' అనే పెద్ద సంస్కృత యక్షగానంలోనివి. దానిని శివనారాయణతీర్థుల

వారు రచించారు. భాగవతం దశమస్కంధంలోని కృష్ణచరిత్రను తీసుకొని పన్నెండు తరంగాలుగా విభజించి 156 కీర్తనలను, మధ్యమధ్య ఎన్నో శ్లోకాలను అనుసంధిస్తూ వ్రాశారు. తీర్థులవారు తమ యక్షగానంలోని అంకాలను తరంగాలన్నా రు. గాయకులు, సాహితీపరులు ఆయన వ్రాసిన కీర్తనలకు తరంగాలని పేరుపెట్టారు.

నారాయణ తీర్థులవారి అనలు పేరు గోవిందశాస్త్రి. స్వగ్రామం గుంటూరు జిల్లాలోని కాజ[1]. ఇంటిపేరు తల్లావజ్ఝులవారు. తీర్థులవారి తండ్రిగారు నీలకంఠశాస్త్రిగారు; గొప్ప సంగీతవేత్త. గాంధర్వదేవుడనే బిరుదుపొందిన విద్వాంసుడు. తండ్రిగారిపద్దనే తీర్థులవారు గానకళ నేర్చుకొనిఉంటారు. వాసుదేవ పండితులనే మహాశాస్త్రజ్ఞులవద్ద ఆయన షడ్దర్శనాలు, సర్వశాస్త్రాలు నేర్చుకొని మహాపండితు డయ్యారు. శాండిల్యభక్తిసూత్రాలకు వ్యాఖ్యానం వ్రాశారు. సాంఖ్యకారికలకు, సాంఖ్యతత్వానికి వ్యాఖ్యానాలు రచించారు. న్యాయకుసుమాంజలికి టీక వ్రాసి తమ తర్కశాస్త్రపాండిత్యాన్ని చూపించారు. తీర్థులవారు సంస్కృతంలో 14 గ్రంథాలు వ్రాశారు. ఇంతటి శాస్త్ర పాండిత్య మున్నా ఆయన సంగీతసాహిత్యాలపై మక్కువ చూపేవా రనుకోవాలి. వేదాద్రి, శోభనాద్రి, శ్రీకాకుళం, కటకం, జగన్నాధం మొదలైనక్షేత్రాలు దర్శించి ఆ దేవతలపై ఎన్నో సంకీర్తనలు రచించారు. ఆయన యౌవనంలో సన్యాసం స్వీకరించి ఈపుణ్యక్షేత్రాలకు వెళ్ళారు. తీర్థులవారు సన్యాసం పుచ్చుకోడానికి కారణం ఉంది. దాని నొక కథగా చెప్తారు. కృష్ణకు ఆవలి ఒడ్డున ఉన్న అత్తవారి గ్రామానికి ఆయన ఒకనాడు ఆత్రుతతో వెడుతున్నారు. ఇంతలో వరద వచ్చింది. మునిగిపోతాం అనుకొని ఆయన ఆపత్స

---

1. తీర్థులవారి జీవిత చరిత్ర గురించి రకరకాల కథలున్నాయి. కొందరు వారి స్వగ్రామం గోదావరీ మండలం అంటారు. కామకోటిపీఠాధిపతులు కృష్ణాతీరమంటారు. డాక్టర్ వి. రాఘవన్ గారు కావేరీతీరాన ఉన్న వరహూరు అంటారు. తల్లావజ్ఝులవారు కాజ అంటారు.

[చూ॥ వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారి షష్టిపూర్తి సన్మాన సంపుటంలో తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రిగారి వ్యాసం.)

న్యాసం స్వీకరించారు. అలా సన్యసించగానే ఇలా గండం తప్పింది. ఒడ్డుకుచేరి అత్తవారింటికి వెళ్ళి భార్య అనుమతితీసుకొని తీర్థులవారు దేశాలు పట్టారు. పరిణామశూలతో బాధపడుతూ దక్షణాదికి చేరుకొన్నారు. తంజావూరుజిల్లాలో కావేరీతీరాన ఉన్న వరహూరు చేరుకోగానే వారి వ్యాధి నయం అయింది. అంచేత కావేరీతీరాన్నే వారు స్థిరపడ్డారు.

అవి తంజావూరు రాజ్యాన్ని నాయకరాజులు పాలిస్తున్న రోజులు. కావేరీతీరాన మేలటూరు అనే గ్రామాన్ని భాగవతమేళాలు ప్రదర్శించే కుటుంబాలకు అచ్యుతప్పనాయకుడు పూర్వం దానం చేశాడు. అందువల్ల ఆ గ్రామానికి అచ్యుతాబ్ధి అనే పేరు వచ్చింది. నారాయణతీర్థులవారు ఈ ఊరిలోనే స్థిరపడ్డారు. ఊరివారంతా భాగవతులే కనుక వాళ్ళు ప్రదర్శించడానికి వీలుగా సంస్కృతంలో కృష్ణలీలాతరంగిణి అనే యక్షగానాన్ని రచించారని భావించవచ్చును. మాతృభాష అయిన తెలుగులోకూడా అయన పారిజాతాపహరణం అనే యక్షగానం వ్రాశారు. అందుకే ఆంధ్రకవిగా అయన చరిత్ర యిక్కడ చెప్పుకొంటున్నాం.

నారాయణతీర్థులవారి పారిజాతాపహరణం ఇప్పుడు ప్రచారంలో లేదు. దీని సమగ్రప్రతికూడా ఒకచోట దొరకదు. తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలో ఒక అసమగ్రప్రతి ఉంది.[1] మేలటూరులో మరొక ప్రతి ఉంది.[2] ఈ రెండు ప్రతులూ కలిపితేనే సమగ్రప్రతి తయారవుతుందని పరిశోధకుల అభిప్రాయం.[3] ఈ యక్షగానంలో మొదట తీర్థులవారు కథా సంగ్రహాన్ని అయిదు శ్లోకాలలో చెప్పారు. దానిప్రకారం మొదట రుక్మిణి ఇంట్లో కృష్ణుడు ఉండగా నారదుడు రావడం, పారిజాతం ఇవ్వడం, సత్యభామకోపం, రుక్మిణి సత్యభామల సంవాదం, సత్యభామ అలుక, తరువాత కృష్ణు డామె చిత్తరంజనం చేయడం, గరుత్మంతుణ్ణి ఎక్కి ఆకాశయానం, భామతో కలసి నరకాసుర సంహారం, నందనోద్యానవనానికి వెళ్ళడం, పారి

---

1. తంజావూరు కేటలాగు - ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ. గ్రంథసంఖ్య 544.
2. Journal of Madras Music Academy, 1942, No. 1-4, P. 74.
3. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర, పుట 285.

జాతాపహరణం, ఇంద్రస్తుతి, సత్యభామ పెరట్లో పారిజాతం నాటడం మొదలైన ఘట్టా లుంటాయి. దీనిని తీర్థులవారు యక్షగానం అనక నాటక మనే అన్నారు. "పారిజాతాపహరణాఖ్యం నాటక మభినీయతే" అని గ్రంథాదిని ఉంది. "అవురా ఈవిధంబున అంతట పారిజాత నాటక నాట్యావైఖరికి విఘ్నంబు గాకుండు విఘ్నేశ్వరుండు వచ్చే మార్గంబు పరాకు" అని సంధి వచనం, తరువాత ఒక దరువు ఉంది.

వచ్చేనే గణప తిడిగో బాల-కరదుడై మిగులను వన్నెమీరగను.

గణపతి ప్రవేశదరువును తెలుగులో ప్రాసినా కృష్ణుడు, నారదుడు మొదలైన పాత్రల ప్రవేశాలను సంస్కృత దరువులలోనే ప్రాశారు. నిజానికి వాటిని క్రొత్తగా ప్రాయలేదు. కృష్ణుని ప్రవేశం అచ్చంగా కృష్ణలీలాతరంగిణి లోనిదే ఇందులో ఉంది.

శంఖీ చక్రీ గదీ పద్మీ ఖార్జీ కిరీటకుండలీ
శ్రీవత్స కౌస్తుభీ దివ్యపీతాంబరో విరాజతే. [తరంగిణి 1-34]

నారదుని ప్రవేశం కూడా సంస్కృత దరువులోనే ఉంది. ఆ ముని పారిజాత పుష్పాన్ని రుక్మిణికి ఇచ్చాడని తెలిశాక సత్యభామకి కోపం వస్తుంది. ఉక్రోషం పుట్టుకొస్తుంది.

పుడమిలోపల నాడు పుటువుక ంటె
నడవిలో నొక పుష్పమై యున్న మేలు.

అని భావిస్తుంది. చెలికత్తెలతో తన గోడు చెప్పుకొంటుంది.

ఎంత దుడుకవాడు గోపాలు డమ్మ-చాని వలపుల కెవశమాయెనమ్మ
తలచుకొంటె నే తాళలేనమ్మ-నారాయణ తీర్థనామధేయుడమ్మ
హరిహరిహరి ఆనంద గోపకమారుడు-అలిగితే నన్నాదరించువా రెవరు?
ఎన్నరాని గుణరత్నాకరు డని-విన్నవింతురే వేదాంతములో
చిన్నవాడు ధీరనారాయణ తీర్థ-చిత్తవృత్తి రంగనటన వినోది.

ఇలా బాధపడ్డాక చెలికత్తెలతో కలసి సత్యభామ రుక్మిణి మందిరానికి వెడుతుంది. అక్కడున్న కృష్ణుని తనతో రమ్మంటుంది. రుక్మిణి ఊరుకొంటుందా?

భామా నీ కింతైన భయము లేదా ?
నా మరువున పిలువ న్యాయమా నీకు
మగువ నాలాగె నిన్ను మన్నించునటె
తగవేమే నాతో నీకు తరుణి పోపోవే—

అని, దయచేయమంది. అంతటితో ఆగలేదు.

సవతి నాతో నీవు చలమేలనే భామ
భావించి చూడవే భాగ్య మెవ్వరిది ?
అవనీమండల చంద్రు డఖిలపాలకుడు
శివనారాయణతీర్థ సేవితాధిపుడు—

అని ఈసడించింది. "అంతట నీలాగున రుక్మిణి అమ్మవారిచేత సత్యభామ అవమానం పొంది తన యింటికి వచ్చి కోపాగారమందు ప్రవేశించేటపుడు యేమని ప్రలాపిస్తున్నది" అని నంధివచనం చెప్పాక తీర్థులవారు చరువులు వ్రాశారు.

ఏమి సేతు నే ఓయమ్మా - బంగారుబొమ్మా ముద్దులగుమ్మా !

ఆమె ఏమీ చేయనక్కరలేకుండానే కృష్ణుడు వచ్చి అనునయిస్తాడు. సంవాదం జరుగుతుంది. సాంతంగా కథ ముగుస్తుంది. చిట్టచివర స్తుతిలో తీర్థులవారు అచ్యుతాబ్ధిని పేర్కొన్నారు.

శరణం శరణం మునీంద్రసన్నుత - శరణం కమల నాయక
శరణ మచ్యుతపురనివాస - స్వామి వరదరాజప్రభో !

ఈ పారిజాతాపహరణంలోని రచన పేలవంగా ఉంది. కృష్ణలీలా తరంగిణి ప్రక్కన పెట్టి చూస్తే సూర్యునిముందు దివిటీలాగ ఉంటుంది.[1]

---

1. తీర్థులవారు దక్షిణాదికి వెళ్ళక ముందే 'పారిజాతం' వ్రాశారని విశ్వనాథ సత్యనారాయణగారి అభిప్రాయం.

చల్లపల్లి ముక్త్యాల సంస్థానములను
పండితాఖండలుండయి ప్రతిభ జూపి
మహిత నాట్యప్రబంధ నిర్మాతయగుచు
పారిజాతాపహరణంబు వ్రాసె కృతిని [11]

అని శ్రీ నారాయణతీర్థులవారి చరిత్రలో విశ్వనాథవారు వ్రాశారు.
[చూ. కృష్ణలీలాతరంగిణి - నూజివీటివారి ప్రచురణ]

అందుకే ప్రచారం పొందలేదేమో. తీర్థులవారి తరంగాలు ఆంధ్రదేశంలో కూచిపూడివారివల్ల చాలా ప్రచారం పొందాయి. అయితే కూచిపూడి నాట్యానికి మూలపురుషుడు సిద్ధేంద్రయోగికూడా తీర్థులవారిలాగే అత్తవారింటికి వెడుతున్నప్పుడే నదిలో ఆపద్ధర్మ సన్యాసం స్వీకరించినట్లు లోకులు చెప్పుకొంటారు. అయన ఆడవాళ్లని దూరంగా ఉంచి ఫక్తు మగవారితోనే నాట్య బృందాలు ఏర్పాటుచేసి తర్ఫీదు ఇచ్చాడు. ఇవాళ కూచిపూడివారు ప్రదర్శించే యక్షగాన నాటక నాట్యాలు ఎన్నో ఉన్నాయి. కాని మూలపురుషుడు సిద్ధేంద్రుడు వ్రాసినవి రెండే. ఒకటి భామాకలాపమనే పేర ప్రసిద్ధమైన పారిజాతం; రెండోది గొల్ల కలాపం.[1]

సిద్ధేంద్రయోగి జీవితచరిత్రను కూచిపూడివారే స్పష్టంగా చెప్పలేకపోవడం విచారించతగ్గ విషయం. సన్యాసం స్వీకరించడానికి ముందు అతని పేరేమిటో ఊరేమిటో తెలియదు. అయితే నటరాజ రామకృష్ణగారు చెప్పినదానినిబట్టి సిద్ధయ్య రాయలసీమవాడు; బ్రహ్మచారి. ఆయన దేశాటనంచేస్తూ కూచిపూడి చేరాడు. ఆ రోజుల్లో సువాణంవారు ఆ గ్రామంలో ప్రసిద్ధ భాగవతులు. సువాణం జోగావధాన్లవారి పుత్రికను ఈ రాయలసీమ చిన్నవాడు పెళ్లాడి అక్కడే స్థిరపడిపోయాడు. కొంతకాలానికి సన్యసించి సిద్ధేంద్రయోగి అయ్యాడు.[2]

సిద్ధేంద్రుడు వ్రాసిన భామాకలాపం నేడు యథాతథంగా ఎవరూ ఆడడం లేదు. దీని కతడు 'పారిజాతం' అని పేరు పెట్టినా ఇవాళ పారిజాతకథ భామాకలాపంలో ఏమాత్రం గోచరించదు. ఒక్క సత్యభామే అష్టవిధనాయికల రూపంలో అభినయించడానికి అనువుగా భాగవతులు కథను దిద్దుకొన్నారు. 'భామనే నత్యభామనే' అని నాయిక ప్రవేశిస్తుంది. ఇవాళ ప్రచారంలో ఉన్న దరువు ఇది :

---

1. గొల్లకలాపం భాగవతుల రామయ్యగారి రచన అని గొట్టెసాటి వెంకటసుబ్బయ్యగారి అభిప్రాయం. కిన్నెర, 1954 - సంపుటి 6. మాత్సభూతయ్య [1787 - 1798] వ్రాసిన పారిజాతంలో గొల్లకలాపం, దాదినమ్మ మొదలైనవి ఉన్నాయి.

2. ఆంధ్రులనాట్యకళ-నటరాజరామకృష్ణ. నృత్యనికేతనం ప్రచురణ (వివేకనగరు-చిక్కడపల్లి, హైదరాబాదు) పుట 26. ఆధోజ్ఞాపిక.

భామనే సత్యభామనే
భామనే పదియారువేల కోమలు అందరిలోన
రామరో గోపాలమూర్తికి ప్రేమదామమైన ముద్దుల ॥భా॥
అట్టహాసము జేసి సురల-నట్టె గెలిచి పారిజాతము
చెట్టు దెచ్చి నాదు పెరట-ఘట్టిగా నాటించుకొన్నా । భా॥

అయితే సిద్ధేంద్రుడు ఇలా వ్రాయలేదు. ఆయన వ్రాసిన దరువు ఇంతకన్నా ప్రౌఢంగా ఉంది:

భామనే సత్యభామనే
భామరో శృంగార జగదభిరామనే-ముఖవిజిత హేమా
ధామనే ద్వారకాపురాధ్యారామనే వయ్యారి సత్యా ॥భా॥
మథనజనకుని వదలకను నా యెదను నదుముకు సుదతిరో మరు
కదన మరుదుగ సలిపి నెమ్మది ముదముగదియగనున్న సత్య ॥భా॥

[D 1916]

సిద్ధేంద్రయోగి వ్రాసిన నాట్యకావ్యాన్ని ఎందరెందరో ప్రదర్శించేవారు. ఎన్ని ప్రాంతాలలోనో అది ప్రచారం పొందింది. జన్మస్థానం కూచిపూడి అయినా అలంపురం దగ్గిర ఉన్న కోటకొండ భాగవతులూ, విశాఖజిల్లాలోని బొబ్బిలి, జామి, నిమ్మలవలస, కసింకోట, చోడవరం మొదలైన గ్రామాల భాగవతులు, అమలాపురం, పేరూరు, మానంపల్లి, మండపేట, పిఠాపురం మొదలైన ప్రాంతాల నర్తకులూ భామాకలాపాన్ని ప్రదర్శించేవారు.

సిద్ధేంద్రుడు బ్రాహ్మణ బాలురకే ఈ విద్య నేర్పినా పిఠాపురం ప్రౌఢ, పెండ్యాలసత్యభామ, మారంపల్లి అక్కచెల్లెళ్లు, చిత్తజల్లు వైదేహి, చిత్తజల్లు ఇందువదనలు మొదలైన విద్వాంసురాళ్లు ఈ కలాపాలు ఆడి బాగా రాణించారు .పెండ్యాల వారింట్లో మూడు తరాలనుండి ఈ విద్య ఉంది. పెండ్యాల సత్యభామగారికి 1958లో 90 సంవత్సరాల వయస్సు ఉండేది. ఆమె అమ్మమ్మగారి పేరు కూడా సత్యభామే. భామాకలాపంలో సత్యభామ వేషం కట్టి ఒప్పించినందుకు ఆ పేరు వచ్చింది. ఇవాళ కుమారి యామినీ కృష్ణ

మూర్తి వచ్చి భామాకలాపానికి అఖిలభారత ఖ్యాతి, అంతర్జాతీయ ప్రశంసలు సంపాదించింది. కుమారి యడవల్లి రమ, కేరళకన్య చంద్ర మొదలైనవాళ్లు చక్కగా ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఇంతమంది ఆడా మగా ప్రదర్శించే భామాకలాపానికి అధికారిక ప్రతి ఒకటీ లేదు. సిద్ధేంద్రుడు వ్రాసినది కాక అరువిధాలైన కలాపాలను నర్త కులు ప్రదర్శిస్తున్నారట.[1] భామాకలాపాన్ని ఇరవయ్యో శతాబ్దపు తొలి దశాబ్దంలో కాకినాడ మంగువారు ప్రచురించారు. మళ్ళీ మొన్న 1964 లో వేదాంతం పార్వతీశంగారు అచ్చు వేశారు. అయితే ఈ రెండూ అచ్చంగా సిద్ధేంద్రుని కృతులు కావు. మంగు జగన్నాధంగారు సిద్ధేంద్రుని ప్రౌఢరచ ననుసరళం చేశారు. మూలకలాపం దోషభూయిష్ఠమై దాని నిజరూపంకూడ గుర్తింపరాని స్థితిలో ఉండడంవల్లవేదాంతం పార్వతీశంగారు దానిని పూరించి హాస్యగాడి వచనాలు మొదలైనవికూడా పొందుపరిచి ప్రచురించారు. అయితే ఇది అనలు లోటు తీర్చదు. వివిధప్రాంతాలలో ప్రచారంలో ఉన్న భామా కలాప ప్రతులను, ప్రాచీన తాళపత్ర ప్రతులను సరిపోల్చి సిద్ధేంద్రుని రచన ఏదో గుర్తించాలి. అప్పుడు ప్రచురించాలి. కూచిపూడి కళాక్షేత్రంవారి ఆధ్వ ర్యాన మహాకాళి లక్ష్మీనరసింహంగారిచేత బండాకనకలింగేశ్వరరావుగారు ఈ పని చేయిస్తున్నారు. ప్రస్తుతం సరైన పాఠాలు నిర్ణయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో 7 పారిజాతాలు, 4 భామాకలాపాలు ఉన్నాయి.[2] వీటిలో కొన్ని చాలా ప్రాచీనాలు. వీటి సహాయంతో పరిష్కరణ జరగాలి.

నేటి భామాకలాప ప్రదర్శన మొదట వేణీప్రబంధం ఉంటుంది. భామ తెరమీద జడ వేస్తుంది. ఆ జడకు బోలెడు కథ వుంది. దానిని సిద్ధేంద్రుడు వ్రాయలేదు. ఎవరో వెంకటశాస్త్రి రచించాడు. కృత్యాది ఇలా ఉంది:[3]

---

1. ఆంధ్రులు – నాట్యకళ. నటరాజరామకృష్ణ, పుట 27.

2. పారిజాతాలు D 1900నుండి1906. భామవేషాలు D1916నుండి1919.

3. ఈ జడ పూర్వోత్తరాలు మిత్రులు వెంపటి చినసత్యంగారి వ్రాతప్రతినుండి ఉదాహరిస్తున్నాను.

శ్రీరమణు భవుని పద్మజు-వారణముఖ సకలదేవవర్గము నేడున్
కోరి భజియించు నీ కృతి-చాతుర్యాకృతిగ వెలయు శ్రేయము
లొసగున్.

జడ కథలో ద్విపదలు, దరువులు, కందాలు, సీసాలు ఉన్నాయి. చివర ఇలా ఉంది :

వేణీప్రబంధ మిలలో-మానక పఠియింప వినిన మానవులకు స
న్మానము కల్గును వారికి-దీనత్వము లేదు కృష్ణదేవుని కరుణన్.

ఇది అర్వాచీన రచన. భామ తెరమీద జడ వేయడం ఎప్పుడు మొద లైందో తెలియదుగాని ఇది ప్రేక్షకులకు సవాలు. ఎటువంటి శాస్త్రీయప్రశ్నల కైనా సమాధానం చెప్తానని భామవేషధారి ఈ జడవేయడంతో ప్రకటించడం జరుగుతుంది. ఓడిపోతే జడ కత్తిరించవచ్చు. ఈ సంప్రదాయం సిద్దేంద్రుని కాలంనుండీ వస్తూందో లేదో, మధ్యలో వచ్చినదో పరిశోధించాలి. భామా కలాపం కథను తుమ్మలపల్లి సీతారామారావుగారు విపులంగా కథనం చేశారు. వారన్నట్టు 'కలాపములో కథాసంవిధానముకంటె రసస్ఫోరకమైన భావచిత్రణ నైపుణి సామాజికులకు ఆలంకారిక వైభవము'లు సాక్షాత్కరింప చేస్తుంది.[1] విప్రలంభశృంగారమే వివిధస్థాయిలలో కనబడుతుంది. ఈ కలాపాన్నే విజ్ఞానసర్వస్వంగా చేయడానికి భాగవతులు ప్రయత్నించారు. శకునాలు, ఉత్తరాలు వ్రాయడానికి మంచి దిక్కులు, వశీకరణ ఔషధాలు మొదలైన వివరాలన్నీ చేర్చారు. భామాకలాపంలో కన్నా గొల్లకలాపంలో ఎక్కువ విజ్ఞానచర్చ ఉంది.

సిద్దేంద్రుడే గొల్లకలాపంకూడా రచించాడని చెప్పుకొంటారుగాని భావి పరిశోధనవల్లగాని యథార్థం తేలదు. భామాకలాపాన్ని ఆడేటప్పుడు ప్రదర్శ నారంభంలో ఒక గోపిక ప్రేక్షకులకు వినోదం కల్గించేది. విదూషకుడు ప్రవేశించి ఆమెతో సంభాషించేవాడు. ఈ ప్రశ్నోత్తరాలు సుదీర్ఘంగా సాగేవి. భామ రంగంమీదికి రావడానికి ముందే ఇది జరిగేది. కొంతకాలానికి గొల్ల కలాపాన్ని భామాకలాపంనుండి పండితులు వేరుచేశారు. గొల్లభామతో విదూషకుని సంభాషణలు కూడా ఆర్వాచీనమైన కల్పన. క్రీ. శ. 1800

1. భారతి-కలగూరగంప, జూలై, 1959.

ప్రాంతాల ఇది ప్రారంభమై ఉండవచ్చునని నాట్యకళలో కృషిచేసినవారు భావిస్తున్నారు.[1] దానిని భాగవతుల రామయ్యగారు రచించారని ప్రతీతి. అందుచేత గొల్లకలాపం సిద్ధేంద్రుని రచన కాదేమో.

సిద్ధేంద్రయోగి జీవితంలో సన్యసించినా నృత్యవిద్యా సన్యాసం చేయలేదు. కూచిపూడి భాగవతులను వెంటపెట్టుకొని వివిధమండలాలలో ప్రదర్శన లిచ్చేవాడు. ఆయన గోలకొండ సుల్తానులను మెప్పించి కూచిపూడి అగ్రహారాన్ని పొందాడు. క్రీ. శ. 1672 – 1685 ల మధ్య పాలించిన తానీషాఅబుల్ హసన్ ఈ భామాకలాపాన్ని మెచ్చుకొని ఆ సత్కారం చేశాడు. సిద్ధేంద్రుడు 1670 కి పూర్వమే ఈ ప్రదర్శనలు ఇస్తూ ఉండివుండవచ్చును. భామాకలాపానికి మూడువందల ఏళ్లు పండుగ చేస్తూ సిద్ధేంద్రుని రచనలతోపాటు అతని సమగ్రజీవితచరిత్రను ప్రచురించడం చాలా అవసరం.

---

1. ఆంధ్రుల నాట్యకళ, నటరాజరామకృష్ణ. పుటలు 35, 36.
2. ఆంధ్రవాగ్గేయకారచరిత్ర, బాలాంత్రపు రజనీకాంతరావు. పుట 201.

24

చింతలపల్లి పండితులు
లయగ్రాహీ కవులు
భారవేది సంస్థానం



ఆంధ్ర సాహిత్యంలో ప్రఖ్యాతమైన పండిత కుటుంబాలు చాలా కనబడతాయి. వారిలో చింతలపల్లి వారిది ముఖ్యమైనది. ఈ వంశంలోని ఒకానొక తరంలో పుట్టినవాళ్లంతా నూతన కాళిదాసులే అని ఒక చింతలపల్లికవి భావించాడు. ఇది అతిశయోక్తి అని మనం కొట్టిపారవేసినా ఈ కుటుంబంలో తరతరాలనుంచి మంచి కవులు జనిస్తూ తమ అఖండ పాండిత్యంతో రాజులను మెప్పించి, పండితులను ఒప్పించి, ప్రజల గౌరవానికి పాత్రులయ్యారని అంగీకరించక తప్పదు. చింతలపల్లి వారిలో మనకు తెలిసిన అత్యంత ప్రాచీనుడు ఎల్లయ్యగారు. ఆయన అచ్యుతదేవరాయల కాలంనాటి వాడు. అంటే క్రీ. శ. 1530 – 1542 మధ్య జీవించాడు.

చింతలపల్లి ఎల్లయ్యగారు మంచి పండితులు; విద్వత్కవులు, సిద్ధాంత రాద్ధాంతాలలో రాటుతేరినవారు; కాళీభక్తులు. ఈయన తన కుటుంబంలో పుట్టినవాళ్ళంతా కవులే కావాలన్న వరం కోరుకున్నారట. ఈయన హరి తత్వ బోధనకు పుష్పగిరిలో ఉన్న దుర్గ ఇచ్చిన వరం సాక్ష్యమట. ఈయన గ్రంథకర్తట; గాని వ్రాసిన పుస్తకాల పేర్లేమిటో తెలియవు. వీరిని అచ్యుత దేవరాయలు సత్కరించి వలపులాడి దుల్పులాడి అనే సహకారయుగ్మాన్ని, చందనచర్చకు వీలుగా బహుళాగ్రహారాలు ఇచ్చారట. ఈ చింతలపల్లి ఎల్లయ్యగారు కమలాపురంలో కాపురం ఉండేవారు.

ఈయన కొడుకులూ, మనుమలూ ఏఏ కావ్యాలు చెప్పారో, ఏ రాజులను మెప్పించారో తెలియదుగాని మునిమనుమల పాండిత్యం మాత్రం తెలియవస్తూంది. ఎల్లయ్యగారికి జోగయ్య, వెంకటయ్య అనే ఇద్దరు మునిమనుమలున్నారు. ఇద్దరూ కవితాస్వాయత్తులే. వీళ్ళలో జోగయ్యగారు వైయాకరణి. సవ్యవరరుచి అని ప్రసిద్ధుడయాడు. వరరుచి అంటే ప్రాచీన సంస్కృత ప్రాకృత వ్యాకర్తల పరమ ప్రామాణికుడు. ఈ జోగయ్యగారి తమ్ముడు వెంకటయ్య నైయాయికుడు. అన్నగారు వరరుచి అయితే ఈయన అభినవ గౌతముడు. మన షడ్దర్శనాలలో ఒకటైన న్యాయానికి గౌతముడే సూత్రకర్త.

ఈ అన్నదమ్ములలో జోగయ్యగారికి మూర్తికవి అనే కుమారుడు కలిగాడు. ఈయన విద్యాలంకారుడు. ప్రౌఢాలంకారిక చక్రవర్తి. బహు శాస్త్రవేత్త. జ్యోతిషంలో ఆరితేరినవాడు. ఇతడు తిరువళ్లూరు గ్రామంలో స్థిరపడినట్టుంది. తన కుమారునికి ఆ ఊళ్లో సుప్రసిద్ధుడైన దైవం వీరరాఘవుని పేరు పెట్టుకొన్నాడు. మూర్తికవి వ్రాసిన గ్రంథాలపేర్లైనా తెలియక పోవడం దురదృష్టమే. ఇతని కుమారుడు వీరరాఘవుడు గొప్పపండితుడు. నైయాయికుడు. శాబ్దికుడు. ఈయన మట్ల అనంతరాజుగారి కొలువులో వేద పరీక్ష యిచ్చి ఉత్తీర్ణుడై వేయిచక్రాల బహుమానం పొందాడు. పూల రంగ పతిరాజుగారిని కవిత్వంలో మెప్పించి గ్రామాధిపత్యం సంపాదించాడు. వీరరాఘవకవి అంతటితో ఆగలేదు. రాజువారివద్ద రాణువను వీలి దళవాయి తనం స్వీకరించాడు. రాణువసంబళాల నిమిత్తం చాలా గ్రామాలపై పెత్తనం చెలాయించాడు.

చింతలపల్లి వీరరాఘవ కవికి ఇద్దరు భార్యలు. పెద్దభార్య పేరు లచ్చమాంబ; రెండో భార్య నరసమ్మ. వీళ్ళలో పెద్దావిడ కెందరు సంతా

నమో తెలియదుగాని, రెండవ భార్యకు ఆరుగురు కొడుకులు. ఈ ఆరుగురూ నూతనకాళిదాసులని తరువాత కవి ఒకడు పొగిడాడు. వీళ్ళలో పెద్దవాడు గోపాలయ్య. ఇతడు జాములోపల ఆర్యాశతకాన్ని చెప్పాడట. ఇతనికి ఇద్దరు భార్యలు. వీరిలో రెండవామెకు శేషశాయి, ఛాయాపతి అనే కుమారులు కలిగారు. శేషశాయి ఏవైనా గ్రంథాలు వ్రాశాడో లేదోగాని ఛాయాపతి మాత్రం రాఘవాభ్యుదయం అనే కావ్యం వ్రాశాడు. చింతలపల్లివా రెన్ని గ్రంథాలు వ్రాసినా, లభ్యమయ్యే మొదటి గ్రంథం ఇది. దీనిని ఇటీవల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించారు. ఈ కావ్యం గురించి తరువాత చెప్పుకొందాం.

చింతలపల్లి వీరరాఘవుని పెద్దకొడుకు గోపాలయ్య గురించి, ఆయన కొడుకు ఛాయాపతిగురించి తెలుసుకొన్నాక చెప్పుకోతగ్గవారు వీరరాఘవయ్య గారి నాల్గోకుమారుడు వెంకటయ్య. ఈయన సర్వతంత్ర స్వతంత్రుడు. ఎన్నో రాజసభలలో ప్రశంసలు పొందాడు. ఇతడు తనకు పుట్టిన ఒక బిడ్డకు తన తండ్రిపేరే పెట్టుకొన్నాడు. ఈ చినరాఘవయ్య సకలశాస్త్రజ్ఞుడు. అభినవనరస్వతీవల్లభుడు. ఇతడు 'మధురవాణీ విలాసం' అనే కావ్యం వ్రాశాడు. ఇదికూడా నేడు లభిస్తూంది. ఇతనిగురించి తరువాత చెప్పుకొందాం.

పెదవీరరాఘవయ్య ఐదో కొడుకుపేరు అప్పయ్య. ఇతడు కవి. అవధానాలు చేసి దేశీయులను మెప్పించాడు. ఇతని కొడుకుపేరు నంజీవయ్య. ఈయన విద్వాన్నిధి. సాహితీ నిపుణుడు. రాజాస్థానాలలో వాగ్ధాటిని ప్రదర్శించిన ప్రబంధ కర్త. చంద్రాంగదోపాఖ్యానంలాంటి కావ్యాలు వ్రాసి రాజులకు అంకితం ఇచ్చాడు. ఈ నంజీవకవి చెప్పిన గ్రంథా లేవీ ఇప్పుడు లభించడం లేదు.

తరువాత తెలుసుకోవలసిన వ్యక్తి పెదవీరరాఘవయ్యగారి కడగొట్టు వాడు యాగయ్య. ఈయన వేదపండితుడు. పురాణాలూ, ఇతిహాసాలూ బాగా మథించినవాడు. ఈయనకు నల్గురు కొడుకులు. వాళ్ళందరూ కళాభావజ్ఞులు. సంహితయాగ ప్రాజ్ఞులు. కవిత్వం తెలిసినవాళ్లు. ఇప్పు డీ చింతలపల్లివారి కుటుంబంలోని ముఖ్యవ్యక్తుల గురించి ఒక్కసారి క్రోడీకరిద్దాం.

వరుస	పేరు	పెదవీరరాఘవయ్య బాంధవ్యం	వివరాలు
1.	ఎల్లయ్య	తాతగారి మూత్తాత	వంశానికి మూలపురుషుడు. అచ్యుతదేవరాయల కాలం వాడు. గ్రంథకర్త.
2.	జోగయ్య	తాత	వైయాకరణి.
3.	వెంకటయ్య	పినతాత	వైద్యాయికుడు.
4.	మూర్తికవి	తండ్రి	జ్యోతిష్కుడు.
5.	వీరరాఘవయ్య	——	మట్ల అనంతరాజుచేత సత్కారాలు పొందాడు. దశవాయితనం చేశాడు. క్రీ. శ. 1600.
6.	గోపాలకవి	పెద్దకొడుకు	ఆర్యాశతకం చెప్పాడు. క్రీ. శ. 1625
7.	ఛాయాపతి	మనుమడు (పెద్దకొడుకు కుమారుడు)	రాఘవాభ్యుదయం రచించాడు. ముద్రితం. క్రీ. శ. 1650.
8.	వీరరాఘవుడు	మనుమడు (నాల్గో కొడుకు కొడుకు)	మధురవాణీ విలాసం వ్రాశాడు. (అముద్రితం)
9.	సంజీవకవి	మనుమడు (ఐదో కొడుకు కొడుకు)	చంద్రాంగదోపాఖ్యానం వ్రాశాడు. (నష్టం)

ఈ పట్టికద్వారా తెలిసిన వ్యక్తులలో ఇద్దరి గ్రంథాలే లభ్యం అవుతున్నాయి. వారిలో మొదటివాడు-గోపాలకవికుమారుని గురించిచెప్పుకొందాం.

చింతలపల్లి ఛాయాపతి :—ఇతడు తాను చాలా గొప్పవాడినని తాను వ్రాసిన రాఘవాభ్యుదయంలో చెప్పుకొన్నాడు. ఆంధ్రగీర్వాణభాషలలో నవఘంట సురత్రాణబిరుదాంకితుడు. సర్వంకషప్రజ్ఞ కలవాడు. అష్టావ

ధానాలు చేశాడు. వ్యస్తాక్షరిలో గొప్ప ప్రతిభ ఉంది. ద్విసంధాప్రావీణ్యం కలవాడు. కొత్త శ్లోకాలను అనులోమ విలోమ క్రమంలో పఠించగలడు. ఇతడు మురళీగోపాల భక్తుడు. తిరుమల శ్రీనివాసాచార్యులవారి శిష్యుడు. తన గురువుగారి నిత డిలా నుతించాడు :

తద్ధితమూఢుడైన ననుఁ దద్ధితమూఢుని జేసి వాక్యసం
సిద్ధి ఘటించినట్టి బహుచిత్రిత శాస్త్రకలాపధన్యులన్
ఇద్ధవదాన్య తిర్మలకులేశ్వర మాన్యుల శ్రీనివాస సు
బుద్ధి మదగ్రగణ్యులను బుణ్యుల మాన్యుల సన్నుతించెదన్.

[రాఘవ. 1 - 21]

'తద్ధితమూఢాః పాణినీయాః' అనే సామెతను ఇలాగ చమత్కరించాడు. ఇటువంటి చమత్కారాలు రాఘవాభ్యుదయంలో చాలా చేశాడు. ఈ కావ్యాన్ని ఛాయాపతి కేశవస్వామికి అంకితం ఇచ్చాడు. ఇతడు బోరవెల్లి సంస్థానంవారి ఇష్టదైవం. ఈ రాజ్యం ఇప్పుడు గద్వాలలో కలిసిపోయింది గాని ఒకనాడు స్వతంత్రరాజ్యంగా ఉండేది. బోరవెల్లిని క్రీ. శ. 1660 ప్రాంతాలలో వెంకటరెడ్డి అనే ప్రభువు పాలిస్తూ ఉండేవాడు. ఈయన ఛాయాపతిని తన ఆస్థానానికి రమ్మని అర్థించాడు. అప్పటిదాకా ఛాయాపతి దేవరకొండసీమలోని బోయినపల్లిలో ఉండేవాడు. బోరవెల్లి వెంకటరెడ్డి పిలిపించి, ఒక కృతి చెప్పి కేశవస్వామికి సమర్పించమని ఛాయాపతిని కోరాడు. కవి అంగీకరించాడు.

ఛాయాపతికి కవిత్వంపట్ల, కవులపట్ల, కృతినాయకులపట్ల కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. హీననాయకాధీనాలు చేసే కృతులు కీర్తి కెక్కవని చెప్తూ

పూనుక సత్కవుల్ కృతులు పూని రచింతు మటంచు నూరకే
న్యూనత సంతటించుకొను టొక్కటె కాని ధరిత్రిలోన దు
ర్మానసదుర్యశోదురభిమానదురాగ్రహ హీననాయకా
ధీనము చేయు కబ్బమది దిక్కుల నిక్కునె కీర్తి కెక్కునే?

[రాఘవా. 1 - 64]

హీననాయకులకు అంకితం ఇస్తే వ్రతముచెడినా సుఖము దక్కదని ఛాయాపతి ఉద్దేశం.

పట్టుమని కాసు చేతం
బెట్టెదువా డొకడు లేడు బీదల కిలలో
కట్టెడి లోభి నరాధము
లిట్టి దురాత్ములకు సుకృతు లీయందగవే? [రాఘవా. 1-58]

కృతి భర్త గురించి ఇటువంటి అభిప్రాయం ఉన్నట్టే కృతి కర్త గురించి కూడా అతనికి నమ్మకా లున్నాయి. సుకవి ఇలాగ ఉంటాడని చెప్పాడు :

శుచియుం దక్షుండు శాంతుండు సుజననుతుడు
సూనృతోక్తి కళావేది శోభనాంగు
డాత్మదైవజ్ఞుడు కృతజ్ఞు డగ్రకులజు
డతి మధురవాగ్మి ఛందస్వి యతడు సుకవి. [రాఘవా. 1-41]

అగ్రకులజుడు కానివాడు సత్కవి కాడని అనాడు చాలామంది నమ్మే వారు. ముఖ్యంగా అగ్రకులంవారే ఇది ప్రచారం చేశారు. కాకునూరి అప్ప కవి ఇవే భావనలను తన లక్షణగ్రంథంలో ఇలా చెప్పాడు :

ధరణీసురుడు ప్రశాంతుడు_గురుభక్తుడు శుచియుం గల్పకుడు పూర్వకవీ
శ్వరవాక్ప్రయోగదక్షుడు_గరుణామతి యెవ్వ డతడు కవియనబరగున్.
[అప్ప. 1_41]

సత్కవిలక్షణాలను ఇలాగ స్పష్టంచేసిన అప్పకవి శూద్రులు చెప్పే కావ్యాలు గ్రాహ్యాలు కావని కచ్చితంగా చెప్పాడు.

ఉపము గలిగిన శయ్యల నొప్పియున్న
నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు
పాయసంబైన సంస్కార పక్వమైన
గాకజాష్టంబు హవ్యంబు గానియట్లు. [అప్ప. 1_26]

సరిగ్గా అప్పకవి అభిప్రాయాలనే ఛాయాపతికూడా చెప్పాడు. శూద్రుల కవిత్వం అనర్హం అన్నాడు.

ఘనకీదుగము లేగతి_నవర్ణాములు వృషలకృతము లట్లనుచితముల్
ఘనగోక్షీరంబులరలె_జను విప్రకృతి ప్రబంధసద్భాషితముల్.

[రాఘవా. 1_42]

ఈ ప్రబంధ నద్భాషితాలు చాలా ప్రభావం గలవని ఛాయాపతి నమ్మకం. అయితే అగ్రకవులు మునుపటి మహానుభావులలాగ ఈనాడు తమ మహత్తు చూపలేకపోతున్నారు. దీనికి ఛాయాపతి ఇలాగ సంజాయిషి ఇచ్చాడు.

కేవలసరసవదాన్యం_డీవసుమతి లేదు, కలిగెనేని కవిత్వ
శ్రీవెలయజేసి కవులు ప్ర_భావంబులు చూపగే ప్రబంధక్రియలన్?

[రాఘవా. 1_48]

ఛాయాపతి గొప్ప ధిషణాహంకారంతో "ఆ మేటి కవిప్రభావంబుల మించ వచింపరె నేటివారలున్" అని పూర్వకవులతో సాటి తెచ్చుకొన్నప్పుడు "మునుపటి కవులలాగ మీరెక్కడ పద్యాలు వ్రాయకలరు? 'బాణోచ్ఛిష్టం జగత్త్రయం' అనికదా" అని ఎవరో అన్నారు. దానికి ఛాయాపతి కోపం తెచ్చుకొన్నాడు. లోగడ కొరవి గోపరాజునికూడా ఎవరో ఇలాగే అన్నారు. అప్పు డాయన రెండు పద్యాలలో చీవాట్లు పెట్టాడు:

సుగుణులు బాణోచ్ఛిష్టం_జగత్త్రియమ్మనగ గొంత చదువగ బ్రియమే
తగ దోడంటిన పాలిం_పుగ బెరుగయియున్న నది యభోజ్యంబగునే?

[సింహాసనద్వాత్రింశిక, I, 1_26]

సంబంధములగు రసభా_వంబులు మునుఁ జెప్పె నభినవంబులు గలవే?
యంబుధినె కాక బహుర-త్నంబులు వర్తకుల కేమి తా బండినవే?

[సింహా. I, 1_27]

కొరవి గోపరాజు రత్నాలగురించి, వర్తకులగురించి ఎలా చెప్పాడో అలాగే ఛాయాపతికూడా—

మొగివర్తక డొకచో మణు_లగపడి చెడనాడ వారియపగత సారం
బగునెటు 'బాణోచ్ఛిష్టం_జగత్త్రియం'బన నిషేధకాస్త్రం బగునే?

[రాఘవా. 1_50]

ఇంతతో ఆగక ఛాయాపతి ఇంకో రెండు పద్యాలు చెప్పాడు. 'ధర్మార్థ కామమోక్షాధికార ణాకార కార రేఖానుకారసార శారద సకలవారన్వర శబ్ద మూర్తి' అటుపంటిది 'బాణునుచ్ఛిష్ట మగుననె పాపమేమి?' అని ప్రశ్నించాడు (1-53). అసలు ప్రపంచమే ధర్మపాలన లేనందువల్ల కలు షితం అయిందని అతని ఉద్దేశ్యం.

శాక్తవామాచారసరణి సమృద్ధయ్యె స్మార్తకర్మంబులు శాంతికొండె
చెరుపుమతాయుక్తకష్ట నేకూహాచ్ఛ వైష్ణవధర్మంబు వసుసదప్పె
పాపాణదారుప్రకృతి మసీ మించె శైవాగమములు నిస్సత్త్వమొండె
చార్వాకసంకరజాతిక్రియలు లెసంగె స్త్రీపురుషోచితస్థితులు దొలగె
నాశ్రమవిభక్తి లేకమై విశ్రమించె
రాజ్యము లరాజకములయ్యె ప్రభ లణంగె
జంతుహీనాధికాంతరాచరణ మెడలె
ధర్మపాలనలేని కతింబ జగతి. [రాఘవా. 1-67]

ఇంత కలికాలంలోనూ మహాప్రబంధాలు వ్రాయవచ్చును. అయితే వ్రాయమనగానే కృతులు ఎవరూ చెప్పలేరు. అల్లసాని పెద్దనగారే కొన్ని షరతులు పెట్టారు. ఆయన చెప్పిన ఈ చాటువు సుప్రసిద్ధం:

నిరుపహతిసలంబు రమణీయప్రియమూతిక తెచ్చియిచ్చు క
ప్పూరపువిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు
త ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకినగాక యీరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే?

పెద్దనగారిలాగే ఛాయాపతికూడా ఇటువంటి షరతులు పెట్టాడు. చూడండి:

తిరమగుచోటు నింటి కొక తీర్పరి పెద్ద నిజానుకూల సుం
దరి యుచితజ్ఞుడై బహుళదాతగు నేత సుధీసహాయమున్
హరి కరుణాకటాక్షమున నబ్బినగాక మహాప్రబంధముల్
సరసిజసూతికిన్ బలుకు చానకునైన రచింప శక్యమే?
[రాఘవా. 1-70]

తక్కిన విషయాల సంగతి ఏమోగాని, ఛాయాపతికి ఉచితజ్ఞుడై బహుళదాతగు నేత దొరికాడు. బోరవెల్లి వెంకటరెడ్డి బాగా సత్కరించి దేవునికే కావ్యాన్ని అంకితం చేయించాడు. ఛాయాపతి షష్ట్యంతాలు తొమ్మిది పద్యాలు వ్రాశాడు. సాధారణంగా అందరు కవులూ ఈ పద్యాలలో 'అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పంబూను' అని వ్రాస్తారు. ఛాయాపతి అందరిలాంటివాడు కాదు. షష్ట్యంతాల తరువాత ఇలాగ వ్రాశాడు:

[కేశవస్వాములకున్] సమర్పితంబుగా ననరసాను[ప్రాసభాసుర వృత్తిచ్ఛేకాద్యలంకార పాత్రచిత్ర కవితానుబంధంబుగా నా యొనర్పం బూనిన రాఘవాభ్యుదయం బను మహాప్రబంధమునకు. [రాఘవా.1_158]

ఇందులో చెప్పినట్టే కావ్యంలో శబ్దాలంకారాలు, చిత్రకవితలు ఉన్నాయి. ఛాయాపతి పోలెడు బంధాలు, చిత్రాలు, ముద్రాలంకారాలు ఈ కావ్యంలో చెప్పాడు. వాటి వివరాలివి:

బంధకవిత్వం:

1. ఖడ్గబంధం (1_210)
2. కలాలికాచక్రబంధం (1_211)
3. చంద్రహాసబంధం (2_267)
4. ఛత్రబంధం (2_258)
5. శకటచక్రబంధం (3_293)
6. పుష్పమాలికాబంధం (3_294)
7. ఛత్రబంధం (4_245)
8. ఛత్రబంధం (4_246)
9. భుజగరాజబంధం (5_215)
10. చక్రబంధం (5_362)
11. ఖడ్గబంధం (6_364)

చిత్రకవిత్వం:

1. ఉభయార్థదచ్ఛేదక్రియ వినోద కందం (5_216)
2. విలోమార్థపూరణీయానులోమ కందం (5_217)

ముద్రాలంకారాలు :

1. ఉత్సాహ (1_207)
2. భూసుత (1_208)
3. మాలిని (1_209. 5_212)
4. ప్రసిద్ధిణి (2_254)
5. మంజుభాషిణి (2_255)
6. పంచచామరం (2_250. 3_289. 4_242)
7. తరళ (3_210)
8. కవిరాజవిరాజితం (3_291. 6_359)
9. భుజంగప్రయాతం (3_292)
10. మణిగణనికరం (4_243)
11. శరశ్చంద్రశ్రీవృత్తం (4_244)
12. మహాప్రసగర (5_211)
13. వనమయూరం (5_213)
14. మత్తకోకిల (5_214)
15. మంగళమహాశ్రీ (6_361)

ఇన్నిరకాలుగా చిత్రాలు చూపించి ఛాయాపతి షష్ఠ్యంతాల తరువాత చిత్రకవితానుబంధంగా ఈ కావ్యాన్ని ప్రాస్తానని చెప్పుకొన్న మాట నిల బెట్టాడు. ఇది 6 ఆశ్వాసాల కావ్యం. కాళిదాసు రచించిన రఘువంశానికి ఇది కొంత అనువాదం. అందులోని 4, 5, 6, 7 సర్గలలోని కథ ఆధారంగా ఛాయా పతి దీనిని రచించాడు. కొన్నిచోట్ల మూలాన్ని యథాతథంగా అనువదిం చాడు; కొన్నిచోట్ల తనకు నచ్చినట్లు స్వంతకల్పనలు చేశాడు. ప్రబంధాలకు కావలసిన వర్ణనలు గుప్పించాడు. అక్కడక్కడ ఊర్దూమాటలు, మాండలీ కాలు జొప్పించాడు. కొన్నిచోట్ల వ్యాకరణమార్గాలను తప్పించాడు. ఈ కావ్యాన్ని బి. రామరాజుగారు పరిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ వారు 1965లో ప్రకటించారు. ఈగ్రంథం అచ్చుపడడంవల్ల ఎన్నో విషయాలు తెలిశాయి. ఇది మన సాహిత్యం చేసుకొన్న అదృష్టం. అయితే ఛాయాపతి

పినతండ్రికొడుకు చినవీరరాఘవయ్య వ్రాసిన మధురవాణీవిలాసం ఇప్పటికీ వెల్గుచూడకపోవడం శోచనీయమే. తెలిసినంతమటుకు అతన్నిగురించి చెప్పుకొందాం.

చింతలపల్లి చినవీరరాఘవయ్య:—ఇతడు కూడా ఛాయాపతిలాగే చిత్రకవితాభినీకుడు. నానావిధాలయిన అవధానలాఘవం గలవాడు. సాహిత్యం, కవిత్వం, వివిధశాస్త్రప్రజ్ఞ, తత్త్వబోధ, త్రిస్కంధాత్మకమైన జ్యోతిషం ఈయన స్వభావాలట. ఈ చినవీరరాఘవయ్య ఒకసారి రాయదుర్గంలో జాములోపల ఒకశతకాన్ని చెప్పి కంకణాలు మొదలైన బహుమానాలు పొందాడు. ఇతడు రకరకాల అవధానాలు చేస్తే ఎవరో మల్లధీరుడు మెచ్చుకొని నాలుగునగలూ, ఒకగుర్రం ఇచ్చాడు. ఇతడు పాండిత్యంతో చాలా కీర్తి గడించాడు. ఇతని కొకనాడు తిరుపతి వెంకటేశ్వరుడు కలలో కనబడి తన పేర మధురవాణీవిలాసం అనే కావ్యం చెప్పమన్నాడు. మధురవాణి పాంచాలరాజుకుమార్తె. ఈమెను కార్తవీర్యార్జునుడు పెళ్లిచేసుకొన్నాడు. ఈ కథను చినవీరరాఘవయ్య ఎన్ని ఆశ్వాసాలలో చెప్పాడోగాని ఇప్పు డిది కొంత అసమగ్రంగానే దొరుకుతుంది. మద్రాసుప్రాచ్యలిఖితగ్రంథాలయంలో రెండు ప్రతులున్నాయి (R 41, D 372). వీటిలో రెండవ ప్రతిలో ఐదు ఆశ్వాసాలున్నాయి. చినవీరరాఘవయ్య త్రిస్కంధాత్మకజ్యోతిషంలో పండితుఁడని చెప్పుకొన్నాడు. అందుచేత కవిత్వంలో కూడా జ్యోతిషాన్ని బాగా జొప్పించాడు. పెళ్లికి లగ్నం పెట్టే ఘట్టంలో నాలుగైదు పద్యాలు వ్రాశాడు:

ప్రభుని యొక్కి ననంత ప్రభావలగ్న వీక్షణమొనర్ప వచ్చినారిటకుగాన
ప్రభునియొక్కినసంతప్రభావలగ్నవీక్షణమొనర్చుటిది మీకువిహితమనుచు॥
దైవజ్ఞులన నితర పర దైవజ్ఞుల జేరి చేరి తగు వేడుకతో
భావజ్ఞులు మీరలు ప్రతిభావజ్ఞులు లగ్న మొకటి పరికింపుడనన్॥
కలితపంచాంగుల గతి కరస్థము చేసి వినవాంఛ మొకటి చేకొదువచేసి
రాజసగ్రహవృత్తి రాశిగా నిర్మించి నేర్పుతో విషనాడి నెరి గమించి
చిత్తజామిత్రమా స్థితి వింగడమొనర్చి జాతిదోషములు చేజేతదీర్చి
స్వామిసంగతి రీతి సౌమ్యదృష్టి దలంచి భావంబు శోభనప్రాప్తి గాంచి

ప్రముఖవీక్షిత చంద్ర తారక బలము_గలిగి చెన్నొందు చెలితా నె కన్నెయూట
కన్య కనుకూలమగునుగా కన్య కిట్టి_గణితవితరణ లగ్న విఖ్యాతి గలదె?
[D 372. 5వ ఆశ్వాసం. 19_21]

గణితమంటే చినవీరరాఘవయ్యకు ఇష్టం. సంప్రదాయసిద్ధమైన కల్పనాపాండిత్యంకూడా ఉన్నవాడే. అయితే తగిన నాధుడు లేకపోవడంచేత ఇతడు కవిత్వాన్ని విడిచిపెట్టేద్దా మనుకొన్నాడు. అప్పుడు పెద్దలు ఇలా అన్నారట:

ఓ విద్వన్మణి సంప్రదాయముగ నీ కుద్భోధమై కల్పనా
ప్రౌఢిమ్యంబు లభించె నందు తగు బొల్పం నాధుండు లేమి చిం
తావిర్భావమునం జిహాస గొననేలా? మేల్కవిత్వం బహో
'కా విద్యా కవితా వినా' యనెడి విఖ్యాతిం చెవి జార్పవే?
[D 372. 1_20]

నిజమే. 'కా విద్యా కవితా వినా?' అయినా రసజ్ఞుడు లేనిదే, ఏకవిగారి మధురవాణి వినిపించదు. ఈసంగతి చినవీరరాఘవయ్య తన కావ్యంలోనే శ్లేషించాడు.

అల రసజ్ఞుని పొడగాంచునది మొదలుగ
మధురవాణికి తెల్వి యను మరులు దోచె
అల రసజ్ఞుని పొడగాంచునది మొదలుగ
మధురవాణికి తెల్వి ధర్మంబెగాదె! [D 372. 3_60]

చినవీరరాఘవయ్య ఏరసజ్ఞుని పొడగాంచాడో మనకు తెలియదు. ఛాయాపతిలాగే ఇతడుకూడా బోరవెల్లివారిని ఆశ్రయించాడో లేదో. చింతల పల్లివారికే కాక ఇతరకవివంశాలకుకూడా బోరవెల్లిరాజకుటుంబం ఆశ్రయం ఇచ్చింది. ఛాయాపతిచేత రాఘవాభ్యుదయం చెప్పించిన వెంకటరెడ్డి బోరవెల్లి వారికి దత్తపుత్రుడు. ఇతని పెంపుడుతల్లి పోరుగిరియమ్మ. ఈమె గద్వాల వారి ఆడబడుచు. బోరవెల్లి పాలించే ముట్టిపల్లివారి కోడలు. గద్వాల సంస్థానాన్ని పెదసోమనాద్రి స్థాపించి క్రీ.శ. 1663-1712 దాకా పాలించాడు. ఆతని కుమార్తె గిరియమ్మ. ఈమె తనకు పిల్లలు లేకపోతే తన బావగారి అబ్బాయి

వెంకటరెడ్డిని పెంచుకొంది. కవులను పోషించడం ఇతడు పెంపుడుతల్లిదగ్గిరే నేర్చుకున్నాడు. ఈమె వనితాశిరోమణి. ఎందరో విద్యార్థులకు అన్నంపెట్టి చదివించింది. కవులను పోషించి కృతులను చెప్పించింది. లయగ్రాహి గరుడాచలకవిచేత 'కౌసలేయచరిత్రం' వ్రాయించి, కేశవస్వామికి అంకితం ఇప్పించింది. ఆగ్రంథంలో కవి ఈమె చేసిన సత్కార్యాల నిలా నుతించాడు :

కట్టించె కేశవాగారంబు భూమిపై బరగు కుబేరపుష్పక మనంగ
సేవించె నారామసేతు కాశీ మధ్య దివ్యస్థలంబులు తెగువమీర
వేయించె వనము లుర్వీని చైత్రరథనందనోద్యానముల రీతి హృద్యముగను
చదివించె విద్యార్థిజనుల కన్నము బెట్టి వేదశాస్త్రపురాణవిద్యలెల్ల
జన్నములొనర్పజేసినిర్జరగణంబు_గణుతియొనరింపవిప్రసంఘముల చేత
వనుచు ప్రజలెల్లవర్ణింప నెనుదినంబు_పరమసద్గుణనికురంబ గిరియమాంబ॥

[కౌసలే. 1_66]

ఈమె వేయించిన అన్నసత్రాలగురించి మరొక చక్కని వర్ణన గరుడాచలం వ్రాశాడు. ఒకనాడు బ్రహ్మ నారదుణ్ణి చూసి వేసిన ప్రశ్నలూ, వాటికి కొడుకు చెప్పిన సమాధానాలూ కవి వ్రాశాడు :

పుత్రక, యెందుబోయితివి? బోర్వెల్లిలో గిరియమ్మ బెట్టు బ
న్నత్రములో భుజింపుటకు! సత్రవిశేషము లేమి? చూడు నా
గాత్రము! వ్రాపితో సుధ? జగజ్జనులందరు వ్రా(వ)వ్రాయుటే
చిత్రము నే నటంచు వచించెను బ్రహ్మకు నారదుం డటన్.

[కాసలే. 1_67]

బోరవెల్లి గిరియమ్మ వేయించిన సత్రంలో నారదుడు తిన్నాడో లేదో గాని గరుడాచలం భుజించేఉంటాడు. ఇతడు ఉభయభాషానిరంకుశుడు. అష్టభాషాకవిత్వసంపన్నుడు. చింతలపల్లివారివి, లయగ్రాహివారివి కూడా పండితకుటుంబాలు. చింతలపల్లివారి మూలపురుషుణ్ణి అచ్యుతదేవరాయల వారు సత్కరిస్తే లయగ్రాహివారి మూలపురుషుణ్ణి కృష్ణదేవరాయలవారే ఏనుగులిచ్చి సన్మానించారు. గరుడాచలం తన తాతగారి ముత్తాతగురించి ఇలా వ్రాశాడు :

మాధవభక్తియుక్త డసమానకవిత్వగురుండు కృష్ణరా
యాధిపదత్త సద్గజ వరాది మహోబహుమానశాలి గం
గాధరకీర్తిసాంద్రుడు జగత్కవిచంద్రుడు మత్కలేంద్రుడా
మాధవు డస్మదాదులకు మాన్యుడు గాడె దలంచి చూచినన్ ?

[కాసలే. 1_11]

అసమానకవిత్వగురుడైన మాధవుని కుటుంబంలోని వాళ్లుకూడా అంతా కవులే. అయితే, ఈ లయగ్రాహి వారి రచనలలో ఒక్క గరుడాచలం వ్రాసిన కౌసలేయచరిత్రం మాత్రమే నేడు దొరుకుతూంది. ఇది అముద్రితం. ఈకవి గురించి, ఇతని పోషకురాలినిగురించి తొలిసారి మిత్రులు బి. రామరాజుగారు తెలియజేశారు.[1] ఛాయాపతి రాఘువా భ్యుదయంలాగే ఈ కౌసలేయచరిత్రంకూడా ముద్రించాలి. ఈ కవులను పోషించిన నాడగౌడు ముష్టిపల్లి వారి వంశంలో గ్రంథకర్తలుకూడా కొందరు లేకపోలేదు. గిరియమ్మకూ, ఆమెదత్తపుత్రుడు వెంకటరెడ్డికీ ఏమవుతాడో తెలియదుగాని గద్వాలలోని రాజులలో ఉండే ఒక నాడగౌడు ముష్టిపలి వెంకటభూపాలుడుకూడా కావ్యాలు వ్రాశాడు. 'దివ్యదేశ మాహాత్మ్యదీపిక' అనే చిన్న ద్విపదకావ్యాన్ని వ్రాశాడు. ఇందులో 108 దివ్యతిరుపతుల వివరాలున్నాయట. ఈయనే రాజవోలి వెంకటేశ్వరశతకం, రాజవోలి వెంకటేశ్వరకీర్తనలు వ్రాశాడు. ఇవి ఒకటీ రెండూ కావు. 3,476 కీర్తనలు.

---

1. మరుగుపడిన మాణిక్యాలు, పుటలు 44 నుండి 50.

ఇవన్నీ అముద్రితాలే. ఈ ముష్టిపల్లి వెంకటభూపాలుని గురించి తొలిసారిగా దేశానికి తెలియజేసిన బి. రామరాజు గారు ఈకవి 17వ శతాబ్దిచివరనో, 18వ శతాబ్ది మొదటనో ఉంటూడని భావిస్తున్నారు. 'పరమభక్తాగ్రేసరుడైన ఈ ప్రభువు ఆంధ్ర వాగ్గేయకారుల యగ్రశ్రేణిలో జేరదగినవా' డని మనవి చేశారు.[1] ఇతడు చింతలపల్లికవులకు సమకాలికు డేమో భావిపరిశోధనవల్ల తేలాలి. బోరవెల్లి సంస్థానం క్రీ. శ. 1668 లో గద్వాలలో విలీనం అయింది. గిరియమ్మ దత్తపుత్రుడే దానికి ఉమ్మడిపాలిక అయ్యాడు.[2] 'గద్వాలు' కలిసిన సంస్థానానికి బోరవెల్లివారు గంటంకూడా ప్రసాదించారు. ఈ సంస్థానం ఒకానొక పండితకుటుంబానికి ఇంటిపేరుకూడా అయింది. దాని సంగతి తరువాత తెలుసు కుందాం.

---

1. మరుగుపడిన మాణిక్యాలు, పుట 64.
2. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం. 3వ సంపుటి. పుట 305.

25

కొకునూరి అప్పకవి



న్నటిదాకా మన తెలుగుపండితులు దేవుని కైనా భయపడేవారు కాదుగాని ఇద్దరి పేర్లు చెపితేచాలు, ఎక్కడలేని భయభక్తులూ చూపించేవారు. వారిలో ఒకరు కాకునూరి అప్పకవి. రెండో ఆయన పరవస్తు చిన్నయసూరి. ఈ ఇద్దరూ వ్యాకరణ గ్రంథాలే ప్రాశారుగాని అప్పకవిగ్రంథం ఛందోగ్రంథం గానే చలామణి అవుతోంది. అప్పకవి నాయకరాజుల కాలం వాడు. చిన్నయసూరి నిన్నటివాడు. ఈ ఇద్దరు చెప్పిన లక్షణాలకు లొంగని పూర్వకవిప్రయోగాలను దిద్దిపాకేయడానికైనా మన పరిష్కర్తలు వెనుదీయలేదంటే ఈ లాక్షణికుల ప్రభావ మెంతో బోధపడుతుంది. ఈ ఇద్దరి గ్రంథాలకూ నన్నయగారు ప్రాశారనుకొనే ఆంధ్రశబ్దచింతామణే మూలం.

వాస్తవానికి అప్పకవి తన పుస్తకానికికూడా ఆంధ్రశబ్దచింతామణి అని పేరు పెట్టాడు. అయితే దానిని సాహిత్యలోకంలో అప్పకవీయం అనే పిలుస్తు

న్నారు. మనభాషలో లక్షణగ్రంథాలను వాటి రచయితల పేర్లతో పిలవడం రివాజే భీమనకవిజనాశ్రయాన్నిప్రాశాడనుకొని దానికి భీమనచందం అనిపేరు పెట్టారు. అనంతామాత్యుడు ఛందోదర్పణం అనే గ్రంథాన్ని ప్రాస్తే దానిని నేటికీ అనంతుని ఛందమనే వ్యవహరిస్తున్నాం. విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి రచిస్తే వానిని పెద్దిరాజు అలంకారం అని పూర్వంనుండీ పేర్కొనేవారు. గ్రంథకర్తపేరుతో ప్రచారమైన కొద్ది గ్రంథాలలో అప్పకవీయమే సుప్రసిద్ధం. అదే నేడు పరమప్రామాణికమైన లక్షణగ్రంథం. దీనిని అప్పకవి 'సారసారవపం' అన్నాడు. అది నిజంగా కల్పతరువే. పాలసముద్రంలోంచి కల్పవృక్షం పుట్టడానికి ముందు ఎంతో పరిశ్రమ జరిగింది. అలాగే అప్పకవి ఈ పుస్తకాన్ని ప్రాయడానికి చాలా కృషి చేశాడు. అతడు చక్కని పండితుడు. కవిత్వాన్నే విద్యగా భావించే సాహితీపరుడు. లోకోపకారంకోసం తన పాండిత్యాన్ని వినియోగించిన మహనీయుడు. అతని వైదుష్యం అసమానమైనది. వాస్తవానికి కాకునూరివారింట్లో అందరూ పండితులే. అప్పకవి తాతముత్తాతలు తమవిద్యతో ఎందరో రాజులను మెప్పించి అగ్రహారాలు పొందారు.[1]

కాకునూరి అగ్రహారం పూర్వం చరికొండసీమలో ఉండెది. ఇప్పుడా ప్రాంతాన్ని మహబూబ్‌నగర్ అని పిలుస్తున్నాం. కల్వకుర్తితాలూకాలో కాకునూరుకు క్రోసెడు దూరంలో లేమావిడి అనే గ్రామం ఉంది. ఇక్కడే అప్పకవి తాతగారి తాత కాపురం ఉండేవాడు. వారి కుటుంబంలో ఏ శుభకార్యం వచ్చినా ముందు సరస్వతీపూజే చేస్తారంటే వాళ్ళు విద్య కెంత ప్రాముఖ్యమిస్తారో ఊహించవచ్చును. అప్పకవితాత పెదసోమయ్య పండితుడే కాక శ్రీమంతుడు. ఆయన ఎన్నో ధర్మకార్యాలు చేశాడు. లోకులు వాడుకొందుకు నూతులు తవ్వించాడు. పశువులు తాగడానికి కుంటలు కట్టించాడు. క్రోవలో మజిలీచేయడానికి తోటలు వేయించాడు. అప్పకవి తండ్రి వెంగన్న గొప్ప వేదపండితుడు. పల్నాటిసీమలో నూటతొంభై నాలుగు గ్రామాలలో అటువంటి వేదవేదాంగవేత్త లేడు. అందుకే 'మారట బ్రహ్మ' అని లోకులతనికి దండం పెట్టేవారు.

---

1. సమగ్రాంధ్రసాహిత్యం_తొలి రాయలయుగం. పుట 13.

తండ్రివంకవా రిటువంటి పండితులైతే అప్పకవి తల్లివంకవారు కవులు. వాళ్ళు ఏవో ప్రబంధాలు వ్రాశారు. అప్పకవి తన మేనమామల ఇంటనే కామెపల్లెలో పెరిగాడు. ఇది కృష్ణానదికి దక్షిణాన పల్నాడు తాలూకాలో ఉంది.[1] బహుశా ఈగ్రామంలోనో, పరిసరాలలోనో అప్పకవి చదువు కొన్నాడు. అతని విద్య బహుముఖాలది. మూర్తి సర్వన్నగారిదగ్గిర యజుర్వేదం చెప్పుకొన్నాడు. కాండూరి గిరయ్యగారివద్ద వ్యాకరణం చదువు కొన్నాడు. సూరభట్టుగారు సకలసిద్ధాంతాలూ నేర్పారు. వీటికి తోడు కొలిచెల మల్ల సింగన్నగారి దగ్గిర స్మార్తకర్మలు తెలుసుకొన్నాడు. రాజయోగిగారివద్ద ఆగమాలు ఉపదేశం పొందాడు. ఇవికాక మంచికంటి ఓబన్నగారనే కవి దగ్గర లక్షణగ్రంథాలు చదువుకొన్నాడు. అయనే అప్పకవిని ఒక లక్షణ కవిగా తీర్చిదిద్దాడు.

ఇంత చదువు చదువుకొన్నాక అప్పకవి శ్రీశైలం వెళ్లాడు. ఆరోజుల్లో ఎవరో భోగి విభూషణు డనే ఆయన ఆ ప్రాంతాలకు అధికారి. అతడి పట్టపు కవిగా కొన్నాళ్లపాటు అప్పకవి శ్రీశైలంలో ఉన్నాడు. సంస్కృతంలోనూ, ఆంధ్రంలోనూ పుస్తకాలు రచించాడు. స్మార్తకర్మలగురించి బాగా తెలుసు కొన్నవాడు కావడంచేత దాని కో నిబంధనగ్రంథం వ్రాయాలని ఆపస్తంబ షట్కర్మనిబంధన మనే సంస్కృతరచన చేశాడు. అప్పకవి పెదతాత తిరు మలభట్టు గొప్పజ్యోతిష్కుడు. ఆయన కాలామృతం అనే గ్రంథం వ్రాశాడు. పెదతాతగారిలాగే అప్పకవికూడా జ్యోతిష్యంలో కృషి చేశాడు. కాలబాలార్ణవ సంహిత అనే జ్యోతిషగ్రంథానికి శ్లోకరూపమైన సంగ్రహాన్ని వ్రాశాడు.

ఈ సంస్కృతరచనలే కాక స్త్రీలకు పనికివచ్చే 'సాధ్వీజనధర్మం' అనే ద్విపదకావ్యాన్ని, 'అనంతవ్రతకల్ప'మనే కావ్యాన్ని వ్రాశాడు. శ్రీశైలంలో ఉండడంవల్ల ఆ దేవునిమీద నిందాస్తుతితో శ్లేషగర్భితమైన శతకం ఒకటి చెప్పాడు. ఆ రోజులలో ఉద్దండపండితులైనవాళ్లుకూడా ప్రదర్శనార్థం యక్ష గానాలువ్రాసేవారు. అప్పకవికూడా'అంబికావాదం'అనే యక్షగానం వ్రాశాడు.

---

1. నరసరావుపేట తాలూకాలో మరో కామెపల్లి ఉంది. అయితే పల్నాడు తాలూకాలోనిదే అప్పకవి మేనమామల ఊరని భావించడం సమంజసం.

పిటితోపాటు 'కవికల్పకం' అనే లక్షణగ్రంథాన్ని రచించాడు. ఇది బహుశా మంచికంటి ఓబన్నగారి ప్రోద్బలంవల్ల వ్రాశాడుకాబోలు. వారికి కృతజ్ఞత చెప్పుకొంటూ 'నన్ను లక్షణవేత్త గావించిన ఘను మంచికంటి యోబన కవీంద్రు దలతు' అని అప్పకవీయంలో గురుస్తుతి చేశాడు. అప్పకవి వ్రాసిన ఈ గ్రంథాలలో ఏ ఒక్కటీ నేడు దొరకదు.

ఇవన్నీ అయన క్రీ. శ. 1656కి పూర్వమే వ్రాశాడు. అది మన్మథ సంవత్సరం. ఆయేడు కృష్ణాష్టమినాడు మడికట్టుకొని కల్పోక్తమార్గంలో సంకల్పం చెప్పి కామెపల్లిలోని గోపాలస్వామిఆలయంలో అప్పకవి పూజలు చేశాడు. ఆరాత్రంతా పురాణశ్రవణంతో గడుపుతున్నాడు. కాని ఒకరాత్రప్పుడు చిన్న కునుకుపట్టి పెద్దకల వచ్చింది. అందులో రెండుపక్కలా ఇద్దరు కాంతలు, రెండు చేతులా పరికరా లున్న పరమాత్ముడు కనిపించాడు. ఆ ఆయుధాలను చూసి అతడు దేవుడని అప్పకవి గుర్తించాడు. భక్తుడు తనను పోల్చుకొన్నందుకు దేవుడు సంతోషించాడు. స్వయంగా పరిచయం చేసు కొన్నాడు. పెళ్లాల పేర్లు చెప్పాడు. తరువాత పాతికపద్యాలలో తను వచ్చిన కార్యాన్ని, అప్పకవి చేయవలసిన కావ్యాన్ని వివరించాడు.

'నన్నయఫక్కి' అనే కావ్యం ఉంది. దాన్ని అప్పకవి తెనిగిస్తే శాశ్వత మైన కీర్తి వస్తుంది. ఆ భక్తునిమీద ఉంటే ప్రేమకొద్దీ దేవుడు ఇలా ఆదేశిం చాడు. అయితే అంతకుముందు ఈ నన్నయఫక్కిగురించి ఎవరూ కనీ వినీ ఎరుగరు. అప్పకవి దాని ముఖంకూడా చూడలేదు. పురమే లేదు, అంతఃపుర మేమిటి? పుస్తకమే లేదు - దాన్ని తెనిగించడం ఎలాగ అని అప్పకవి బాధపడకూడదని దేవుడు చెప్పాడు. అపుస్తకం లభించే మార్గం విశదపరి చాడు. అసలు నన్నయఫక్కి ఎలా పుట్టిందో తెలియజేశాడు.

ఆదిలో నన్నయగారు ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణాన్ని ప్రప్రథ మంగా రచించారట. దానిలోని సూత్రాలను ఆధారం చేసుకొనే ఆంధ్రమహా భారతంలోని మూడు పర్వాలూ వారు రచించారట. ఆయనమీద వేములవాడ భీమకవికి పగ. ఎందుకంటే తను వ్రాసిన రాఘవపాండవీయం అనే కావ్యాన్ని నన్నయగారు అణచివేశారట. ప్రతీకారం చేయడానికి భీమకవి సంకల్పిం చాడు. ఆంధ్రశబ్దచింతామణిని దొంగిలించి గోదావరిలో కలిపి రూపుమాపాడు. అయితే నన్నయగారు ఒక తెలివైన పని చేశారు. వ్యాకరణం వ్రాయగానే దాన్ని మూలపడవెయ్యలేదు. శిష్యులకు దానిని పాఠం చెప్పారు. రాజరాజ

నచేంద్రుని కొమకు సారంగధరుడు లేదూ-ఆ యువరాజు ఈ వ్యాకరణాన్ని పూర్తిగా కంఠస్థం చేశాడు. వాళ్ళ నాన్న కాళ్లూ చేతులూ కొట్టించేశాడుగాని కంఠం తొత్తరింపజేయలేదుకాబట్టి సారంగధరుని గొంతుకలో ఈ వ్యాకరణ గ్రంథం సురక్షితంగా ఉంది. ఏడాదీ రెండేళ్ళూ కాదు, కొన్నివందల సంవత్సరాలు సారంగధరుడు దాన్ని జ్ఞాపకంపెట్టుకొన్నాడు. తండ్రి శిక్షించాక అతడు సిద్ధు డయ్యాడు. అందుచేత ఎన్ని శతాబ్దాలైనా జీవించగలడు.

అలా జీవించేస్తూ సారంగధరుడు ఇంకా ఈ వ్యాకరణాన్ని గళపట్టులో దాచడం కష్టం అనుకొన్నాడుకాబోలు, ఒక మంచి ముహూర్తం చూసి, కీలక నామసంవత్సరంలో, ఆ పుస్తకాన్ని కాస్తా ఎలకూచి బాలసరస్వతిగారికి మతంగపర్వతందగ్గిర ధారాదత్తం చేశాడు. ఇంతకూ నన్నయగారు రచించిన వ్యాకరణం పెద్దది కాదు. అందులో ఎనభైరెండు ఆర్యలున్నాయి. వాటినే అయిదు పరిచ్ఛేదాలకింద విభజించారు. ఈ గ్రంథం మతంగపర్వతంమీద ఉంటే విప్రుడు తీసుకువచ్చి అప్పకవికి ఇస్తాడట. దాన్ని అందుకోగానే విస్తరంగా తెనిగించమని దేవుడు ఆదేశించాడు. భారతరచనలో నన్నయగారికి నారాయణభట్టు తోడ్పడినట్లు తానే స్వయంగా అప్పకవికి తోడవుతానని పరమాత్ముడు హామీ ఇచ్చాడు.

ఇంత విపులంగా చెప్పి దేవుడు అంతర్ధానమయ్యాడు. ఆ మరునాడే కంపిలినుంచి కాశీకి పోతున్న ఒక బ్రాహ్మడు కామెపల్లిలో మజిలీచేశాడు. అయన కాకునూరివారింట్లోనే బసచేశాడు. భోజనాలయ్యాక లోకాభిరామాయణం చెప్పుకొంటున్నప్పుడు ఆ బ్రాహ్మడు 'విశ్వశ్రేయః కావ్యం' అనే శ్లోకాన్ని చదివాడు. అప్పటికి అప్పకవి ఎన్నో లక్షణగ్రంథాలు చూశాడుగాని ఈ శ్లోక మెందులోనూ అయనకు తగలలేదు. 'ఇదెక్కడిది?' అని అడిగాడు. 'అయ్యో, మీకు తెలియవా! నన్నయభట్టీయంలోని ప్రథమాశ్వ కదండీ! అందులో 82 ఉన్నాయి' అని కంపిలిశాస్త్రుల్లు చెప్పాడు. ఒక పుస్తకం విప్పాడు. 'మహాద్భుతం' అని అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు మరింత ఆశ్చర్యం కలిగేటట్టు అప్పకవి తన కలసంగతి చెప్పాడు. అతనితల్లి పుట్టింటి వారంతా ఆనందించి వెంటనే ఆ గ్రంథాన్ని తెనిగించమన్నారు. అప్పకవి ఒప్పుకున్నాడు. వెనువెంటనేఆ బ్రాహ్మడి పుస్తకంలోని నన్నయభక్కీకి సరైన నకలు కాపీ తీసుకొని అయనని కాశీపంపించాడు. ఇది నవమినాడు జరిగింది. 'శుభస్యశీఘ్రం' అని దశమినాడే అప్పకవి అది తెనిగించసాగాడు. మూలంలో

తెలియని పదాలు ఎన్నో ఉన్నాయి. అయితే వాటి అర్థం దేవుడే చెప్తా డన్న ధైర్యంతో అప్పకవి ఉపక్రమించాడు.

నిజాని కా వ్యాకరణాన్ని అర్థం చేసుకోడానికి, అనువదించడానికి కావలసినంత పాండిత్యం అప్పకవికి ఎప్పటినుంచో ఉంది. అతడు 42లక్షణ గ్రంథాలను కూలంకషంగా పరిశీలించాడు. 73 తెలుగుకావ్యాలను అమూలాగ్రం శోధించాడు. 316 పద్యాలలోని విలక్షణప్రయోగాలను గుర్తించి జ్ఞాపకం పెట్టుకొన్నాడు. ఇని కాక 23 కవుల చాటుపద్యాలలోని విశేషాలను గమనించాడు. అప్పటికే కవికల్పక మనే లక్షణగ్రంథాన్ని వ్రాశాడు. ఇంతటి పరిశ్రమ చేసి సిద్ధంగా ఉన్నాడుకనుకనే ఆంధ్రశబ్దచింతామణిని ఇలాగ కావీ చేసుకొని అలా తెనిగింపు ప్రారంభించాడు. అయితే వాస్తవానికి అది అనువాదం కాదు; వ్యాఖ్యానరూపం అయిన స్వతంత్రగ్రంథం.

బాలసరస్వతి టీకవ్రాసిన శబ్దానుశాసనీయమే ఆధారంగా అప్పకవి ఆంధ్రశబ్దచింతామణిని రచించాడు. మూలంలో అయిదే పరిచ్ఛేదాలున్నాయి. వాటికి సంజ్ఞ-సంధి-తత్సమ-దేశ్య-క్రియాపరిచ్ఛేదాలు అని పేర్లున్నాయి. ఇవే విస్తరించి అప్పకవి ఎనిమిది ఆశ్వాసాలుగా రచింపదలిచాడు. వాటికి భాషాపరిచ్ఛేదం, వర్ణపరిచ్ఛేదం, వళిప్రాసపరిచ్ఛేదం, పద్యపరిచ్ఛేదం; సంధిపరిచ్ఛేదం, తత్సమపరిచ్ఛేదం; దేశ్యపరిచ్ఛేదం, క్రియాపరిచ్ఛేదం అనే పేర్లు పెట్టాలనుకొన్నాడు. ఈ ఎనిమిదింటిలోనూ మూలంలోని 82 ఆర్యలూ తెనిగించదలిచాడు. అయితే ఆయన వ్రాసిన 5 ఆశ్వాసాలే నేడు లభిస్తున్నాయి. వాటిలో 50 ఆర్యలకు మాత్రమే వ్యాఖ్యానం ఉంది. ఏ ఏ ఆశ్వాసాలలో ఎన్నెన్ని ఆర్యలను ఎంత విస్తరంగా తెనిగించాడో చూడండి.

ఆశ్వాసం	పేరు	మూలంలోని ఆర్యల సంఖ్య	అప్పకవీయం పద్యాల సంఖ్య
ప్రథమ	భాషాపరిచ్ఛేదం	6	134
ద్వితీయ	వర్ణపరిచ్ఛేదం	20	437
తృతీయ	వళిప్రాసపరిచ్ఛేదం	1	398
చతుర్థ	పద్యపరిచ్ఛేదం	5	440
పంచమ	సంధిపరిచ్ఛేదం	18	193
	మొత్తం	50	1602

ఈలెక్కన చూస్తే ఒక ఆర్యగీతానికి వివరణగా నగటున 300పైచిలుకు పద్యాలను అప్పకవి వ్రాసినట్లు కనబడుతుంది. మూడవ ఆశ్వాసంలో ఒకేఒక ఆర్యకు 398 పద్యాలు చెప్పాడు. ఇంత పరిశ్రమ చేసిన గ్రంథాన్ని అనువాదం అనడం అపచారమే. లోకంలో లక్షణగ్రంథాలెన్నో ఉన్నాయి. వాటిలో తాను చదివిన గ్రంథాల పేర్లను మొదటే అప్పకవి పేర్కొన్నాడు (1-5). అతడు గ్రంథకర్తల పేర్లు చెప్పలేదు. గుర్తించకల్గినన్ని రచయితలపేర్లతో పట్టికను పొందుపరుస్తున్నాను చూడండి.

వరుస	గ్రంథం పేరు	కవి	కాలం
1.	ప్రతాపరుద్రీయం	విశ్వనాధుడు	కాకతీయ
2.	కువలయానందం	అప్పయదీక్షితులు	1550-1620
3.	చంద్రాలోకం	జయదేవుడు	1300
4.	రసమంజరి	భానుదత్తుడు	1320
5.	సాహిత్యచంద్రోదయం	———	—
6.	సాహిత్యరత్నాకరం (?)	వారణాసి ధర్మసూరి	1700
7.	వృత్తరత్నాకరం	కేదారభట్టు	?
8.	చమత్కారచంద్రిక	———	—
9.	షడ్భాషాచంద్రిక	———	—
10.	షడ్భాషావివరణం	ఎలకూచిబాలసరస్వతి	నాయక
11.	త్రివిక్రమవృత్తి	త్రివిక్రముడు	—
12.	హేమచంద్రఫక్కి	హేమచంద్రుడు	1150
13.	కవిభల్లటఫక్కి	కవిభల్లటుడు	రెడ్డిరాజుల
14.	అధోక్షజఫక్కి	అధోక్షజుడు	—
15.	శబ్దానుశాసనీయం	బాలసరస్వతిటీక	నాయక
16.	కవిరాక్షసీయం	కవిరాక్షసుడు	రెడ్డిరాజుల
17.	కవికంఠపాశం	కవిసర్వగారుడంలో ఉదాహరించాడు	మలితాయల
18.	కవిమూషికమార్జాలం	పట్టాభిరామకవి	1600
19.	కవిగజాంకుశం	భైరవుడు	తొలిరాయల
20.	కవిసర్వగారుడం	కూచిరాజుబసవన	మలిరాయల

21.	కవిజనాశ్రయం	మల్లియరేచన	చాళుక్య
22.	కవిలోకసంజీవని	ముదరాజురామన	ఆరవీటి
23.	కవికంఠాభరణం	లక్షణవిలాసంలో పెను మర్తి వెంకటార్యుడు పేర్కొన్నాడు	ఆరవీటి
24.	కావ్యాలంకార చూడామణి	విన్నకోట పెద్దన	రెడ్డిరాజుల
25.	కవిచింతామణి	తాతంభట్టు	మల్లీరాయల
26.	అథర్వణఛందం	అథర్వణుడు	కాకతీయ
27.	గోకర్ణఛందం	గోకర్ణుడు	—
28.	శ్రీధరఛందం	శ్రీధరుడు	—
29.	అనంతునిఛందం	అనంతుడు	గజపతుల
30.	ఛందోదర్పణం	తాతంభట్టు	మలిరాయల
31.	అలంకారసంగ్రహం	——	—
32.	అలంకారరత్నావళి	——	—
33.	ఆంధ్రభాషాభూషణం	కేతన	కాకతీయ
34.	రేఫఱకారనిర్ణయం	తాళ్లపాక పెదతిరుమలయ్య	మలిరాయల
35.	లక్షణవిలాసం	పెనుమర్తి వెంకటార్యుడు	ఆరవీటి
36.	సలక్షణసారం	లింగమగుంట తిమ్మన	—
37.	సర్వలక్షణసారసంగ్రహం	చిత్రకవి పెద్దన	నవాబుల
38.	లక్షణదీపిక	గౌరన	గజపతుల
39.	కారదాదీపిక	——	?
40.	కారదాముకుటం	——	?
41.	కారదాతిలకం	కవిసర్వగారుడంలో ఉదహరించాడు	? ?
42.	వాగీంద్రచూడామణి	వాగీంద్రుడు	?
43.	నరసభూపాలీయం	భట్టుమూర్తి	నవాబుల

సూచన: వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు సంపాదించిన అప్పకవీయం తాళపత్రప్రతిలో సాహిత్యరత్నాకరం పేరు లేదు. అపాఠమే సముచితం. వారణాసి ధర్మసూరికాలం క్రీ. శ. 1700; అప్పకవీయంరచన, క్రీ. శ. 1656.

లక్షణగ్రంథాలు లక్షోపలక్ష లున్నాయని చెప్పి వాటిగురించి అప్పకవి ఇలా అన్నాడుః

ఒకదానికంటె మరివే_రొకటి విశేషంబు జెప్పుచుండు కతమునన్
సకలగ్రంథములును జదు_వక తెలియుఁ నె లక్షణప్రపంచంబెల్లన్?

[అప్పకవీయం, 1_6.]

అప్పకవి తాను చదివిన గ్రంథాలలోని అంశా లన్నింటిని వెదకి వెదకి, సారమంతా వివరిస్తూ ఈవ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. ఏయే ఆశ్వాసాలలో ఏయే విషయాలు చెప్పాడో కొద్దిగా తెలుసుకొందాం.

ప్రథమాశ్వాసం :—ప్రామాణికగ్రంథాల జాబితా ఇచ్చాక లక్షణవేత్తలలో మూడురకాలవాళ్లు ఉన్నారని చెప్పాడు. లక్ష్యలక్షణ పద్యా లన్నీ తెలిసినవాడే ఉత్తముడు. లక్ష్యపద్యాలు మాత్రమే తెలిసినవాడు మధ్య ముడు. లక్షణపద్యాలుమా త్రమే నేర్చుకొన్నవాడు అధముడు. మొదట లక్షణసూత్రాలు తెలుసుకొని తరువాత లక్ష్యాలు గుర్తించి లక్షణలక్ష్యాలు రెండూ పాఠంచేయాలని అప్పకవి ఉపదేశించాడు. 'విశ్వశ్రేయః కావ్యం' అన్న తొలిసూత్రానికి 18 పద్యాల వివరణ వ్రాశాడు. నప్తసంతానాలను పేర్కొని వాటిలో కృతే ఎందుకు ప్రశస్తమో చెప్పాడు. ఏ కులంవాడి కావ్యం పవిత్రమో విశదీకరించాడు. కావ్యభేదాలు చెప్పి ఇరవైరెండు వర్ణనల జాపితా ఇచ్చాడు. నాలుగురకాల ఉదాహరణలు వగైరాలూ పదిహేను రకాల ముక్తకాది సంఖ్యాబద్ధమైన రచనలూ చెప్పాడు.

తరువాత ఇతరసూత్రాలు వివరించాడు. శబ్దార్థలక్షణాలూ, అలం కారాలూ ఒక సీసమాలికలో బోధపరిచాడు. అనుప్రాసల తేడాలు చెప్పాడు. 8 రకాలయమకాలు వివరించాడు. చిత్రకవిత్వం, గర్భకవిత్వం, బంధ కవిత్వం మొదలైనవి ఎలాంటివో కొద్దిగా చెప్పాడు. తరువాత 16 రకాల శబ్దగతదోషాలు, 50 అర్థదోషాలు పేర్కొన్నాడు. నవరసాల వివరణ, నాయక నిర్ణయం, సుకవిమాహాత్మ్యం, సత్కవిలక్షణం, ఏడురకాల కవుల తేడాలు వివరించాడు. కవితాప్రశంస చేశాడు. తరువాత దేశభాషావిశేషాలు చెప్పాడు. సంస్కృతప్రాకృతాలకు తెలుగు వికృతి అన్నాడు. సంస్కృతంలోంచి పుట్టిన తెలుగుమాటలేవో, ప్రాకృతంలోంచి పుట్టిన వేవో వివరించాడు. చందురుడు, లచ్చి, జూదం, సాన, రాచమూక, జిక్కులు అనే పదాలను సంస్కృతప్రాకృత సూత్రాలతో చర్చించాడు.

అప్పకవి ఉద్దేశ్యంలో లక్ష్మీశబ్దానికి ప్రాకృతభవమైన లచ్చి అనే తెలుగు మాటేగాని సంస్కృతజనితమైన 'లక్కమి' అనే రూపం లేదు. అసంగతి ఇలా చెప్పాడు:

నాకులభాషను ముట్టక-ప్రాకృతమున లచ్చి చా బరగు లచ్చియనన్
నాకోక్తియైన లక్ష్మీకి-బ్రాకటముగ లక్కమి యని పలుకగ వలదే?
[అప్ప. 1_90]

ఈపద్యం చెప్పాక 'పూర్వకవులు ప్రబంధములయందు లచ్చి యని ప్రయోగించినారుగాని లకిమి అని ప్రయోగించినవారు కాదు' అని తెలియ చేశాడు. అయితే పూర్వకవిప్రయోగాలు లేకపోలేదు. తాళ్ళపాకవారు చాలా సార్లు వాడారు. అన్నమయ్య ఒక శృంగారసంకీర్తనలో యతిప్రాసలస్థానంలో ఇలా ప్రయోగించాడు:

లకిమమ్మ కేమైనా లంచము లిమ్మనరో
శుకవాణి తలుపు మూసుక తియ్యదు. [12_8]

'లకిమి'అన్న ప్రయోగాన్ని అన్నమయ్య ఈ ఒక్కచోటే కాదు, ఇత రత్రాకూడా చేశాడు (12-15). దానికి 'లగిమమ్మ' అనే రూపాంతరంకూడా ఉన్న ట్టుంది.[1] సంకీర్తనములలో ఉన్న ప్రయోగంకనుక అప్పకవిదృష్టిని ఈమాట తప్పించుకొం దనుకోవాలి. అతడు ప్రబంధాలే చూశాడు. వాటినే చెప్పాడు. కొన్ని శబ్దాలను చర్చించాక 58 మాటలను పేర్కొని అవి ఏవి సంస్కృతశబ్దాలనుండి పుట్టాయో వివరించాడు (1-98). ఆంధ్రమున సుప్ర సిద్ధంబులైన పూర్వకవి సమయసిద్ధపదములుగాని చొరవు' అని శాసించాడు.

ద్వితీయాశ్వాసం :—ఇది వర్ణపరిచ్ఛేదం. ఇందులో అక్షరాల ఉచ్చారణ ఎలా ఉంటుందో వ్రాశాడు. వాటి స్వరూపాలు వర్ణించాడు. తరు చుగా లేఖకులు చేసే తప్పులు క్రోడీకరించాడు. ఏమాటలలో క్రకారకొమ్ములు వాడాలో, ఎక్కడ వట్రసుడి వ్రాయాలో వివరించాడు. తెలుగువాళ్లం కొందరం వట్రసుడిని క్రకారకొమ్ములాగా ఉచ్చరిస్తాం. అందుచేత, ఈ తబ్బిబ్బులు

1. తాళ్ళపాకవారి గేయరచనములు - సంపుటి 12, పుట 11 లో అధోజ్ఞాపిక.

వస్తాయి. ఉదాహరణకు 'గృహము' అని వ్రాసి 'గ్రుహము' అని ఉచ్చరిస్తాం. అందుకే అప్పకవి ఇలాగా చెప్పవలసి వచ్చింది. అయితే ఈ ధీమంతుడు కూడా అవే పొరపాట్లు చేశాడు. ధ్రువము అనే మాటలో క్రొరకొమ్ము ఉందని అతడే 1–66లో చెప్పాడు. గాని యతిస్థానంలో వ్రుసుడిలో 'ధ్రువసన్ను తా!' అని వాడాడు (4-326). మరొకసారి 4-572లో కూడా ఇలాగే వ్రుసుడితో ప్రయోగించాడు.

తరువాత: అప్పకవి క్రోడీకరించిన రెండు పెద్ద పట్టిక లున్నాయి. ఏ పదాల్లో మామూలు'ర' ఉందో, ఏమాటల్లో 'బండిర'ఉందో చెప్పాడు. అతని ఉద్దేశ్యంలో రేఫ ఱ కారాలు దేవదానవులవంటివి. అందుచేత ఆ రెండిటికి సంకరం చేయకూడదు. అందుకే ఆదికవీంద్రకావ్యాలన్నీ శోధించి క్రమంగా వాటిని పొందుపరిచాడు. అంతకుముందు తాళ్ళపాక కవులలో పెదతిరుమలయ్య రేఫఱకారనిర్ణయ మనే గ్రంథం వ్రాశాడు. 'వారలు మునుపు రచించిన యివి యెల్ల జాలవా యనగ వలదు వెండియు నొకకొన్ని వెదకికూర్చితి' అని అప్పకవి సంజాయిషి ఇస్తూ ఈమాటలను యాకరువు పెట్టాడు. అతను చెప్పిన పదాలలో రకారమున్నవి 420;బండిరా ఉన్న మాటలు 406.అప్పకవి ఇంత కష్టపడి వాటినికేటాయించినా కొన్ని నల్లగొర్రెలు తెల్లమందలో కలిసి పోయాయి. ఈ వర్ణసాంకర్యం ఒకరు ఆపితే ఆగేది కాదు. లోకవ్యవహారంలో రేఫఱకార భిన్నోచ్చారణ లేనప్పుడు వ్రాతలో భేదాలు పెట్టా లంటే కుదరని పని. లాక్షణికులు తప్ప మరెవ్వరూ ఈపట్టింపులు పెట్టుకోలేరు. రేఫఱకారాల విషయంలో అప్పకవి కవిత్రయసోమభాన్ధ్రుల గ్రంథాలను ప్రమాణాలుగా తీసుకొన్నాడు (2-197). అయితే వాళ్ళ గ్రంథాలలోకూడా ఒకే మాట శకటరేఫతోనూ మామూలు రేఫతోనూ కనబడితే విధి లేక రెండు రూపా లున్నాయని ఒప్పుకోవలసివచ్చింది. అప్పకవి ఏదైనా సహిస్తాడుగాని ఈ సాంకర్యం ఒప్పుకోడు. బమ్మెరపోతరాజుగా రంటే అతనికి భక్తి. ఆదికవులను స్తుతించడంలో సహజపాండిత్యాని సంస్మరించాడు (పీఠిక-27). అయితే ఆయన ఈసాంకర్యం చేశారుకనుక వారి ప్రయోగాలను లాక్షణికులు స్వీకరించలే దని చెప్పాడు.

బమ్మెరపోతరాజకృత భాగవతమ్ము సలక్షణమ్ముగా
కిమ్మహి నేమిటం గొదువ యెంతయు నారసి చూడగాను రే

ఘమ్ములు ఱాలునుం గలసి ప్రాసమ్ములైన కతంబునం గదా
యిమ్ముల నాదిలాక్షణికు లెల్లను మాని రుదాహరింపగన్.

[అప్ప. 2_234]

లాక్షణికులు ఉదాహరించకపోతే ఎవరికి తక్కువ? కోడీ కుంపటి లేక పోతే తెల్లవారదా? పోతరాజుగారిని కాదనడానికి అప్పకవికి మనస్కరించ లేదు. అంచేత ఎక్కడో నాలుగోశ్వాసంలో శుభగణాలను చెప్తూ పోతరాజు గారి పద్యంఒకటి ఉదాహరించాడు (4-69). ఇంతకు మించి భాగవతంలోని ప్రయోగం వీవీ చూపించలేదు.

రేఫఱకారాల తేడాలు చెప్పాక అక్షరబీజాలు, వాటి లింగాలు, పూజా విధానాలు, సారస్వతఔషధాలు చెప్పాడు. ఏస్థానంలో ఏ అక్షరం వాడకూడదో వివరించాడు. కొందరు తిట్టుకవుల పద్యాలు ఉదాహరించాడు. అతడు మూడు మందుల గురించి ముచ్చటించాడు. ఒకటి రూకెత్తు తింటే సూక్తులు ఘటిస్తాయి (2-430); ఇంకొకటి ఉసిరికాయంత తింటే గడియ కోపద్యశతకం చెప్పే సామర్థ్యం కలుగుతుంది (2-431); మూడోమందు చిన్నమెత్తు సేవిస్తే అనాలుకమీద నలువచెలువ కాపురముంటుందిట (12-432).

తృతీయాశ్వాసం :—ఇందులో యతిప్రాసలగురించి చెప్పాడు. తొలి ఛందోగ్రంథం కవిజనాశ్రయంలో పది యతులుమాత్రమే ఉండేవి. అనంతామాత్యుడు వాటిని రెట్టింపు చేశాడు. తరువాతవాళ్లు మరోవీడు చేర్చారు. అప్పకవి వాటిని 41దాకా పెంచాడు. ఇవి నాలుగురకాలు: (1) స్వరయతులు, (2) వ్యంజనాక్షరయతులు, (3) ఉభయయతులు, (4) ప్రాస యతులు. వీటిలో స్వరయతులలో 7 రకాలు, వ్యంజనాక్షరయతులలో 21 తేడాలు, ఉభయయతులలో 12 భేదాలు చెప్పాడు. ప్రాసయతి ఒక్కటే ఒక్కటి ఉంది. నిజానికి ఇన్నిరకాల యతులకి అవసరంలేదు.

అప్పకవి అఖండవడిని ఒప్పుకోడు. మనం 'నవ్యపండితు లియతి నాదరింత్రు' అని ఒక పద్యపాదంలో ప్రాసి 'నవ్య'లోని నకారానికీ, నంధిలో వచ్చిన 'నాదరింత్రు'లోని నకారానికీ యతి సరిపెడితే అప్పకవి దెబ్బలాడుతాడు. 'ఆదరింత్రు' అనే మాటనే యతి విషయంలో స్వీకరించా లనే పట్టింపు అప్పకవికి ఉంది. పూర్వకవులలో నన్నయగారివంటి వారే అఖండ

యతి వాడారు. మాద్రినికూడ సంతానం కనమని పాండురాజు చెప్పే ఘట్టంలో "చూవె మనంబున దలంచుచుండుదు నెపుడున్' అని నన్నయ గారు ఒక కందంలో చివరిపాదం చెప్పారు (ఆది 5-131). 'తలంచుచుండుదు'లో 'చుండుదు' అనే ప్రత్యేకశబ్దం లేదు. 'ఉండుదు' అనే మాట నంధిలో అలా వచ్చింది. ఇది అఖండయతి. అందుచేత శుద్ధ తప్పు. నన్నయ గారు వ్రాస్తే నేం? మార్చెయ్యాలి. 'చూవె మనంబున దలంతు సుందరి యెపుడున్' అని అప్పకవి సవరించాడు (3-204). ఇలాగ ఈ ఒక్కచోటే కాదు. ఏడు పూర్వ ప్రయోగాలు దిద్దేశాడు. నిజానికి తెలుగు సాహిత్యంలో అఖండయతి వాడని కవి అంటూ లేడు. కవిత్రయభారతం నుండి తిరుపతి కవుల గ్రంథాలదాకా గాలిస్తే కొన్ని వందల ప్రయోగాలు కనబడతాయి. రావూరి దొరస్వామిశర్మగారు సుమారు వందప్రయోగాలు సేకరించి ప్రకటించారు.[1]

అప్పకవి అఖండవడిని అంగీకరిస్తే యతుల సంఖ్య తగ్గేది. అయితే ఇతడు 41 దాకా వీటిని పెంచితే, అనంతరలాక్షణికులు తక్కువ తిన్నారా? కూచిమంచి వెంకట్రాయకవి అనే మహానుభావుడు 72 యతు లున్నాయని చెప్పాడు. వాటికి మహాకవిలక్ష్యాలను ఇచ్చాడు. ఇది 'సుకవిజన మనో రంజని'లో వ్రాశాడు.[2] ఈ యతుల జాపితాలుచూస్తే గిరీశం ఇచ్చిన పుస్తకాల పట్టిక జ్ఞాపకంవస్తుంది. సెలవల్లో వెంకటేశం చదవవలసిన పుస్తకాల పేర్లు వ్రాయమని నలచరిత్ర, రాజశేఖరచరిత్ర, షెప్పర్డ్‌జనరల్ ఇంగ్లీషు, వెంకటసుబ్బారావు మేడీజీ అంటూ కొన్ని చెప్పాడు. ఈ పుస్తకాల సంఖ్య తొమ్మిదే అయ్యాయి. అందుచేత మరి ఒకటి వ్రాయమని 'కుప్పుసామయ్యరు మేడ్‌డిఫికల్టు' అనే పేరు కలిపాడు.[3] వాస్తవానికి మన లక్షణగ్రంథాలు కొన్ని మేడీజీలు కాక మేడ్‌డిఫికల్టులే!

41 యతిభేదాలు చెప్పాక అప్పకవి 17 రకాల ప్రాసలు తెలియ

---

1. తెలుగుభాషలో ఛందోరీతులు - రావూరి దొరస్వామిశర్మ, పుటలు 305 నుండి 308 దాకా. 93 అఖండవడి ప్రయోగాలు చూపించారు. 2. తెలుగుభాషలో ఛందోరీతులు - పుట 300. 3. కన్యాశుల్కం. ప్రథమాంకం. 1-వ స్థలం.

చేశాడు. యతులు పెంచినట్టే ప్రాసలుకూడా అప్పకవి పెంచాడు. అనంతుడు 12 భేదాలే చెప్తే ఈయన మరో అయిదు కలిపాడు.

చతుర్థాశ్వాసం:—ఇది పద్యపరిచ్ఛేదం. ఇందులో గద్యపద్య భేదాలు, షట్ప్రత్యయాలు, ఇరవైఆరు ఛందాలలో ఉండే కొన్ని సమ వృత్తాల రూపాలు, గౌణవృత్తాలు, మాలికావృత్తాలు, చిత్రకవిత్వాలు, గర్భ కవిత్వాలు, బంధాల రూపాలు చాలా విపులంగా చెప్పాడు. లెక్కపెడితే ఎవరైనా పదమూడు కోట్ల పై చిలుకు వృత్తాలు ప్రాయడానికి అవకాశం ఉంది. వాస్తవానికి అసంఖ్య 13,42,17,726. అయితే ఏపిచ్చివాడూ ఇన్ని వృత్తాలు ప్రాయడు. సర్వసాధారణంగా మనకు తారసపడే వృత్తాలు వంద కూడా వుండవు. అప్పకవి 186 సమవృత్తాలు వివరించాడు. 35 ముఖ్య వృత్తాలు తెలియచేశాడు. యక్షగానాలు, ఉదాహరణలు, లాలిపాట, పెళ్ళి పాట, ధవళం, సువ్వాల, అర్ధచంద్రిక మొదలైన వాటి లక్షణాలుకూడా చెప్పాడు.

పంచమాశ్వాసం:—ఇది సంధిపరిచ్ఛేదం. ఇందులో కళలేవో, ద్రుతప్రకృతికా లేవో విచారించాడు. సంధిలక్షణాలు ఇచ్చాడు. సంధుల వివరాలు తెలిపాడు. శ్రీనాథునివంటి వాళ్ళనే విసంధులు చేశారని ఆక్షేపించాడు (5-66). ఇది నన్నయగారు ప్రాసిన వ్యాకరణగ్రంథానికి వివరణ అయినా మూలంలో కవిభల్లట మతసంధులు అథర్వణమతసంధులు కొన్ని ఉన్నాయి. వాటినికూడా నన్నయగారే పొందుపర్చారని భావించి అప్పకవి వివరించాడు.

ఈ గ్రంథాన్ని అప్పకవి సొంతం రచించాడో లేదో తెలియదు. అయిదాశ్వాసాలు మాత్రమే ప్రచారంలో ఉన్నాయి. మిగత మూడాశ్వాసాలలోని కొన్ని పత్రాలు మాత్రం ఆంధ్రసాహిత్యపరిషత్తువారి కార్యాలయంలో ఉన్నాయట. తత్సమపరిచ్ఛేదం కొంత లభిస్తోంది.[1]

ఇప్పటికి ఈ పుస్తకాన్ని వావిళ్ళవారే ఆరుసార్లు అచ్చువేశారు. తొలిసారి 1850 లో ముద్రించారు. 1962 లో తాజాముద్రణ జరిగింది. ఈ ఆరవముద్రణకు గ్రంథాన్ని రావూరి దొరస్వామిశర్మగారు పరిష్కరించారు.

---

1. పరిషత్పుస్తకభాండాగారం, గ్రంథ సంఖ్య 51.

ఈ ముద్రణలోనే మళ్ళీ అప్పకవీయంలో వ్యావహారిక వచనాలు కనబడుతున్నాయి. వీటిని గిడుగు రామ్మూర్తిపంతులుగారు మొదట చూపించారు. వావిళ్ళవారు 1922 లో వేసిన ముద్రణకు చాలా విపులమైన పీఠిక వ్రాసిన గిడుగువారు ఎన్నో విషయాలు తెలిపారు. అతరువాత అచ్చుపడిన ముద్రణలో వ్యావహారికరూపాలు మాయమయ్యాయి. మళ్ళీ వాటిని సమగ్రంగా అచ్చువేయడం సంతోషింపతగ్గ విషయం.

అయితే ఒకందుకు చింతించాలి. అప్పకవీయానికి మరొక తాళపత్ర ప్రతి 1950 లో బయటపడింది. దానిని వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు సంపాదించారు. ఇందులో ఎన్నో పాఠాంతరాలు (చాలా మంచివికూడా) కనబడుతున్నాయి. వాటన్నిటినీ విపులంగా వడ్లమూడివారు పొందుపరిచారు [1] అయితే ఈ పాఠాలగురించి వావిళ్ళవారి 1962 ముద్రణలో మాట వరసకైనా తలపెట్టలేదు. అప్పకవీయంవంటి పరమప్రామాణికగ్రంథాన్ని పరిష్కరిస్తున్నప్పుడు దానిని ఎప్పటికప్పుడు సమగ్రం చేయడానికి ప్రయత్నించాలి.

ఈ లక్షణగ్రంథం సంపూర్ణంగా దొరకకపోవడం చాలా దురదృష్టం. అప్పకవిలాంటి శాస్త్రీయదృక్పథ మున్న లాక్షణికులు చాలా అరుదు అతడు తెలుగుమాటల వ్యుత్పత్తి అర్థాలుసైతం చెప్పాడు. ఉయ్యాల, పయ్యెద, తాయత్తులు మొదలైన పదాల పుట్టుక తొలి అశ్వాసాలలోనే చక్కగా వివరించాడు (2-186 నుండి). అతనికి తమిళభాషకూడా వచ్చునుకాబోలు. తాయెత్తులు అనే పదానికి ఇలా అర్థం చెప్పాడు. 'ఎత్తు' లనగా దక్షిణదేశమున దండలకు పేరు. దాని జిడ్డను తేలపలికిన 'యెతు'లాయెను. 'తాయి' అనగా 'తల్లి'. ఆ తాయి శిశువులకు శరీరరక్షకుగాను కట్టునవి యతులు గనుక తాయెతులు. ఈ అర్థవివరణ ప్రమాదజనితమే. తాయతులు అనే మాట దేశ్యం కాదు. 'తావీజ్' అనే అరబ్బీపదంనుండి 'తాయెత్తు' వచ్చింది. దీనిగురించి విపులంగా తూమాటి దొణప్పగారు చర్చించారు.[2] అప్పకవి పొరవడినా చక్కని కృషి చేశాడు. భాషాశాస్త్ర పరి

---

1. భారతి, జూలై 1950. వడ్లమూడివారి వ్యాసంలో అచ్చుప్రతినుండి విభేదాలుగాని, పాఠాంతరాలుగాని 104 ఉన్నాయి.

2. భారతి, జూన్ 1959 (వికృతివివేకకర్తృత్వం అనే వ్యాసం.)

శోధనాదృష్టి అలవరచుకొన్నాడు.తమిళపదాలనుండి తెలుగు అర్థాలు పిండడం అనే శాస్త్రీయదృక్పథాన్ని అమలులో పెట్టి ఒకరకంగా అప్పకవే ద్రావిడ భాషావాదానికి ఆదిమపురుషు డయ్యా డనవచ్చును. ఇంత చక్కగా శబ్దోత్పత్తిని వివరించడానికి ప్రయత్నించే లాక్షణికుడు దేశ్యపరిచ్ఛేదం వ్రాస్తే అది మన లక్షణగ్రంథాలలో ఎవరెస్టుశిఖరంలా ఉండేది.

అయితేనేం, ఇప్పటికీ అప్పకవీయాన్ని మించిన ప్రామాణికగ్రంథం లేదు. అతడు చెప్పబట్టి కొందరు కవులపేర్లు, గ్రంథాలు తెలిశాయి. ఆయన ఇచ్చిన ప్రయోగాలే కొందరి కవిత్వరూపాన్ని తెలియచేస్తాయి. అయితే అప్పకవి చేసినది ఒక్కటే ఒక్క తప్పుంది. చాలా వినయవిధేయతలతో అతడు పండితుల కొక విజ్ఞాపన చేశాడు.

కాళిదాసమయూరాదికవులకైనఁగలచు తప్పులనంగ నన్యులకు లేవె?
దిద్దదగు పట్ల దిద్దుడు, దిద్దకాని_యెడల నానేరములు క్షమియించుటొప్పు.

[అప్ప. పీఠిక, 1_28]

తనగ్రంథంలోని తప్పులను దిద్దేయమని అప్పకవి లైసెన్సు ఇస్తే దాన్ని పురస్కరించుకొని మన పరిష్కర్తలు తమకు తప్పని తోచిన చోట్లలో మహాకవుల ప్రయోగాలే దిద్దిపారేశారు. ఆ దిద్దడానికి ముందు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అప్పకవి చెప్పనే చెప్పాడు. వినాలి. తరువాత పుస్తకం చూడాలి, పెద్దల నడగాలి. ఆ తరువాత తప్పనాలిగాని తెలియనివన్నీ దోషాలకింద జమకట్టకూడ దని భావిజనులకు చెప్పాడు. ఇది ఎవరూ పట్టించుకోలేదు. సకలగ్రంథాలూ చదవనిదే లక్షణప్రపంచం తెలియదని అప్పకవి చెప్పాడు. అయినా తన గ్రంథంగురించి ఇలా అన్నాడు :

ఇది చదివినపిమ్మట_యెదియేనియు జదువు బుద్ధి యేలా వొడమున్
బదపడి గ్రంథము అన్నియు_పదకిపదకి సారమెల్ల వివరింపంగన్.

[అప్ప. 1_7]

ఇది అక్షరాలా నిజం అయికూర్చుంది. అప్పకవీయం చదివాక ఇంకేవీ చదవా లనిపించదు!

26

పదిమంది శతక కవులు



యకరాజుల యుగంలో యక్షగానాలూ, నాట కాలూ వృద్ధిచెందినంత ఇతరప్రక్రియలు ప్రచారం పొందనట్లు కనిపిస్తుందిగాని ఈ యుగంలో శతకాలూ దండకాలూ మొదలైనవి కూడా విరివిగానే కవులు విరచించారు. ఎలకూచి బాలసరస్వతి, గణపవరపు వెంకటకవి, కాకునూరి అప్పకవివంటి ప్రసిద్ధులు వ్రాసిన శతకాల గురించి వాళ్ళ చరిత్రలలో తెలుసు కున్నాం. ఇప్పు డీయుగంలోని శతకకవుల గురించి ముచ్చ టించుకుందాం.

1. శ్రీగిరి విరూపాక్షయ్య :—ఇతడు కాళహస్తిలింగశతకం వ్రాశాడు. ఇది బహుళప్రచారం పొందింది. ప్రాచ్యలిఖితగ్రంథాలయంలోనే దీనికి 17 ప్రతులు ఉన్నాయంటే ఇది ఎంత పేరుమోసిందో తెలుస్తుంది.[1] ఈ కవికాల మేదో నికరంగా చెప్పలేము. వంగూరిసుబ్బారావుగారు ఇతడు క్రీ.శ.

---

1. మద్రాసు ఓ. లై. డిస్క్రిప్టివ్ కేటలాగు 75వ సంపుటిలో D1503 నుండి D 1519 దాకా ఈ శతకప్రతుల వివరణ ఉంది.

1700s పూర్వుడని ఊహించారు.[1] నిడుదవోలు వెంకటరావుగారు మాత్రం ఇతడు క్రీ. శ. 1400 వాడని భావించారు.[2] ప్రాచ్యలిఖితగ్రంథాలయంలో 14 తాళపత్రప్రతులలో నగం చాలా ప్రాచీనప్రతులలాగా కనబడుతున్నాయి. ఒకదానిలో లేఖకుడు తారీఖు వ్రాసుకొన్నాడు. అది 'ప్రభవనామసంవత్సర భాద్రపద బ: 13 మంగళవారం' (D 1509). దీనికి నరైన ఇంగ్లీషుతేదీ 29-9-1807. కవి ఈ కాలానికి నూరు, నూటయేభయి సంవత్సరాలముందు వాడు కావచ్చును.

ఇది సీసపద్యశతకం. ఇందులో లోకనీతి, శివస్తుతి ఉన్నాయి. క్షత్రియ లక్షణాలు ఎక్కువగా చెప్పాడు. చివరి పద్యంలో తన తండ్రిపేరు శ్రీగిరి పాపరాజు అని, తన పేరు విరూపాక్షయ్య అని చెప్పుకున్నాడు. మకుటం గీతపద్యంలోని చివరి రెండుపాదాలలో ఉంది. అది:

ప్రణుతభవళాంగమానిహృత్పద్మభృంగ-అమితభవభంగశ్రీకాళహస్తిలింగ.

ఈకవి 'పూర్ణవిద్యలు రాజపూజితుగా జేయు, నీతిమార్గంబున నెగడు సిరులు' అని నమ్మినవాడు. 'అవధరింపుము నా నేర్చినట్లు నీకు విన్నవించెద శతకంబులో'అని తన దేవునితో చెప్పాడు. శతకం చదివితే ఇతడు నేర్పరే అని తోస్తుంది.

2. ఉడుమూడి సూరపరాజు :–మామ్మూలుగా మన శతకాలలో సంఖ్యానిర్ణయం, మకుటనియమం ఉంటాయిగాని శతకమంతా ఒకే ప్రాసలో చెప్పడమనే నియమం కొందరే పెట్టుకొంటారు. ఉడుమూడి సూరపరాజు 'ర'కార ప్రాసతోనే వెంకటాచలపతిశతకాన్ని వ్రాశాడు. ఏకప్రాసశతకం వ్రాస్తున్నట్లు ఇలా చెప్పాడు:

వరయతిలక్షణజ్ఞులగు వందితసత్కవు లెల్ల మెచ్చగా
గరిమను నేకప్రాసశతకం బొనగూర్చి సుపుష్పమాలగా
నరహరి మీ కొనర్చెదను నారదగానవిలోల ద్వారకా
తిరుపతివేంకటాచలపతీ! ననుబ్రోవుము వేగ శ్రీపతీ!

---

1. శతకకవుల చరిత్ర, పుట 304.
2. శతకకవుల చరిత్ర, పుట 739.

నత్కవులు మెచ్చేటట్లు శతకం చెప్తానని ఇతడు ప్రకటించినా సాహిత్యచరిత్రకారులుమాత్రం ఇతని కవిత్వంలో భావాలు సంపూర్ణత పొంద లేదనీ, క్రొత్తవికావనీ భావిస్తున్నారు.[1] ఈకవి గోదావరిజిల్లాలోని జొన్నాడ కాపురస్తుడు. భట్టాజు. పూర్వకవిస్తుతిలో భట్టుమూర్తిని స్తుతించాడు. ఇదే ఇతని కాలనిర్ణయానికి కొండగుర్తు.

3. పుసులూరి సోమరాజు :— ఏకప్రాసశతకాలు ప్రాసినా ప్రౌఢంగా ప్రాసిన వాళ్ళలో పుసులూరి సోమరాజుకూడా ఒకడు. ఇతడు బాలగోపాలకృష్ణుని భక్తుడు. అందుచేత ఇతణ్ణి 'బాలకృష్ణదాసు' అనికూడా పిలిచేవారు. ఈయన గుంటూరుజిల్లా పుసులూరు గ్రామవాసి. అయినా దేశాలు పట్టిపోయాడు. నీలాచల మనే పేరు గల పూరీ జగన్నాథం వెళ్ళాడు. చైతన్యుని ప్రభావంలో పరవశించాడు. మధురభక్తిని ప్రకటించే మూడు మనోహరశతకాలు ప్రాశాడు. ఒకటి దూతకావ్యం. 'ఇందూ! నందుని మంద నుండి కద నీవేతెంచుటల్ రాకలన్'అనే మకుటం గలది చంద్రదూతశతకం. దీనినే ఇందుశతకం అనికూడా పిలుస్తారు. విరహిణి అయిన గోపికలాగా 'మందన్ రాధ యెరుంగకుండ వ్రజభూమల్ కానకుండంగ గోవిందున్ మెల్లనె తోడితెమ్మ'ని కవి ఆత్మ ప్రార్థిస్తుంది.

బృందారణ్యము సేమమా యచటి గోబృందముల్ లెస్సలా
నందుండున్ సతియున్ సుఖాన్వితులె నానాగోపగోపాలికా
సందోహంబులలో హలాయుధుడు గృష్ణస్వామి గ్రీడింతురా
ఇందూ! నందుని మందనుండి కద నీ వేతెంచుటల్ రాకలన్.

[ఇందు_1]

అని శతకం ప్రారంభం అవుతుంది. పోనుపోను భక్తి పరవళ్లు తొక్కుతుంది. రసం వెల్లివిరుస్తుంది. తన్మయత్వంలో కవి ప్రేమాలాపన చేస్తాడు. గీత గోవిందం, శ్రీకృష్ణకర్ణామృతం మొదలైన మధురకావ్యాల సారాన్ని ప్రవహింపచేస్తాడు. ఇందునంచేశం ఫలించి దగ్గరకు వచ్చిన నందనందనుణ్ణి చూసి సోమరాజు 'నీ చక్కదనంబు చూడ మనసైనది చూపుము నంద

---

1. శతకకవుల చరిత్ర, పుట 559.

నందనా' అనే మకుటంతో మరో మధురశతకం వ్రాశాడు. ఈయనే బాల గోపాలశతకాన్ని వ్రాశాడు. సంస్కృతభక్తికావ్యాలే కాక ఈయన ద్రావిడ వేదంలోని పాశురాలుకూడా బాగా చదివినవా డని తెలుస్తుంది. తన పద్య శతకం ఎలా ఉందో ఈయన చక్కగా వివరించాడు.[1]

ప్రాచేతసార్పిత రామాయణము భంగి, వ్యాస కల్పిత భాగవతముమాడ్క్, .
ద్రావిడవాఙ్మయోదార వేదముగీతి, నారదమధుర గానంబుసరణి,
లీలాశుకస్తుతిలాలసప్రక్రియ, జయదేవకవి సరస్వతి విధమున,
బమ్మెరపోతన భారతక్రమమున, దాసగీతప్రబంధములపోల్క్.
బాలకృష్ణాంఘ్రిదాసోక్త పద్యశతము_దయనుకనుగొను మాచంద్ర_
బాలగోపాల కరుణాలవాల నీల_శైలావనీపాల చామలీల. [తారకము గ
[D 1622 పద్యం 94.]

ఈ పద్యంలో అతిశయోక్తు లేం లేవు. సోమరాజుగారి కవిత్వంలో ఇందరి భావలాలిత్యం, భక్తిపారవశ్యం ననలెత్తాయి. బాలగోపాలశతకాన్ని ఉపకర్తా మృతమని కవే చెప్పుకొన్నాడు. పుసులూరి సోమరాజుగారి మూడు శతకాలు మూడు రనభాండాలు.

4. సింహాద్రి అంకన్న:-పూరీ జగన్నాథుని భక్తుడైనా పుసులూరి సోమరాజు ఆ దైవంపై ప్రత్యేకంగా శతకం చెప్పలేదుగాని ఎవరో సింహాద్రిగారి అంకన్న "దారూ జగన్నాయకా!' అనే మకుటంతో చక్కని శతకం చెప్పాడు. ఇతని తండ్రిపేరు సింహాద్రి. ఈయన బెహరాగారి సత్కారాలు పొందాడు. 'కవుల్ గాణల్ బుధుల్ జాణలున్ భళిరా యంచు

---

1. ఈ బాలగోపాలశతకం ప్రతులు మూడు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. D 1624 సంఖ్యగలప్రతిలోని లేఖన కాలం 'శార్వరినామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమి శనివారం' అని ఉంది. క్రీ. శ. 1600 నుండి 1900 దాకా వచ్చిన శార్వరినామ సంవత్సరాలలో ఏ ఒక్కటీ ఆశ్వయుజశుద్ధ దశమి శనివారం నాడు రాలేదు. 2_10_1780 దశమి ఆదివారమైంది. ఆయేడు శనివారంనాడు తిథులు లుప్తం.

నుతించు' నూరు పద్యాలు కవి చెప్పాడు. తన విషయం ఇలా చెప్పుకొన్నాడు:

ఘనతల్ మీ శుభనామకీర్తన లపేక్షంబేయు మీభృత్యులన్
అనఘుం డామవనీయు డన్న బెహరార్యస్తోత్రపాత్రుండ స
జ్జనమాన్యుండ!నృసింహసేవకుడ సౌజన్యుండ సింహాద్రినం
దను డంకేంద్ర కవీంద్ర నామకుడ నీ దాయా జగన్నాయకా.

[D. 1563 పద్యం 110]

ఈ పద్యంలో చివర 'సింహాద్రినందనున్ కద్రకవీంద్రనామకుండ' అనే పాఠాంతరం ఉంది. దీనినిబట్టి ఈ కవిపేరు కద్రయ్య అని పరిశోధకులు భావించారు.[1] అంకయ్య అన్నదే సమంజసంగా తోస్తుంది. ఈ అంకయ్య వ్రాసినదో, లేక ఇంకెవరైనా వ్రాశారోగాని మరొక జగన్నాయక శతకం కనబడుతుంది. కర్తపేరు తెలియకపోయినా కమ్మగా ఉంది.

తండ్రీ! నాయెడ నీకు నెన్నరులేదా దైవచూడామణీ
గుండ్రాతిన్ సతిజేయు వార్త విని నీవక్రమొక్కచున్ వేడుచున్
వేండ్రంబైన భవాబ్ధి బాపి దయతోవీక్షించి దైన్యంబుతో
నుండ్రేనీకు భయంబు లే దన వదేమో మా జగన్నాయకా!

[D. 1562]

ఈ రెండు జగన్నాయక శతకాలకన్నా విభిన్నమైనది మరొకటి ఉంది. 'నీతకుధరాధ్యక్ష జగన్నాయకా' అని మకుటం. దాని కర్తపేరుకూడా తెలియదు. అది సంస్కృతసమాసభూయిష్ఠం. అనుప్రాసల పుట్ట. ఇది ఒక పనికిమాలిన క్లిష్టరచనమని బ్రౌనుదొరగారి రిమార్కు (D. 1561)

5. తిరునగరి వెంకటాచార్యులు :-ఈ కాలంలోనే రసవత్తరమైన మరొక శతకకర్త తిరునగరి వెంకటాచార్యులు. ఇతడు అనుమకొండవాసి. ఆఊరి పేరు ఐమిడ్చి 'యతిపతీ హనుమద్గిరిరాజమందిరా' అనే మకుటంతో శతకం వ్రాశారు. ఇది ముద్రితమనీ, రసవత్తరమనీ శేషాద్రీ రమణకవులు వ్రాశారు.[2].

---

1. D. కేటలాగు సంపుటి 7. పుట 1852.
2. గోలకొండ కవుల సంచిక. పుట 411.

ఈ శతకం అచ్చుప్రతి నాకు దొరకలేదుగాని ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి గ్రంథాలయంలో దీని ప్రతి ఒకటి ఉంది. అది బాగా శిథిలమయిపోతున్న తాళపత్రగ్రంథం. (నెం T. 114; H-25-1.) ఇందులో అధునికులకు ఆట్టే నచ్చని చాదస్తం ఎక్కువగాఉన్నా 'తినగతినంగ వేపకును దియ్యదనంబొన గూడినట్లు' నాలుగు పద్యాలు చదివితే కవిత్వం మధురంగా రుచిస్తుంది. ప్రపన్నులను కవి ఇలా ప్రశంసించాడు:

క్షితితల మెల్ల పావనము జేతురు వేదము వేదమార్గమున్
గతి జెడకుండ గాతురు త్రికాలపరిజ్ఞత విష్ణువైష్ణవ
వ్రతసుఖనిష్ఠులై జనుల వర్ధిలజేతురు మీపదాంబుజ
ద్వితయసమాశ్రితుల్ యతిపతీ మానుమద్గిరిరాజమందిరా. [పద్యం 24.]

ఈ శతకం గతిచెడకుండా ఉండడంకూడా అవసరమే.

6. గద్దె రామలింగయ్య:— మన దేశంలో శివలింగాలకు లెక్కలేదు. ప్రతిష్ఠించినవారి పేరిట కొన్ని శివలింగాలు ప్రసిద్ధమవుతాయి. ఉదాహరణకు చోడుడు స్థాపించిన లింగం చోడలింగమని, సీత పూజించిన లింగం సీతలింగ మని పేరుకెక్కాయి. ఈ లింగాలు గోదావరీమండలంలో ఉన్నాయి. భీమవరందగ్గిర ఉన్న బొండాడగ్రామంలో ఉండే గద్దె రామలింగయ్య అనే కవి 'చోడలింగమా' అనే మకుటంతో ఒక శతకం చెప్పాడు. దీనికి ఇతడు పరవాదిగజాంకుశ మనే పేరుపెట్టినట్లు ఇలా చెప్పాడు:

వరుసను విన్నవింతు పరవాదిగజాంకుశమంచు కావ్యమి
దరను ప్రసిద్ధిగాను నిరతంబును ముక్తికి మూలమైన సు
స్థిరముగ వేదశాస్త్రములు చెప్పిన పద్ధతి నాంధ్రభాషనే
వరకృతిగాను సత్కవుల వర్ణన చేసెద చోడలింగమా.
[D_1610 పద్యం 18.]

ఈ శతకకావ్యంలో రామలింగయ్య వీరశైవాన్ని వివరించాడు. ఇతని తండ్రి ఆగమవేత్త నాగయ్య. గురువు సిద్ధరామయ్య. ఈ శతకంలో వీరశైవుడగు జంగమతీర్థప్రసాదభోగి పాల్కురికిఘనుండు సోమగురు గొల్చి, రామలింగయ్య శతకాన్ని రచించాడు.

7. రామలింగయ్యగారి అబ్బాయి :— బహుశా ఈ రామలింగయ్యగారి కుమారుడే బొండాడలో ఉన్న నగరేశ్వరస్వామిపై రెండు శతకాలు చెప్పినట్లు ఉంది. ఒకదాంట్లో 'నగరేశా' (D 1592) అనీ, ఒకదాంట్లో 'నగరేశశివా' అనీ మకుటాలు ఉన్నాయి. రెండూ కోమట్ల దైవమైన నగరేశునిపై చెప్పినవే.

ప్రియభక్త లనుచు వైశ్యులు-ప్రియంబున పూజింప మీరు ప్రత్యక్షంబై
జయమైన వరము లిచ్చితి-నయమున బొండాడ నున్న నగరేశశివా!
[D_1591]

ఈ శతకాల కర్త ఎవరో తెలియదని ప్రాచ్యలిఖితగ్రంథాలయపరిశోధకులు వ్రాసినా 'బంధురరామలింగపుత్రవిరచితము'ని ఉండడంవల్ల చోడలింగ శతకకర్త కుమారుడే నగరేశశతకరచయిత అని వంగూరి సుబ్బారావుగారు భావించారు.[1] ఇతని శతకంలో యతిభంగాలు కనబడతాయి.

8. తాళ్ళపాక శ్రీనివాసుడు :—యతిభంగాలు, వ్యాకరణ దోషాలు, వినంధులూ మొదలైన తప్పుల తడకలతో మరొకడు కూడా శతకం చెప్పాడు. అతడు సుప్రసిద్ధులైన తాళ్లపాకవారి వంశంలోనివాడవడం గమనించదగ్గ విషయం. అన్నమయ్యగారికి ఎన్నోతరంలోని మనుమడోగాని శ్రీనివాసుడనే ఈబలాటపరుడు 'కమలవసుధేశ! సర్వయుగాధిపేశ! విమలశశికోటిసంకాశ! వెంకటేశ'అనే మకుటంతో ఒక శతకం వ్రాశాడు. దీనిప్రతి ఒకటి కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయంలో ఉంది. (సంఖ్య 3998). శతకం చెప్పాలనే కోరిక ఎంతగా ఉందో తెలుపడానికి తప్ప ఇదిమరెందుకూ ఉపయోగపడదు. పులిని చూసి వాతలు వేసుకొన్న కవిత్వం.

9. పులివర్రు రాజయ్య :—గుంటూరుజిల్లాలో పులివర్రు అనే గ్రామం ఉంది. ఆఊళ్లో ఉన్న శివలింగాన్ని నరేంద్రలింగం అంటారు. ఈ స్వామిమీద రాజన్న అనే కవి ఒక శతకం చెప్పాడు. దాని అసమగ్రప్రతి ఒకటి ప్రాచ్యలిఖితగ్రంథాలయంలో ఉంది (D 1593). లోకనీతులుకూడా ఉన్నాయి. బంగారంపైన మంచి పద్యం ఉంది.

---

1. శతకకవుల చరిత్ర. పుట 302.

కులహీనుడైనను గుణహీనుడైనను ఘనుని గావించు నీగాంచనంబు
అరయ నసాధారి కంగనామణిగైన గాంతిబుట్టించు నీగాంచనంబు
ప్రాణంబు గొనవచ్చు పగతురడైనను కరుణ పుట్టించు నీగాంచనంబు
అనుకూలపరులైన అన్నదమ్ములకైన కలత బుట్టించు నీగాంచనంబు
ఇట్టి వస్తువు మరి లేదు యిహమునందు-రాజకవిదాసమానసోల్లాసవాస
వ్యాఘ్రపురనాథదుర్మదవ్యాఘ్రభేద-చంద్రరేఖోత్తమాంగవరేంద్రలింగ

ఈ శతకాన్ని నగేంద్రలింగశతకమని లేఖకుడు వ్రాసుకొన్నాడు. అయితే పుస్తకంలోని దేవుని పేరు నరేంద్రస్వామివారు కనుక శతకంపేరు అదే అయిఉంటుంది. దీని కర్తపేరు ప్రతిపద్యంలోనూ ఉన్నా ఇతని కాలం తెలియదు. నాయకరాజులయుగంలోనివాడు కావచ్చును.

10. ప్రెగ్గడపల్లి పోతయ్య :—గోదావరీతీరాన ఎంతమందో కవులు పుట్టారు. గంటం పట్టారు. అయితే గోదావరిపై కావ్యాలు గాని, శతకాలుగాని చెప్పినవారు చాలా కొద్దిమంది. ప్రెగ్గడపల్లి పోతయ్య అనే కవి మత్తేభశార్దూలవృత్తాలలో గోదావరీశతకాన్ని వ్రాశాడు. అఖండగౌతమిలాంటి శైలి. ఈ శతకం సంపూర్ణంగా లభించలేదని చెప్తూ నిడుదవోలు వెంకట రావుగారు ఒక పద్యాన్ని ఉదాహరించారు:[1]

స్నిగ్ధపుణ్యోదయ మేదినీందువదనా సీమంతవీథీలస
ద్గురుముక్తాఫలనూత్రమో! సురుచిరశ్రోణీపురంధ్రీ యళో
ధరధమ్మిల్లలతాంతమాలికయొ! భూతన్వీకుచశ్రీ మనో
హారసంవ్యానమొ నాగ నీదగు ప్రవాహం బొప్పు గోదావరీ.

ఇంత చక్కని కవిత్వం కాలప్రవాహంలో కలసిపోవడం దురదృష్టమే. ఇటువంటి మనోహరకృతులు ఎన్ని నష్టమైపోయాయో!

---

1. శతకకవులచరిత్ర. అనుబంధం, పుట 738. కవి క్రీ. శ. 1466 వాడని నిడుదవోలువారి నిర్ణయం.

27

తొండగొళ్ళు కదిరీపతి
అయ్యలరాజు నారాయణ



జును చూసిన కళ్లతో మొగుణ్ణి చూస్తే మొట్టబుద్ధి; అయితే మన సాహిత్యంలో ఊరేగే రాజులను చూసి ఒళ్లు మరచిపోయి ఊరన్ని కలలు కన్న పౌరకాంతలు కోకొల్లలు. వీళ్లు రాజును చూస్తే ఫరలేవాదుగాని వీళ్లలో ఏ ఒక్కరిని రాజు చూసి మక్కువపడినా ఇబ్బందికి తక్కువ ఉండదు. 'రాజుకు కంటిలో విషం; పాముకు పంటిలోవిషం'అన్నారు. మగనాలిపై మరులు కొన్న కామకుడు చెడతాడని రామాయణం మొదలుకొని ఎన్నో కావ్యాలు ఎలుగెత్తి ఘోషిస్తాయి. 'రంకాడితే చెడిపోతా' వని హెచ్చరించే నీతులు వినే చెవులతోనే రంకాడి సుఖపడ్డవాళ్ల సాహసకథలను వినాలని జనం ఉవ్విళ్లూరడం కథాసరిత్సాగరం దగ్గరనుంచీ కనబడుతూనే ఉంది.

సంస్కృతంలో రంకుకథలు కోకొల్లలు. బాలురకు హితోపదేశం చేసే పంచతంత్రంలోనే బూతుకథలు ఉన్నాయి. నేడు మన కథలు కంచికి పోయినా ఆదిలో చాలా సంస్కృతకథలు అరేబియాకు పోయి వేయిన్నొక్క రాత్రులలో కలిసిపోయేవి. నీతికథలలాగే బూతుకథలు కూడా సార్వజనికం కనుక ఒక దేశంలోని కథ మరొక దేశంలోని కథలాగా రూపాంతరం చెంద గలదు. అరేబియన్ నైట్స్‌లోని కథలలాగే తదితరదేశాల సాహితీపరులు కథలను సృష్టించుకొన్నారు. పది నీతులూ, పది బూతులూ కలిపిన కావ్యాలు జనించాయి. తెలుగులో మంచన చెప్పిన కేయూరబాహుచరిత్ర, జక్కన వ్రాసిన విక్రమార్క చరిత్ర, అనంతామాత్యుడు కల్పించిన భోజరాజీయం, కొరవి గోపరాజు రచించిన సింహాసనద్వాత్రింశిక మొదలైనవి చాలా నీతి కథలతో కొన్ని బూతుకథలు కథనం చేశాయి.

'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పేరుపడిన మన తెలుగులో మంచన తొలిసారిగా నీతికథలను కథనం చేసిన కాలానికి దగ్గిరగా ఇటాలియన్‌భాషలో జియోవాని బొకాచియో అనే రచయిత నూరు శృంగారగాథల సంకలనాన్ని వ్రాశాడు. దాని పేరు 'డికె మెరాన్'. ఇటలీలో ఒకసారి అంటువ్యాధి వచ్చింది. ముగ్గురు యువకులు, ఏడుగురు యువతులు ఊరు వదలి కొండలకు వలస వెళ్లారు. అక్కడ కాలం గడుపుతూ పదిరోజులు చెప్పుకొన్నట్లు ఈ రంకుకథలను బొకాచియో క్రీ. శ. 1350 ప్రాంతాలలో కల్పించాడు. ఇంచుమించు ఈ కాలంలోనే ఇంగ్లాండులోకూడా జాఫ్రీ ఛానర్ అనే కవి కాంటర్‌బరీగాథ లనే గ్రంథంలో శృంగార కథలను వ్రాశాడు. ఇరవై తొమ్మండుగురు యాత్రీకులు తీర్థయాత్రలు చేస్తూ పుణ్యాస్థలానికి వెళ్లేటప్పుడు తలో రెండూ, వచ్చేటప్పుడు తలో రెండూ కథలు చెప్పుకోవాలని అనుకొన్నారు. కాంటర్‌బరీ మజిలీలలో నూటయిరవై కథలు ఉంటాయని ఛానర్ చెప్పినా అందులో ఇరవైమాత్రమే సంపూర్ణమైనవి. రెండు అసంపూర్ణంగా, రెండు అసమగ్రంగా ఛాసర్ వదలివేశాడు. ఇటలీలోనూ, ఇంగ్లండులోనూ క్రీ. శ. 1350 ప్రాంతాలలోనే ఇలాంటి కథలు పుట్టినా ఫ్రాన్సులో 'నవారె' రాణి మార్గరెట్ వ్రాసిన 'హెప్టామెరన్' క్రీ. శ. 1530 ప్రాంతాలలోగాని రాలేదు. హెప్టా మెరన్ అంటే 'ద్వాసప్తతి' కథ లన్నమాట.

విదేశసాహిత్యాలలో ప్రభవించినట్టే మన తెలుగు సాహిత్యంలోకూడా కేవలం కాముకుల కథలు చెప్పే కావ్యాలు పుట్టకపోలేదు. శృంగారం మదన

శివాలు తొక్కి, నాయిక పరకీయ అయితేగాని రక్తికట్టదని పదకర్తలు భావించే నాయకరాజుల కాలంలోనే రెండు 'రంకు' పురాణ కావ్యాలు జనించాయి. ఒకటి 'శుకనప్తతి'; రెండోది 'హంసవింశతి'. రెండింటిలోనూ ఒకలాంటి కథానిర్మాణమే ఉంది. రెండింటిలోనూ అనగనగా ఒక మగనాలిని పట్టపు రాజు కామిస్తాడు. కబురు పెడతాడు. రెండింటిలోనూ ఆ యిల్లాలి భర్త వ్యాపారంకోసం దేశాంతరం వెళతాడు. రెండింటిలోనూ నాయిక రాత్రి ముస్తాబు చేసుకొని రాజుని కలుసుకోడానికి వెళ్లబోతే ఇంట్లో ఉన్న పెంపుడు పక్షులు ఆపి ఆకర్షణీయంగా కథలు చెప్తాయి. శుకసప్తతిలో చిలకా, హంసవింశతిలో హంసా ఉన్నాయి. రెండు కావ్యాలలోనూ నాయికలు అడుగు జారడానికి అవకాశం లేనంత ఆసక్తితో కథలకు చెవులూ, ఇంటికి కాళ్లూ అప్పచెప్పేస్తారు. రెండింటిలోనూ పిట్టలు ప్రతికథలోనూ ఒక మడతపేచీ వేస్తాయి. దీనికి జవాబు చెప్పకల్గితే రాజుదగ్గిరకి వెళ్లమని నవాలు చేస్తాయి. రెండింటిలోనూ నాయికలు చెప్పలేక పిట్టనే చెప్పమంటారు. ప్రతిరాత్రీ ఇలాగే గడిచిపోతుంది. రెండింటిలోనూ నాయికలు ఇలాగ తెలియని ఖాయిదాలో ఉంటారు. రెండింటిలోనూ భర్తలు ఇంటికి రాగానే కథానాయికలోని కామం కంచికి వెడుతుంది.

ఈ రసవత్తరమైన కావ్యాలలో శుకసప్తతిని తాడిగోళ్ల కదిరీపతీ, హంసవింశతిని అయ్యలరాజు నారాయణా రచించారు. ఈ ఇద్దరూ నాయకరాజుల యుగంలోనివాళ్లే. కదిరీపతి కొద్దిగా పూర్వుడు. నారాయణ ఒకతరం అర్వాచీనుడు. కదిరీపతి కోలారుప్రాంతాలవాడు. నారాయణ నెల్లూరు పరిసరాలవాడు. కదిరీపతి ఆంధ్రా బొకాచియో అయితే నారాయణ తెలుగు ఛాసరు. బొకాచియో రాసిన డికెమెరాన్‌లోని కథలనే ఛాసరు యథాతథంగా అనుసరించాడని ప్రతీతి. కదిరీపతి కావ్యంలోని వర్ణనలు, సామెతలు, పంక్తులు, భావాలు యథాతథంగా నారాయణకూడా అనుసరించాడు. విశ్వసాహిత్యంలోని ఆ యిద్దరు కవులకూ, ఈ ఇద్దరు తెలుగుకవులకూ పోలిక నరిగ్గా నప్పుతుంది.

వాస్తవానికి డికెమెరాన్, కాంటర్‌బరీ మజిలీకథలతో శుకనప్తతికీ, హంసవింశతికీ ఇంకా చూలా పోలిక లున్నాయి. ఇటలీదేశపు సాహిత్యంలో కూడా పురాణగాథలను, ఆద్యసత్కథలను రచయితలు స్వీకరించే రోజు

లుండేవి. పాత ఇతివృత్తాలు విడిచిపెట్టి సమకాలిక జీవితంలోని వ్యక్తులను, వాళ్ల స్వభావాలను తీసుకొని తాను జీవించే సంఘానికి దర్పణంగా డికె మెరాన్ కావ్యాన్ని బొకాచియో నిర్మించాడు. అదొక ప్రపంచం. దాని నిండా సజీవపాత్రలే ఉంటాయి. బొకాచియోలాగే ఛాసరుకూడా సమకాలిక జీవి తాన్ని కాంటర్‌బరీ మజిలీలలో చిత్రించాడు. అతడు చేసిన వ్యక్తుల వర్ణనలు హృద్యంగా ఉంటాయి. సంఘంలో కనిపించే అన్నిరకాల వ్యక్తులూ, అన్ని వృత్తుల మనుష్యులూ అందులో ఉంటారు. ఈ విశ్వకవుల కావ్యాలలోలాగే మన తెలుగుకవుల కావ్యాలలోకూడా సంఘహృదయం సజీవంగా స్పందిస్తుంది. తెలుగుతనంతో, తెలుగువాళ్లతో ప్రతికథా గుబాళిస్తుంది. అష్టాదశ వర్ణాలవాళ్లూ తమ భార్యలతో, బంధువులతో, వేషభాషలతో, లోటుపాట్లతో, మాటతో, మంచితనంతో, మానవత్వంతో మన కళ్ల ఎదుట సాక్షాత్కరిస్తారు.

ఈ పోలికలు ఇంతటితో ఆగలేదు. డికెమెరాన్‌లో కథకులు వినుగెత్తిస్తారుగాని కథలు వినుగెత్తించవు; కాంటర్‌బరీమజిలీలలో కథలు వినుగెత్తిస్తాయిగాని కథకులు వినుగెత్తించరు అని విమర్శకులు చెప్తారు.[1] శుకసప్తతిలో కథలుగాని, కథకులుగాని వినుగెత్తించరుగాని హంసవింశతిలో కథలు హృద్యంగా ఉన్నా కథకుడు 'బోరు' కొట్టిస్తాడు. అయితే ఛానరు వ్రాసిన వర్ణనలలాగా నారాయణ చేసిన వర్ణనలు, చెప్పిన వివరాలు, ఇచ్చిన భోగట్టాలు చరిత్రకారులకు పనికివస్తాయి. కదిరీపతి సందర్భోచితంగా చెప్పిన సాంఘికవిషయాలను నారాయణ, సందు దొరికితే చాలు, సాంతం గుప్పించేస్తాడు. బొకాచియోని అనుసరించినా ఛానరూ, కదిరీపతిని కాపీ కొట్టినా నారాయణా నిలబడగలిగారంటే వాళ్లకు చిత్తశుద్ధీ, సిద్ధహస్తం ఉండడంవల్లనే. అయ్యలరాజు నారాయణ 'సుమధుమధురసుధావచస్స్ఫూర్తి' కోసం, 'సర్వశబ్దార్థవిజ్ఞానసరణి' కోసం ప్రయత్నించినవాడు. కదిరీపతి నైషుంటిక పదానునయరూఢి కన్నా ముందు కావ్యనైపుణికే పెద్దపీట వేస్తాడు. పాలకడలిలోంచి చిలికి తీసిన అమృతంలాగ కావ్యరసాన్ని పాఠకులకి సునాయాసంగా అందిస్తాడు.

కదిరీపతి తన వంశం పాలవెల్లిలాంటిదని భావించాడు. తాడిగోళ్ళవారి వంశంపేరు ఆదిలో పాలవేకరివాళ్లు. నేటి మైసూరులోని కోలారుమండలం

---

1. Encyclopaedia Britannica, Vol. 3. P. 769 a.

శ్రీనివాసపురం తాలూకాలో పూర్వం పాలవేకరివారు ఉండేవారు. విజయనగర సామ్రాజ్యాన్ని అళియరామరాయలు నిర్వహించే రోజులలో, అంటే క్రీ. శ. 1542-1565 మధ్య ఓబళనాయకుడనే ధీరుడు రాయరాణువలోఉండేవాడు. అళియరామరాయలు చేసిన యుద్ధాలకు ఓబళనాయకుడు కర్తగా పేరెన్నిక పొందాడు. గుర్రాలు, ఏనుగులు, రత్నాలు మొదలైనవి బహుమతులుగా పొందాడు. తాడిగోళ్ల గ్రామానికి అధికారంకూడా పొందిఉంటాడు. ఈ పెన ఓబళనాయకునిలాగా అతని మునిమనుమడు కరెమాణిక్యనాయకుడు మళ్లీ రాయసత్కారాలు పొందాడు. క్రీ. శ. 1618 నుండి 1630దాకా కర్ణాటకాన్ని పాలించిన రామదేవరాయల సరిగద్దెమీద ఈ కరెమాణిక్యనాయకుడు కూర్చొన కలిగాడు.

కరియమాణిక్యనాయకునికి నలుగురు కొడుకులు. రెండో కొడుకు రామప్పనాయకుడు తన తండ్రికి పుణ్యంగా యిచ్చిన దానశాసనాలు క్రీ.శ.1637 నుంచి కనబడతాయి.[1] ఈ రామప్పగారి కొడుకు రఘుపతినాయడు క్రీ.శ.1648 లోనే మహానాయకాచార్యుడై దానాలుఇచ్చినట్టు శాసనాలు కనబడుతున్నాయి.[2] కరియమాణిక్యనాయకుని కడగొట్టుకొడుకుపేరు కదురరాజు. ఇతని భార్య పేరు కదురమ్మ. వీళ్లకి కదిరీపతి జన్మించాడు. కరియ మాణిక్యంగారి రెండో కొడుకు కన్న కొడుకు క్రీ. శ. 1648 నాటికే ప్రాజ్ఞుడై దానధర్మాలు చేస్తే కడగొట్టుకొడుకు నోచుకున్న కొడుకు, కదిరీపతి, ఆనాటికి కావ్యనిర్మాణం చేసిఉండడా?

వాస్తవానికి క్రీ. శ. 1648 ప్రాంతాలకే కదిరీపతికి కావ్యనైపుణ్యమే కాక శబ్దగౌరవ ప్రాగల్భ్యం, అర్థావనాసక్తి, లక్ష్యలక్షణగుణశ్లాఘ్యతాపటిమ

---

1. కదిరీపతి-శుకసప్తతి: నేలటూరి వెంకటరమణయ్యగారి వ్యాసం, భారతి, నవంబరు, 1945.

2. Mysore Arch. Rep. 1924 No. 88 అని నేలటూరివారు పైవ్యాసంలో చెప్పారు. కోలారుజిల్లాలో ఈ నాయకుల శాసనాలు చాలా కనబడుతున్నాయి. వాటిలో తమ యింటిపేరు తాడిగోళ్ల అని చాలాసార్లు చెప్పుకొన్నారు. కదిరీపతికూడా గద్యాలోనూ, ఒక పద్యం లోనూ తాము పాలవేకరివాళ్లమని చెప్పినా అవతారికలో డబ్బను పైచిలుకు పద్యాలలో తమ ఇంటిపేరును 'తాడిగోళ్ల' అనే వాడాడు.

పట్టుబడ్డాయి. సకలప్రబంధాలలోని సువాక్కుల ప్రౌఢిమ తెలుసుకున్నాడు. హాళిపుట్టించు కవిత్వ ముగ్గడించగలడు. రక్తికల్పించు గీతాలు తెలుసు. ఇంపొనర్చే ప్రసంగవార్తలు ఘటించగలడు. అద్భుతం బొసంగే కావ్యవైభవం చెప్పకలడు. తనచుట్టూ ఉన్న తెలుగునంఘాన్నే కాక విచిత్రవేషభాషాభిరాము లగు పరంగులతోడి నెయ్యం ఆతనికి తెలుసు కాబోలు (శుక 1-196). ఇంగి లీసుల ముఖాముల నతడు చూశాడు (1-175). 'తలారికి బులావు ధగిడీకే' అని గద్దించే తురకభటుణ్ణి, వాడు క్రొత్తగా తలమీద పెట్టుకొన్న తెలిపరంగి ముడాసునిసైతం కదిరీపతి గమనించాడు. అతని కన్ను చూడని వింత, కలం తొక్కని పుంతా లేవు. అడుగడుగు అబ్బురాలు కదిరీపతి వ్రాసిన ముప్పయి కథలలోనూ కనబడతాయి.

"ముప్పదికథలలోనే యిన్ని చమక్కులున్నవియే. డెబ్బదిలో నెన్ని యున్నవో? అవి మనకు లభింపలేదయ్యో గదా యని విచారింపవలసివచ్చి నది" అని పరిశోధకులు బాధపడతారు.[1] శుకసప్తతి అన్నది కావ్యనామం. నప్తతి అంటే డెబ్బయి. కాబట్టి ఇందులో డెబ్బయికథలు ఉండితీరాలని అందరూ భావిస్తారు. దానిలో ముప్పయికథలే ఉన్నాయికనుక దీనికి 'శుక త్రింశతి' అనే పేరు పెట్టాలని పండితులు భావించినట్టు బ్రౌనుదొరగారు తాము సేకరించి పరిష్కరింపచేసిన శుకసప్తతిప్రతిలో వ్రాశారు.[2] అయితే ఆదిలో జూలూరు అప్పయ్యపంతులుగారి దగ్గిరనుంచి నేటి నిడుదవోలు వెంకట రావుగారిదాకా అందరూ కథల సంఖ్య డెబ్బయి అని పొరబడ్డారు. వాస్తవా నికి శుకసప్తతి అంటే 'చిలుక చెప్పిన డెబ్బయి కథ'లని భావించడంకన్నా 'చిలుక డెబ్బయిరాత్రులు చెప్పిన కథలే' అని నిర్ణయించడం మంచిది. ఇది 'డెబ్బయిరాత్రుల కథ'లని సురవరం ప్రతాపరెడ్డిగారు సరిగ్గా ఊహించారు.[3] అయితే ఈ ఊహని బలపరిచే సాక్ష్యాన్ని వారు గ్రంథంలో చూపలేదు. శుక నప్తతికావ్యం యించుమించు పూర్తిగా లభించిందేగాని అంతా వెలుగు చూడ

---

1. శుకసప్తతి ద్వితీయముద్రణ పీఠికలో కొత్తపల్లి సూర్యారావు గారు. (వావిళ్ల ప్రచురణ)

2. ఓ. కై. D. 837.

3. శుకసప్తతి (వావిళ్లప్రచురణ) మూడవముద్రణ ఉపోద్ఘాతం, పుట XI.

లేదు. అచ్చుపడ్డకావ్యంలోని ఆఖరుపద్యాలు పరిశోధకుల దృష్టిలో పడలేదు కాబోలు. చిట్టచివర కథానాయికతో చిలుక 'నీవిభుండు మమతం మరి డెబ్బదినాళ్లనాటి కిలు జేరుదునని వాక్రుచ్చి చను టెరుంగవె మగువా?' అని అడుగుతుంది (4-326). అంతతో ఊరుకోక ఇలాగ హితోపదేశం చేస్తుంది:

నే డత డిల్లు జేరు రమణీ! వెస డెబ్బదినాళ్లు సెల్లె నీ
పోడిమి నీ వెదురొక్కని విభుం గని మ్రొక్కి రహస్యలీల నీ
వేడుక లుప్పతిల్ల తను విందొనరించి ప్రియంబునన్ రతి
క్రీడల దేలవమ్మ సుచరిత్రలు ని న్ననయంబు మెచ్చగన్. [శుక. 4_328]

ఈకావ్యంలోని నాయికను సుచరిత్రలు అనయం మెచ్చారో లేదోగాని ఈ కావ్యనిర్మాణనైపుణ్యాన్ని అయ్యలరాజు నారాయణ మెచ్చుకొని ఈ ఫక్కి లోనే మక్కికి మక్కి అనుకరణచేశాడు. అయినా "ప్రతిభావంతుడు కనుక అనుకరణానికికూడా స్వతంత్ర హొరాదాను తీసుకురాగలిగినాడు" అని సహృదయులు భావించడంలో తప్పు లేదు.[1] తరతరాలుగా తమ వంశంలో ఉన్న సత్కవితారచనాధ్యులవారసత్వాన్ని నారాయణ తన కావ్యంలో కనబర్చాడు. వాళ్ళ నిలా ఆదిలో స్తుతించాడు:

అయ్యలరాజు దిప్పసచివాగ్రణి బర్వతరాజు రామభ
ద్రయ్యను భాస్కరాగ్రణి బ్రధానవరుండగు కొండధీరునిం
జయ్యన దిమ్మయప్రభుని సత్కవితారచనాధ్యులైన మా
యయ్యలరాజవంశజుల నాదికవీంద్రుల సన్నుతించెదన్. [హంస 1_12]

ఈపద్యంలో ఆరడజనుమందిని సత్కవితారచనాధ్యులుగా నారాయణ పేర్కొన్నా వీరిలో కొందరిగురించే మన సాహిత్యచరిత్రలు చెప్పగలుగుతున్నాయి. ఇప్పటిదాకా కాలనిర్ణయాలు నికరంగా చేసిన ఆయ్యలరాజు కవుల పేర్లు, వారి గ్రంథాలను చూడండి.

వరస	కవి	గ్రంథం	యుగం
1.	తిప్పయ్య	ఒంటిమిట్ట రఘువీరశతకం	గజపతులయుగం
2.	రామభద్రుడు	రామాభ్యుదయం	నవాబులయుగం
3.	అయ్యల భాస్కరకవులు	రొట్టమతం	ఆరవీటిరాజులయుగం

1. హంసవింశతి. (బందరు శృంగారకావ్య గ్రంథమండలి ప్రచురణ) తొలిపలుకులలో మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు. పుట 17.

ఒంటిమిట్టరఘువీరశతకాన్ని చెప్పిన అయ్యలరాజు తిప్పయ్యగారికి పర్వతన్న అనే తమ్ముడు ఉన్నాడు. ఈయనకూడా కవే అని నారాయణ ప్రస్తుతించాడు. ఈ పర్వతన్నగారి మనవడి మునిమనుమడే నారాయణ. అంటే పర్వతన్నగారికి అయిదోతరంలో నారాయణ ఉన్నాడు. తరానికి ముప్పయిసంవత్సరాలు లెక్కకడితే 150సంవత్సరాల తేడా ఉంది. అయ్యల రాజు తిప్పయ్య క్రీ. శ. 1500 వందలకి కొంచెం కుడియెడంగా ఉన్నాడు కనుక అతని తమ్ముడుకూడా క్రీ. శ. 1500లో ఉండవచ్చు. దీనికి 150 కలిపితే నారాయణకాలం క్రీ. శ. 1650 అవుతుంది. కొందరు పరిశోధకులు అయ్యలరాజు నారాయణ క్రీ. శ. 1660 ప్రాంతాలవాడని భావిస్తున్నారు.[1] దీనికి ఆధారం నారాయణ తన తండ్రిగురించి చెప్పిన ఒక పద్యమే. చూడండి:

కౌండిన్యసద్గోత్రకల్పకంబగు పర్వతన్నవెగ్గడెవ్వాని తాతతాత
కవిచకోరనిశాక(?)రయశస్ఫురదయ్యలామాత్యుడెవ్వాని యబ్బకబ్బ
ఖకవితాక్షుద్రక్షుద్రాలసముడు భాస్కరమంత్రి యెవ్వాని కన్నతండ్రి
హంసవింశతిప్రబంధాకల్పనారాయణాఖ్యుడౌనేనేమహాత్ముసుతుడ
నట్టియయ్యలరాజాన్వయాంబుధిశీ
భగణహ్యనాన్నిధుగొండ మాంబాసనాధు
నిఖిలకవిబంతరాళనిర్ద్విద్రకీర్తి
మజ్జనకు శూరపామాత్యుమాన్యుదలతు.

ఇది 'దశావతారకథాసంగ్రహము' అనే కావ్యం అవతారికలోని పద్యం. హంసవింశతి ప్రకాశక ఈ కావ్యాన్ని నారాయణ రచించాడు. ఇది మూడాశ్వాసాల గ్రంథం. ఇతని సమకాలికుడే కాక సమీపగ్రామాలలో ఉండే ధరణీదేవుల రామయ్య దశావతారచరిత్రను సుదీర్ఘంగా ప్రాస్తే నారాయణ అదే కథను కుదించాడుకాబోలు. రెండింటినీ తైపారువెయ్యాలి.

ధరణీదేవుల రామయ్య నెల్లూరుమండలంవాడు. ప్రళయకావేరిపట్నంలోని మగదలవారి ఆశ్రితుడు. అయ్యలరాజు నారాయణకూడా నెల్లూరు మండలంవాడే. కొచ్చెర్లకోటతాలూకాలోని గోరుగుంతలగ్రామంలో ఉండేవాడు. ఆ గ్రామంలో ఆంజనేయస్వామిగుడి ఉండేది కాబోలు. ఆ దేవునిపై, బహుశా బాల్యంలో, నారాయణ ఒక శతకం చెప్పాడు. అయితే తన స్వగ్రామంపేరు

1. శతకకవుల చరిత్ర. వంగూరు సుబ్బారావుగారు. పుట 278.

హుందాగా లేదని దానిని సంస్కృతీకరించాడు. గోరు అంటే నఖం. గుంట అంటే గర్త. పాడు అంటే పురం. అందుచేత గోరుగుంతలపాడుని నఖగర్త పురం అన్నాడు. చెప్పేది కందపద్యశతకం కనుక 'నఖగర్తపురాంజనేయ నతజనగేయా' అని మకుటం పెట్టాడు. ఈ శతకంలో ఆంజనేయుణ్ణి ఏగేయ మానమైన భావాలతోనారాయణ కీర్తించాడో తెలియదు. ఈ శతకందొరకలేదు. ఈ ఆంజనేయభక్తి నారాయణకు పుష్పగిరి తిమ్మన్నగారివల్ల వచ్చిందేమో!

పుష్పగిరి తిమ్మన్నగారు కంకంటిపాపరాజు లాంటివారికి కవిత్వరచనలో సహాయం చేశారు. ధరణిదేవుల రామయ్యకుకూడా ఆయన సాయపడినట్లు ప్రతీతి. రామయ్య వ్రాసిన దశావతారచరిత్రకు ఇతరుల సహాయం కావలసి వచ్చిందిగాని తనకు అక్కరలేదని ఎత్తిపొడవడానికి కాబోలు అయ్యలరాజు నారాయణ గద్యలో తాను 'నిస్సహాయకవిత్వనిర్మాణచాతుర్యనిస్తంద్రు'ణ్ణి అని చెప్పుకొన్నాడు. అయితే ఇతరుల గ్రంథాన్ని ఆధారం చేసుకొని అనుకరిస్తూ తన ప్రతిభను చూపించేవాడు ఇలాగ చాటుకొనడం బాగుండదు.

నారాయణ వ్రాసిన హంసవింశతినీ, కదిరీపతి వ్రాసిన శుకసప్తతినీ పక్కపక్కన పెట్టుకొని చదువుతే నూటికి పైగా అనుకరణలు కనబడతాయి. అభ్యుదయపరంపరాభివృద్ధిగా కథను ప్రారంభించి ఆ కథ జరిగే ఊరిని పాలించే రాజు 'చంద్రమతీనాథు చందాన, నలుని వైఖరిని' వగైరావగైరా షట్చక్రవర్తులు షోడశమహారాజులు వెరసి ఇరవై ఇద్దరు ప్రాచీనుల తీరున పాలించుచున్నాడని కదిరీపతి చెప్పాడు (1-93). నారాయణకూడా డిటో డిటోగా తన కథలోని రాజును 'వెరయ హరిశ్చంద్రు విధంబున, నలుని వీకను' వగైరా పద్ధతిలో పాలించమన్నాడు (1-42). శుకసప్తతిలోని నాయికను రంకాడమని ప్రోత్సహించిన కుంటెనకత్తె ఇలా ఎత్తిపొడిచింది:

మగని ప్రక్కనె యుండి తగ జేరి జోకొట్టి మోసపుచ్చని దేటి ముద్దరాలు
పసులగోడలనైన వసుధ నిచ్చెన లేక యొక్కనేరని దేటి యొమ్మెలాడి
తలవరుల్ గనుగొన్న దప్పు నొప్పు ఘటించి బొంకనేరనిదేటి పువ్వుబోణి
దొరలు గద్దింప గల్లరివార్త నిజముగా నిర్వహింపని దేటి నీటుకత్తె
యత్తమామల గృహకర్తలగుచు మెలగు-నట్టిధూర్తులనెల్ల నోరదిమి గదిమి
పాంచియుపనాథుతోడగ్రీడించిమించి-చక్కటికిదిద్దుకొనని దేసరసురాలు
[శుక. 1-139]

ఈపద్యాన్నే చదివి బట్టీపెట్టి హంసవింశతిలోని హేల తన మాటలో ఇలా కొద్దిమార్పులు చేసి చెప్పింది:

కోటగోడలైన మాటుగా నెగబ్రాకి దాటనేరని దేటి తలిరుబోడి?
ఘుమఘుమార్భాటితోడ ఘూషించునదులైన నీదిపోవని దేటి యెమ్మెలాడి?
తనమీది తప్పు నొక్కనిమీది నిజముగా బెట్టజాలని దెట్టి బిసరుహాక్షి?
ధవుడైన దన జాడ తగదని పట్టిన నిర్వహింపని దేటి నీటుకత్తె?
తలవరులుగన్న చో లేని తాత్మిబూని_బొంకు తథ్యంబు తథ్యంబుబొంకగాగ
నెంచియుపనాధుతోడగ్రీడించిమించి-చక్కటికిదేని దదియేటిసరసురాలు?

[హంస. 1_102]

రెండు కావ్యాలలోని కథాకథనభాగంలో వందలాది పద్యాలను కాక ఈ రెండు పద్యాలను చూస్తేనేచాలు నారాయణ చేసినది పచ్చి చౌర్యం అని ఎవరేనా అనగలరు. కాని నారాయణ శుకసప్తతిలో లేని నివరాలను ఎన్నో స్వంతంగా చేర్చి హంసవింశతిని ఒక నిఘంటువుగా రూపొందించాడు. విజ్ఞాన సర్వస్వంలాగా రచించాడు. అటపాటల పేర్లు, చెట్లు చేమల పేర్లు, నదుల పేర్లు, ధాన్యాల పేర్లు అష్టాదశవర్ణాలవాళ్ళ వేషధారణరీతులు, వశీకరణ మంత్రాలు తంత్రాలు, మచ్చుమందులు, వివిధశాస్త్రాలు, శస్త్రాలు—ఒకటేమిటి? తనకు తెలిసిన వన్నీ గుదిగుచ్చాడు. తాను చేసిన కృషిని అడుగడుగునా చూపిస్తాడు.

కదిరీపతిమాత్రం, తాను చేసిన కృషినేకాక చూసిన సమాజాన్నీ, సత్యాన్నీ కూడా మనకు అడుగడుగునా ప్రదర్శిస్తాడు. ఇద్దరికీ కొరవి గోపరాజే వరవడి. సింహాసనద్వాత్రింశికలో గోపరాజు ఒకవంక తన పరిశీలనా దృష్టినీ, మనస్తత్వచిత్రణాకౌశల్యాన్ని చూపిస్తూ తన కావ్యాన్ని ఒక విజ్ఞాన సర్వస్వం చేయదలిచాడు. 'సర్వజ్ఞుడు కానివాడు సత్కవి యగునే' అని చెప్పాడు. గోపరాజులోని నిశితపరిశీలనాశక్తిని కదిరీపతి అలవరచుకొన్నాడు. నిఘంటునిర్మాణశక్తిని నారాయణచేత పట్టుకొన్నాడు. తాము వ్రాస్తున్న కథలలో కేవలం జారత్వమే కాక లోకోపకారమైన విషయాలు ఉండాలని ఇద్దరికీ మనస్సులో తహతహ లేకపోలేదు. అయితే ఉపదేశాన్ని "జాతివార్తలు దొలక రసంబు గులుక కవిత రచించి" కథలు కల్పించి చెప్పాలని కదిరీపతికీ తెలుసు, నారాయణకూ తెలుసు. వాళ్లు తమ కాలంలోని రకరకాల

మానవుల స్వభావాలను తెలుసుకొన్నారు. ముఖ్యంగా కులస్త్రీలలో అణచి పెట్టిన సెక్సువాంఛలను తెలిసినవాళ్లు. మగనాలికి ఎందుకు పరపురుష వ్యామోహం కలుగుతుందో నారాయణ ఇలా వ్రాశాడు:

కోరగరాదు నవ్వి గిలిగింతలు పెట్టగరాదు చెక్కిలం
జీరగరాదు గుబ్బలు ఖచిక్కున గ్రుమ్మగరాదు కేళిలో
మీరగరాదు పెకొని రమింపగ రాదు గళారవంబులిం
పారగ సల్పరాదు మదిరాక్షులు భర్తల గూడు వేళలన్. [హంస. 1_94]

ప్రకృతిలో పశుపక్షులకు సహితం సెక్సుఅడ్డంకులులేవు. మనుష్యుల కెందుకు? అనే చింతన కొందరిలోఉందని కదిరీపతి ఇలా చెప్పాడు:

నోరెరుంగని యట్టి జంతువులు సైతమంబుజానన యిచ్ఛావిహారమందు
బ్రతుక నేర్చినతనువొక్కపతికొసంగి-బంగరమువంటిమనసు గెంటంగ నేల?
[శుక. 1_531]

జంతువులకు లేనివి, మానవులకు తప్పనివీ వావివరసలు. అయితే కామం ప్రకోపించినప్పుడు, వాంఛ చెలరేగినప్పుడు పట్టలేనివాళ్లు వావివరుసలు పట్టించుకోలేరు.

చక్కని వనితాపురుషుల_కెక్కడి వావులు మనోజు డెక్కడ నున్నా
డక్కడ దగవులు నడచునె_యొక్కలితన మేల మేలములు వల దింకన్.
[శుక. 2_532]

ఇవి రంకుపురాణా లనిపించుకొనే ఇలాంటి గ్రంథాలలోనేకాదు, పంచ కావ్యాలలో చేరిన మనుచరిత్రవంటి ప్రబంధాలలో నాయికలుకూడా తలచే తలపులే. ప్రవరాఖ్యుణ్ణి వశపరచుకొంచుకు వరూధిని ఇలా అన్నది:

వెలివెట్టిగే బాడబులు పరాశరు పట్టి దాశకన్యాకేళి తప్పుజేసి?
కులములో వన్నె తక్కువయయ్యెనే గాధిపట్టికి మేనక చుట్టరికమున?
ననుపుకాడై వేల్పు నాగవాసముగూడి మహిమ గోల్పడియెనే మాందకర్ణి?
స్వారాజ్య మేలంగ నీరైరె సుర లహల్యాజారుడైన జంభాసురారి?
వారికంటెను నీమహత్వంబు ఘనమె_పవనపర్ణాంబుభక్షులైనవసియింపు
కచ్చడాల్ కట్టుకొనుమునిమ్రుచ్చులెల్ల-దామరసనేత్రలిండ్ల బందాలుగారె?
[మను. 2_73]

వరూధిని మొదలుపెట్టిన ఈ వాదనను ప్రబంధనాయికలు రకరకాల సానపట్టి పదనుతేర్చి వలచినవాళ్ళపై వదిలారు.

ఆ అడ్డసవాళ్ళకు నిజంగా శుకసప్తతిలోనూ, హంసవింశతిలోనూ అడవాళ్లు చెప్పగలిగే జవాబు దొరుకుతుంది. కామోద్రేకులు అలాఅంటే నిమంగా బ్రతికే అడవాళ్లిలా సమాధాన మిస్తారు:

దశకంఠుని మోహదశ విచారించెనే సకలజగన్మాత జనకజాత
నహుషభూపాలు మన్నన కొప్పుకొనియెనే స్త్రీరత్నమైన శచీపురంధ్రి
యలసింహబలుని మాయలజిక్కి చొక్కెనే విపులసద్గుణమాన్యద్రుపదకన్య
శబరాధిపుని దురాశలకు లోనయ్యెనే రతినిభాకృతి భీమరాజపుత్రి
తొల్లిటి మహాపతివ్రతల్ దుర్మదాంధ-కాపురుషులంగభవశరాఘాతవికల
చిత్తులై తమ్ము జేరి యాచించినపుడు-సిగ్గవోనాడుకొనిరటే చిగురుబోడి!

[శుక. 1-155]

సిగ్గుపోనాడని పతివ్రతల కథలు చెప్పి 'ఇలాగే నడచుకొంది' అంటే ఎవరికీ అది రుచించదు. కుంచం నిలువునా కొలవడానికి వీల్లేకపోతే అడ్డంగా కొలిస్తే కొన్ని గింజలేనా నిలుస్తాయి. అందుకే చెడా మడా చెడిపోయి అతి సాహసంగా తంకాడి అంతకురెట్టింపు ధైర్యంతో బొంకగలిగిన జగజ్జంతల కథలు చెప్పి 'వాళ్ళంత తెగువా, తెలివీ ఉంటే నువ్వూ చిత్తమొచ్చినట్టు తిరుగు'అని సవాలుచేస్తే 'నిజమే, వాళ్లు దేనికైనా తగినవాళ్లు. మన కా చాక చక్యం రానూ రాదు, మనం గిరిదాటిపోనూపోము' అని కొందరైనా అనుకుంటారు.

మానసికవ్యభిచారం చేసేవాళ్ల కోరికలను సబ్లిమేట్ చేయడానికి ఈ తరహారచనలు అవసరమే. అందుకే అన్ని దేశాల సాహిత్యంలో అనాదినుంచీ ఇలాంటి కథలు ప్రచారంలో ఉన్నాయి. పుణ్యకథల ఫలశ్రుతిలోని నిజ మెంతో తెలియదుగాని ఈ కథలకు మాత్రం ఇలా ఫలశ్రుతి చెప్పవచ్చును. రాజుమీద మోజుపడ్డమగనాలు ఈ రంకు కథలు విన్నాక 'రాజురాకడా ఉండదు! ప్రోవనూకుడూ ఉండదు!'

28

కవులు



నాయకరాజుల యుగంలో ఒక్క దక్షిణాదినే కాక ఇతరప్రాంతాలలోకూడా చాలా మంది కవులు రచనావ్యాసంగం చేశారు. వాళ్ళలో కొందరు మెరుస్తున్న రత్నాలు; కొందరు 'మరుగు పడిన మాణిక్యాలు'. మరికొందరు 'చరిత్రకెక్కని చరితార్థులు'. వీళ్ళ పాండిత్యాలు రకరకాలు. కొందరు వ్యాకరణ వేత్తలయితే మరికొందరు విలక్షణప్రయోగాలు చేసేవారు. కొందరు భక్తిగానాలు పాడితే, కొందరు యక్షగానాలు చెప్పారు. కొందరు అన్నిరకాల రచనా ప్రక్రియలను చేపట్టినవారు. వీళ్ళలో కొందరి జీవితాలను గేయలుగా ఇతర కవులు గానం చేశారు. వీళ్ళలో పెద్దదాసుకు కనీసం పేరులో పెద్దరికం ఉంది కనుక, మొదటి పీట వేయవచ్చు.

1. పెద్దదాసు :–విజయరాఘవుడు తంజావూరు పాలించే రోజులలో ఆ నగరంలో శేషాచలం అనే గాజులసెట్టి ఒకాయన ఉండేవాడు. అతడు చేసిన పూజలకొద్దీ అపురూపమైన కొడుకు పుట్టాడు. ఆ బిడ్డకు పెద్దదాసు అనే పేరు పెట్టారు. కొడుకు పెరిగి పెద్దవాడయ్యాక కొలువులో చేరుతాడని శేషాచలం అనుకొన్నాడు. గాని పెద్దదాసు కొలిచితే వేణుగోపాలుణ్ణే

కొలవా లన్నాడు. కొన్నాళ్ళు కులధర్మాన్ని పాటించి గాజులమలారాన్ని భుజాన వేసుకొని ఆ ఊరి సౌభాగ్యవతులను దీవించాడు. ఆ పిమ్మట తల్లి తండ్రులు కాలం చేయగానే వృత్తి మానేసి పాటలు కట్టి పాడుకొంటూ కాలం గడిపేవాడు. అతని భక్తివైరాగ్యాలు ఊరంతా చెప్పుకొనేవారు.

ఇతని కీర్తి యువరాజు చెవిని పడింది. విజయరాఘవనాయకునికి మన్నారు దేవు డనే కొడుకు ఉన్నాడు. అతన్ని మన్నారప్పనాయనింవా రని, మన్నార్నాయనింవారనీ పిలిచేవారు. అతని కోసారి వైరాగ్యం వచ్చింది. అతను వేసిన ప్రశ్నలకు ఊరిలోని విద్వాంసులు సమాధానాలు చెప్పలేక పోయారు. పెద్దదాసే ఆ ధర్మసందేహాలు తీర్చకలడని అంతా అనుకొన్నారు. ఆ భక్తుని కోసం రాజభటులు వెళ్ళారు. 'నరహరికొలువును విడిచిపెట్టి ఒక నరుని కడకు రా'నని పెద్దదాసు చెప్పాడు. మన్నారుదేవుడు తానే స్వయంగా వెళ్ళి సందేహాలుతీర్చుకొన్నాడు. పెద్దదాసు పాడే పాటలు విని ఆనందించాడు. తన తండ్రి వంశావళిని వర్ణించి తనమీద పాటలు కడితే బాగుంటుం దను కొన్నాడు; కోరాడు. 'నారసింహుని బాడిన నోట ఊరసింహమును బాడను' అని పెద్దదాసు నిశ్చయంగా చెప్పాడు. తన తండ్రిని గ్రామసింహ మన్నాడని కోపించి మన్నారుదేవుడు ఆ భక్తునిచేత కుక్కకన్నా నీచమైన గాడిదకు దండం పెట్టించాడు. చెప్పరాని బాధలు పెట్టాడు. అన్నీ ఓర్చుకొని పెద్దదాసు దేవునితో మొరపెట్టుకొన్నాడు. భగవంతుడు కొరడాపట్టుకొని శిక్షించేదాకా మన్నారు నాయనికి బుద్ధి రాలేదు. వెంటనే చెంపలు వేసుకొని క్షమార్పణ చెప్పుకొని పెద్దదాసుని విడిపించాడు. తరువాత కొన్నాళ్ళకు పెద్దదాసు శ్రీరంగంలో ముక్తిపొందాడు.

ఈకథను సింగరిదాసు అనే జానపదగేయ రచయిత చెప్పాడు. 'పెద్ద దాసు చరిత్ర'ము అను గుజిలీ పుస్తకం చాలా ప్రచారం పొందింది. ప్రచా రానికి తగినంత ప్రశస్తమైన రచన కాకపోయినా నాయకరాజుల కాలంలోని ఒక గేయకర్తగురించి చెపుతుంది. పెద్దదాసును బాధించిన రాజు విజయ రాఘవనాయకుడే అని కొందరు పరిశోధకుల అభిప్రాయం.[1] సింగరిదాసు పొరపడి మన్నారునాయణ్ణి తంజావూరి రాజుగా పెద్దదాసు చరిత్రలో పేర్కొ

1. దక్షిణదేశీయాంధ్రవాఙ్మయం. నిడుదవోలు వెంకటరావుగారు, పుట 164.

నడంవల్ల పరిశోధకులుకూడా విజయరాఘవుడే హరిభక్తులను హింసించాడను కొని ఉంటారు. అయితే అతడు వైష్ణవపక్షపాతి. వాళ్ళు ఏనేరం చేసినా దండించడు. పైగా వైష్ణవులను బాధించేవాళ్ళనే శిక్షిస్తాడని చెప్పవచ్చును. తంజావూరు పతనానికి ముందు మన్నారుదేవుణ్ణి విజయరాఘవుడు బంధించాడు. 'ఇంతకుమునుపు, ఒకప్పు డేదో కోపం కల్గి తమ కొమారుడు మన్నా తప్పు నాయనింవారికి బంగారునంకెళ్ళు వేసి బందుచేసి ఉంచిరి' అని దండకవిలెలో ఉంది.[1] వైష్ణవులను హింసించినవెంటనే విజయరాఘవుడు తన కొడుకును బంధించాడేమో. ఇది భావిపరిశోధనవల్ల తేలాలి.

పెద్దదాసు ఏవో కీర్తనలు వ్రాశాడనే తెలుస్తున్నదిగాని అతను కట్టిన పాట లేవో గుర్తించడానికి ఆధారాలులేవు. పెద్దదాసుపదా లని పరిశోధకులు చెప్పే పదాలు నిజానికి సింగరిదాసుపదాలే. నిడుదవోలు వెంకటరావుగారు పెద్దదాసువని చెప్పి రెండుపదాలను ఉదాహరించారు.[2] వాటిలో రెండవ దానిలో చివరి చరణం ఇలా ఇచ్చారు:

ఇందుముఖుల పొందు గోరము పర_నింద కొడిగట్టి తిరుగము
పొందుగ నరసింహ పెద్దదాసునుజూచు ఇందిరేశు భజనానందులై యున్నాము

ఈ చరణంలో పెద్దదాసు అనే ముద్ర కనబడుతుందికనుక అతడే వ్రాశా డనుకోవచ్చు. అయితే దీని అసలుపాఠం ఇంకోలా ఉంది:[3]

ఇందుముఖుల పొందు గోరము, పర_నిందకొడిగట్టితిరుగము
పొందుగ సింగారిదాసుని బోషించె_ఇందిరేశు భజనసందులై యున్నాము

దీనినిబట్టి ఈ కీర్తన సింగారిదాసురచనే అనే చెప్పాలి. భావిపరిశోధన వల్ల పెద్దదాసుకీర్తనలు లభించితే అవి రామదాసుకీర్తనల కోవలోనివేమో పరిశీలించవచ్చు.

---

1. తంజావూరి ఆంధ్రరాజులు, చరిత్ర వేటూరి ప్రభాకరశాస్త్రి గారి సంపాదితం, పుట 27.

2. దక్షిణదేశీయాంధ్రవాఙ్మయం, 166_167.

3. పెద్దదాసు చరిత్ర 16. పేజీలుగల పుస్తకం. ఎన్.వి. గోపాల్ అండుకో_మద్రాసు ప్రచురణ. పుట 5.

2. కంచెర్ల గోపన్న :—తెలుగుదేశంలో ఎందరు రామభక్తులున్నా ఒక్కడే రామదాసు! అతడు కంచెర్లగోపన్న. ఖమ్మంజిల్లా భద్రాచలం తాలూకాలో నెలకొండపల్లె అనే గ్రామం ఉంది. అందులో క్రీ. శ. 1620 ప్రాంతాలలో కంచర్ల లింగన్నఅనే కరణమో, గణకుడో ఉండేవాడు. అతనికి పింగళివారు పిలిచి పిల్లనిచ్చినట్టుంది. హనుమకొండలో 'ఆమిల్'వద్ద పింగళి భానుజయ్యగా రనే ఉద్యోగి ఒకాయన ఉండేవాడు. ఆయన తన కూతురు కామమ్మను కంచెర్లలింగన్నకు ఇచ్చి పెళ్లిచేశాడు. ఈ దంపతులకు గోపన్న పుట్టాడు పుట్టగానే పరిమళించినట్టు గోపన్నకు చిన్నతనంనుంచీ రామభక్తి అలవడి రామదాసు అయ్యాడు.

ఏగురువువద్ద కవిత్వం నేర్చుకొన్నాడోగాని రఘునాథభట్టాచార్యులవారి వద్ద గోపన్న వైష్ణవం స్వీకరించాడు. కబీరుదాసుదగ్గిర తారకమంత్రం ఉపదేశం పొందాడు. రామనామంతోపాటు అతడు కావ్యరచనకూడా చేసేవాడు. జీవనోపాధికోసమో, ఎందుకోగాని గోపన్న తన కావ్యాలను దురాత్ములకిచ్చి మోసపోయాడు. రేగుపళ్లకోసం ముత్యాలు పోసినట్టు అతడు బాధపడ్డాడు. ఆ సంగతి ఇలా దేవునితో మొరపెట్టుకొన్నాడు:

మంగని రేగుపండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు దు
ర్వ్యసనము చెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యెనా
రసనకు చూతవృత్తి సుకరమ్మగ జేయరునట్లు వాక్సుధా
రసముల చిల్క బద్యముఖరంగమునందు నటింపవయ్య సం
తసమును జెంది భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ [నెం. 7]

గోపన్న కోరినట్టే అతనికి వాక్సుధారసములు చిలికే స్వచ్ఛందకవిత్వం అలవడింది. అతడు భద్రాచలంలోని రాముని సేవలోనే కాక సర్కారుకొలువులోకూడా ఉండేవాడు. అతని మేనమామలు అక్కన్నమాదన్నలు క్రీ. శ. 1650 ప్రాంతాలలో గోలకొండలో చిన్న ఉద్యోగులు మీర్‌జుమ్లావద్ద కొద్దిపాటి జీతంతో వాళ్లు పని చేస్తూఉండేవారు. మేనల్లునికి భద్రాచలంలో చిన్న ఉద్యోగం ఇప్పించారు. గోపన్న క్రమేపీ తహసీల్దారు అయ్యాడు. అక్కడి రామాలయాన్ని ఉద్ధరించాడు. ఆ రాముని మహిమవల్ల తనకొడుకు చచ్చి బ్రతికాడని విశ్వసించాడు. తన జీవితాన్నేకాక వసూలుచేసిన పన్నులు కూడా ప్రపన్నుల కోసం రామార్పణ చేశాడు. భద్రాచలమాహాత్మ్యం లోకానికీ,

రామదాసు సంగతి సర్కారువారికి తెలిసింది. అధికారులు అతన్ని బంధించి ఖైదులో పెట్టారు. మేనల్లుడికి ఉద్యోగం వేయించేపాటి పలుకుబడేగాని చెర తప్పించేంత అధికారం అక్కన్నమాదన్నలకు అప్పటికి లేదు.

గోపన్న పన్నెండేళ్లు బందిఖానాలో మగ్గాడు. రోజు కోపాటతో తన ఆరాటాన్ని దేవునికి చెప్పుకొనేవాడు.

రక్షింప విది యే మొ రాచకార్యము పుట్టె రామచంద్రా నన్ను
రక్షింపకున్నను రక్షకు లెవరయ్య రామచంద్రా
అప్పలవారిదె అరికట్టుచున్నారు రామచంద్రా, స్వామి
చెప్ప శక్యము కాదు చక్కున్గోచరమాయె రామచంద్రా.

అని మొరపెట్టాడు. 'నీటుతో నీ నామకోటి వ్రాసితిని, నీకు సాటిలే దని సారెసారెకు వేడితిని' అని చెప్పుకొన్నాడు. 'నిన్నుపోనిచ్చెదనా! నన్ను రక్షింపక' అని సవాలుచేసి 'రట్టుచేసి నిన్నరికట్టుదు నింక దిక్కు కల్గితె మొరపెట్టుకోరా'అని దేవునికే దిక్కులే దన్నాడు. 'కుదురుగ కూర్చుండ నియ్యను-నీకు కోపము వచ్చిన భయపడను' అని దేవుడినే అడుగుదాటి కదల నియ్య నన్నాడు. 'రాతికైన జెమట రంజిల్లు రామా, ఆతీరు నీ మనసు నొందదు'అన్నాడు. 'నీ తలపుల లేదె సీతచెర దాశరథీ కరుణాపయోనిధీ'అని ఎత్తిపొడిచాడు. సీతతో 'నను బ్రోవమని చెప్పవే' అని విన్నవించుకొన్నాడు.

క్రీ. శ. 1674 నాటికి పరిస్థితులు మారాయి. అక్కన్న మాదన్నలు అంచెలమీద గొప్పపదవులు నంపాదించారు. మాదన్న మీర్‌జుమ్లాఅయ్యాడు. అక్కన్న షర్‌లష్కరుఅయ్యాడు. వాళ్లు చివరకు గోపన్నను విడిపించారు. విముక్తి పొందాక గోపన్న ఎలా జీవించాడో, ఏ రచనలు చేశాడో తెలియదుగాని బందిఖానానుండి బయటపడేదాకా అతడు చెప్పిన పద్యాలు, కట్టిన పాటలూ అత్యంతప్రచారంలోకి వచ్చాయి. అతని కీర్తనలు పాడని భక్తజనకూటమూ, అతని శతకంలోని పద్యాలు రాని భక్తుడూ తెలుగుదేశంలో లేడు. గోపన్న తన జీవితశేషాన్ని రామునికి సాటి లేరని చెప్పడంలో గడిపిఉంటాడు. తన దీక్షను అత నిలా విశదపరిచాడు:

భండనభీము డా ర్తజనబాంధవు డుజ్జ్వలబాణతూణకో
దండకళాప్రచండభుజతాండవకీ ర్తికి రామమూ ర్తికిన్

రెండవ సాటిదైవ మిక లేడనుచున్ గడకట్టి భేరికా
డాండడడాండడాండనినదంబులజాండమునిండ మత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ. [నెం. 34]

రామదాసు కీర్తనల నినాదంబులతో నేడు తెలుగు అజాండము నిండి పోయింది.

3. పైడిపాటి వెంకటనరసయ్య :—రామదాసుభక్తి,అతడు కట్టించిన భద్రాచలదేవాలయపు కీర్తీ అచిరకాలంలోనే అంధ్రదేశమంతా అల్లుకొనిపోయిందికాబోలు. దూరాన నెల్లూరుమండలంలో ఉండే కవులుకూడా గోదారుఱీతీరానఉండే ఈ భద్రాద్రియుగ్దానశ్రీకరుణ్ని గైకొనమంటూ శతకాలు వ్రాశారు. 'నన్ను గైకొను ముపేంద్రా రామచంద్రాహరీ' అనే మకుటంతో పైడిపాటి వెంకటనరసయ్య అనే కవి భద్రాద్రిరామునికి అంకితంగా ఒక శతకం చెప్పాడు. ఇతడు నెల్లూరుజిల్లా కందుకూరుతాలూకాలోని పైడిపాడు గ్రామంవాడు. ఆ ఊరికి అతని పూర్వీకుల కాలంనుంచీ పైడిపాటివారే కరణాలు.

కరణీకమేకాక పైడిపాటివారి కుటుంబంలో అందరికీ ప్రవిమలపుణ్యకీర్తీ, హరిభక్తీ, కవిత్వతరోక్తీ ఉన్నాయట. పైడిపాటి లక్ష్మీపతి అనే ఆయన వరసమ్యక్కవితాచమత్కృతమతిగా, ఉత్తమకళాప్రత్యక్షచంద్రునిగా పేరుపడ్డవాడు. ఇతడు ఏగ్రంథాలు వ్రాశాడో తెలియదు. ఇతనికి ఎంతమంది శిష్యులో కూడా తెలియదు. అయితే అతని పెద్దకొడుకు వెంకటనరనయ్యమాత్రం తండ్రిదగ్గిరే చదువు మొదలుపెట్టాడు. తరువాత ఎందరో దేశికుల ఉపదేశం వల్ల కవిత్వోపయోగవిద్యను పొందాడు. ఉభయవ్యాకరణాలూ నేర్చాడు. వాగర్థజ్ఞానసమర్థుడు అయ్యాడు. శతకాలు చెప్పాడు. ఒక్కొక్క శతకంలో పదకొండు దశకాలు వ్రాశాడు. రామచంద్రశతకంలో ఇలా చెప్పాడు:

క్షితి నేకాదశసంఖ్యచే దశకముల్ చెన్నొంద మాణిక్యవ
ద్రతతిం గూర్చిన హారపంక్తిగతి గీర్వాణాంధ్రశబ్దంబులన్
శతకగ్రంథ మొనర్చి నీ కొసగెదన్ సర్వేశ యస్మత్కవి
త్వతపస్సిద్ధికి నన్ను గైకొను ముపేంద్రా! రామచంద్రా! హరీ!

[D_1672]

ఇతని కవిత్వతపస్సు ఈ శతకంలోనేకాక మన్నారుకృష్ణశతకంలో కొనసాగింది. 'చారుతరమందహాస పోలూరివాస వారితామిత తృష్ణ మన్నారు కృష్ణ!' అనే మకుటంతో వెంకటనరసయ్య ఒక సీసపద్యశతకం చెప్పాడు. ఇందులోనూ పదకొండు దశకా లున్నాయి. ఈ శతకంలోని మన్నారుకృష్ణుడు నెలూరుజిలా సూళ్ళూరుపేటతాలూకాలోని మన్నారుపోలూరు గ్రామంలోని దేవుడు. పైడిపాటి వెంకటనరసయ్యకు మన్నారుపోలూరు అత్తవారి గ్రామం. భద్రాద్రిరాముని దేవాలయాన్ని రామదాసు ఉద్ధరించినట్లు మన్నారుకృష్ణుని గుడిని వెంకటనరసయ్య ఉద్ధరించాడు. 'వినిపింతు నిదె నా కవిత్వంబు తాళరా! తాళరాగైకనృత్యప్రమోద' అని దేవుణ్ణి కొంచెం ఆపి గుడికట్టించి నట్టుంది. అయితే 'కృతి చెప్పుమని పల్కరింపనే చాలవా చాలవాచాలకశక్తి కలిగి' అని భక్తుడే దేవుణ్ణి ముందు రెచ్చగొట్టాడు. వెంకటనరసయ్య ఈ శతకంలో తన వాచాలకత్వాన్ని నిరూపించుకున్నాడు. ప్రతిసీసంలోనూ ప్రతిపాదార్థ ముక్తపదగ్రస్తాన్ని నియమంగా వాడాడు. మొదటి దశకంలో పై నియమంతో పాటు పాదపాదానికీ ముక్తపదగ్రస్తం వాడాడు. శతకం ఎంతో శ్రావ్యంగా ఉంది.[1] ఇతని రెండు శతకాలలో దశావతారదశకం అని ఒక విభాగం ఉంది. కంచెర్ల గోపన్నగారి దాశరథీశతకంలో కూడా దశావతార దశకం ఉంది. గోపన్నను వెంకటనరసయ్య తన శతకాల్లో ఇలా అనుసరించాడు.

పై శతకాలు ప్రాశాక, 'శ్రీనివాసదేవుని యనంతావతారంబు లని దశావతారత్రయంబు చిరకాలాభ్యుదయంబు గావున రామకృష్ణద్వైపంబులకు వృత్త సీసశతకద్వయంబు చెప్పి యర్పించి'న్నృసింహదేవునకు 'భవ్యంబగు కావ్యం' ఒకటి వెంకటనరసయ్య చెప్పదలిచాడు. 'లక్ష్మీనృసింహవిలాసం' అనే పేర చెంచులక్ష్మికథను మూడాశ్వాసాలలో చెప్పాడు. ఈ కావ్యం ప్రాసేనాటికి అతడు కవితామతచమత్కారకారణుడు, అష్టభాషాసంస్కార పరిష్కార మనీషావిశేషుడూ అయ్యాడు [D-733]. ఇతడు ఎంతటి పండితుడో అంతటి పవిత్రుడు. కామక్రోధాలులేనివాడు. అందుకే ఇతని మేనల్లుడు ఇతణ్ణి ఇలా నుతించాడు:

కామాదికషడ్దుర్వ్యాళ-భీమునిశ్రీపైడిపాటివెంకటనరసిం
హామాత్యకవికులేంద్రుని-నా మాతులుని న్నుతింతు సతశీర్షుడనై.

---

1. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు 'శతకసముచ్చయం' ద్వితీయ భాగంలో ఈ శతకాన్ని ప్రకటించారు.

ఇలా తల వంచుకొని నమస్కరించే మేనల్లుడు ఎవరో అనామకకవి కాదు. హంసవింశతి రచించిన అయ్యలరాజు నారాయణ!

4. పొనుగోటి జగన్నాధరాయలు :-సర్కారుద్రవ్యాన్ని రెండు చేతులా కైంకర్యంచేసి సద్భక్తుడని పట్టా పొందినవాళ్లలో కంచెర్ల గోపన్న 17వ శతాబ్దినుండి సుప్రసిద్ధుడైనా ఆదికాలంలోనే ఇటువంటి చరిత్ర కల మహానుభావుడు లేకపోలేదు. వైష్ణవమతాన్ని ప్రచారంచేసిన పన్నెండుమంది ఆళ్వారులలో ఒక దివ్యసూరి ఇటువంటివాడే. ఆయనపేరు పరకాలుడు; చోళదేశంలో ఒక ఊరికి అధికారి. ఆవూళ్లో ఒక వైద్యుడున్నాడు. అతనికి పిల్లలు లేరు. ఒకనా డావైద్యుడు కోనేటికి వెళ్లాడు. అక్క డొక ఆడపిల్ల అతనికి దొరికింది. ఆపెను ఆ వైద్యుడు పెంచాడు. పెద్దదాన్ని చేశాడు. ఆపిల్ల అందాన్ని చూసిన పరకాలుడు ఆమెను పెళ్లాడదలిచాడు. పంచసంస్కారాలూ పొందిన వైష్ణవుని గాని వివాహం ఆడనని ఆ చిన్నది ప్రతిజ్ఞచేసింది. పరకాలుడు వైష్ణవుడై ఆమెను వివాహం చేసుకొన్నాడు. పరమభాగవతులకు నిత్యం సద్రసోపేతంగా విందులు చేసేవాడు. దానికై రాజద్రవ్యాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టాడు.

రామదాసు కథలోలాగే పరకాలుని కథలోకూడా రాజుకి కోపం వచ్చింది. డబ్బుకోసం కబురుపెట్టాడు. మనుష్యులను పంపాడు. పరకాలుడు వాళ్లని తిరగగొట్టి రాజుమీద తిరగపడ్డాడు. యుద్ధం చేశాడు. చివరకు 'మీ సొమ్ము మీకు ఇస్తాను, కంచికి రండి' అని రాజోద్యోగులను తీసుకువెళ్లాడు. ఎవరో అడ్డుపడి డబ్బు ఇచ్చారు. రాజు పరకాలుణ్ణి దేశబహిష్కారం చేశాడు. ఆ భక్తుడు భార్యతోపాటు బయటపడ్డాడు. నిత్యం వైష్ణవులకు సంతర్పణ చేయాలి. డబ్బేదీ? అంచేత పరకాలుడు దొంగతనాలు చేసేవాడు. అయితే, తనకోసం చేసిన అధర్మం కూడా ధర్మమేనని విష్ణువు లోగడ సెలవిచ్చాడు. అందుచేత పరకాలుడు చేసేది తప్పుకాదని అతని భార్య తలపోసేది. అతడు శ్రీమహావిష్ణువు ధరించే కార్ముకం అంశతో పుట్టిన మహానుభావుడు. అతణ్ని తమిళభాషలో తిరుమంగైయాళ్వార్ అంటారు. అతని భార్య లక్ష్మీదేవి అవతారమే. ఆమెపేరు కుముదవల్లి. ఈ ఆళ్వారుచరిత్రను 'కుముదవల్లీవిలాస'మనే పేరిట పొనుగోటి జగన్నాధరాయలు ఒక ప్రబంధాన్ని వ్రాశాడు. ఈయన నలగొండజిల్లాలో ఉండే పెనుగోడనివాసి. ఇతనికి గోలకొండనవాబు గుర్రాలు,

ఏనుగలు, ఛత్రాలు, చామరాలు మొదలైనవి ఇచ్చాడు. నవాబులకు ఆణకువగా దేవాద్రిపట్టణాన్ని జగన్నాథరాయలు పాలించేవాడు. ఇతడు వైష్ణవుడు. సముద్రాల తిరుమలాచార్యులవారి శిష్యుడు. తాను రచించిన కుముదవల్లీ విలాసాన్ని కవి తన గురువుగారికే అంకితంఇచ్చాడు. ఇది ఐదాశ్వాసాల గ్రంథం. దీనిని కవి తొమ్మిదోతరంలోని మనుమడు క్రీ. శ. 1925లో అచ్చు వేయించారు. తరానికి ముప్పయిసంవత్సరాలచొప్పున లెక్కిస్తే కవి క్రీ. శ. పదిహేడో శతాబ్ది ప్రథమభాగంలో తెలంగాణాలో ఉండవచ్చును.

5. వేములవాడ సోమనాథుడు :— తెలంగాణలో ఉన్న వేములవాడకే లేములవాడ అని మరొక పేరుంది. లకారయుక్తమైన ప్రయోగాన్ని తన వసుచరిత్ర వ్యాఖ్యానంలో సోమనాథకవి యతిస్థానంలో వాడాడు.

శ్రీమెఱయన్ సమస్త మునిసేవితమై విలసిల్లుచున్న యీ
లేములవాడలో వివిధలీలలు జూపి జగంబు బ్రోచు నా
సామికి రాజలింగమను చక్కని నామము గల్గువానికిన్
గామితదాయి కర్పితముగా నొనరించెద నీనిబంధమున్ [D_749]

వసుచరిత్రకు అర్థం చెప్పినవాళ్ళలో ఇతడు మొట్టమొదటివాడు కాదు. చిత్రకవి వెంకటరమణ ఆద్యుడు (R-123). అయినా నేడు లభ్యం అవుతున్న వ్యాఖ్యానాలలో సోమనాథునిదే ప్రాచీనమైనది. ఇతడు క్రీ. శ. 1750 ప్రాంతాలవాడు అని బ్రౌనుదొరగారు అభిప్రాయపడ్డారు. గోలకొండ కవులసంచిక సంపాదకులు మాత్రం ఈ కవి క్రీ. శ. 1650 ప్రాంతాలవా డని చెప్పారు (పుట 415). ఈ వ్యాఖ్యానానికి 'విద్వజ్జనరంజని' అనే పేరుంది. ఈ టీక ఒక్కటే కాక సోమనాథుడు మరికొన్ని గ్రంథాలుకూడా రచించాడు. (1) చతుర్భుజాభిషేకం, (2) ధృవచరిత్ర, (3) మరుత్సందేశం, (4) ముద్రా లాభం, (5) గంగాగౌరీసంవాదం అనే ప్రబంధాలు చెప్పినట్టు వసుచరిత్ర వ్యాఖ్య అవతారికలో తెలియజేశాడు. ఈ ప్రబంధాలలో 'హృద్యబహుళార్థ చమత్కృతి శబ్దచిత్రములో' ఉన్నాయట. అయితే దురదృష్టవశాత్తూ ఈ గ్రంథాలు కొన్నిఅముద్రితాలు,కొన్నిఅలభ్యాలు. 'విద్వజ్జనరంజని' వ్యాఖ్యానం వల్ల సోమనాథు డాంధ్రసాహిత్యానికి గొప్ప ఉపకారం చేశాడు. వసుచరిత్రను వాసిన కవిపేరు భట్టుమూర్తి అనే సంగతిలా గ్రంథస్థం చేశాడు:

కారణజన్ముడై కవినికాయము మెచ్చగ గార్యకర్తయై
భూరికళాకలాపుడయి పొల్పు వహించెడు భట్టుమూర్తిచే
నీరితమై ఘనార్థవరహీనపదాస్పదమై యీవసు
ధ్నోరమణప్రవృత్తము సుసాధ్యము కాదు తలంచి చూడగన్. [D_749]

వసుచరిత్రలోని ఆర్థాలను సుసాధ్యం చేసిన ఈ సోమనాధుడు స్వయంగా రచించిన బహుళార్థచమత్కృతులను చవిచూసే అదృష్టం మనకు కొరవడింది.

6. కోననారాయణ :– మన భాషలో ఒకేకథను పదిమంది వ్రాయడం పరిపాటే. ఉషాపరిణయాన్ని ఎందరో వ్రాశారు. తమ కావ్యానికి ఉషపేరో, అనిరుద్ధుని పేరో పెట్టుకొన్నారుగాని వారికి పుట్టిన బిడ్డపేరు పెట్ట లేదు. కోన నారాయణ అనే తెలంగాణాకవిమాత్రం 'వ్రజాభ్యుదయం' అనే పేరుతో ఉషాకళ్యాణం వ్రాశాడు. ఈ కావ్యాని కిలా దేవుడే నామకరణం చేశాడట. కవిగారి కలలో కనబడి ప్రోత్సహించి 'అయ్యనిరుద్ధుచరిత్ర కింక వ్రజాభ్యుదయం బటన్న యభిధాంతర మొప్ప నొనర్పుమా కృతిన్' అని అనతిచ్చాడట. అనతిచ్చిన దేవుడు హయగ్రీవుడు. అతడు కవితో ఇంకా ఇలా అన్నాడు:

హయవదనావతారమున నస్మదనుగ్రహలబ్ధ విస్తృతా
వ్యయకవితామతల్లికుడ వౌట సమర్థుడ వీవ మత్కళా
శ్రయుఁ డనిరుద్ధు...పావనితన్ వరియించు వృత్త మీ
ద్వ్యయమునకున్ కుమారుడయి వజ్రుఁడు కల్గెడుదా కొనర్పుమా.

కోననారాయణ ఒనర్చిన ఈ కావ్యం అచ్చుపడలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తువారి కార్యాలయంలో ఒక అసమగ్రప్రతి ఉంది (గంథసంఖ్య 3523). అవతారికలోని పద్యాలవల్ల ఇతని యింటిపేరు కోనవారు అని పరిశోధకులు భావించారు.[1] అయితే ఆయింటిపేరు 'నెల్లుట్ల'వారని శేషాద్రిరమణ కవులు వ్రాశారు.[2] ఇప్పటికీ తెలంగాణాలోని బమ్మెరగ్రామంలో నెల్లుట్లవా

1. ఆంధ్రసాహిత్యపరిషత్తు పత్రిక సంపుటి 8. సంచిక 6. పుట 341.

2. గోలకొండకవుల సంచిక, పుట 401.

రున్నారని, వారింట్లో వజ్రాభ్యుదయం జీర్ణప్రతి ఒకటి దొరికించని, ఈ గ్రంథ కర్త బమ్మెరపోతరాజుగారి వంశంలోవాడని కూడా శేషాద్రిరమణకవులు చెప్పారుగాని 'బమ్మెరవారికిని నెల్లుట్లవారికిని కౌండిన్యసగోత్రసామ్య మొక్కటిదక్క వేరుసంబంధ మేమియు లేదు' అని కందుకూరి వీరేశలింగం గారు ఖండించారు.[1] నారాయణ నిజంగా పోతరాజుగారి వంశంలోనివాడైతే ఆసంగతి అవతారికలో చెప్పుకొనేవాడు.

కోనశబ్ది మేమహానూనవిభవున-కన్వయార్థ మగుచు నతిశయిల్లు
నక్కమార కోనపార్యనస్మత్కులా-చార్య గొలుతు వాత్స్యజాతధుర్య.

అని ఒక ఎత్తుగీతిలో తన కులకర్తగా కోనప్పనే నారాయణ కీర్తించాడు. ఈకవి తండ్రిపేరు అచార్యులుగారు. గురువు బోయనపల్లి నరసింహం గారు. ఈయన మహాపండితుడే కాక చక్కగా చదువు చెప్తాడు. "వజ్ర శుంఠీయునైన వచ్చి యేఘనుపెద్ద నంచికబట్టబేస్వతి తలంకు" అని నారాయణ తన గురువును ప్రశంసించాడు. బోయనపల్లి నరసింహంగారి కవితాధార 'భాగీరథీరయమధురతాభర'మనికూడా శిష్యుడు చెప్పాడు. అయితే ఆ ధారను ఆస్వాదించడాని కాయన పుస్తకాలు దొరకలేదు. గురువుగారి రచనలు పూర్తిగా దొరకలేదుగాని శిష్యుని రచన కొంతైనా లభిస్తున్నందుకు సంతోషించాలి. "వజ్రాభ్యుదయంలోని కవిత్వం చక్కగా నున్నది. సంస్కృత పాండిత్య మసమానమని కొన్ని ఘట్టములు సూచించుచున్నవి"అని పరిశీలకులు చెప్తున్నారు. ఈ కావ్యం ఉన్నంతమట్టుకైనా అచ్చుపడితే మంచిది.

7. బోరవెల్లికవులు – బోయినపల్లి దొర :– ఈనాడు మనలో ఇంటిపేర్లు త్వరగా మారిపోవుగాని ఒకనాడు రెండుమూడు తరాలలోనే అవి మారిపోతూఉండేవని చెప్పవచ్చు. క్రీ. శ. 1580-1614 ప్రాంతాలలో తరిగొప్పుల మల్లన్న అనే కవి చంద్రభానుచరిత్ర రచించాడు.[1] ఇతడు తన పూర్వుల ఇంటిపేరు తరిగొప్పులవారు అని చెప్పుకొన్నాడు. అయితే ఈయన రెండవ వెంకటపతిరాయలవారివద్ద ప్రాయసంగా ఉండబట్టి ఇతని కుటుంబానికి రాయసంవారనే ఇంటిపేరు వచ్చింది. కాని మల్లన్నగారి మనుమలు, మునిమనుమలు గద్వాలదగ్గిర ఉన్న బోరవెల్లిలో స్థిరపడడంవల్ల

---

1. తెలుగుకవులచరిత్ర ప్రథమభాగం బమ్మెరపోతన. పుట 586
2. సమగ్రాంధ్రసాహిత్యం–ఆరవీటిరాజులయుగం, 165.

కొన్నాళ్ళకు వారి కాసంస్థానపు పేరే ఇంటిపేరు అయింది. తరిగొప్పుల మల్లన్న గారి మనుమడిమనుమడు నరసింహం అనే కవిని నమకాలికులు బోరవెల్లి నరసింహం అని పిలిచేవారు. ఇతడు 'సోపర్ణాఖ్యానం'అనే కావ్యాన్ని వ్రాశాడు. దీనిని అలంపూరునరసింహస్వామికి అంకితం ఇచ్చాడు. ఈకావ్యంలో ఉభయ భాషావిశేషోక్తులు ఉన్నాయని, ఇది సాంప్రదాయప్రసిద్ధిని పొందినదని తెలుస్తోంది. ఈకవిగారి తండ్రి కృష్ణప్పకూడా కృతికర్త. ఆయన 'యయాతి చరిత్ర'ను రచించాడు. అతనితండ్రి దత్తన్నగారు శబ్దశాస్త్రప్రవీణుడు. ఈ బోరవెల్లివారి గ్రంథా లేవీ దొరకడం లేదుగాని వీళ్ళ చరిత్రమాత్రం ఇతరుల కావ్యాలవల్ల తెలుస్తోంది. బోరవెల్లి నరసింహం ఒకనాడు ప్రసిద్ధుడు. సంస్థానాధిపతులకు గురువు. అతడు రాజసభలకు వెడుతున్నప్పుడు వెంబడినే లేఖకులు, పాఠకులు నడిచేవారు. ఉక్తప్రత్యుక్తిగౌరవాలు అడుగుతూ వెళ్లేవారు. ఈ నరసింహకవికి పెదపాటిగల్లు దుర్గాధిపతి శిష్యుడు. అతని పేరు బోయినపల్లి కుమారవెంకటరాయలు. ఆయన ద్రౌపదీకళ్యాణం అనే కావ్యం వ్రాశాడు. అందులో తన గురువుగారినీ, వారి తాతముత్తాతలనూ ఇలా కీర్తించాడు:

మీ తాత తాతకు భాగ్యజనితుగ దా రాయసము మల్లనూరి 'చంద్ర
భానుచరిత్ర' మొప్పగ జెప్పె మీ తాత దత్తన్న శబ్దశాస్త్ర ప్రవీణు
డతని సుతుండు కృష్ణప'యయాతిచరిత్ర' మిశ్రకావ్య మొనర్చి మీజనకుడు
చనితి వీవు దక్షిణ కాశ్యలంపురినృహరిదయోదయా మహిత కలిత
కృతి యతనికంకితముగ బండితుల మతుల
నెనయ సోపర్ణకాఖ్యానమనగనొకటి
యుభయ భాషావిశేషోక్తియుం (శిథిలము)
సిద్ధముగ సంప్రదాయప్రసిద్ధి గనుచు. [ద్రౌపది 1-47]

ఇంతటి చరిత్రగల బోరవెల్లికవుల గురించి మిత్రులు డాక్టరు బి. రామరాజుగారి 'మరుగుపడిన మాణిక్యాలు' అను గ్రంథంలో ఉదాహరించిన పద్యాలవల్ల పైవివరాలు సేకరించాను. తెలుగుదేశానికి తొలిసారిగా ఈ కవుల ఉనికి తెలియచేసినందుకు రామరాజుగారికి మనం ఋణపడిఉన్నాం. అయితే బోరవెల్లి నరసింహంగురించి ఆయన కొద్దిగా పొరబడ్డారు. లయగ్రాహి గరుడాచలకవికి ఇతడు తండ్రి అని వారిలా వ్రాశారు: "లయగ్రాహి గరుడాచల

కవి తండ్రి అయిన బోరవెల్లి నరసింహకవియే ద్రౌపదీకళ్యాణమును (అముద్రితము) రచించిన బోయినిపల్లి కుమారవెంకటరాయలను పాలుగల్లు వెలమ రాజునకు గురుతుల్యుడు"[1] లయగ్రాహి గరుడాచలంగారి తండ్రిపేరుకూడా నరసింహకవే. వారి స్వగ్రామం బోరవల్లే. అయితే లయగ్రాహివారిది హరితస గోత్రం. పానుగల్లు దుర్గాధిపతుల గురువైన నరసింహకవిది స్వతంత్రకపి గోత్రం. ఈసంగతి కుమారవెంకటరాయల గ్రంథంవల్ల తెలుస్తూంది. తన నభలోనికి వచ్చిన గురువుగారిని అతడు ఇలా సంబోధించాడు:[2]

ఆర్వేలాన్వయగేయ రాయసము మల్లామాత్య సూర్యన్వ వా
యోర్వీదేవ మత స్వతంత్రకపిగోత్రోద్భూత దత్తాన్వయాం
తర్వాణీప్రియసూను కృష్ణవిదుషా (బుధా) త్మప్రోద్భవుండైన యీ
బోర్వెల్లీపుర నారసింహకవి సంబోధించి ఇట్లంటొగిన్. [ద్రౌపదీ.1_46]

తరిగొప్పుల మల్లన్నది కూడా ఇదే గోత్రమని చంద్రభానుచరిత్ర అవతారికలోని ఈక్రిందిపద్యంవల్ల తెలుస్తూంది:

శ్రీవిద్యావిభవాస్పదంబయిన యార్వేలాన్వవాయంబునం
బావిత్ర్యాభినుత స్వతంత్రకపిసన్మౌనీంద్ర గోత్రుల్ ధరా
దేవోత్తంసులు మించి రందు బెడగొందెఁ భూజనశ్రేణి సం
భావింపం దరిగొప్పులాంకుడగు శ్రీమల్లప్రధానుండిలన్. [చంద్ర. 1_25]

ఈచర్చవల్ల తరిగొప్పుల మల్లన వంశంలోని నాలుగైదుతరాల కవుల పేర్లు, వాళ్ల గ్రంథాలూ తెలిశాయి. మల్లన క్రీ. శ. 1580 ప్రాంతాలవాడు. అతనికి నాల్గుతరాల తరువాత వాళ్లు 1670 ప్రాంతాలలో ఉన్నారని భావించవచ్చు. ఈసంగతులను తెలియజేసే ద్రౌపదీకళ్యాణం మన సాహిత్యచరిత్రకు ఎంతో ఉపయోగపడింది. ఈగ్రంథాన్ని వ్రాసిన పద్మనాయకప్రభువు కుమార వెంకటరాయలు. ఇతని పూర్వులు కుతుబ్‌షాహీలకు అణకువగా ఉండి మెతుక దుర్గాన్ని పాలించేవారు. గాని ఈ బోయినపల్లి ప్రభువులలో వేంకట రాయలనే దొర పెదపానుగల్లు దుర్గాధిపతిగా ఉండేవాడు. ఈయనకు కృష్ణా

---

1. రాఘవాభ్యుదయం, చింతలపల్లి ఛాయాపతికృతి-పీఠిక పుట9.
2. ఈ పద్యాన్ని, దానిముందు ఉదాహరించినదానినీ డాక్టరు రామరాజుగారి 'మరుగుపడిన మాణిక్యాల'నుండి తీసుకొన్నాను. పుట21.

నదిలో ఈదడం ఇష్టం. అందుకే కృష్ణవేణీజలక్రీడావినోదనాబిరుదు ఇతనికి ఉండేది. ఇతని కుమారుని పేరుకూడా వెంకటరాయలే. అందుచేత కొడుకుని కుమారవెంకటరాయలని పిలిచేవారు. ఇతనే ద్రౌపదీకళ్యాణాన్ని వ్రాశాడు. ఇది అయిదాశ్వాసాల కావ్యం; అముద్రితం. ఈ తాళపత్రగ్రంథాన్ని గద్వాల సంస్థానంవారు ఆంధ్రసాహిత్యఅకాడమీకి ఇచ్చారు. ఈకవినిగురించి, కావ్యం గురించి డాక్టరు బిరుదురాజు రామరాజుగారు తమ 'మరుగుపడిన మాణిక్యా లు'లో విపులంగా తెలియచేశారు.

కుమార వెంకటరాయలు అనవద్యవిద్యావిశంకటుడు. విశేషకృతుల లోనూ, బంధగర్భకవిత్వాలలోనూ అందెవేసినవాడు. ఇతడు వైష్ణవుడు; శరన్నవరాత్రులలో నరస్వతీలక్ష్మీపూజలు చేసేవాడు. ఒకసారి దసరారోజుల లోనే తిరుపతివెంకటేశ్వరస్వామి కలలో కనబడి ద్రౌపదీకళ్యాణాన్ని వ్రాయ మని ఆనతిచ్చాడు. కవి, నవరసాలంకారాంకితంగా ఆ కావ్యాన్ని వ్రాసి దేవు నికే అంకితంఇచ్చాడు. గ్రంథాంతంలో ఇలా చెప్పాడు:

అతులంబై యకలంకమై ప్రభుసమాజాకర్ణ్యమై వర్ణ్యమై
యతిపాపాపహమై శుభావహమునై యాచంద్రతారార్కము
సితమై యుండెడుగాక వెంకటనగాధిస్వామియుష్మద్గుణాం
కిత మేతత్కృతి యీతీతిన్ కవిజనాంగీకారసారోన్నతిన్.

ఈ ద్రౌపదీకల్యాణం అచ్చుపడితే కవిజనాంగీకారం పొందవచ్చును.[1]

8. అంగర నరసింహం :—కవిజనాంగీకారంపొందిన కావ్యా లలోకూడా వ్యాకరణదోషాలుఉంటే లాక్షణికులు ఒప్పుకోరు. వ్యాకరణరీత్యా చేయు, కోయు, వ్రాయు మొదలైన ధాతువులలోని 'యా'కు కొన్ని సంద ర్భాలలోనే సకారంవస్తుంది (బాల. క్రియ-54). తద్ధర్మాదులలో సాధారణంగా 'యా'కు సకారం రాదు. చేయుట, కోయుట, వ్రాయుట అంటామేగాని, చేసుట, కోసుట, వ్రాసుట అనే ప్రయోగాలుచేయడం ఇప్పుడు ఎక్కడా

---

1. ఈ ప్రకరణంవల్ల తేలిన క్రొత్తగ్రంథాలు మూడు. కవులు ముగ్గురు. 1. బోరవెల్లి కృష్ణప్ప-యయాతిచరిత్ర. 2. బోరవెల్లి నరసింహం-సోపర్ణాఖ్యానం. 3. బోయినపల్లి కుమారవెంకటరాయలు - ద్రౌపదీ కళ్యాణం.

కనబడదు. అయితే అంగరనరసింహం అనే కవి ఓంప్రథమం-తొలిపద్యం లోనే 'వ్రాసుట'అనే ప్రయోగం చేశాడు. ఒకసారి కాదు, రెండుసార్లు అదే పద్యంలో చేశాడు. అతని 'రాజరాజాభిషేకం' అనే అయిదాశ్వాసాలకావ్యం లోని మొదటి పద్యం చూడండి:

శ్రీసతిచన్నుగ్రేవలను జెక్కుల నొక్కుట చిత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కుట భాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనిన వేల్పు సత్కృపో
ల్లాస మెలర్ప బ్రోచు శుభలక్షణు గొప్పుల వల్లభూవరున్.

అయితే ఇటువంటి ప్రయోగాలు ఈ కవి ఒక్కడుమాత్రమే చేయ లేదు. కట్టా వరదరాజులాంటివారుకూడా చేశారు. ద్విపదరామాయణం అయోధ్యకాండలో రామపట్టాభిషేకప్రయత్నాలు జరుగుతున్నసంగతి చెప్పిన మంథరతో కైకేయి తన సంతోషం వెల్లడిస్తుంది. ఆ సందర్భంలో రాముడు తన నెంత ప్రీతిగా చూసుకొనేవీ ఇలా చెప్పిందని వరదరాజు వ్రాశాడు.

కౌసల్య గడవ రాఘవుడు నాయందు
జేసుమిక్కిలి ప్రీతి చెప్పెడి దేవి. [అయోధ్య. 700]

కట్టా వరదరాజు క్రీ. శ. 1650 ప్రాంతాలు. వరదరాజుచేసిన ప్రయో గాలవంటివి చేసిన అంగర నరసింహంకూడా ఆ కాలంవాడే అనుకోవచ్చు. ఇతడు తన 'రాజరాజాభిషేకాన్ని' కొట్టాపురం పాలించే కొప్పుల వల్లభరాజుకి అంకితం ఇచ్చాడు. ఇది విశాఖపట్నంజిల్లా శృంగవరపుకోటతాలూకాలోని కొట్టాం కావచ్చు. ఈ గ్రామాన్ని పాలించేరాజుని 'పట్టుతలాట కేళాదిరాయ రాజదెవేంద్ర రాజాధిరాజచంద్ర గాయిగోవాళజగనొబ్బగండబిరుదశాలి' అని కవి చెప్పాడు. అయితే కవిగురించి గాని, కృతిపతిగురించిగాని ఆట్టే వివరాలు తెలియవు. రాజరాజాభిషేకం అముద్రితం. అలభ్యం. దీనినిగురించి కందు కూరి వీరేశలింగంగారు తమ ఆంధ్రకవుల చరిత్ర మూడవభాగంలో చెప్పారు. లక్షణదోషాలు ఎన్నో ఉన్నా మొత్తంమీద కవిత్వం రసవంతంగానే ఉంద న్నారు. అంగర నరసింహం ఈ కావ్యంలోని పూర్వకవిస్తుతిలో చిమ్మపూడి అమరేశ్వరుని వచఃప్రసాదసంసిద్ధుడని నుతించాడు. శ్రీనాథుని తరువాత నున్న ఏకవీ పేర్కొనలేదు. ఇతని గ్రంథం నాకు లభించలేదు.

9. కౌడూరి శోభనాద్రి :–అంగర నరసింహం యతిప్రాసల కోసం 'ప్రాసుట' మొదలైన ప్రయోగాలు చేస్తే, గణాలకోసం పేర్లను పొట్టి చేసే కవులు – అందులోనూ తన పేరును తప్పు వర్ణక్రమంలో ప్రాసేవాళ్లు లేకపోలేదు. తంజావూరులో విజయరాఘవనాయకుడు పూతనాహరణం, కాళీయమర్దనం మొదలైన కృష్ణలీలలను నృత్యనాటికలుగా ప్రాస్తున్న కాలంలో కౌడూరులో దేవవరపు శోభనాద్రి అనే కవి 'బాలక్రీడావిహారం' అనే యక్షగానం రచించాడు. ఇందులో బలరామకృష్ణుల బాల్యక్రీడ లున్నాయి. తనగురించీ, తన పుస్తకం గురించీ అత డిలా చెప్పుకొన్నాడు:

వేడుక తోడను బాల–క్రీడవిహారంబు రామకృష్ణుల మహిమల్
నాడెముగ వినుడి మీరలు–కౌడూరి శోభనాద్రిదాసు కవితారచనన్.

[ఆం. సా. సెం. 2694]

ఇందులో 'ఎమితిని సెపితివి కపితము'లాగ 'శోభనాద్రి' అనే పొట్టిదనం కన బడుతుంది. రచన ఒకమాదిరిదని, ఇందులో మంత్రసానివాలక మనేది ఒక విశేషమని డాక్టరు యస్వీ జోగారావుగారు చెప్పారు [1] ఈ యక్షగానపు ప్రతి ఒకటి ఆంధ్రసాహిత్యపరిషత్తువారి గ్రంథాలయంలో ఉంది. పుస్తకం చివర, దానిని ప్రమాదీచనామసంవత్సర భాద్రపదశుద్ధ షష్ఠి శనివారంనాడు లిఖించి నట్లు కనబడుతుంది. ఇది క్రీ. శ. 6-9-1673 కి సరిపోతుంది. శోభనాద్రి నాయకరాజుల యుగంలోనివా డని తేలుతోంది.

10. శేషభట్టరు అప్పలాచారి :– కౌడూరు శోభనాద్రే కాక మరొక కవికూడా బలరామకృష్ణుల లీలలను కావ్యంగా ప్రాశాడు. అతని పేరు శేషభట్టరు అప్పలాచారి. 'శృంగారవాఙ్మాధురి' తో 'లాలిత్యంబగు శబ్ద నంగతుల సల్లావణ్యయుక్తంబు'గా 'రామకృష్ణవిలాసం' అనే కావ్యాన్ని ప్రాసినట్లు కవి చెప్పుకొన్నాడు. ఇది ఐదాశ్వాసాల ప్రబంధం. ఈ కవి గుడ శైలసీమలోని దొడ్లేటి పట్టణంవాడు. ఆ ఊళ్ళో మర్రి పేరయ్యనాయు డనే మోతుబరి ఉన్నాడు. ఆయన కవిని పిలిచి ఈ కావ్యం ప్రాయించి భద్రాద్రి రామునకు అంకితం ఇప్పించాడు. శైలి చాలా బాగున్న ఈ కావ్యంప్రతి ఒకటి ఆంధ్రసాహిత్యపరిషత్తువారి కార్యాలయంలో ఉంది (గ్రంథసంఖ్య. 3416). కవికాలం తెలియదు.

---

1. ఆంధ్రయక్షగానవాఙ్మయచరిత్ర, ద్వితీయభాగం, పుట 30.

నాయకరాజులయుగంలోని కావ్యాలు ఇంకా ఎన్నో ఎక్కడెక్కడో మూలుగుతూఉండవచ్చు. ఈయుగాన్ని నిన్నటిదాకా చాలామంది క్షీణయుగం అని పేర్కొన్నారు.[1] మరికొందరు అలా అనకూడ దంటున్నారు.[2] ఈయుగంలోని కవులలో ప్రతిభ క్షీణించిందో లేదోగాని పునరుక్తులను చదివి సంతోషించే ఓపిక, ఉత్త పాండిత్యప్రకర్షను సహించే తీరిక పాఠకునికి క్షీణించడం మాత్రం నిజం!



1. విజ్ఞానసర్వస్వం (భాషాసమితి) 35 సంపుటిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, పుట 619. ఆంధ్రసాహిత్యచరిత్ర సంగ్రహంలో ఆచార్య ఖండవల్లిలక్ష్మీరంజనంగారు, పుట 119. ఆంధ్రవాఙ్మయ చరిత్రములో డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు పుట. 71.

2. కారదాధ్వజములో యండమూరి సత్యనారాయణరావుగారు, పుటలు 18_23.

ప్రమాణగ్రంథాలు

1. అఖిలభారతి కవయిత్రులు — ఓటుకూరి లక్ష్మీకాంతమ్మగారు
2. ఆంధ్రకవితరంగిణిసంపుటాలు — చాగంటి శేషయ్యగారు
3. ఆంధ్రకవుల చరిత్ర — కందుకూరి వీరేశలింగంగారు
4. ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర — యస్వీ జోగారావుగారు
5. ఆంధ్రవాగ్గేయకారచరిత్ర — బాలాంత్రపు రజనీకాంతరావుగారు
6. ఆంధ్రసాహిత్యచరిత్ర సంగ్రహం — ఖండవల్లి లక్ష్మీరంజనంగారు


6-a. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సంపుటాలు

7. ఆంధ్రుల నాట్యకళ — నటరాజ రామకృష్ణగారు
8. ఆంధ్రుల సాంఘికచరిత్ర — సురవరం ప్రతాపరెడ్డిగారు
9. కిన్నెర సంచికలు
10. గోలకొండ కవులసంచిక
11. తంజావూరు ఆంధ్రనాయకరాజులచరిత్ర — ఖరహరేశ్వరపురాణము — ఖరహరేశ్వరపురాణము — ఖరహరేశ్వరపురాణము

22. వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రి షష్టిపూర్తి సన్మాన సంచిక
22-a. విజ్ఞానసర్వస్వం (తెలుగుభాషా సమితి) సంపుటాలు
23. శతక కవుల చరిత్ర - వంగూరి సుబ్బారావుగారు
24. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం
25. త్యాగయ్య పదములు - గిడుగు సీతాపతిగారు
26. క్షేత్రయ్య పదములు - విస్సా అప్పారావుగారు

1. Bulletins of Govt. Oriental MSS Library, Madras
2. Early History of Madras Region—K. V. Raman
3. Encyclopaedia Britannica
4. Further Sources of Vijayanagara History—
   K. A. Neelakantha Sastri & N. Venkataramanayya
5. History of Gingee and its Rulers—Rao Bahadur
   C. S. Srinivasachari
6. History of the Nayaks of Madura—
   R. Satyanatha Iyer
7. Journal of Madras Music Academy
8. List of Villages of Madras Presidency
9. Maratha Rajahs of Tanjore—Dr. K.R Subrahmanyam
10. Peeps into the Saraswathi Mahal —S. Gopalan
11. Proceedings of the Indian Historical Records
    Commission
12. Sources of Vijayanagara History—
    Prof. S. Krishnaswamy Iyengar
13. The City of Gingee at the end of 16th Century—
    Rev. Heras—Indian Antiquary
14. The Nayaks of Tanjore—V. Vridhagirisam

274



Check List

Book Number	SSR02A198	Date	13/9/2021
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	CI 1273 1		
Missing Pages	NO		
Prepared	K. Anuradha	Scanned	Mounika
BOOK SIZE	H 7.3 W 5.1	Pages	277